

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹5.00

సంపుటి: 10
సంచిక: 329

సోమవారం 19-2-2018



విద్యా రుణం... తెలివుండాలి!
ఉన్నత చదువుల కోసం ఇచ్చే విద్యా రుణాలపై ప్రత్యేక కథనం -బిజినెస్‌లో



భారత్ శుభారంభం
దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టి20లో 28 పరుగుల తేడాతో విజయం -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

చంద్రబాబు పార్ట్‌నర్ పవన్‌కల్యాణ్ ఏ ఉద్దేశంతో చెప్పినా ఫర్వాలేదు..

హోదా కోసం



ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం ప్రకాశం జిల్లా కందుకూరులో జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం. సభలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

అవిశ్వాసానికి రెడీ

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ సంచలన ప్రకటన

టీడీపీని ఒప్పించండి

వారు ముందుకు వచ్చినా మద్దతిస్తాం

ప్యాకేజీ పేరుతో మోసం చేయొద్దు..

ప్రత్యేక హోదా మన హక్కు

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

''చిత్తశుద్ధి ఉంటే అవిశ్వాసం పెట్టాలని అంటున్నారు.. అయ్యా పవన్ కల్యాణ్.. మీరు ఏ ఉద్దేశంతో చెప్పినా పర్లేదు. రాష్ట్రానికి మంచి జరుగుతుంది అని చెబుతున్నారు.. ప్రత్యేక హోదా కోసం ఎవరినైనా కలుపుకుని పోవడానికి.. ఎవరు ఏ సలహా ఇచ్చినా స్వీకరించడానికి మేం సిద్ధంగా ఉన్నాం కాబట్టి రాజీనామాలకే కాదు, అవిశ్వాస తీర్మానం పెట్టడానికి కూడా మేం సిద్ధమే'' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ''మార్చి 5 నుంచి పార్లమెంటులో మా పోరాటం ఉధృతం చేస్తాం.. మార్చి చివరివారంలో కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడతాం. ఏప్రిల్ 6న రాజీనామాలు చేస్తాం..'' అని ఆయన పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కందుకూరు శాసనసభా నియోజకవర్గ కేంద్రంలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో జరిగిన భారీ బహిరంగసభలో పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ జగన్ ఈవిధంగా స్పందించారు. చంద్రబాబుకు పార్ట్‌నర్ అయిన పవన్‌కల్యాణ్ చంద్రబాబుకు జ్ఞానోదయం అయ్యేలా చేయాలని, ప్యాకేజీ అంశాన్ని పక్కన బెట్టి ప్రత్యేక హోదా కోసం పోరాడాలన్నారు. ఇంకా ఆయనేమన్నారంటే..

మేం సిద్ధమే.. మరి మీరు...?

'ప్రత్యేక హోదా కోసం మా పార్టీ ఎంపీల పోరాటం పార్లమెంటులో మార్చి 5వ తేదీ నుంచి మొదలవుతుంది. చివరి వారంలోకి వచ్చేసరికి కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెడతామని కూడా చెబుతున్నాను. చంద్రబాబు గారి పార్ట్‌నర్ అయిన పవన్ కల్యాణ్‌కు ఇదే చెబుతున్నాను. మీరు కోరినట్లే కేంద్రంపై అవిశ్వాసతీర్మానం పెట్టడానికి మేం సిద్ధంగా ఉన్నాం. అయితే మీరొకసారి చంద్రబాబుతో మాట్లాడండి. అవిశ్వాస తీర్మానం నిలబడాలి అంటే... దానికి 54 మంది ఎంపీల మద్దతు అవసరం అవుతుంది. ఇవాళ మా పార్టీకి సంబంధించి ఐదు మంది ఎంపీలు మాత్రమే నాతో ఉన్నారు. మిగతా వారందరినీ మీ చంద్రబాబు డబ్బులిచ్చి కొనుగోలు చేశారు. మా ఐదు మంది ఎంపీలు

మిగతా 2వ పేజీలో ▶



కేంద్ర ప్రభుత్వంలో ఉంటున్న చంద్రబాబే రాష్ట్రానికి బీజేపీ వాళ్లు దండిగా ఇచ్చారని నాలుగేళ్లుగా చెబుతూ వచ్చారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని ప్లేటు మార్చి.. కేంద్రం ఏమీ ఇవ్వలేదని చెప్పడం చూస్తుంటే నిజంగా ఆశ్చర్యం కలుగుతోంది. ఇక పవన్‌కల్యాణ్ కేంద్రం ఏమిచ్చింది? వీళ్లేమి తీసుకున్నారు? అని నిజనిర్ధారణ చేస్తారట. ఇది కోడిగుడ్డుపై ఈకలు పీకినట్లుగా ఉంది.

– వైఎస్ జగన్, ప్రతిపక్ష నేత

త్రిపుర ఎన్నికలు ప్రశాంతం..

76% పోలింగ్

- త్రిపురలో ఆదివారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సుమారు 76శాతం పోలింగ్ నమోదైందని, 25.73 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల సంఘం తెలిపింది. మొత్తం 60 శాసనసభా స్థానాలకు గాను 59 స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

- వివరాలు 10లో

బీజేపీ మంత్రుల రాజీనామా..?

రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో సుదీర్ఘ చర్చ

- మంత్రివర్గం నుంచి బయటకు రావాలి
- టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- లేకపోతే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నిజమని నమ్మే ప్రమాదం
- ఎమ్మెల్యేల కొనుగోళ్లపై పక్కాగా ఆధారాలున్నాయి: విష్ణుకుమార్‌రాజు
- రాష్ట్రానికి కేంద్రమిచ్చిన నిధులపై చర్చకు సిద్ధం: సోము వీర్రాజు



ఆదివారం విజయవాడలో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు. చిత్రంలో ఆ పార్టీ నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తమ పార్టీ ఎమ్మెల్యేలకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన రెండు మంత్రి పదవులకు మరికొద్ది రోజుల్లో రాజీనామా చేయాలని బీజేపీ యోచిస్తోంది. విజయవాడలో ఆదివారం జరిగిన బీజేపీ రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశంలో పార్టీ నేతలు ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి అన్యాయం చేస్తోందంటూ

మిగతా 3వ పేజీలో ▶

కుప్పకూలిన విమానం..

ఇరాన్‌లో 66 మంది మృతి..

- అసెమన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈపీ3704 విమానం జాగ్రోస్ పర్వతాల్లో కూలిపోయింది. అందులోని మొత్తం 66 మందీ చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. రాజధాని టెహ్రాన్ నుంచి యాసుజ్ పట్టణానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

- వివరాలు 10లో





సామాన్యుడిపై 'సర్జికల్' స్ట్రైక్

కార్పొరేట్ ఆసుపత్రుల కాసుల వేట
ఆపరేషన్ థియేటర్‌లో ధరల మంట

శస్త్రచికిత్సల వస్తువులపై 300% అధికంగా వసూలు
స్టెంట్ల ధర తగ్గించినా ఇప్పటికీ తగ్గని బిల్లులు
ఆర్థికంగా చితికిపోతున్న సామాన్య రోగులు - 5లో

200 షెల్ కంపెనీలు, బినామీ ఆస్తులు
పీఎన్‌బీ స్కాంలో జోరు పెంచిన దర్యాప్తు సంస్థలు 10లో

చెరువులో ఐదు మృతదేహాలు

- వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో కలకలం
- మృతులు తమిళనాడుకు చెందిన ఎర్రచందనం కూలీలుగా అనుమానం



వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట చెరువు నుంచి బయటకు తీసిన మృతదేహాలు 18లో



సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి, సమానత్వం కోసం న్యాయవాద వృత్తిని ఎంచుకుని మహిళల రక్షణ చట్టాల కోసం నిరంతరం వాదిస్తున్న ప్రముఖ మహిళా న్యాయవాదుల గురించి తెలుసుకోవడానికి www.sakshi.comలో నేను శక్తి క్లిక్ చేయండి.

అవిశ్వాసానికి రెడీ..

▶ మొదటి పేజీ తరువాయి

సిద్ధంగా ఉన్నారు. అవిశ్వాస తీర్మానం మమ్మల్ని పెట్టమన్నా మేం పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం. లేదా మీరు పెడతామన్నా మద్దతునివ్వడానికి మేం సిద్ధంగా ఉన్నామని చెబుతున్నాను. అయితే నేను పవన్‌కళ్యాణ్‌ను కోరేది ఒక్కటే... మీరు, చంద్రబాబు ఇద్దరూ కూడా ఈ రాష్ట్ర ప్రజలను ప్యాకేజీ పేరుతో మోసం చేయొద్దు... ప్రత్యేక హోదా అనేది మా హక్కు అని మీ ఇద్దరికీ చెబుతున్నాను. మీరు (పవన్‌కళ్యాణ్) చంద్రబాబుతో మాట్లాడి ఆయనకు జ్ఞానోదయం అయ్యేలా చేయండి. ప్రత్యేక ప్యాకేజీ అనే అంశాన్ని పక్కన పెట్టండి. రాష్ట్రానికి ఓ రూపాయి తక్కువ ఇచ్చారు, అర్ధ రూపాయి తక్కువ ఇచ్చారనే అంశాన్ని పక్కన పెట్టండి. ఎందుకంటే బీజేపీ చాలా బాగా ఇచ్చిందని చంద్రబాబే చెప్పిన సందర్భాలున్నాయి కనుక. ప్రత్యేక హోదాను ముందుకు తీసుకురండి, ప్రత్యేక హోదా కోసం అవిశ్వాస తీర్మానం పెడదాం. ప్రత్యేక హోదా కోసం రాజీనామాలు చేద్దాం అని చెబుతున్నాను.

చంద్రబాబు తానా అంటే... పవన్ తందానా...

చంద్రబాబు తానా అంటే ... ఆయనకు తందానా చెప్పే దానికే పవన్‌కళ్యాణ్ ఉన్నారు. ఆయన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ పేరుతో ఓ కమిటీ ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వం ఎంతిచ్చిందీ... రాష్ట్ర ప్రభుత్వం ఎంత తీసుకుందీ నిజనిర్ధారణ చేస్తారట. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో ఉంటున్న చంద్రబాబే రాష్ట్రానికి బీజేపీ వాళ్లు దండిగా ఇచ్చారని నాలుగేళ్లుగా చెబుతూ వచ్చారు. ఇపుడు ఎన్నికలు వస్తున్నాయని చెప్పి ప్లేటు మార్చి, డ్రామాలాడుతూ మళ్లీ ఆయనే కేంద్రం ఏమీ ఇవ్వలేదని చెప్పడం చూస్తుంటే నాకు నిజంగా ఆశ్చర్యం కలుగుతోంది. చంద్రబాబే ఈ మాదిరిగా మాట్లాడుతూ ఉంటే... ఇంకా పవన్‌కళ్యాణ్ అనే వ్యక్తి వాళ్లు(కేంద్రం) ఏమిచ్చారు? వీళ్లేమి తీసుకున్నారు? అని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని వేస్తాడట. నిజంగా ఇది కోడిగుడ్డుపై ఈకలు పీకినట్లుగా ఉంది. చంద్రబాబుకు, పవన్‌కళ్యాణ్‌కు నేనొక్కటే చెబుతున్నా... ఇవాళ కోడిగుడ్డు మీద ఈకలు పీకడం కాదు, రూపాయి, అర్ధ రూపాయి తక్కువ ఇచ్చారని నానా యాగీ చేయడం కానే కాదు, మీరు చేయాల్సిందల్లా.... ప్రత్యేక హోదా మా హక్కు అని పోరాటం చేయడమే అని చెబుతున్నాను.

మనకు హక్కుగా ఇచ్చారు..

రాష్ట్రాన్ని విడగొట్టేటపుడు ప్రత్యేక హోదాను ఒక హక్కుగా ఇచ్చారు. హోదా వస్తేనే పరిశ్రమలు వస్తాయి. ఆదాయపపు పన్ను , జీఎస్టీ కట్టాల్సిన అవసరం లేదు. ఈ రెండూ కట్టాల్సిన పని లేనపుడే పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి హోటళ్లు, హాస్పిటళ్లు కడతారు. పరిశ్రమలు పెడతారు. అలాంటి ప్రత్యేక హోదాను చంద్రబాబు దగ్గరుండి తాకట్టు పెట్టారు. ప్రత్యేక ప్యాకేజీ అంటూ మన చెవుల్లో క్యాలీ ఫ్లవర్లు పెడుతున్నారు. నేను బాబును, బీజేపీ నేతలను ఇద్దరినీ అడుగుతున్నాను. ప్రత్యేక హోదా హక్కుకు సమానంగా ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చామని అంటున్నారు. చంద్రబాబునాయుడేమో ప్రత్యేక హోదాకు సమానంగా ప్యాకేజీ వచ్చింది కాబట్టి తీసుకున్నానని అంటాడు. ముందుగా బీజేపీని అడుగుతున్నా... ఆ రోజు రాష్ట్రాన్ని విడగొట్టేటపుడు మీ వెంకయ్య రాజ్యసభలో ఏమన్నారో గుర్తుకు తెచ్చుకోండి. ఒక పరిశ్రమ పెట్టడానికి కనీసం మూడు, నాలుగేళ్లు పడుతుంది, మేం(బీజేపీ) అధికారంలోకి వస్తే పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పలేదా! దీనిని బట్టి ఆరోజు వెంకయ్య చెప్పింది ప్రత్యేక హోదా అనేది పరిశ్రమల కోసం అనే కదా? ఇక చంద్రబాబు తిరుపతి ఎన్నికల సభలో మోదీ సమక్షంలోనే... పరిశ్రమలు పెట్టడానికి నాలుగైదేళ్లు పడుతుంది. ప్రత్యేక హోదా అనేది మధ్యలో ఆగిపోతే ఎలా? పదేళ్లు కాదు, పదిహేనేళ్లు కావాలి, దాన్ని తెస్తాను అన్నారు. మరి ఎన్నికలకు ముందు వీళ్లంతా ప్రత్యేక హోదా అంటే... ఆ హోదాతో పాటు వచ్చే పరిశ్రమలు, హోదాతో పాటు వచ్చే ప్రత్యేకమైన పారిశ్రామిక రాయితీలనే కదా మాట్లాడారు. మరి ఇవాళేమో...ప్రత్యేక ప్యాకేజీ అంటున్నారు.



వైఎస్ జగన్‌కు నాగలి బహూకరిస్తున్న కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త తూమాటి మాధవరావు

హోదాలోని అంశాలు ప్యాకేజీలో ఉన్నాయా?

ప్రత్యేక ప్యాకేజీ, ప్రత్యేక హోదా రెండూ సమానమేనని ఇవాళ మాట్లాడుతున్నారు. ప్రత్యేక ప్యాకేజీలో ఆదాయపుపన్ను కట్టాల్సిన పనిలేదని, జీఎస్టీ కట్టాల్సిన పని లేదన్న రాయితీలు ఎక్కడున్నాయని నేను చంద్రబాబును, బీజేపీ పెద్దలను అడుగుతున్నాను. ఆదాయపు పన్ను, జీఎస్టీలు కట్టాల్సిన పని లేదంటేనే ఎవరైనా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తారు. ఇవన్నీ ప్రత్యేక ప్యాకేజీలో ఎక్కడున్నాయయ్యా! అని చంద్రబాబును, బీజేపీని నిలదీస్తున్నాను. ఇవన్నీ ప్యాకేజీలో లేవని తెలిసి కూడా ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ ఒకటేనని చెప్పి సిగ్గు లేకుండా హోదాను ఎలా తాకట్టు పెట్టారని చంద్రబాబును అడుగుతున్నాను.

హోదా ఇవ్వకపోతే రాజీనామాలే..

హోదా కోసం ముందుకు రావాలని చెప్పి చంద్రబాబును గట్టిగా అడిగాను. హోదాతోనే రాష్ట్రం బాగుపడుతుంది. చదువుకున్న ప్రతి పిల్లవానికి ఉద్యోగం వచ్చే అవకాశం ఉంటుందని వలసలు పోయే అవసరం లేకుండా మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు వచ్చే పరిస్థితులు నెలకొంటాయని చెప్పాను. హోదా కోసం మార్చి 1న కలెక్టర్ కార్యాలయాల దిగ్బంధానికి పిలుపునిచ్చాం. మార్చి 5న ఢిల్లీలో మా ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నేతలు ధర్నా చేయాలని నిర్ణయం తీసుకున్నాం. మార్చి 3వ తేదీన నేనెక్కడైతే పాదయాత్ర చేస్తున్నానో అక్కడే జెండా ఊపి వారిని ఢిల్లీకి పంపిస్తాను. మార్చి 5న ఢిల్లీ నడిబొడ్డున ధర్నా చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తారు. మార్చి 5 నుంచి ఏప్రిల్ 6వ తారీఖు వరకూ జరిగే పార్లమెంటు సమావేశాల్లో... మా ఎంపీలందరూ ప్రత్యేక హోదా కోసం వీరోచితంగా పోరాటం చేస్తారు. ఆ తరువాత కూడా హోదాను ఇవ్వకపోతే ఏప్రిల్ 6వ తేదీన సమావేశాల చివరి రోజున మన ఎంపీలు రాజీనామాలను వారి మొహాన కొట్టి రాష్ట్రానికి తిరిగి వస్తారు.

చంద్రబాబు నుంచి స్పందనే లేదు..

రాష్ట్రం కోసం మేం ఈ పోరాటం చేస్తూ టీడీపీ ఎంపీల చేత రాజీనామా చేయించాల్సిందిగా చంద్రబాబుకు కూడా పిలుపునిచ్చాం. అయ్యా చంద్రబాబూ... ఇన్ని సంవత్సరాలు మీరు మోసాలు చేస్తే చేశారు కానీ, కనీసం ఇప్పటికైనా చేసిన తప్పులు సరిదిద్దుకోండి అని విజ్ఞప్తి చేస్తున్నాను. మేం రాజీనామాలు చేస్తున్నాం. మీ పార్టీ ఎంపీల చేత కూడా రాజీనామాలు చేయించండి, మొత్తం 25 మంది రాజీనామా చేస్తే కేంద్రం దిగి వస్తుందని ఆయనకు పిలుపునిచ్చాం. ఈ పిలుపునిచ్చి మూడు రోజులు అయిపోయింది. ఇంత వరకూ చంద్రబాబు స్పందించలేదు. లీకుల మీద లీకులు ఇస్తాడు కానీ ఆ లీకుల్లో ఎక్కడా కూడా ప్రత్యేక హోదా గురించి ఒక్క మాట కూడా మాట్లాడడు. ప్రత్యేక హోదా కోసం పోరాడాలని ఒక్క మాట కూడా చెప్పడు.'' అని జగన్ పేర్కొన్నారు. ఈ సభలో ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, కందుకూరు సమన్వయకర్త తూమాటి మాధవరావు, బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ఉన్నప్పుడు కొన్ని గుణాలు ఉండాలి. నాయకుడికి విశ్వసనీయత అనే పదానికి అర్థం తెలిసి ఉండాలి. విశ్వసనీయత, నిజాయితీ ఉండాలి. చిత్తశుద్ధి ఉండాలి. ఇవేవీ లేకపోతే ఆ నాయకుడు చంద్రబాబు మాదిరిగా తయారవుతారు... కేవలం వెన్నుపోట్లు, మోసాలు, అబద్ధాలు, మీడియా మేనేజ్‌మెంట్ (ప్రభావితం చేయడం), వ్యవస్థలను మేనేజ్ చేయడం వంటి పనులతోనే చంద్రబాబు తన జీవితాన్ని గడిపేస్తున్నారు.



ప్రకాశం జిల్లా కందుకూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ప్రతిపక్షనేత వైఎస్ జగన్

నాలుగేళ్లుగా బీజేపీని పొగిడి..

ఎన్నికల ముందు విమర్శలా?

నాలుగేళ్లు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంతో చంద్రబాబు సంసారం చేశారు. కేంద్ర బడ్జెట్ కేంద్ర మంత్రివర్గం ఆమోదంతోనే పార్లమెంటుకు వస్తుంది. మంత్రివర్గంలో టీడీపీ మంత్రులు కూడా ఉన్నారు. వారి ఆమోదంతోనే బడ్జెట్ వస్తుంది. గత నాలుగేళ్లుగా ఇదే జరుగుతూ ఉంది. మరి గతంలో చంద్రబాబునాయుడు ఇదే బీజేపీ ప్రభుత్వాన్ని ఎలా పొగిడారో చూడండి. జనవరి 27, 2017వ తేదీన మనమే ఎక్కువ సాధించామని, ఏ రాష్ట్రానికైనా ఇంత కంటే ఎక్కువగా వచ్చి ఉంటే చెప్పండి అన్నారు. 2017లో ఈ మాట చంద్రబాబు, అన్నారంటే 2014-15, 2015-16, 2016-17 మూడు బడ్జెట్‌లలో నరేంద్ర మోదీ బాగా చేసినట్లు సర్టిఫికెట్ ఇచ్చినట్లే కదా అని ప్రశ్నిస్తున్నా. జనవరి 27లో ఆయన ఈ మాట అన్న తరువాత ఫిబ్రవరిలో వాళ్లు 2017-18 బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దానిపై ఒక్క మాటా మాట్లాడలేదంటే చంద్రబాబు ఆ బడ్జెట్ కూడా బ్రహ్మాండంగా ఉందని చెప్పినట్లే కదా అని అడుగుతున్నా. నాలుగేళ్లు చంద్రబాబు బీజేపీని పొగడుతాడు. అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడుకు శాలువాలు కప్పి సన్మానాలు చేస్తారు. వాళ్ల చెవులో క్యాబేజీలు పెడతా ఉంటే చంద్రబాబు పెట్టించుకుని మన చెవుల్లో పూలు పెట్టే కార్యక్రమం చేశారు. నాలుగేళ్లుగా ఇదే కార్యక్రమం. ఇక ఒక సంవత్సరంలో ఎన్నికలు జరుగబోతున్నాయని చెప్పి బీజేపీపై చంద్రబాబు నిందలు వేయడం మొదలు పెట్టాడు. ఈ నాలుగేళ్లు బాగా ఉందని చెప్పిన చంద్రబాబు చివరికి ఎన్నికలొచ్చేటప్పటికి బీజేపీ ఏమీ చేయలేదని అంటున్నాడు.

ఎప్పుడో పూర్తయిన పోగొండ రిజర్వాయర్ నేడు ప్రారంభం

నాలుగేళ్లుగా పిల్ల కాలువలు కూడా తవ్వించలేని సర్కార్

పోలవరం పనులు పరిశీలించనున్న సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: నాలుగేళ్ల క్రితమే పూర్తయిన పోగొండ రిజర్వాయర్‌ను సీఎం చంద్రబాబు సోమవారం ప్రారంభించనున్నారు. ఆయకట్టుకు నీరందించే పిల్ల కాలువ పనులను నాలుగేళ్లుగా చేపట్టకుండా.. జల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆ రిజర్వాయర్ ప్రారంభానికి ముహూర్తం పెట్టడంపై అధికారవర్గాలు నివ్వెరపోతున్నాయి. రిజర్వాయర్ ప్రారంభం అనంతరం పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. పశ్చిమగోదావరి జిల్లా చింతలగూడెంకు సమీపంలో బైనేరు నదిపై 227.38 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యంతో పోగొండ రిజర్వాయర్‌ను 2007లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టారు. రూ.18.20 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా గిరిజనులకు చెందిన 4 వేల ఎకరాలకు నీళ్లందించాలని నిర్ణయించారు. బైనేరు నది వరద ఉద్ధృతి నేపథ్యంలో రిజర్వాయర్ డిజైన్‌లను మార్చాలంటూ సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజనీర్, జీఎస్‌ఐ (జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) కమిటీ ప్రతిపాదించాయి. దాంతో డిజైన్‌ను మార్చారు. దీనివల్ల అంచనా వ్యయం రూ.85.51 కోట్లకు పెంచుతూ 2014 జనవరి 1న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రిజర్వాయర్ పనులు 2014 నాటికే పూర్తయ్యాయి. కేవలం డిస్ట్రిబ్యూటరీల (పిల్ల కాలువలు) పనులు పూర్తిచేస్తే ఆయకట్టుకు నీళ్లందించవచ్చు. కానీ, మూడున్నరేళ్లుగా పిల్ల కాలువలు తవ్వించలేని సర్కార్.. అదనపు పనులు చేశారంటూ రూ.30.87 కోట్లు, జీవో 22 కింద రూ.13.10 కోట్లు వెరసి రూ.43.97 కోట్లను కాంట్రాక్టర్‌కు అదనంగా ఇచ్చేయడం గమనార్హం.

హెల్త్ వర్సిటీ నిధులు పక్కదారి!

- రూ.167 కోట్లు వైద్య కళాశాలల కోసం ఖర్చు చేస్తారట!
- జీవో జారీ చేసిన వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి
- నిధులు తీసుకుంటే విధులు బహిష్కరిస్తామన్న వర్సిటీ ఉద్యోగులు

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిధులను పక్కదారి పట్టించడంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తమ నిధులను వైద్య కళాశాలలకు ఎలా వినియోగిస్తారని ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఉద్యోగులు మండిపడుతున్నారు. వైద్య కళాశాలల్లో మెరుగైన వసతులు కల్పించడానికి ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీకి చెందిన రూ.167 కోట్లు నిధులు తీసుకున్నామంటూ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య పది రోజుల క్రితం జీవో జారీ చేశారు. దీంతో వర్సిటీ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. అసలే హెల్త్ వర్సిటీలో సరైన



వసతులు లేవు, ఈ నేపథ్యంలో తమ నిధులు మీరెలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. నిధుల మళ్లింపునకు నిరసనగా సోమవారం విధుల బహిష్కరణకు పిలుపునిచ్చారు. నిధులు తీసుకుంటామంటూ ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోకపోతే నిరవధిక దీక్షలకు సైతం సిద్ధమని వర్సిటీ ఉద్యోగులు తేల్చిచెప్పారు.

ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయించకుండానే..

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిధులను ఇతర అవసరాలకు వినియోగించాలంటే వర్సిటీకి చెందిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకోవాలి. అదేమీ లేకుండానే జీవో జారీచేశారు. దీన్ని వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్‌లు కూడా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. జీవో ఇవ్వగానే నిధులు ఇచ్చినట్టు కాదని, వర్సిటీ నిధులను ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వబోమని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. కొన్నేళ్లుగా నిధులను కాపాడుకుంటూ వచ్చామని, ఇప్పుడు మెడికల్ కళాశాలలకు ఖర్చు చేస్తామని చెప్పడం దారుణమని ఉద్యోగులు అంటున్నారు.

కన్సల్టెన్సీలకు అప్పగింత

హెల్త్ యూనివర్సిటీ నిధులతో ప్రభుత్వ వైద్య కళాశాలలను బలోపేతం చేసి, నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ (ఎన్ఏబీహెచ్) గుర్తింపు తెచ్చుకోవాలని సర్కారు భావిస్తోంది. వైద్య కళాశాలల్లో పనులను పలు ప్రైవేట్ కన్సల్టెన్సీలకు అప్పగించారు. ఈ కన్సల్టెన్సీల వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కన్సల్టెన్సీలు పనులు ప్రారంభించాయి. దీంతో ఏపీఎంఎస్ఐడీసీ విభాగం నిధులు ఇవ్వాలని వైద్యవిద్యా సంచాలకులకు(డీఎంఈ) లేఖ రాసినట్టు తెలిసింది. ఈ నిధులు ఇచ్చే అధికారం డీఎంఈకి లేదు. అయితే వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి జీవో ఇవ్వడం గమనార్హం.

పదోన్నతుల్లో టీచర్లకు న్యాయం చేయాలి

మున్సిపల్ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

సాక్షి, అమరావతి: మున్సిపల్ టీచర్ల పదోన్నతుల్లో మెరిట్ ఉన్న వారికి న్యాయం చేయాలని మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మున్సిపాలిటీకి బదిలీపై వచ్చిన వారికి.. మొదటి అపాయింట్‌మెంటు తేదీనే పరిగణలోకి, డీఎస్సీ మెరిట్ మారదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా కొందరు అధికారులు వీటిని పట్టించుకోట్లేదన్నారు. పలువురు రీజనల్ జాయింట్ డైరెక్టర్లు తమకు ఇష్టం వచ్చినట్లు స్కూల్ అసిస్టెంట్ల సీనియార్టీని రూపొందించారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్ఎస్ఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభుత్వానికి అప్పగింత

సాక్షి, అమరావతి: సర్వశిక్ష అభియాన్ అదనపు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ డి.మధుసూదన్‌రావును ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఈ మేరకు సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మధుసూదన్‌రావు గతంలో జిల్లా విద్యాధికారిగా పనిచేస్తూ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. దీంతో ఆయన సర్వశిక్ష అభియాన్ కార్యాలయంలో ఎఎస్పీడీగా నియమితులయ్యారు. అయితే మధుసూదన్‌రావు పనితీరు సంతృప్తికరంగా లేనందున ఆయనను విధుల నుంచి రిలీవ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అర్హులుగా తేల్చి.. పెండింగ్‌లో పెట్టారు!

పేదలకు రేషన్, పింఛన్, గృహాల మంజూరు ఏడాదిగా పెండింగ్

- అత్యంత అర్హత గల ఇళ్లు లబ్ధిదారులు 4.30 లక్షలు
- అర్హులుగా ఇళ్లు లబ్ధిదారులు 6.16 లక్షలు
- వీలైనంత జాప్యం చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ఆకలితో ఉన్నప్పుడు అన్నం పెడితే అర్థం ఉంది.. కానీ రాష్ట్ర ప్రభుత్వం తనకు తోచినప్పుడే అన్నం పెడతాననే ధోరణిలో ఉంది. పేదలకు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల మంజూరులో వీలైనంత మేర జాప్యం చేసి నిధులు మిగుల్చుకోవాలనే ఆలోచన ప్రభుత్వంలో కనిపిస్తోంది. ఏడాది కిందటే అర్హులని తేల్చిన లబ్ధిదారులకు ఇప్పటికీ మంజూరు చేయకుండా ఉండడమే ఇందుకు ఉదాహరణ. పేదలను రాష్ట్ర ప్రభుత్వం రెండు వర్గాలుగా విభజించింది. అత్యంత అర్హత గల పేదలుగా ఒక వర్గాన్ని, అర్హులుగా మరో వర్గాన్ని విభజించింది. అత్యంత అర్హులంటే చాలా పేదరికంలో మగ్గుతున్నారనేది ఎవ్వరికైనా అర్థం అవుతుంది. ఇలాంటి వారికి కూడా మంజూరు చేయకుండా ఏడాది నుంచి పెండింగ్‌లో పెట్టడం అంటే పేదల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ, చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం అవుతోంది. ప్రజాసాధికార సర్వే ఆధారంగా ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుదారుల ఇంట్లో టీవీ ఉందా, మోటారు సైకిల్ ఉందా అనే కోణంలో దరఖాస్తులను పూర్తిగా వడపోసిన తరువాత అర్హులుగా తేల్చారు. రేషన్‌కార్డులకు 62,443 మంది అత్యంత అర్హులుగా ప్రభుత్వం తేల్చింది. ఇందుకోసం ఏడాదికి రూ. 3,12,21,500 వ్యయం అవుతుందని లెక్క కట్టింది. అలాగే పింఛన్లకు 80,274 మంది(అయ్యే వ్యయం రూ. 8,54,91,810), ఇళ్ల కోసం 4,30,235 మంది(అయ్యే వ్యయం 6453.37 కోట్లు) అత్యంత అర్హులుగా తేల్చింది. ఈ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధిత శాఖలు సూచించాయి. ఏడాది నుంచి అర్హత ఉన్నప్పటికీ ఆ పేదలు రేషన్, పింఛన్, ఇళ్ల కోసం ఎదురుచూపులు చూడక తప్పడం లేదు.

జిల్లా పేరు	రేషన్	బడ్జెట్	పింఛన్లు	బడ్జెట్	గృహాలు	బడ్జెట్
గుంటూరు	16,331	81,65,500	15,040	1,60,17,600	40,463	606,94,50,000
చిత్తూరు	9,146	45,73,000	13,964	1,48,71,660	56,743	851,14,50,000
పశ్చిమగోదావరి	3,757	18,78,500	3,915	41,69,475	33,871	508,06,50,000
శ్రీకాకుళం	2,983	14,91,500	11,788	1,25,54,220	37,349	506,23,50,000
కృష్ణా	11,373	56,86,500	7,610	81,04,650	50,861	762,91,50,000
తూర్పుగోదావరి	6,550	32,75,000	8,744	93,12,360	55,096	826,44,00,000
కర్నూలు	9,352	46,76,000	12,019	1,28,00,235	1,30,348	1955,22,00,000
ప్రకాశం	6065	30,32,500	6919	73,68,735	13,756	206,34,00,000
అనంతపురం	4317	21,58,500	9791	1,04,27,415	45,123	676.84,50,000
విజయనగరం	4,103	20,51,500	4,643	49,44,795	24,664	369,96,00,000
వైఎస్ఆర్ కడప	5,768	28,84,000	7842	83,51,730	41,873	628,09,50,000
నెల్లూరు	2,978	14,89,000	6,254	66,50,925	49,695	745,42,50,000
విశాఖపట్టణం	7,935	39,67,500	4,105	43,71,825	37,124	556,86,00,000
మొత్తం	90,658	4,53,29,000	1,12,625	11,99,45,625	6,16,966	9254,49,00,000

వీడియో కాల్ చేసి ప్రియురాలు ఆత్మహత్య

ప్రియుడు చూస్తుండగానే ఫ్యాన్‌కు ఉరివేసుకున్న ఎంబీఏ విద్యార్థిని

మృతురాలు అనంతపురం జిల్లావాసి

హైదరాబాద్/ అనంతపురం సెంట్రల్: ఇద్దరూ ప్రేమించుకున్నారు.. త్వరలోనే పెళ్లి చేసుకుందామనుకున్నారు... ఓ స్నేహితురాలి ఫంక్షన్‌కు వెళ్తున్నానని ప్రియురాలు చెప్పింది. వెళ్లొద్దంటూ ప్రియుడు ఆమెతో ఫోన్ చాటింగ్‌లో వాదులాటకు దిగాడు. మాటామాటా పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఎంబీఏ విద్యార్థిని వీడియో కాల్‌లో మాట్లాడుతూనే ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హైదరాబాద్ నగర శివారులోని కొంపల్లి శివశివానీ కళాశాల క్యాంపస్ హాస్టల్లో శనివారం అర్ధరాత్రి దాటాక ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. అనంతపురం జిల్లాకు చెందిన బుగ్గయ్య చౌదరి (టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) కుమార్తె హనీషా చౌదరి (23) శివశివానీలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతూ కళాశాల ఆవరణలో ఉండే హాస్టల్‌లో ఉంటోంది. మేడ్చల్‌లో ఉండే తోటి విద్యార్థి దక్షిష్ పటేల్, ఆమె ప్రేమించుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి 10.30కు ప్రారంభమైన వీరి చాటింగ్ అర్ధరాత్రి 1 గంట వరకు కొనసాగింది. వందకు పైగా మెసేజ్‌లు ఒకరికొకరు పంపుకున్నారు. రాత్రి 1.30 సమయంలో వీడియో కాల్ చేసిన హనీషా.. 'నువ్వు నన్ను అనుమానిస్తున్నావ్... నేనంటే నీకు ఇష్టం లేదు కదా' అని మాట్లాడుతూ చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో కంగుతిన్న దక్షిష్ విషయాన్ని హాస్టల్‌లో ఉంటున్న మరో విద్యార్థినికి ఫోన్ చేసి చెప్పాడు. అతను మేడ్చల్ నుంచి వచ్చేసరికి తలుపు గడియ పెట్టి ఉంది. బద్దలుకొట్టి చూడగా హనీషా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేట్ బషీరాబాద్ ఎస్సై గంగాధర్ తెలిపారు. హనీషా ఫోన్‌ను సీజ్ చేశారు. ఆమె మృతదేహాన్ని తల్లిదండ్రులు అనంతపురం తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మంత్రులు కాలువ శ్రీనివాసులు, పరిటాల సునీత తదితర నేతలు బుగ్గయ్యచౌదరి కుటుంబాన్ని పరామర్శించారు.



మృతురాలు బి.హనీషా చౌదరి

బీజేపీ మంత్రుల రాజీనామా..?

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి బీజేపీ మంత్రులు బయటకు వచ్చి ఈ దుష్ప్రచారాన్ని గట్టిగా తిప్పకొట్టాలని నిర్ణయానికొచ్చారు. లేకపోతే ముఖ్యమంత్రితో సహా టీడీపీ నేతలు సాగిస్తున్న తప్పుడు ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలు నిజమేనని నమ్మే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. టీడీపీ ఆడుతున్న నాటకంలో బీజేపీకీ భాగం ఉందన్న భావన రాష్ట్ర ప్రజలకు కలగనీయకుండా జాగ్రత్త పడదామని కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. అప్పటి వరకు సమావేశంలో పాల్గొన్న మంత్రి కామినేని శ్రీనివాస్ ఈ అంశం ప్రస్తావనకు రాగానే బయటకు వెళ్లినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. బీజేపీ మంత్రుల రాజీనామాలను అమిత్‌షా, ప్రధాని నరేంద్ర మోదీకి పంపితే బాగుంటుందని చర్చించుకున్నారు. పార్టీ తీసుకునే ఏ నిర్ణయానికైనా కట్టుబడి ఉంటానని మంత్రి మాణిక్యాల రావు జవాబిచ్చినట్టు సమాచారం. అయితే, ఈ అంశంపై పార్టీ పెద్దలతో ఒకసారి చర్చించి, నిర్ణయం తీసుకుంటే మంచిదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు చెప్పడంతో తుది నిర్ణయం తీసుకోకుండానే ఈ అంశంపై చర్చను ముగించారు.



ఎంపీ హరిబాబును నిలదీస్తున్న లక్ష్మీపతిరాజు



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

21 నుంచి కరపత్రాల పంపిణీ

రాష్ట్రానికి కేంద్రం ఏ పథకంలో ఎంత సహాయం చేస్తోంది.. ఎన్నికల మేనిఫెస్టో హామీలను టీడీపీ ప్రభుత్వం ఎంతవరకు అమలు చేసిందన్న వివరాలను పోల్చుతూ గ్రామస్థాయి వరకు కరపత్రాలను పంపిణీ చేయాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. కరపత్రం రూపకల్పన బాధ్యతలను పార్టీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డికి అప్పగించారు. 21 నుంచి జిల్లా, మండల స్థాయి సమావేశాలు నిర్వహించి రాష్ట్రానికి కేంద్రం విడుదల చేసిన నిధులపై కరపత్రాలు పంపిణీ చేయనున్నారు.

టీడీపీ అవినీతిని బట్టబయలు చేద్దాం..

సీఎం చంద్రబాబు ఎత్తుగడలను ముందుగానే అడ్డుకోవాలని, ఇందుకు పార్టీపరంగా ప్రణాళిక సిద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. చంద్రబాబుతోపాటు జిల్లాల్లో మంత్రులు, టీడీపీ నేతల అవినీతి కార్యకలాపాలను, వైఎస్సార్‌సీపీ టిక్కెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడాన్ని పార్టీ జాతీయ నేతల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ నిర్ణయించింది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కొనసాగిస్తున్న అవినీతిని బట్టబయలు చేసి, జనంలోకి తీసుకెళ్లాలని బీజేపీ తీర్మానించింది.

హరిబాబు, లక్ష్మీపతిరాజుల మధ్య వాగ్వాదం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు మొదటి నుంచీ టీడీపీ పట్ల మెతక వైఖరి అవలంభించారని, ఇకపై టీడీపీకి వ్యతిరేకంగా ఆయనే ప్రకటనలు జారీ చేయాలని నేతలు సూచించారు. కంభంపాటి వల్లనే రాష్ట్రంలో బీజేపీకి ఈ దుస్థితి వచ్చిందని పార్టీ నేత లక్ష్మీపతిరాజు ధ్వజమెత్తారు. ఒక దశలో కంభంపాటి హరిబాబుకు, లక్ష్మీపతిరాజుల మధ్య వాగ్వాదం పెరగడంతో మంత్రి మాణిక్యాల రావు, ఇతర నాయకులు జోక్యం చేసుకుని పరిస్థితి సద్దుమణిగేలా చేశారు.

టీడీపీ అవినీతిపై పక్కా ఆధారాలు

టీడీపీ అవినీతికి సంబంధించిన ఆధారాలు పక్కాగా ఉన్నాయని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు చెప్పారు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను ఏ విధంగా కొనుగోలు చేసిందీ, పోలవరంతో సహా ఏ ప్రాజెక్టుల్లో ఎంత అవినీతికి పాల్పడిందీ తదితర వివరాలు ఉన్నాయన్నారు. వీటిని ప్రజల ముందుకు తీసుకువెళ్లాలన్నారు. టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని మరో ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏపీకి విడుదల చేసిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమేనని ప్రకటించారు. ఈ సమావేశంలో మంత్రులు కామినేని శ్రీనివాస్, ఎంపీ గోకరాజు గంగరాజు, నేతలు పురందేశ్వరీ, కావూరు సాంబశివరావు, కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్‌లు ఇవ్వకుండా నిధులొస్తాయా?

- నిధులపై చర్చలకు ఎప్పుడైనా సిద్ధం
- టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మాధవ్

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని టీడీపీ నేతలు అసత్య ప్రచారం చేశారని బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అరోపించారు. ఏ ప్రాజెక్టుకైనా నిధులు విడుదల కావాలంటే దానికి సంబంధించిన డీపీఆర్‌ను ముందుగా రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలని, అలా ఆంధ్రప్రదేశ్ వ్యవహరించకుండా రాజధాని నిర్మాణానికి కేంద్రం సహకరించడం లేదని దుష్ప్రచారం చేస్తోందని చెప్పారు. ఆదివారం విజయవాడ వన్‌టౌన్‌లో 'రాష్ట్ర పునర్విభజన చట్టం అమలు–వాస్తవాలు' సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశంపై నిప్పులు చెరిగారు. గతంలో ఎర్రన్నాయుడు రైల్వేబోర్డు ఛైర్మన్‌గా పనిచేశారని, ఆ సమయంలో రైల్వేజోన్ గురించి టీడీపీ ఎందుకు పట్టించుకోలేదని ఆయన ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన నిధులపై వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందని, వీటిని వివరించేందుకు బీజేపీ సిద్ధంగా ఉంటుందన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు బీజేపీ ఏమిచ్చిందో తెలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి బీజేపీనే కారణమని, రాష్ట్రానికి 11 శాతం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులొచ్చాయన్నారు. రాజధాని నిర్మాణానికి డీపీఆర్ లేకుండా ఎవరైనా నిధులు ఇస్తారా? అని తెలుగుదేశం నేతలను ప్రశ్నించారు. అయినా రూ.2,500 కోట్లు ఇచ్చామని తెలిపారు. 2014కు ముందు పోలవరం ప్రాజెక్టుకు ఖర్చు చేసిన రూ.6 వేల కోట్లను చంద్రబాబు కోరారని, వాటిని ఇవ్వకపోవడానికి కారణాలను చెప్పకుండా పోలవరానికి కేంద్రం సహకరించడం లేదని ఆరోపణలు చేస్తున్నారన్నారు.

యార్డుల్లోనే వ్యవసాయ ఉత్పత్తులు

- 2 లక్షల క్వింటాళ్ల వేరుశనగ, మొక్కజొన్న, అపరాలు నిల్వ
- నగదు చెల్లింపులో తీవ్రజాప్యం
- ఆందోళనలో రైతులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పంటల నిల్వలు పేరుకుపోతున్నాయి. మద్దతు ధర ప్రకటించిన వేరుశనగ, మొక్కజొన్న, అపరాల దిగుబడులను రైతుల నుంచి పెద్దఎత్తున కొనుగోలు చేసిన కేంద్ర ప్రభుత్వం వాటిని నిల్వచేయడానికి గోదాములు లేకపోవడంతో మార్కెట్ యార్డుల్లోనే నిల్వచేసింది. నెల రోజులు దాటే వరకు వీటిని గోదాములకు తరలించకపోవడంవల్ల రైతులకు సకాలంలో నగదు చెల్లింపులు జరగడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో 2 లక్షల క్వింటాళ్లకు పైగా దిగుబడులు ఉన్నాయి.

గోదాములు లేక తగ్గిన వేరుశనగ కొనుగోళ్లు

మొన్నటి ఖరీఫ్‌లో పండిన వేరుశనగకు ప్రైవేట్ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.3,600 వరకే ధర పలకడంతో రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.4,450ల మద్దతు ధర ప్రకటించింది. డిసెంబరు 1 నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఫిబ్రవరి 28 లోపు 11.70 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు అనంతపురం, కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. అయితే, ఆ జిల్లాల్లో గోదాములు లేకపోవడంతో రైతుల నుంచి వచ్చిన ఒత్తిడిని తట్టుకునేందుకు వేరుశనగను కొనుగోలు చేసి యార్డుల్లో నిల్వచేశారు. 11.70 లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేయాలని లక్ష్యంగా తీసుకున్నప్పటికీ గోదాముల కొరత కారణంగా కేవలం 5 లక్షల క్వింటాళ్లను మాత్రమే ఇప్పటివరకు కొనుగోలు చేశారు. ఇందులో 4.50 లక్షల క్వింటాళ్లను గోదాములకు తరలించగా, మిగిలిన 50 వేల క్వింటాళ్లు ఆ జిల్లాల్లోని యార్డుల్లోనే నిల్వ ఉండిపోయింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం గోదాములకు తరలించిన తరువాత రైతులకు నగదు చెల్లింపులు జరగాలి. అయితే, ఈ రైతులు నెల క్రితమే పంటను అమ్మినా, మరో నెల రోజుల వరకు గోదాములకు తరలించే అవకాశం లేకపోవడంతో నగదు ఎప్పుడు చేతికి అందుతుందో అంతుపట్టడంలేదు.

మొక్కజొన్నకూ అదే పరిస్థితి

ఇదిలా ఉంటే.. మొన్నటి ఖరీఫ్‌లో రైతులు ఎక్కువగా మొక్కజొన్నను సాగుచేశారు. మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటంతో కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.1,425ల మద్దతు ధర ప్రకటించి 4.25 లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటివరకు 81,374 క్వింటాళ్లను కొనుగోలు చేసి, యార్డుల్లో నిల్వచేసింది. రబీలోనూ గతం కంటే ఎక్కువగా 2.08 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. త్వరలో ఈ పంట చేతికి అందనుంది.

అపరాల రైతుల ఆందోళన

రెండు నెలల క్రితం రాష్ట్రంలో అపరాల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. క్వింటా పెసలకు రూ.5,475ల మద్దతు ధర ప్రకటించి, రెండు లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు 30 వేల క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేసి మార్కెట్‌యార్డుల్లో నిల్వ చేశారు. అయితే, అమ్మిన రైతులకు నెల రోజులు దాటినా నగదు చెల్లించకపోవడంతో రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈనెల 15న కృష్ణా జిల్లా కంచికచర్ల మార్కెట్ యార్డులో రైతులు ఈ విషయమై ఆందోళన చేశారు. మరోవైపు.. నెల రోజుల్లో రబీ పంట చేతికి రానున్నది. ఈ నేపథ్యంలో పంటలను కొనుగోలు చేసి రైతులకు సకాలంలో నగదు చెల్లించడానికి, ఇతర అవసరమైన చర్యలు తీసుకోడానికి వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటుచేసింది.

బీజేపీతో కలిసి పనిచేస్తాం: మంత్రి అయ్యన్న

సీఎంను విమర్శించే స్థాయి సోము వీర్రాజుకు లేదని వెల్లడి



కొత్తపల్లి: గత ఎన్నికల్లో బీజేపీతో కలిసి పనిచేశామని, వచ్చే ఎన్నికల్లో కూడా ఆ పార్టీతో కలిసి పనిచేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి సీహెచ్. అయ్యన్నపాత్రుడు అన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల విడుదలలో అన్యాయం చేశారన్నారు. తూర్పు గోదావరి జిల్లా కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లిలో పిఠాపురం–కోనపాపపేట రోడ్డు అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు ఆకుకు, వక్కకు తేడా తెలియదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. వీర్రాజుకు సిగ్గు, లజ్జ, సంస్కారం ఉంటే మాట్లాడే పద్ధతిని మార్చుకోవాలన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఏర్పాటుచేసిన జేఏసీతో రాష్ట్రానికి ఉపయోగం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. అయితే, శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలతో కలవడం పవన్‌కు సమంజసం కాదన్నారు. రాష్ట్రాన్ని విభజించిన నాయకులే ఇప్పుడు రాష్ట్రం గురించి మాట్లాడడం ఎంతవరకూ సబబని అయ్యన్న ప్రశ్నించారు. తాము కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని చెప్పారు.

గురుముఖంగానే న్యాయశాస్త్రాన్ని నేర్చుకోవాలి

ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు

తిరుచానూరు: వేదం మాదిరిగానే ప్రతి న్యాయ విద్యార్థీ న్యాయశాస్త్రాన్ని గురుముఖంగానే నేర్చుకోవాలని ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు అన్నారు. తిరుపతిలో సీనియర్ న్యాయవాది కెఎస్ శ్రీధర్ 75వ జన్మదినం, న్యాయవాదిగా ఆయన 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వారి శిష్య బృందం ఆదివారం నగరంలో స్వర్ణోత్సవాలు నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ గురుశిష్య బంధం బలంగాను, ఆత్మీయంగాను ఉంటే శిష్యుడు ఎంత ఎత్తుకు ఎదగవచ్చో తానే ఉదాహరణని తెలిపారు. గురువుకు మించిన శిష్యుడైనప్పటికీ గురువు తరువాతే శిష్యుడన్న విషయాన్ని మరవకూడదన్నారు. న్యాయవాది విజ్ఞత, విజ్ఞానం, నడవడికపైనే అనేకమంది జీవితాలు ఆధారపడి ఉంటాయన్న విషయాన్ని జూనియర్లు గుర్తుంచుకోవాలని సూచించారు. అధ్యయనం, అభ్యాసంతో న్యాయవ్యవస్థలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న కెఎస్.శ్రీధర్ స్వర్ణోత్సవంలో తాను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు కెఎస్.శ్రీధర్ దంపతులను జస్టిస్ దుర్గాప్రసాదరావు దంపతులు, జిల్లా జడ్జి దుర్గారావు, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘనంగా సత్కరించారు.




సీనియర్ న్యాయవాది శ్రీధర్‌ను సన్మానిస్తున్న హైకోర్టు జడ్జి దుర్గాప్రసాదరావు, జిల్లా జడ్జి దుర్గారావ్

టీడీపీకి ప్యాకేజీలే ముఖ్యం: ఎమ్మెల్యే రోజా



చిత్తూరు ఎడ్యుకేషన్: టీడీపీ నాయకులకు ప్రత్యేక హోదా కన్నా ప్యాకేజీలే ముఖ్యమని, కేంద్రంతో పోరాడే శక్తి లేక ప్రతి దానికీ రాజీపడిపోతున్నారని చిత్తూరు జిల్లా నగరి ఎమ్మెల్యే రోజా విమర్శించారు. ఆమె ఆదివారం మధ్యాహ్నం చిత్తూరులోని కలెక్టర్ బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టి 16 రోజులవుతుంటే కలుగులో దాగున్న సీఎం అన్ని పార్టీలు పొగబెట్టిన తర్వాత బయటకొచ్చి రాజీలేని పోరాటం చేస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఆయన కాని, ఆయన పార్టీ ఎంపీలు, మంత్రులు ఎన్‌డీఏ నుంచి వైదొలుగుతామని ఎందుకు చెప్పలేకపోతోందని నిలదీశారు. ప్యాకేజీతో ఉపయోగం లేదని నాడే జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాగుర్తుచేశారు. హోదా ఇవ్వకపోతే ఎంపీలు రాజీనామాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని పవన్ 2016లో చెప్పి, ఇప్పుడు రాజీనామాలు ఎందుకు అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరడం ఆయన రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమన్నారు.


'భట్టరాజు' పాలకవర్గాన్ని నియమించాలి



మాట్లాడుతున్న కోటంరాజు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): భట్టరాజు కో–ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ పాలకవర్గాన్ని వెంటనే నియమించాలని ఆంధ్రప్రదేశ్ భట్టరాజు సంఘం అధ్యక్షుడు కూరపాటి కోటంరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం విజయవాడ అలంకార్ సెంటర్‌లో ధర్నా చేపట్టారు. కోటంరాజు మాట్లాడుతూ 10 లక్షల మందికిపైగా ఉన్న భట్టరాజులు సామాజికంగా ఎదగాలని దివంగత సీఎం వైఎస్సార్ 2009లో ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించారన్నారు. టీడీపీకి చెందిన కొందరు 'మీ జనాభా ఎంత? మీకు ఫెడరేషన్ ఎందుకు?' అని అవహేళన చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు అన్ని ఫెడరేషన్లకు పాలక వర్గాలను నియమించి, భట్టరాజుల సంఘంపై మాత్రం వివక్ష చూపుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు రాజగోపాలరాజు, ప్రధాన కార్యదర్శి రాంపల్లి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీసెట్‌లో విదేశీ విద్యార్థి మృతి



కాలేమహ్మద్ (ఫైల్)

కాణిపాకం: చిత్తూరు జిల్లా పూతలపట్టు పోలీసు స్టేషన్ పరిధిలోని పెనుమూరు క్రాస్ వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎస్వీసెట్) హాస్టల్లో ఆదివారం రాత్రి అరబ్ దేశానికి చెందిన విద్యార్థి కాలే మహ్మద్ (28) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతడు హాస్టల్ గదిలో ఉరేసుకుని మృతిచెంది ఉన్నట్లు ఎస్ఐ మురళీ మోహన్ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అతడి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

సాక్షి
సాహిత్యం
విజయవాడ | సోమవారం | ఫిబ్రవరి | 19 | 2018
అభిప్రాయాలకు: sakshisahityam@gmail.com

గ్రేట్ రైటర్

చాల్స్ డికెన్స్

ఇంగ్లండ్‌లో జన్మించాడు చాల్స్ డికెన్స్ (1812–1870). తల్లిదండ్రులకున్న ఎనిమిది మంది సంతానంలో రెండోవాడు. తండ్రి గుమాస్తాగా పనిచేసేవాడు. ఆయన జైలుపాలవడంతో చిన్నతనంలోనే డికెన్స్ చదువుకు దూరమయ్యాడు. అయినా చదువు మీద అనురక్తి పోగొట్టుకోలేదు. బయట బాగా తిరిగేవాడు. ఇంట్లోని బొమ్మల పుస్తకాలు



బాగా చదివేవాడు. ప్రత్యేకించి అరేబియన్ నైట్స్ ఆయన్ను బాగా ప్రభావితం చేసింది. ప్రత్యేకంగా పాఠశాల విద్యను అభ్యసించకపోయినప్పటికీ సహజ పండితుడిలాగా చదువుకున్నాడు. 15 నవలలు, 5 నవలికలు, వందలకొలదీ కథలు, వ్యాసాలు రాశాడు. ఒక వారపత్రికకు 20 ఏళ్లపాటు సంపాదకత్వం వహించాడు. విక్టోరియన్ ఇరా(విక్టోరియా రాణి శకం)లో పుట్టిన గొప్ప నవలాకారుడిగా కీర్తి ప్రతిష్ఠలు గడించాడు. బాల్య జ్ఞాపకాలను అత్యంత స్పష్టంగా కాగితం మీద నెమరేసుకున్న డికెన్స్ మరిచిపోలేని పాత్రల్ని సృష్టించాడు. ఎ టేల్ ఆఫ్ టూ సిటీస్, గ్రేట్ ఎక్స్‌పెక్టేషన్స్, డేవిడ్ కాపర్‌ఫీల్డ్, ఆలివర్ ట్విస్ట్, ఎ క్రిస్మస్ కరోల్, హార్డ్ టైమ్స్, ద సిగ్నల్–మాన్ లాంటివి ఆయన ప్రసిద్ధ రచనల్లో కొన్ని.


సాహిత్య మరమరాలు

అంత పెద్ద మనిషే చెబితే...

వకీలుగా కాళోజీ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు జరిగిన ఘటన ఇది.

వరంగల్‌లో ఒక పండితుడు ఉంటాడు. ఆయన వస్త్రధారణ, నామధారణ నిష్ఠగా ఉంటాయి. ఆ వీధిలోనే ఉండే ఒక ఎరుకలాయనకు ఈ పండితుడంటే చాలా గౌరవం. పండితుడు తొవ్వలో ఎదురైనప్పుడల్లా ఎంతో ఇదిగా చూస్తుంటాడు.

అయితే, ఒక రాత్రి అదే వీధిలో ఉండే ఒక ధనవంతుడి ఇంట్లో ఏదో దొంగతనం జరిగింది. ఆయనకు ఈ ఎరుకలతనే చేసివుంటాడని అనుమానం. కేసు పెట్టాడు.



కోర్టులోకి కేసు వచ్చింది. దొంగతనం చేశావా అని ఎరుకలతణ్ని అడిగారు. చేయలేదని చెప్పాడు. మళ్లీ అడిగారు. మళ్లీ అదే చెప్పాడు. న్యాయవాది అడిగిన ప్రతిసారీ కూడా ఆ ఎరుకలతను దొంగతనం చేయలేదనే చెబుతూ వచ్చాడు. నిజంగా కూడా ఆ దొంగతనం అతను చేయలేదు. అయితే పండితుడిని సాక్షిగా పిలిపించారు. ఈయనకూ ఆ ధనికుడికీ మధ్య ఏవో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. అందుకే దొంగ సాక్ష్యం ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. ఈ ఎరుకలతను దొంగతనం చేయగా తన కళ్లతో చూశానని సాక్ష్యం ఇచ్చాడు.

అప్పుడు మళ్లీ న్యాయవాది, ఆయన చెబుతున్నాడుగదా, ఇప్పుడేమంటావు అని ఎరుకలతణ్ని అడుగుతాడు. 'అయ్యా అంత పెద్ద పండితుడు నేను దొంగతనం చేస్తున్నప్పుడు చూసిన్నని చెబుతున్నప్పుడు నేను కాదంటానా అయ్యా' అన్నాడు, వ్యంగ్యాన్నీ నిరసననీ స్వరంలో మిళితం చేస్తూ. అతడికి శిక్ష పడింది. ఈ తీరును కోర్టులో చూసినతర్వాత విరక్తి పుట్టి, కాళోజీ కేసులు వాదించడం మానేశాడు.

ప్రతిధ్వనించే పుస్తకం

చివరకు మిగిలేది

అసలు జీవితానికి అర్థమేమై వుంటుంది?

ఈ చింతనే ప్రధానంగా సాగుతుంది 'చివరికి మిగిలేది'. వ్యక్తిగతమైన విముక్తి ప్రధాన ప్రేరణగా దీన్ని రాసినట్టు బుచ్చిబాబు చెప్పుకున్నారు. తెలుగులో వచ్చిన గొప్ప మనో వైజ్ఞానిక నవలగా ఇది ఆయనకు ఎంతో కీర్తిని తెచ్చిపెట్టింది. ప్రధానంగా కథకుడైన బుచ్చిబాబు రాసిన ఏకైక నవల ఇది. తొలుత ధారావాహికగా వచ్చి 1952లో పుస్తకరూపం దాల్చింది.


బుచ్చిబాబు

శీలపు మరకను కలిగివున్న తల్లి గత చరిత్ర దయానిధిని జీవితాంతం వేదనకు గురిచేస్తుంది. తల్లి చేసిన తప్పేమిటో స్పష్టంగా తెలియదు, లేదా రచయితే తెలియనివ్వడు. అంతర్ముఖుడైన దయానిధిలాగే నవలంతా ఒక గుప్తమైన మార్మికత పరుచుకుని ఉంటుంది. అయినప్పటికీ తనకు ఎదురయ్యే దేన్నీ కూడా తరచి చూడకుండా దయానిధి ఉండడు. కళ, సౌందర్యం, ప్రకృతి, సమాజం, స్త్రీ, రాజకీయం, అమలిన శృంగారం అన్నింటినీ స్పృశిస్తాడు.

దయానిధి తన సుదీర్ఘ జీవిత ప్రయాణంలో అమృతం, కోమలి, ఇందిర, సుశీల, నాగమణి లాంటి స్త్రీల సామీప్యానికి వెళ్తాడు; వెళ్లలేకపోతాడు. వజ్రం రూపంలో సంపద వస్తుందీ పోతుందీ. మనుషుల ద్వేషాన్నీ, దానికి గల కారణాన్నీ అర్థం చేసుకుంటాడు. తనకేం కావాలో తెలియనప్పుడు మానవుడు ద్వేషిస్తాడు. మనిషికి కావాల్సింది మతాలు, దేవుళ్లు, మొక్కుబళ్లు, రాజకీయాలు కావు; మానవుడికి కావాల్సినది దయ, అని తేల్చుకుంటాడు. అమృతం, కోమలి పాత్రలు గుర్తుండిపోతాయి.

కథనం తాబేలు నడకలా సాగుతుంది. ఏమీ ప్రత్యేకించి పరుగులు పెడుతూ జరగదు. ప్రతి వాక్యాన్నీ, ప్రతి గమనింపునీ కవితాత్మకంగా మలవాలన్న శైలి బుచ్చిబాబు బలమూ, బలహీనతా రెండూ.

జీవితం గురించి ఎక్కువ ఆలోచిస్తుంటావు, జీవించవు అన్న స్నేహితుడి వాక్యం దయానిధికి పూర్తిగా వర్తిస్తుంది. జీవితంలో మునిగిపోవడానికి మించిన వేరే పరమార్థం జీవితానికి ఏమీ లేదు. అలాగని దీని గురించి జిజ్ఞాసువులు మీమాంస పడకుండా ఉండటమూ కష్టమే. జీవితానికి అర్థమేమిటన్నదానికి ప్రత్యేకించి సమాధానం ఏమీ లేదు. ఆ సమాధానాన్ని తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమూ, అందులో భాగంగా కలిగే కొన్ని అనుభవాలూ, అవి కాగలిగే జ్ఞాపకాలూ, తనతో తాను మనిషి సమాధాన పడటమూ మాత్రమే చివరికి మిగిలేవి.


మిమ్మల్ని బాగా కదిలించిన పుస్తకం గురించి మాతో పంచుకోండి.
మెయిల్: sakshisahityam@gmail.com

రైతు హంబో యింట్లో ఆనాడు భేదాభిప్రాయం వచ్చింది. పన్నెండేళ్ల కొడుకు గిఖోర్‌ను పట్నంలో పనిలో పెడితే ప్రపంచంలో యెలాగో నెట్టుకొస్తాడని హంబో ఆలోచన.

కానీ ముక్కుపచ్చలారని బిడ్డని నీతీ న్యాయం లేని ప్రపంచంలో తోసెయ్యడానికి అతని భార్య ఒప్పుకోలేదు. కానీ హంబో ఆమెను లెక్కచేయలేదు.

చూస్తుండగానే
కాలం చేసింది

కష్టాలదేముంది నాయనా, చూసేలోపలే రోజులెలాగో గడిచిపోతాయంటాడు తండ్రి. తను అన్న మాటల పరమార్థం ఆయనే గ్రహించలేదు. పన్నెండేళ్ల కొడుకు కాలం చేశాడు.



ఒక విచారకరమైన ఉదయాన గిఖోర్ వాళ్లమ్మ, చెల్లెలు జాన్నీ, చిన్ని గల్లో వాడిని పల్లె పొలిమేర దాకా వచ్చి సాగనంపారు. వెనక్కి చూస్తూ, తండ్రి పక్కన పరుగెత్తినట్టుగా గిఖోర్ నడుస్తున్నాడు. కాసేపటికి కొండ వెనక్కి నక్కింది వాళ్ల ఊరు.

ఆ రాత్రి వాళ్లు ఓ ఊళ్లో హంబో పాత స్నేహితుడుంటే అక్కడ దిగారు. గ్లాసులు గలగల్లాడిస్తూ కడిగి, ఒక చిన్నమ్మాయి టీ తయారుచేసింది. ఆమె అందమైన ఎర్రని దుస్తులు వేసుకుంది. పట్నంలో డబ్బు సంపాదించాక అటువంటి దుస్తులు జాన్నీకి కొనిపెట్టాలని గిఖోర్ లెక్కవేశాడు.

మరునాడు తండ్రీ కొడుకూ తిఫ్లీస్ పట్టణం చేరుకున్నారు. కొట్ల నిండా పండ్ల గుట్టలు. స్కూలుకు వెళ్లి వచ్చే పిల్లల గుంపులు. కూరగాయల బరువుతో గాడిదలు. నెత్తిమీద సరుకులు పెట్టుకుని అమ్ముకునేవాళ్లు. హడావుడి, గోల.

●●●

ఒక షాహుకారు కొట్లో గిఖోర్ పనికి కుదిరాడు. యజమాని పేరు బజాజ్ అర్తేం. ఇల్లు శుభ్రంగా ఉంచడం, గిన్నెలు కడగడం, జోళ్లు శుభ్రం చెయ్యడం, కొట్టుకు భోజనం తీసుకెళ్లడం మొదలైన పనులు గిఖోర్ సంవత్సరంపాటు చెయ్యాలి. ఆ తరువాత పిల్లాడికి కొట్టులో పని నేర్పుతాడు. ''అయిదారేళ్ల దాకా జీతం మాత్రం ఏమీ యివ్వను'' అన్నాడు. ''నిజం చెప్పాలంటే, పని నేర్పుతున్నందుకు నువ్వే నాకు ఎదురివ్వాలి'' అన్నాడు నవ్వుతూ. ఇద్దరికీ టీ, ఫలహారం పెట్టించాడు.

కొడుక్కు ఆ రాత్రి హంబో ఎన్నో జాగ్రత్తలు చెప్పాడు. 'అక్కడా, ఇక్కడా తిరక్కు. నీ చేతికేదైనా డబ్బు వస్తే అనవసరంగా పాడు చెయ్యకు. ఇంటి దగ్గర లక్ష అవసరాలున్నాయి. రాత్రిపూట బాగా కప్పుకో, లేకపోతే జలుబు చేస్తుంది. వాళ్ల భోజనాల్లో మిగిలిన తిండి నీకు పెడతారు, నువ్వేమీ అనుకోకూడదు. చాకిరీ చేసుకునేవాళ్ల బతుకే అంత. రోజులెలాగో తెలియకుండానే గడిచిపోతాయి'. అప్పటికే హంబోను ఆనుకుని గిఖోర్ నిద్రపోయాడు. తెల్లారి హంబో కొడుకును వదిలేసి తమ ఊరికి తిరిగి వెళ్లిపోయాడు.

గిఖోర్ వాలకం అర్తేం భార్య నత్తోకు ఏమీ నచ్చలేదు. బొత్తిగా కొండల్లోంచి వచ్చిన అడవి వాడిలా కనిపించాడామెకు. శనిగాడని తిట్టుకుంటూ కూర్చుంది. కానీ ఖర్చు లేకుండా కొన్ని సంవత్సరాలు పనిచేసే నౌకరు దొరికాడని అర్తేం సంతోషించాడు.

●●●

గిఖోర్ వంటింట్లో కూర్చునివున్నాడు. ఇంతలో నత్తో లోపలికి వచ్చింది. గిఖోర్ తను కూర్చున్న చోటు నుంచి లేవలేదు. ఆవిడ ఏదో అంది, గిఖోర్‌కు అర్థం కాలేదు.

''ఒరేయ్ అడవి మృగమా! నీకే చెప్తున్నాను'' అంది ఆమె. గిఖోర్‌కు వణుకు పుట్టింది. ఏమిటి చెప్పేరని తిరిగి అడగటానికి ధైర్యం చాలలేదు. నత్తో మండిపడుతూ బయటికి వెళ్లిపోయింది.

అప్పుడు అర్తేం తల్లి లోపలికి వచ్చింది. ఆమెది కొంచెం మెత్తని స్వభావం. ''యజమానురాలు లోపలికి వస్తే లేచి నిలబడవేంరా? ఏదైనా అడిగితే సమాధానం చెప్పాలి' అని సుద్దులు చెప్పింది. ఏమేం పనులు ఎలా చెయ్యాలో చెప్పింది.

అన్ని పనులూ గిఖోర్ చేసేవాడు. ఆకలికి మాత్రం ఆగలేకపోయేవాడు. ఇంటిదగ్గర ఆకలేస్తే తనంతట తాను రొట్టో, జున్నుముక్కో తినేవాడు. ఇక్కడ సంగతి వేరు. ఎంత కడుపులో కాలుతున్నా అందరి భోజనాలన్నీ అయ్యేదాకా ఉండి, అప్పుడు తను మొదలెట్టాలి. వాడి కడుపులో ఆకలి దహించుకుపోయేదాకా ఆ భోజనాల సమయం రాదు. అట్లా పదిసార్లు చూశాక, వంటింట్లో ఏమైనా దొరుకుతుందేమో అని వెతికేవాడు. ఓ ఎండిపోయిన రొట్టెముక్క, సగం గీరిన ఎముక ముక్క, ఏదో ఒకటి నోట్లో పెట్టుకునేవాడు.

●●●

వీధిలో ఎవరో గంట కొట్టారు. గంట వినబడగానే ఎవరో, ఎందుకు కొట్టారో చూడాలని గిఖోర్‌కు చెప్పారు. బాల్కనీలోంచి చూశాడు. ఒక పెద్దమనిషి, కొంతమంది స్త్రీలు. ''ఇదుగో ఏయ్, ఎవరు?'' అని కేక వేశాడు గిఖోర్. ''మీ యజమానురాలు యింట్లో లేరా?'' అని పెద్దమనిషి అడిగాడు. నత్తో ఆ మాటలు విని, బయటికి వచ్చి, ''ఓరి పీనుగా, వెళ్లి తలుపు తియ్యి, పరుగెత్తు'' అంది. అతిథులు లోపలికి వచ్చారు. గిఖోర్‌ను తొందరగా బజారుకు పంపింది. అతిథులతో నత్తో అరగంట సేపు కబుర్లు చెప్పింది. ఇంతలో గిఖోర్ చెమటలు కక్కుకుంటూ వచ్చాడు. ''పళ్లు పట్టుకువచ్చానమ్మగారూ!''

''సరేలే, అలా వుండనీ'' అంది నత్తో.

''అయ్యగారు చెర్రీపళ్లు చాలా ఖరీదు. అవి పట్టుకెళ్లకపోయినా ఫర్వాలేదులే అన్నారండి.''

అతిథులకు నవ్వొచ్చింది. నత్తో సిగ్గుపడింది. ''ఆయన ఏమన్నారో, యీ బుర్ర తక్కువ వెధవ ఏం వినిపించుకున్నాడో!'' అని సర్ది చెప్పుకుంది.

''నే నబద్ధం చెపితే ఒట్టండి'' అన్నాడు గిఖోర్.

స్నేహితులు వెళ్లిపోయాక, పళ్లు బల్లమీంచి తీసేస్తూ భర్తనీ గిఖోర్‌నీ కలిపి తిట్టింది నత్తో. 'అందరిమధ్యా నా తల వంచుకునేలా చేశాడు' అంటూ వచ్చాక భర్తకు ఫిర్యాదు చేసింది.

అర్తేం రమ్మని అరిచాడు. బిక్కుబిక్కుమంటూ వచ్చాడు గిఖోర్. బజాజ్ ముఖం చూసి వాడి పైప్రాణం పైకిపోయింది. 'మట్టిబుర్రా, చచ్చువెధవా' అంటూ చెంప ఛెడేలుమంది. తలవెళ్లి గోడకు కొట్టుకుంది. కళ్లు తిరిగి నేలమీద పడ్డాడు. ముసలమ్మ గిఖోర్‌ను లాగడానికి ప్రయత్నించింది. అప్పటికే చెట్టుకింద పడ్డ ఆకులా వణికిపోతూ, 'అమ్మా, అమ్మా' అని మూలుగుతున్నాడు.

●●●

గిఖోర్ ఇంటిపనులకు పనికిరాడని నిశ్చయించి, షాపులోకి తీసుకువెళ్లారు. షాపు శుభ్రం చేయడం, బట్టలు తానులుగా చుట్టడం, కొనుక్కునేవాళ్లకు సరుకు అందించడం, ఏమీ లేనప్పుడు కొట్టులోకి కొత్తవాళ్లు వచ్చేలాగా పిలిచి ఆకర్షించడం– ఇదీ వాడి పని.


ఒకనాడు ఇంటినుండి కొట్టుకు భోజనం తెస్తూ, మధ్యలో ఒక పార్శీమనిషి కోతిని ఆడిస్తూ పాడుతుంటే అక్కడే నిలిచిపోయాడు. ఆలస్యమైనందుకు, 'క్లబ్బుకు వెళ్లావా? గవర్నరుగారితో పనిమీద వెళ్లావా?' అంటూ మళ్లీ దెబ్బలు పడ్డాయి. బుగ్గనిండా ఎర్రని నెత్తురు చారలు. ఇంటికి వచ్చాక వాడికి అన్నం పెట్టవద్దని అర్తేం ఆజ్ఞాపించాడు. వాడికి ఆకలంటే అర్థం తెలియాలిట. ఆ రోజంతా వాడేమీ తినలేదు. ఒళ్లంతా దెబ్బలతో కదుము కట్టింది. కళ్లు వాచేలా ఏడ్చాడు. వాడి మనసు ఇంటిమీదకు పోయింది. 'రోజులెలాగో తెలియకుండానే గడిచిపోతాయి' అని తండ్రి చెప్పిన మాట గుర్తొచ్చింది.

●●●

చలికాలం వచ్చింది. మంచు తుపానుతో ఝుమ్ అని మోగిపోతోంది. అనాథ పిల్లల్ని కబళించడం కోసం మూలమూలలూ గాలిస్తోంది. వలగుడ్డలాంటి చొక్కా వేసుకుని, కొట్టుగుమ్మంలో నిలుచుని, 'అయ్యా రండి' అని పిలుస్తున్న గిఖోర్ తుపానుకు దొరికాడు. చలి వాడి ఎముకల్లోంచి కత్తిలా లోపలికి దూరింది. నీరసంగా వున్న వాడి ప్రాణానికిది చాలు. మంచానపడ్డాడు. హంబోని రమ్మని అర్తేం కబురు పంపాడు. గిఖోర్‌ను పట్నం ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. అక్కడ బోలెడుమంది రోగులు వరుసగా పడివున్నారు. ఎవరి కళ్లల్లోనూ జీవం లేదు. గిఖోర్‌ను హంబో అక్కడే చూశాడు. అంత జ్వరంలో తండ్రిని వాడు గుర్తించలేదు. 'అమ్మా, నాన్నా, జాన్నీ' అంటూ సంధిలో నవ్వుతున్నాడు.

రెండ్రోజుల తర్వాత హంబో గ్రామానికి బయల్దేరాడు. గిఖోర్‌ను పాతిపెట్టడం అయిపోయింది. హంబో చంక కింద గిఖోర్ బట్టలు పెట్టుకుని తల్లి చూసుకుని ఏడవడానికి తీసుకు వెడుతున్నాడు. వాడి జేబులో మెరుస్తున్న బొత్తాలూ, రంగు రంగు కాగితం ముక్కలూ, పిన్ను సూదులూ, బట్టల తాన్ల పీలికలూ ఉన్నాయి. ఇవన్నీ జాన్నీ కోసం పోగుచేశాడు.

హొవనేస్ తుమన్యాన్(1869–1923) కథ 'గిఖోర్' సారాంశం ఇది. దీన్ని చిరంజీవినీ కుమారి అనువదించారు. అర్మేనియా జాతీయ కవిగా తుమన్యాన్‌ను కీర్తిస్తారు. ప్రతి కవీ తన జాతి జనుల ఆత్మగా ఉండాలంటాడాయన.


హొవనేస్ తుమన్యాన్

కొత్త బంగారం

మరణించే హక్కు గురించి మాట్లాడే నవల

తన అంతర్జాతీయ కచేరీ పర్యటనకి మూడు వారాల ముందు, ఆత్మహత్యా ప్రయత్నం చేయడంతో, హాస్పిటల్లో చేరిన ఎలిఫ్రిడీ (ఎల్ఫ్)తో నవల ప్రారంభం అవుతుంది. ఆమె ప్రపంచ ప్రసిద్ధి పొందిన పియానిస్ట్. డబ్బున్నది. ప్రేమించే భర్త నిక్ ఉంటాడు. కానీ, మానసిక వ్యథతో బాధపడుతూ, మరణించాలన్న ప్రగాఢమైన కోరిక ఉన్న స్త్రీ. చనిపోయేందుకు– కడుపు మాడ్చుకోవడం, నిద్ర మాత్రలు మింగడం, మణికట్టు కోసుకోవడం, బ్లీచ్ తాగడం వంటి ప్రయత్నాల్లో వేటినీ వదలదు. 'ఎల్ఫ్ చనిపోవాలనుకుంది కానీ తను బతకాలన్నది నాకోరిక. మేమిద్దరం ఒకరినొకరు ప్రేమించుకునే శత్రువులం' అన్న చెల్లెలు యోలాండా (యోలీ) జీవితం ఆటుపోట్లకి గురైనది. కథనం ఆమె స్వరంతోనే వినిపిస్తుంది.




మిరియమ్ తియస్

అక్కను చుట్టుముట్టిన చీకటి గురించి తెలిసిన యోలీని, కారుణ్య మరణం చట్టబద్ధం అయిన స్విస్ క్లినిక్కి తనను తీసుకెళ్ళమని ఎల్ఫ్ అడుగుతుంది. తను వొప్పుకున్నా లేకపోయినా కూడా, ఎల్ఫ్ ఆత్మహత్యా ప్రయత్నం ఎప్పుడో అప్పుడు నెరవేరుతుందని గ్రహించిన యోలీ – అక్కకి సహాయపడ్డానికే నిశ్చయించుకుంటుంది. కానీ, బాంక్ ఆమెకి లోన్ ఇవ్వదు. ఎల్ఫ్‌కూ, నిక్‌కూ ఉమ్మడి ఖాతా ఉండటం వల్ల ఆ ప్రయాణాన్ని భర్తనుంచి దాయడం ఎల్ఫ్‌కు కుదరదు.

తన పుట్టినరోజు జరుపుకోడానికి ఎల్ఫ్ హాస్పిటల్ నర్సుల అనుమతి తీసుకుని బయటకెళ్ళి, నిక్‌తో పాటు విందు భోజనం చేసి, పుస్తకాలు తెమ్మని అతన్ని లైబ్రరీకి పంపుతుంది. ఎదురుగా వస్తున్న రైలు కింద తల పెట్టేసి, ఆత్మహత్య చేసుకోవడంలో కృతకృత్యురాలవుతుంది. తన జీవిత బీమా డబ్బుని యోలీకి వదిలిపెడుతుంది. ఎల్ఫ్ తండ్రి కూడా ఇదే విధానంలో, 12 సంవత్సరాల కిందట తన మరణాన్ని ఎంచుకుంటాడు. అక్కచెల్లెళ్ళ పల్లెటూరి బాల్య జ్ఞాపకాలని రచయిత్రి స్పష్టంగా, శక్తిమంతంగా వర్ణిస్తారు.


కథనం– సానుభూతికీ, పరిహాసానికీ మధ్య ఊగిసలాడుతుంది. మితిమీరిన విషాదం కనిపించక, పదునైన చమత్కారం కనబడుతుంది. కొన్ని చోట్ల నవ్విస్తుంది కూడా. అందుకే నవల విషాదకథల జోన్రాలోకి మాత్రం రాదు. కథాంశం తక్కువా, అస్పష్టమైన కవిత్వం ఎక్కువా ఉన్న ఈ నవల నిజాయితీగా అనిపిస్తుంది. కెనడియన్ రచయిత్రి మిరియమ్ తియస్ దీన్లో కొటేషన్ మార్క్స్ ఉపయోగించరు. అందువల్ల, ఏ పాత్ర మాట్లాడుతోందో, అది పలికిన మాటో, ఆలోచనో అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. నవల ఆఖరున రచయిత్రి డి.హెచ్.లారెన్స్‌ను ఉటంకిస్తారు: 'ఎన్ని ఆకాశాలు మీద పడ్డా సరే, మనం బతకక తప్పదు.'

'జీవితంతో అలిసిపోవడం వల్ల మరణాన్ని ఎంచుకోవడం సహేతుకమైనదేనా! మనం ప్రేమించే వారిపట్ల మనకే బాధ్యత ఉండదా?' అన్న ఎన్నో ప్రశ్నలని పుస్తకం సంధిస్తుంది. చనిపోయే ఎంపికా, ఆత్మహత్యకు సంబంధించిన అవమానం ఎదురుకోవడం అన్న అంశాలు నవల నేపథ్యానికి ఆయువుపట్టు. బ్రిటనీ మేనార్డ్ మొదలుపెట్టిన 'మరణించే హక్కు' ఉద్యమం ఊపందుకున్న తరువాత, ఈ పుస్తకం 2014లో విడుదల అయింది. ఇది రచయిత్రి ఆరవ నవల. తియస్ పుస్తకాలు ఎక్కువగా మానసిక వ్యాధులకి సంబంధించినవే.


ఈ స్వీయ చరిత్ర 2014లో 'రోజర్స్ ట్రస్ట్ ఫిక్షన్' బహుమతి పొంది,'స్కాటియా బాంక్గిలర్'బహుమతికి షార్ట్ లిస్ట్ అయింది. తదుపరి రెండేళ్ళలో మరెన్నో బహుమతులు కూడా గెలుచుకుంది. ఆడియో పుస్తకం కూడా ఉంది.

◆ కృష్ణ వేణి


ఈవారం పుస్తకాలు



జీవన కాలమ్ -2
రచన: గొల్లపూడి మారుతిరావు; పేజీలు: 220; వెల: 150; ప్రతులకు: ఎస్.ఆర్. బుక్‌లింక్స్, దానయ్య వీధి, మాచవరం, విజయవాడ-4. ఫోన్: 0866–2436959



శ్రీ కృష్ణదేవరాయలు వంశ మూలాలు
రచన: ముత్తేవి రవీంద్రనాథ్; పేజీలు: 222; వెల: 200; ప్రచురణ: సావిత్రి పబ్లికేషన్స్, 467, ఎన్టీఆర్ స్టేడియం వెనుక, ఎన్టీఆర్ వీధి, గుంటూరు– 522006. ఫోన్: 9014672669



వదరుబోతు
(1917, 18ల్లో అనంతపుర విద్యార్థి సంఘం ప్రకటించిన పక్ష పత్రికల నుండి)
పునర్ముద్రిత సంపాదకత్వం: డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి; పేజీలు: 136; వెల: 50; ప్రతులకు: వేమన అధ్యయన, అభివృద్ధి కేంద్రం, తాళ్లకాల్వ, గాండ్లపెంట మం., అనంతపురం– 515521. ఫోన్: 9963917187



అనుసృజన (దేశ, విదేశీ కవితల అనువాదాలు)
అనువాదం: నిఖిలేశ్వర్; పేజీలు: 128; వెల: 100; 2-2-647/185/1ఎ, శారదానగర్, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్–13. ఫోన్: 040–27422797

నవ్వుల ప్రపంచం



పదం పలికింది - పాట నిలిచింది

తెల్లవారకముందే పల్లె లేచింది తనవారినందరినీ తట్టి లేపింది



ఒక్కోసారి గొప్ప దృశ్యాన్ని ఆవిష్కరించడమే గొప్ప కవిత్వం అవుతుంది. దీనికి ఉదాహరణ 'ముత్యాల పల్లకి' చిత్రం కోసం మల్లెమాల రాసిన ***'తెల్లవారకముందే పల్లె లేచింది తనవారినందరినీ తట్టి లేపింది'*** పాట. ఇందులో సూర్యోదయాన్నీ, పల్లె జీవితాన్నీ చక్కగా దృశ్యమానం చేశాడు కవి.

వెలుగు దుస్తులేసుకుని సూరీడూ
తూర్పు తలుపు తోసుకొని వచ్చాడు
పాడు చీకటికెంత భయమేసిందో
పక్క దులుపుకొని ఒకే పరుగు తీసింది
అది చూసి లతలన్నీ ఫక్కున నవ్వాయి
ఆ నవ్వులే ఇంటింటా పువ్వులైనాయి.

ఈ చిత్రానికి సంగీతం సమకూర్చింది సత్యం. పాడింది పి.సుశీల. నారాయణరావు, జయసుధ నటించిన ఈ సినిమా 1976లో వచ్చింది. దర్శకత్వం బి.వి.ప్రసాద్.

రారండోయ్

- ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 21న ఉదయం 10 గంటలకు రవీంద్రభారతిలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 'తెలంగాణ భాషా అమలులోని వివిధ అంశాలపై' సదస్సు జరగనుంది. నిర్వహణ: తెలంగాణ సాహిత్య అకాడమీ.
- సయ్యద్ సలీం సాహిత్య సమాలోచన జాతీయ సదస్సు ఫిబ్రవరి 22, 23 తేదీల్లో కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలో జరగనుంది. నిర్వహణ: విశ్వవిద్యాలయ తెలుగు శాఖ, శశిశ్రీ స్మారక సమితి.
- బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ 'స్ఫూర్తి' అవార్డుల ప్రదానం ఫిబ్రవరి 25న సా. 6 గంటలకు వేంకటేశ్వర విజ్ఞాన మందిరం, గుంటూరులో జరగనుంది. పురస్కార గ్రహీతలు: ఓల్గా, కూచిభొట్ల ఆనంద్, బాల థెరిసా సింగారెడ్డి జింగ్రాస్, కె.ఎం.యాదవ్.
- 'ప్రాతినిధ్య–2016' ఆవిష్కరణ ఫిబ్రవరి 25న ఉదయం 10 గంటలకు విజయవాడలోని మధుమాలక్ష్మి కల్చరల్ సెంటర్‌లో జరగనుంది. నిర్వహణ: సాహితీ మిత్రులు.
- 2017 మాడభూషి రంగాచారి స్మారక పురస్కారానికి సమ్మెట ఉమాదేవి కథల సంపుటి 'రేలపూలు' ఎంపికైంది. ప్రదానం ఫిబ్రవరి 25న హైదరాబాదులో.
- విల్సన్‌రావు కొమ్మవరపు కవితా సంకలనం 'దేవుడు తప్పిపోయాడు' ఆవిష్కరణ ఫిబ్రవరి 22న సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. నిర్వహణ: పాలపిట్ట, కవిసంగమం.
- అనిల్ మాధవ్‌దవే పుస్తకానికి తెలుగు అనువాదం 'శివాజీ: స్వరాజ్యం నుంచి సురాజ్యం దాకా' ఆవిష్కరణ మార్చి 1న సాయంత్రం 6 గంటలకు సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రెయినింగ్(సిసిఆర్‌టి), మాధాపూర్, హైదరాబాద్‌లో జరగనుంది. నిర్వహణ: శ్రీ శివాజీ స్ఫూర్తి కేంద్రం, సోషల్ కాజ్, చేతన.

గ్రహం అనుగ్రహం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం. ఉత్తరాయణం, శిశిర ఋతువు. ఫాల్గుణ మాసం. తిథి శు.చవితి రా.3.40 వరకు, తదుపరి పంచమి. నక్షత్రం ఉత్తరాభాద్ర ప.12.37 వరకు, తదుపరి రేవతి. వర్జ్యం రా.12.39 నుంచి 2.16 వరకు. దుర్ముహూర్తం ప.12.35 నుంచి 1.21 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.40 వరకు. అమృత ఘడియలు ఉ.7.41 నుంచి 9.20 వరకు.

సూర్యోదయం : 6.29
సూర్యాస్తమయం : 5.58
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.28
జొహర్ : 12.30
అసర్ : 4.42
మగ్రీబ్ : 6.19
ఇషా : 7.32

అఖిలపక్షం పోరుబాట



రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్ష నేతలు

- ప్రత్యేక హోదా సాధనకు ఉమ్మడి కార్యాచరణ ప్రకటన
- ఒక్కటే ఎజెండాగా ముందుకు సాగాలని నిర్ణయం
- నేటి నుంచి ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షలు
- మార్చి 2, 3, 4 తేదీల్లో అన్ని జిల్లాల్లో ధర్నాలు
- 8న చలో పార్లమెంట్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా పోరుబాట పట్టాలని అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఆదివారం విజయవాడలో వామపక్షాల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ప్రత్యేక ప్యాకేజీని అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. తాడో పేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ప్రజలకు పిలుపునిచ్చింది. వచ్చే పార్లమెంట్ సమావేశాలు ముగిసేలోగా ప్రత్యేక హోదాపై స్పష్టమైన ప్రకటన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వచ్చే పక్షం రోజుల కాలానికి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. సీపీఐ, సీపీఎం, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, లోక్‌సత్తా, జనసేన, ఆమ్ ఆద్మీ సహా 18 పార్టీలు, వివిధ ప్రజాసంఘాలు, రాయలసీమ, ఉత్తరాంధ్ర మేధావులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరయ్యారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని నినదించారు. లక్ష్య సాధన కోసం ఎందాకైనా పోరాడాలని పేర్కొన్నారు. జెండాలు ఎన్ని ఉన్నా ఎజెండా ఒక్కటిగానే ముందుకు సాగాలన్నారు. సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను సాధన సమితి నాయకులు ప్రకటించారు.

చంద్రబాబు తల ఖరాబైంది

ఇంటి తాళాలు దొంగకిచ్చి సామాన్లు కాపాడమని అడగడమే ఈ రాష్ట్ర ప్రజలు చేసిన తప్పు అని వైఎస్సార్‌సీపీ నేత కె.పార్థసారథి చెప్పారు. తమ పార్టీ ఎప్పుడూ ప్రత్యేక హోదాకే మద్దతు ఇస్తోందన్నారు. ప్రాణాలు ఉన్నంత వరకు ప్రత్యేక హోదా కోసం పోరాడతానని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసింది బీజేపీ, టీడీపీలేనని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మండిపడ్డారు. సీఎం చంద్రబాబు 29 సార్లు ఢిల్లీకి వెళ్లింది అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు కోసమే తప్ప రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించడానికి కాదన్నారు. కాసేపు ప్రత్యేక హోదా, కాసేపు ప్రత్యేక ప్యాకేజీ అంటూ గందరగోళంలో ఉన్న సీఎం చంద్రబాబుకు మంచి వైద్యం అందించాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చెప్పారు. చంద్రబాబుకు తల ఖరాబైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదాను ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా లేదన్నారు. ఈ విషయంలో మొదటి నేరస్తుడు చంద్రబాబు, రెండో నేరస్తుడు నరేంద్ర మోదీ అని దుయ్యబట్టారు.

సమావేశంలో సామినేని ఉదయభాను, మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్(వైఎస్సార్‌సీపీ), వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ బాబూరావు (సీపీఎం), పీజే చంద్రశేఖర్, వనజ (సీపీఐ), బి.బాబ్జీ (లోక్‌సత్తా), రాము (ఆప్), పోతుల మహేష్ (జనసేన), జగదీష్ యాదవ్ (ఎస్పీ), తూమాటి శివయ్య (ఎంసీపీఐ), విద్యాసాగర్ (బీఎస్పీ), మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ రావు, ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి అధ్య క్షుడు చలసాని శ్రీనివాసరావు ప్రసంగించారు.

భవిష్యత్ కార్యాచరణ ఇలా...

- సోమవారం(ఫిబ్రవరి 19) నుంచి ప్రతిరోజూ ఏదో ఒక జిల్లాలో రౌండ్ టేబుల్ సమావేశం
- ఫిబ్రవరి 19 నుంచి 28 వరకు ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షలు
- 19న ఒంగోలు, 21న విజయవాడలో జర్నలిస్టు సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం
- అన్ని విశ్వవిద్యాలయాల్లో వచ్చే నెలాఖరు నుంచి విద్యార్థి సంఘాల సమావేశాలు, ఆ తర్వాత బంద్
- మార్చి 1వ తేదీన గుంటూరులో రాష్ట్ర సదస్సు
- 2, 3, 4 తేదీల్లో అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో దీక్షలు, ధర్నాలు
- మార్చి 1న వైఎస్సార్‌సీపీ తలపెట్టిన దీక్షలకు, 5న ఢిల్లీలో ధర్నాకు మద్దతు
- మార్చి 4న విశాఖలో కొవ్వొత్తుల ప్రదర్శన
- మార్చి 6, 7 తేదీల్లో ఢిల్లీలో కాంగ్రెస్ దీక్షలకు సంఘీభావం
- మార్చి 4 నుంచి ఢిల్లీలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులకు లేఖలు, ఇళ్ల ముట్టడి
- మార్చి 8న 'చలో పార్లమెంట్'

సామాన్యుడిపై 'సర్జికల్' స్ట్రైక్



సాక్షి, అమరావతి

45 ఏళ్ల రాజేంద్రకు హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. హైదరాబాద్‌లోని(ప్యారడైజ్ సమీపంలో) ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరాడు. స్టెంట్ వేస్తేనే బతుకుతాడని డాక్టర్లు చెప్పారు. స్టెంట్ వేశాక రెండు రోజుల్లో డిశ్చార్జి అయ్యాడు. స్టెంట్ ఖరీదు కాకుండానే రోగికి రూ.1.56 లక్షల బిల్లు వేశారు. స్టెంట్ ధర మరో రూ.30 వేలు అన్నారు. మొత్తం రూ.1.86 లక్షలు చెల్లించాల్సి వచ్చింది. కేవలం ఒక్క స్టెంట్ వేస్తే ఇంత బిల్లు ఎందుకైందని అడిగితే... అది అంతేనని డాక్టర్లు బదులిచ్చారు.

65 ఏళ్ల రాజేశ్వరి అనారోగ్యంతో విజయవాడలోని విజేత టాకీస్ వద్దనున్న ఆసుపత్రికి వెళ్లింది. రోజుకొకటి చొప్పున వారం రోజులు ఇంజెక్షన్ వేయాలన్నారు. ఒక్కో ఇంజెక్షన్ ఖరీదు రూ.6 వేలు అవుతుందన్నారు. ఆ మహిళ బంధువు ఫార్మసిస్ట్‌గా పని చేస్తున్నాడు. ఆ ఇంజెక్షన్ ధర మందుల దుకాణంలో అయితే రూ.2,500, అదే డిస్ట్రిబ్యూటర్ వద్ద రూ.900 అని చెప్పాడు. ఒకే మందు ధర మూడు చోట్ల మూడు రకాలుగా ఉంటుందా? అని రోగి కుటుంబ సభ్యులు నివ్వెరపోయారు.

సామాన్యుడికి జబ్బు చేసి కాదు, ఆసుపత్రిలో బిల్లు చూసి గుండె ఆగిపోతోంది. ఒక్కసారి అనారోగ్యం బారినపడి కార్పొరేట్ ఆసుపత్రిలో చేరితే ఉన్న ఆస్తులు అమ్ముకోవాల్సిందే. ప్రాణం నిలవడం మాటేమోగానీ ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగలడం ఖాయం. ఏ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లినా సామాన్యుడిపై 'సర్జికల్' స్ట్రైక్ జరుగుతోంది. చట్టాలు కార్పొరేట్ హాస్పిటళ్లకు చుట్టాలుగా మారాయి. శస్త్రచికిత్సల పేరిట విపరీతంగా దోచేస్తున్నారు. వస్తువును తయారు చేసే కంపెనీ తక్కువ ధరకే ఇస్తోంది. దాన్ని డిస్ట్రిబ్యూటర్ కూడా తక్కువ ధరకే కార్పొరేట్ ఆసుపత్రులకు అందజేస్తున్నాడు. కానీ, ఆ తక్కువ ధర సామాన్య రోగికి వర్తించడం లేదు. కార్పొరేట్ ఆసుపత్రులు చెప్పిందే లెక్క, వేసిందే బిల్లు. శస్త్రచికిత్సల పరికరాల రేట్లు సామాన్యులనే కాదు సంపన్నులనూ భయపెడుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా సాగుతున్న దోపిడీపై 'సాక్షి' పరిశీలనలో పలు విషయాలు వెల్లడయ్యాయి.

300 శాతం అధిక రేట్లు

నర్సింగ్ హోమ్‌లు, ప్రైవేట్ ఆసుపత్రులు, కార్పొరేట్ హాస్పిటళ్లు... పేరు ఏదైనా వీటి లక్ష్యం రోగుల దగ్గర ఉన్నదంతా ఊడ్చేయడమే. శస్త్రచికిత్స కోసం వెళితే ఎంత చార్జి పడుతుందో అంచనా ఉండదు. వాస్తవానికి సర్జికల్ వస్తువులు తక్కువ ధరకే లభిస్తున్నాయి. అవి కార్పొరేట్ ఆసుపత్రులకు చేరి, రోగులకు వాడేసరికి ధర 200 నుంచి 300 రేట్లు పెరిగిపోతోంది. ఈ దందాపై ఆరోగ్య శాఖ, ఇటు ఔషధ నియంత్రణ అధికారులు దృష్టి పెట్టడం లేదు.

రోగికి 'స్టెంట్' లాభం సున్నా

దేశవ్యాప్తంగా స్టెంట్ల ధరను ప్రభుత్వం భారీగా తగ్గించింది. ఏ స్టెంట్‌నైనా గరిష్టంగా రూ.30 వేలకు మించి అమ్మకూడదని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) నిర్దేశించింది. ఏడాదిన్నర కిందటే ఇది అమల్లోకి వచ్చినా ఏపీ, తెలంగాణలో ఆ ప్రభావం కనిపించడం లేదు. ధర తగ్గించకముందు రోగికి ఒక స్టెంట్ వేస్తే రూ.1.70 లక్షలు ఖర్చయ్యేది. ఇందులో స్టెంట్ ధర రూ.70 వేలు అవుతుందని చెప్పేవారు. కానీ, ధర తగ్గించాక స్టెంట్ ఖర్చు రూ.30 వేలు మాత్రమే. అంటే రూ.40 వేలు తగ్గించాలి. ఏ ఆసుపత్రిలోనూ ఇది అమలు కావడం లేదు. ప్రొసీజర్ రేట్లు.. అంటే థియేటర్ చార్జీలు, నర్సింగ్ చార్జీలు, డాక్టర్ చార్జీల పేరుతో పాత రేట్లనే (రూ.1.70 లక్షలు) వసూలు చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

రేట్లు తగ్గాయి.. ప్రొసీజర్ ఖరీదైంది

దేశవ్యాప్తంగా స్టెంట్లు, మోకాలి చిప్పల ధరలు తగ్గించారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో వీటి రేట్లు తగ్గించారు గానీ ఆపరేషన్ చార్జీలు, నర్సింగ్ చార్జీలు, డాక్టర్ ఫీజులు పెంచేశారు. రోగులు ఎప్పటిలాగే పాత ధరలే చెల్లించాల్సి వస్తోంది. ఎంఆర్‌పీకి మించి ఎక్కువ వసూలు చేస్తేనే తాము చర్యలు తీసుకోగలమని ఔషధ నియంత్రణ శాఖ అధికారులను చెబుతున్నారు. ఎంఆర్‌పీ మేరకే తీసుకుంటే ఏమీ చేయలేమని అంటున్నారు. బడా ఆసుపత్రులు బిల్లుల్లో స్టెంట్లకు ఎంఆర్‌పీ ధరలే వేస్తున్నాయి.

ఏటా రూ.వేల కోట్ల వ్యాపారం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సల పేరిట ఏటా రూ.వేల కోట్ల వ్యాపారం జరుగుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 పడకలు మొదలుకుని 200 పడకల స్థాయి వరకూ 2,868 ప్రైవేట్ హాస్పిటళ్లు ఉన్నాయి. వీటిలో ప్రతిఏటా 3 లక్షల వరకూ మేజర్ సర్జరీలు జరుగుతున్నట్టు అంచనా. మరో 80 వేల నుంచి లక్ష వరకూ మైనర్ సర్జరీలు జరుగుతున్నాయి. ప్రైవేట్ ఆసుత్రుల్లో శస్త్రచికిత్స ద్వారా ఏటా రూ.10 వేల కోట్లకు పైగానే టర్నోవర్ జరుగుతున్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఒక రేటు, ఇన్సూరెన్స్ ఉంటే మరో రేటు, నగదు చెల్లించేవారికి ఇంకో రేటు వేస్తున్నారు. బిల్లుల విషయంలో ఒక ఆసుపత్రికి మరో ఆసుపత్రికి పొంతనే ఉండడం లేదు.

ఎంఆర్‌పీని నియంత్రించవచ్చు కదా?

''అసలు ఎంఆర్‌పీని(గరిష్ట అమ్మకం ధర) నిర్ణయిస్తున్నది ఎవరు? ఒక వస్తువును ఉత్పత్తి చేయడానికి ఉత్పత్తిదారుడికి రూ.30 ఖర్చయితే, ఆ వస్తువుపై ఎంఆర్‌పీ రూ.160 అని వేస్తున్నారు. ఎంఆర్‌పీని ప్రభుత్వం ఎందుకు నియంత్రించలేకపోతోంది? ఎంఆర్‌పీ అనేది వస్తువును ఉత్పత్తి చేసే కంపెనీ వేస్తోందా? లేక మధ్యలో ఎవరైనా వేస్తున్నారా? ఎంఆర్‌పీ వెనుక మతలబు తేల్చాల్సింది ప్రభుత్వమే''

– డా.శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ, ఏపీ నర్సింగ్‌హోమ్స్ అసోసియేషన్

ఏ సేవకు ఎంత ఫీజో చెప్పాల్సిందే..

''క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–2010 ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రులు తమ సేవలకు ఎంత ఫీజు వసూలు చేస్తారో బోర్డు మీద వివరాలు అందుబాటులో ఉంచాలి. ఔట్ పేషెంట్లకు కూడా ఏ స్పెషలిస్టు ఎంత వసూలు చేస్తున్నారో చెప్పాలి''

– డా.గీతాప్రసాదిని, అదనపు సంచాలకులు, ప్రజారోగ్య శాఖ

సర్జికల్ వస్తువుల ధరలు (రూపాయల్లో)

వస్తువు	డిస్ట్రిబ్యూటర్ ధర	కార్పొరేట్ ఆసుపత్రి ధర
బీడీ వాన్‌ఫ్లోన్ 20జి	29.75	132
పాలీ అల్ట్రా ఐవీ కానులా	5.17	120
వైకాన్ ఐవీ కానులా	8.00	118
పాలీ ఐవీసెట్	7.49	108
ఐవీసెట్ పీపీ	10.50	110
ఈజీఫిక్స్	8.50	35
రామ్‌సన్ ఐవీసెట్	8.75	115
పాలీమెడీసిజర్	91.67	521
స్విగీకేర్ గ్లౌజ్	10.45	49
బిబ్రాన్ సెంట్రోఫిక్స్	1,450	2,910
సెంట్రోఫిక్స్ మోనో	872.40	1,995
సెంట్రోఫిక్స్ ట్రోయో	1,450	3,560
ఎగ్జామినేషన్ గ్లౌజ్	1.24	7.50
స్ట్రాస్ ప్యాడ్	7.20	50
గ్లాస్‌వాన్22	240	500
సర్జీకేర్	330	1,225



రాజన్నలా పంచె కట్టి.. రైతన్నలా నాగలి చేతపట్టి.. పాదయాత్రలో జగన్ వెంట అడుగులేస్తున్న చిన్నారి



చంద్రబాబును ఇక నమ్మము అని కందుకూరు సభలో చేతులెత్తి చెబుతున్న అశేషజనవాహినిలో ఓ భాగం

బాబును పొరపాటున కూడా క్షమించొద్దు

కందుకూరు సభలో ప్రతిపక్ష నేత జగన్

- ఈయన్ను క్షమిస్తే మోసాలకు హద్దు ఉండదు..
- రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ పాలన..
- ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినా చర్యలు ఉండవు..
- ఆ నలుగురు మంత్రులు ఏ పార్టీ వారు చంద్రబాబూ?
- జనం కరువుతో అల్లాడుతున్నా పట్టించుకోరా?
- గిట్టుబాటు ధర దక్కక రైతులు విలవిల్లాడుతున్నా ఆదుకోరా?
- ఇలాంటి నాయకుడు మనకు అవసరమా?
- మనందరి ప్రభుత్వం రాగానే అన్ని వర్గాల వారినీ ఆదుకుంటాం..
- రామాయపట్నం పోర్టు, రాళ్లపాడు ప్రాజెక్టు పూర్తి చేస్తాం

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'చట్టాలను తయారు చేయాల్సిన శాసనసభలోనే చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. వ్యవస్థలను నాశనం చేయడమే కాక తారస్థాయిలో అవినీతికి పాల్పడుతూ మోసాలు, అబద్ధాలతో ఇవాళ చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. ఒక్క హామీ కూడా నెరవేర్చని ఈ పెద్దమనిషిని మీరు పొరబాటున కూడా క్షమించొద్దు' అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం 91వ రోజు ఆయన ప్రకాశం జిల్లా కందుకూరులో జరిగిన భారీ బహిరంగ సభలో అశేష ప్రజానీకాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు 23 మందిని మార్కెట్‌లో పశువుల మాదిరిగా ఒక్కొక్కరికి రూ.20 కోట్లు, రూ.30 కోట్లు ఇచ్చి కొనుగోలు చేయడమే కాకుండా వారిలో కొంత మందికి మంత్రి పదవులు కూడా ఇచ్చారని ధ్వజమెత్తారు. ఒక పార్టీ తరఫున గెలిచి మరో పార్టీలోకి మారినందుకు వారిని అనర్హులుగా ప్రకటించరు.. వారి చేత రాజీనామాలూ చేయించరు.. వారు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా అలాగే కొనసాగుతున్నారని మండిపడ్డారు. ఈవాళ మంత్రివర్గంలోకి తీసుకున్న ఆ నలుగురు ఎమ్మెల్యేలు ఏ పార్టీకి చెందిన వారని చంద్రబాబును ప్రశ్నిస్తున్నానన్నారు. ఈ సభలో జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే..

కరవు మండలాలను ప్రకటించరా?

"తాను అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు చార్జీలు తగ్గిస్తానని చంద్రబాబు అన్నారు. కానీ మూడుసార్లు పెంచి షాక్ కొట్టేలా చేశారు. ఆర్టీసీ బస్సు చార్జీలూ పెంచేశారు. పండుగలప్పుడు సొంతూళ్లకు వెళ్లాలంటే భయపడేలా టికెట్ల ధర పెంచేస్తున్నారు. బాబు వస్తే జాబు వస్తుందన్నారు. జాబు రాలేదు కానీ ప్రకాశం జిల్లాకు కరవు వచ్చింది. ఈ ఖరీఫ్‌లో 56 మండలాలకు గాను 42 మండలాలు కరవు ప్రాంతాలుగా నమోదయ్యే పరిస్థితి. రబీలో రుతుపవనాల మీద ఈ జిల్లా ఎక్కువగా ఆధారపడుతుంది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో మైనస్ 71 శాతం వర్షపాతం ఉంది. జనవరిలో కూడా ఒక్క చినుకు పడలేదు. మొత్తంగా 90 శాతం మైనస్‌లో వర్షపాతం ఉంది. రైతన్నలు ఇంత దారుణమైన పరిస్థితుల్లో ఉంటే ఇంత వరకూ కరవు మండలాల ప్రకటన కూడా జరగలేదంటే ఈ పాలన ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోండి. ఇంత వరకూ కరవు మండలాల ప్రకటన లేదు. రాష్ట్ర ప్రభుత్వం కట్టాల్సిన ఇన్సూరెన్స్ మొత్తం కూడా కట్టలేదు. ఇదే జిల్లాలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు కలిగిన వారు 7 లక్షల మంది ఉన్నారు. గత ఏడాది 3.9 లక్షల కుటుంబాలకు 100 రోజులు పనులు కల్పించాల్సి ఉండగా, 52 రోజులపాటు మాత్రమే పనులు కల్పించారు. ఈ ఏడాది కరువు ఇంతగా ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వానికి పనులు కల్పించాలన్న ఆలోచన లేదు. దీంతో లక్షలాది మంది వలస పోతున్నారు.

రాళ్లపాడుకు చంద్ర గ్రహణం

రాళ్లపాడు ప్రాజెక్టు పూర్తి కాక పోవడం వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటున్నామన్నా.. అంటూ కొందరు అక్క చెల్లెమ్మలు ఇవాళ (ఆదివారం) నాతో చెప్పారు. ఇలాంటి పాలన చూసినపుడు బాధ కలుగుతుంది. రాళ్లపాడు మీదుగానే ఇక్కడకు వచ్చాను. ఆ ప్రాజెక్టును చూసినప్పుడు నాకు బాధ కలిగింది. ఇవాళ రాళ్లపాడుకు చంద్ర గ్రహణం పట్టిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోమశిల ఉత్తర కాలువను తీసి నీళ్లు తరలించి తద్వారా కందుకూరు నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని సంకల్పించారు. ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లోని దాదాపు 25, 30 వేల ఎకరాలకు నీరందుతాయని ఆయన భావించారు. ఇందుకోసం రూ.100 కోట్లు కేటాయించి పనులు మొదలు పెట్టించారు. ఆయన చనిపోయాక రూ.20 కోట్లు ఖర్చు చేస్తే నీళ్లు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నా ఈ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. మనందరి ప్రభుత్వం రాగానే రాళ్లపాడు ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేస్తాం. రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తాం.

దళారీల నాయకుడు చంద్రబాబే

శనగ, పొగాకు, మినుము, కంది పంటలు ఇక్కడ బాగా పండిస్తారు. ఈ జిల్లాలో శనగ 2.54 లక్షల ఎకరాల్లో పండిస్తారు. శనగకు క్వింటాలుకు ఉత్పత్తి ధర రూ.5,200 అయితే ఇవాళ మార్కెట్‌లో రూ.3,200 నుంచి రూ.3,800 మాత్రమే ధర పలుకుతుండటంతో రైతులు అల్లాడిపోతున్నారు. చంద్రబాబు నాయుడు దళారి అవతారం ఎత్తి.. తన హెరిటేజ్ కంపెనీ కోసం రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశాక అవే శనగలు అక్కడ రూ.9 వేలు, రూ.10 వేలు అవుతాయి. కందికి కనీస మద్దతు ధర రూ.5,450 ప్రకటిస్తే ఇవాళ రూ.3,500 నుంచి రూ.4,000కు కూడా అమ్ముకోలేని పరిస్థితులు ఉన్నాయి. మినుము మద్దతు ధర రూ.5,850 అయితే రూ.4,200 కూడా గిట్టు బాటు కావడం లేదు. నాన్నగారి హయాంలో పొగాకు రైతులకు సగటున కేజీకి 127 రూపాయలు వచ్చేవి. ఆ రోజుల్లో ఎరువుల రేట్లు తక్కువగా ఉండేవి. తక్కువ ఖర్చుతో పండించే వారు. ఇవాళ.. అంటే పదేళ్ల తర్వాత రేటు చూస్తే కేవలం రూ.116 మాత్రమే. ఇవాళ ఎరువులతో సహా అన్నీ రేట్లు పెరిగాయి. రైతులు లక్షల రూపాయలు పోసి బ్యారన్లను కట్టుకున్నారు. ఈ లైసెన్సులు తమకొద్దని.. వెనక్కు తీసుకోండని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇన్ని ఇక్కట్ల మధ్య పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే నేను వచ్చి పరామర్శించాను.

ఈ పెద్దమనిషి మాటలు మీరు నమ్ముతారా?

అధికారంలోకి రావడం కోసం ఎన్నికలప్పుడు చంద్రబాబు ఎన్నో హామీలు ఇచ్చారు. తీరా గెలిచాక ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. ఇలాంటి నాయకుడు మనకు అవసరమా? ఆలోచించండి. ఇప్పుడు ఈ పెద్దమనిషిని మీరు కనుక క్షమిస్తే ఈయన మోసాలకు హద్దు ఉండదు. ఇక మీరు చిన్న మోసాలకు మోసపోరని తెలిసి రేపటి ఎన్నికల్లో ప్రతి ఇంటికీ కేజీ బంగారం ఇస్తానంటారు. మీరు నమ్మరని తెలిసి ప్రతి ఇంటికీ బెంజికారు ఇస్తానంటారు. అయినా నమ్మరని తెలిసి అవినీతితో విపరీతంగా సంపాదించిన డబ్బును ఇంటింటికీ తీసుకెళ్లి ప్రతి ఒక్కరి చేతిలో రూ.3 వేలు పెడతారు. అపుడు మీరు వద్దు అని మాత్రం అనొద్దు. రూ.3 వేలు కాదు.. రూ.5 వేలు గుంజండి. ఆ డబ్బు మనదే. మన వద్ద నుంచి దోచేసిందే. ఓట్లేసేటప్పుడు మీ మనస్సాక్షి ప్రకారం ఓట్లేయండి. మోసాలు, అబద్ధాలు చెప్పే వారిని బంగాళాఖాతంలోకి తోసేయండి. చెడిపోయిన ఈ వ్యవస్థలోకి మార్పు తీసుకు రావాలంటే జగన్ ఒక్కడి వల్లనే సాధ్యం కాదు. అందుకు మీ అందరి తోడు కావాలి.

ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు తెస్తాం

దేవుని ఆశీస్సులతో, మీ అందరి సహకారంతో రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలకు మేలు చేసే నవరత్నాలను అమలు చేస్తాం. ఆరోగ్యశ్రీ పథకం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఎలా అమలు అయిందీ.. ఇప్పుడెలా ఉందో ఒక్కసారి ఆలోచించాలని కోరుతున్నా. ఆయన ఆరోజు ప్రవేశ పెట్టిన 108 అంబులెన్స్ సర్వీసు అప్పట్లో ఫోన్ చేసిన 20 నిమిషాల్లో మన ముందుకు వచ్చి రోగిని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించేది. ఇవాళ ఫోన్ చేస్తే అంబులెన్స్‌కు డీజిల్ లేదనే సమాధానం వస్తోంది. గుండె, మెదడు, కిడ్నీకి సంబంధించిన వ్యాధులు, క్యాన్సర్ వచ్చిన రోగులు అత్యుత్తమ ఆసుపత్రులు ఉండే హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స చేయించుకుందామంటే ఈవాళ ఆరోగ్యశ్రీ వర్తించని పరిస్థితులున్నాయి. ఇక్కడేమో మంచి ఆసుపత్రులు లేవు. అక్కడున్నా పోవడానికి వీల్లేదు. ఇవాళ (ఆదివారం) కూడా ఓ తల్లి చేతిలో చిన్న పిల్లాడిని తీసుకుని నా దగ్గరకు వచ్చింది. ఆ పిల్లాడికి మూగ, చెవుడు ఉన్నందువల్ల కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ చేయించాలి. అందుకు రూ.6 లక్షల నుంచి రూ.7లక్షలు ఖర్చవుతుంది. నాన్నగారు జీవించి ఉన్నప్పుడు ఇలాంటి పిల్లలకు నేనున్నాను అని చికిత్స చేయించేవారు. ఇవాళ అలాంటి పిల్లలు చికిత్స కోసం వెళితే రకరకాల కారణాలు చూపి ఆ చికిత్స చేయడం లేదు. ఈ ప్రాంతంలో కిడ్నీ రోగులు చాలా ఎక్కువ. అలాంటి వారికి డయాలసిస్ చేయించాలి. వారానికి రెండు మూడు సార్లు డయాలసిస్ చేయించాలంటే నెలకు రూ.20 వేలు ఖర్చు అవుతుంది. ఏడాదికి రూ.2 లక్షలకు పైనే ఖర్చు అవుతుంది. ఇప్పుడు ఆసుపత్రికి కిడ్నీ రోగులు డయాలసిస్ కోసం వెళితే సంవత్సరం తర్వాత రండి అని చెప్పి పంపిస్తున్నారు. ఇదే ప్రకాశం జిల్లా కనిగిరిలో కిడ్నీ రోగులను ఆదుకోవాలని నేను ధర్నా చేస్తే ప్రభుత్వం ఒక డయాలసిస్ యూనిట్‌ను మంజూరు చేసింది. క్యాన్సర్ రోగులకు ఏడెనిమిది సార్లు కీమోథెరపీ చేయాల్సి ఉండగా రెండుసార్లు చేసి పంపించేస్తున్నారు. ఇలా చేస్తే ఆరు నెలల తర్వాత వ్యాధి తిరగబెట్టే ప్రమాదం ఉంది. అలా వ్యాధి తిరగబెట్టడంతో రోగి ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని ఆసుపత్రికి వెళితే చికిత్స చేయబోమని తిప్పి పంపుతున్నారు. అందుకే రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మరింత మెరుగ్గా అమలు చేస్తాం. వైద్యం ఖర్చు వెయ్యి రూపాయలు దాటితే ఆ వైద్యమంతా ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేయిస్తాం. ఎంత పెద్ద ఆపరేషన్ అయినా, ఎంత ఖర్చయినా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ఎక్కడైనా మంచి ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నా ఉచితంగా చేయిస్తాం. శస్త్ర చికిత్స చేయించుకున్న రోగి తీసుకునే విశ్రాంతి కాలానికి వైద్యుల సూచన మేరకు (పేదవాళ్లు జీవించడానికి) డబ్బు కూడా ఇస్తాం. కిడ్నీ, తలసీమియాతో బాధపడే రోగులకు రూ.10 వేలు పింఛన్ ఇస్తాం" అని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.



కాకుటూరులో అభిమాని ఇచ్చిన పుచ్చకాయ ముక్కను తీసుకుంటున్న జగన్



జగన్‌తో కరచాలనం చేయడానికి పోటీ పడుతున్న ఓ సోదరి

ప్రజాసంకల్ప యాత్ర 91వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం **1,234.9** కిలో మీటర్లు

91వ రోజు నడిచిన దూరం **12.6** కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 8 గంటలకు పోకూరు

ముగింపు: సా. 5.30 గంటలకు కందుకూరు

ముఖ్యాంశాలు

- పోకూరు, నూకవరం, అత్తింటివారిపాలెం క్రాస్ రోడ్డు, బొంతవారిపాలెం, కాకుటూరు, చెర్లోపాలెం, ప్రశాంత్‌నగర్‌లలో ప్రజలతో మమేకం
- బడేవారిపాలెం వద్ద పార్టీ జెండా ఆవిష్కరణ
- కందుకూరులో బహిరంగ సభ

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8 గంటలకు కందుకూరు

ముఖ్యాంశాలు

- కందుకూరు, వెంకట్రాదిపాలెం, అనంతసాగరం క్రాస్, కొండపి నియోజకవర్గంలోని ఎడ్లూరుపాడు కాలనీ, విప్పగుంటలో జనంతో మమేకం.
- ఎడ్లూరుపాడు, పెదవెంకన్నపాలెంలలో పార్టీ జెండా ఆవిష్కరణ

మాకోసం ఎంత కష్టపడుతున్నావయ్యా..

- ఈసారి నిన్నే గెలిపించుకుంటాం..
- జగన్‌కు మహిళలు, వృద్ధుల మద్దతు

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'అయ్యా.. మాకోసం మండుటెండలో నడుస్తున్నావు.. ఇంతగా కష్టపడుతున్నావు.. ఈసారి నిన్నే గెలిపించుకుంటాం..' అని పాదయాత్ర సాగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు మహిళలు, వృద్ధులు మద్దతు పలికారు. ఆదివారం కందుకూరు నియోజకవర్గంలోని వల్లేటివారిపాలెం మండలం బడేవారిపాలెం గ్రామంలో పెద్ద సంఖ్యలో జనం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మువ్వా నరసమ్మ అనే వృద్ధురాలు మాట్లాడుతూ.. 'అయ్యా.. పింఛన్లు రాక ముసలోళ్లు ఇబ్బంది పడుతున్నారు.. మాలాంటోళ్ల కోసం నువ్వు కష్టపడుతున్నావు. ఈసారీ నువ్వే వస్తావు.. నిన్నే గెలిపించుకుంటాం' అని చెప్పింది. ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు వేర్వేరుగా జగన్‌ను కలిశారు. నష్టాలు వస్తున్నాయనే నెపంతో గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వం పల్లె వెలుగు బస్సులను తిప్పడం ఆపేస్తోందని వివరించారు. గ్రామాలకు బస్సు సర్వీసులను నిలిపివేసి, ఆ బస్సులను పట్టణ ప్రాంతాల్లో నడిపేందుకు వేరే డిపోలకు తరలిస్తున్నారని చెప్పారు. ఇటీవల కందుకూరు డిపో నుంచి కొన్ని బస్సులను వేరే డిపోకు తరలించారన్నారు. ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఈ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయలేదని.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రెగ్యులరైజ్ చేయాలని కోరారు.



కాకుటూరులో రైతులతో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత



బడేవారిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి తల్లితో మాట్లాడుతున్న జగన్



అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న జననేత





దివ్యాంగురాలిని, అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న జగన్

91వ రోజు

18-02-2018, ఆదివారం
కందుకూరు, ప్రకాశం జిల్లా



భావి తరాల బంగారు భవితవ్యం కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధం

బడేవారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన బొమ్మల చిన్నయ్య రావడం రావడమే బాబుగారిపై ఆగ్రహాన్ని వెళ్లగక్కాడు. 'సార్.. ఈ గవర్నమెంటును నమ్మేదానికే లేకుండా పోతోంది. నాకున్న కొద్దిపాటి పొలాన్ని నమ్ముకుని కుటుంబాన్ని సాక్కుంటున్నాను. వర్షాల్లేక పంటలు ఎండిపోతుంటే బోరు వేసుకుందామనుకున్నాను. ఎస్సీ కార్పొరేషన్‌కు పోతే బోరు మంజూరు చేశారు. ఇది జరిగి రెండేళ్లు పొద్దయింది. ఇప్పటికీ నా పొలంలో బోరుపడ్డ పాపానపోలేదు. ఇదేమి సామీ అనుకుంటూ అధికారులకు, ఆఖరుకు కలెక్టర్‌కు కూడా పలుమార్లు విన్నవించుకున్నాను. పట్టించుకున్న నాథుడే లేడు. రెండేళ్లుగా తిరుగుతూ ఉంటే విసుగొస్తోంది.. కోపమొస్తోంది. ఆ కోపం ఎవరిమీద చూపించాలో తెలియడంలేదు..' అంటూ 65 ఏళ్ల వృద్ధుడు ఆవేశపడిపోతుంటే ధర్మాగ్రహమే కదా.. అనిపించింది. పాపం ఇప్పుడు కూడా మిర్చి పంట ఎండిపోయే పరిస్థితికి వచ్చిందట. పంట ఎండిపోతే రైతు బతుకులో జీవకళ పోయినట్టే కదా. అందుకే రైతులందరికీ ఉచిత బోరు పథకమనేది వర్తించేలా చేయాలన్న నా సంకల్పం దృఢపడింది.

జలదంకి మండలానికి చెందిన దర్గాబాబుకూ ఇదేరకం చేదు అనుభవం ఎదురైంది. మినీ డెయిరీ పెట్టుకోవడం కోసం ఎస్సీ కార్పొరేషన్‌ను ఆశ్రయించాడట. గతేడాది ఇంటర్వ్యూ చేసి సెలక్ట్ అయ్యావన్నారట. మొదట రూ.6 లక్షలు మంజూరు చేస్తామన్నారట. సెలక్షన్‌లు అయిపోయాక లోను రూ.3 లక్షలకే కుదించారట. కలెక్టర్ శాంక్షన్ లెటర్ అయితే ఇచ్చారు గానీ, ఆయనకు మాత్రం ఏడాది గడిచిపోతున్నా నిరీక్షణ తప్పలేదట. ఆయనతో పాటు ఆ లోన్లకు ఎంపికయిన మరో 32 మంది ఎస్సీ సోదరులదీ అదే పరిస్థితట. ఇంతవరకూ ఏ ఒక్కరికీ కూడా లోన్ ఇవ్వకపోగా.. ఈ సంవత్సరానికి సంబంధించి మళ్లీ ఇంటర్వ్యూలు జరుపుతున్నారట. ఇది ఎవర్ని మోసం చేయడానికి? కులానికో కార్పొరేషన్ పెట్టి.. వాటిని పట్టించుకోకుండా నిర్వీర్యం చేసి.. ఇలా ఎంతకాలం మోసం చేస్తూ పోతారు? ఇలా చేయడం ధర్మమేనా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ప్రజల కష్టసుఖాలు తెలిసిన మనసున్న నేత అధికారంలో ఉంటే.. ఏం జరుగుతుందనే దానికి నిదర్శనం కందుకూరు తాగునీటి సమస్య పరిష్కారం. మెట్ట ప్రాంతం, ఆపై ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమైన కందుకూరు ఒకప్పుడు తాగునీటికి కటకటలాడిన పట్టణం. ఇక్కడ అక్కచెల్లెమ్మలు మైళ్ల దూరం వెళితేగానీ.. బిందెడు మంచినీరు దొరకని పరిస్థితి. ఆ ఇక్కట్లను గుర్తెరిగిన నాన్నగారు అధికారంలోకి వచ్చిన వెంటనే దాదాపు రూ.110 కోట్లు ఖర్చుచేసి నాగార్జునసాగర్ నుంచి కృష్ణాజలాలను కందుకూరుకు రప్పించి ఈ ప్రాంత ప్రజల దాహార్తి తీర్చారు. ఆ మేలును ఎన్నటికీ మరువలేమంటూ ఈ ప్రజలు పదే పదే గుర్తుచేస్తుంటే.. మనసంతా సంతోషంతో నిండిపోయింది.

జనంతో పోటెత్తిన కందుకూరు సభలో ప్రత్యేక హోదా కోసం ఎందాకైనా పోరాడాలన్న నా సంకల్పాన్ని, దృఢచిత్తాన్ని మరోసారి ప్రజల ముందుంచి.. హోదా సాధన కోసం రాష్ట్రమంతా ఏకమై చిత్తశుద్ధితో పోరాడదామని పిలుపునిచ్చాను. రాష్ట్రానికి పరిశ్రమల కోసం.. పిల్లల ఉద్యోగాల కోసం.. మన రాష్ట్ర ప్రయోజనాల కోసం.. భావి తరాల బంగారు భవితవ్యం కోసం.. ఎవరితోనైనా కలుస్తాం. ఎన్ని త్యాగాలకైనా సిద్ధం. ఎన్ని పోరాటాలకైనా సన్నద్ధం. అవిశ్వాసానికైనా.. రాజీనామాలకైనా. మన ఆశ, మన శ్వాస హోదాయే.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. హోదాను తాకట్టుపెట్టారు.. ప్రత్యేక ప్యాకేజీ అన్నారు.. హోదాలో ఉన్నవన్నీ ప్యాకేజీలో ఉన్నాయన్నారు.. అందుకే అంగీకరించామన్నారు. మీరు, బీజేపీ వారు ఇవే మాటలు మాట్లాడారు. రాజ్యసభలో వెంకయ్యగారు మాట్లాడిన మాటలు, తిరుపతిలో ప్రధాని మోదీ సమక్షంలో మీరు పలికిన పలుకులు ఒక్కసారి గుర్తుచేసుకోండి.. అబద్ధాలు చెబుతూ మీ మనస్సాక్షిని ఎలా అమ్ముకోగలుగుతున్నారు? ఇది అధర్మం కాదా? అన్యాయం అనిపించలేదా?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర — మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

సాక్షి ఫ్యామిలీ
నేను శక్తి
విజయవాడ
సోమవారం, 19-2-2018



“మహిళల మీద జరిగే దాడుల్లో గృహహింస ముందు వరుసలో ఉంటుంది.
- పర్ల్ క్లీజ్, ఆఫ్రికన్ అమెరికన్ రచయిత



ది బ్రేవ్ లేడీ
- ‘ఫ్యామిలీ’ లోపలి పేజీలో...

నిద్రముంచుకొస్తోంది... పడుకోవాలంటే భయమేస్తోంది

రుతుక్రమం ఆగిపోయింది..

కోరికలూ ఆవిరైపోయాయి!

ఆయన వాంఛను ఆపలేకపోతోంది!

నిద్రముంచుకొస్తోంది..

కానీ పడుకోవాలంటే భయమేస్తోంది!!



ప్రతీకాత్మక చిత్రం

“నా వల్ల కాదే... చచ్చిపోవాలనిపిస్తోంది... నాకు ఈ పనిష్మెంట్ ఏంటీ?’’ శారద ఏడుస్తోంది ఫోన్‌లో.

‘‘ఊరుకో అమ్మా! నువ్వు ఇదంతా భరించాల్సిన అవసరం లేదు. వెళ్లి రాజీవ వాళ్ల అమ్మను కలువు. ఫోన్ నంబర్ వాట్సాప్ చేస్తా. రాజీవక్కూడా చెప్తాను. అది ఇంటికొచ్చి నిన్ను తీసుకెళ్తుంది. ఓకే నా.. అమ్మా.. ఓకేనా..?’’ తల్లిని ఊరడిస్తోంది.. ఆమెకు ధైర్యమిస్తోంది సంహిత.

‘‘ఊ... సరే’’ అని ముక్కు తుడుచుకుంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసింది శారద.

అయిదు నిమిషాల్లో రాజీవ వాళ్ల అమ్మ శైలజ నంబర్ వాట్సాప్ చేసింది సంహిత. చూసుకుని, ఆమెకు ఫోన్ కలిపింది. అపాయింట్‌మెంట్ ఫిక్స్ అయింది. తెల్లవారే రాజీవ వచ్చి శారదను తీసుకొని వెళ్లింది వాళ్లమ్మ ఆఫీస్‌కి.

ముసల్దానా...

‘‘సంహిత అమెరికాలో, బాబు అంకిత్ ఆస్ట్రేలియాలో. ఇక్కడ మేమిద్దరమే. మేము యంగ్‌గా ఉన్నప్పుడు కూడా దొరకనంత ప్రైవసీ. కానీ అలాంటి ప్రైవసీని ఆస్వాదించే స్థితిలో నేను లేను. మెనోపాజ్. ఆయనేమో చాలా ఉత్సాహంగా ఉంటున్నాడు. నన్నూ అలా ఉండమని ఇన్‌సిస్ట్ చేస్తున్నాడు. నా వల్ల కావట్లేదు. ఆయనకు కోపం వస్తోంది. తిడుతున్నాడు చండాలంగా. భరించలేని నొప్పి, మంట.. ఆ ఇబ్బందిని ఎక్స్‌ప్రెస్ చేయాలన్నా భయమేస్తోంది. కొడుతున్నాడు. ‘ముసల్దానితో సంసారం చెయ్యాల్సిన కర్మ పట్టింది. ఇంకోదాన్ని చూసి పెళ్లి చేయ్ మరి’ అంటూ వేధిస్తున్నాడు ’’ అని ఏడ్చేసింది శారద. ‘‘పైగా వికృతమైన చేష్టలు, అసహజమైన పద్ధతుల్లో అడుగుతున్నాడు. పోర్న్‌సైట్స్ చూడ్డమే కాదు.. అలాంటి వీడియోలను నాకు వాట్సాప్ కూడా చేస్తున్నాడు’’ అంటూ వాంతికొచ్చినట్టయి బాత్రూమ్‌లోకి పరిగెత్తింది శారద.

‘‘మమ్మీ.. ఆంటీ ప్రాబ్లమ్‌కి సొల్యూషన్ లేదా?’’ బాధగా అడిగింది రాజీవి.

‘‘ఊ... ’’కుర్చీలో వెనక్కి వాలుతూ నిట్టూర్చింది శైలజ.

ఇంతలోకే మొహం తుడుచుకుంటూ వచ్చింది శారద.

‘‘శారదగారూ... కౌన్సెలింగ్, కంప్లయింట్లతో మీ ఆయనను మార్చేదేమీ ఉండదు. ఎందుకంటే ఆయనా పోలీస్ ఆఫీసరే. ఎలా డీల్ చేస్తారు, ఫలితం ఏముంటుందో ఆయనకు తెలుసు. కాబట్టి..’’ అని ఆగి శారద వైపు చూసింది శైలజ.

‘‘చెప్పండి’’ అంది శారద.

‘‘మీ సమస్యకు పరిష్కారాన్నిచ్చేది, మీ బాధకు ఉపశమనాన్ని కలిగించేది ఒక్కటే.. డీవీ యాక్ట్!’’ అని పూర్తిచేసింది శైలజ.

‘‘డీవీ యాక్టా? అంటే?’’ అమాయకంగా సందేహాన్ని వెలిబుచ్చింది శారద.

‘‘డొమెస్టిక్ వయలెన్స్. ఇందులోనే మీది సెక్సువల్ హెరాస్‌మెంట్ కిందకు వస్తుంది’’ అని వివరించి శారద ఏం చేయాలో చెప్పింది శైలజ.

> “మీ సమస్యకు పరిష్కారాన్నిచ్చేది, మీ బాధకు ఉపశమనాన్ని కలిగించేది ఒక్కటే.. డీవీ యాక్ట్!” అని పూర్తిచేసింది శైలజ.

ప్రొటెక్షన్ ఆర్డర్స్

శైలజ చెప్పినట్టే చేసింది శారద. భర్త వికృతచేష్టలను వీడియోలో రికార్డ్ చేసింది. తన మెడికల్ రిపోర్ట్‌తో సహా ఆ వీడియోను కోర్టులో ఫైల్ చేసింది. ఆమె భర్తకు నోటీసులు వెళ్లాయి. షాక్ అయ్యాడు భర్త. తన ఇంట్లోకి ఎలా అడుగుపెడుతుందో చూస్తా అనుకున్నాడు అహంకారంగా. నిర్భయంగా, అధికారికంగా అడుగుపెట్టింది ఆమె కోర్టు ఇచ్చిన ప్రొటెక్షన్ ఆర్డర్స్‌తో. అంతేకాదు ‘‘ఇక ముందు ఇలా ప్రవర్తిస్తే సెక్షన్ 377 కింద బుక్ చేయాల్సి వస్తుంది. పదేళ్లు చిప్పకూడు తింటావ్’’అని ఆ పోలీస్ ఆఫీసర్‌కు వార్నింగ్‌కూడా ఇచ్చింది కోర్టు.

చెట్టు నీడ

మరణించిన భోజన పాత్ర

శిష్యుడు ఆశ్రమాన్ని శుభ్రం చేస్తున్నాడు. చూడకుండా చేయి తగలడంతో ఒక పింగాణీ పాత్ర కిందపడి, భళ్లున బద్దలైంది. గురువుగారికి కోపమెక్కువ. పైగా ఆయనకు అది ఇష్టమైన పాత్ర. అందులోనే భోంచేయడం ఆయన అలవాటు. శిష్యుడికి భయమేసింది. ఒళ్లంతా చమట పట్టింది. గురువు తనను ఏం చేయనున్నాడో! చకచకా ఆ పెంకులన్నీ ఏరి ఒకచోట జాగ్రత్తగా పెట్టాడు. గురువుకు ఏమని సమాధానం చెప్పాలా అని ఆలోచించసాగాడు.

> ‘అది ప్రకృతి సహజం. ప్రతిదీ ఏదో రోజు నశించి తీరవలసిందే’

కాసేపట్లో గురువు వస్తున్నట్టుగా పాదాల అలికిడి వినబడింది. శిష్యుడు ఎదురెళ్లి, వినయంగా చేతులు కట్టుకుని, ‘గురువర్యా, పొద్దున్నే నాకో సందేహం వచ్చింది. అడగమంటారా?’ అన్నాడు.

శిష్యుడి వాలకం కొత్తగా అనిపించినప్పటికీ, అడగమన్నట్టుగా తలూపాడు గురువు.

‘అసలు మనుషులకు మరణం ఉండాల్సిందేనా?’ ప్రశ్నించాడు శిష్యుడు.

‘అది ప్రకృతి సహజం. ప్రతిదీ ఏదో రోజు నశించి తీరవలసిందే’ చెప్పాడు గురువు.

వెంటనే అందుకున్నాడు శిష్యుడు: ‘అయితే, ఇవ్వాళ మీ భోజన పాత్ర మరణించింది’.

వివేకవంతుడు కావడంతో గురువుకు తక్షణం జరిగినదేమిటో అర్థమైంది. శిష్యుడి ప్రశ్నకు ఉన్న మూలం గుర్తించాడు. దానికి కారణమైన తన కోపగుణం కూడా మనసులో మెదిలింది.

శిష్యుడిని మనస్ఫూర్తిగా అభినందిస్తూ, ‘ఇవ్వాళ నా కోపం కూడా మరణించింది’ అన్నాడు.

సినిమా బడి

స్క్రీన్‌మ్యాన్

‘ప్యాడ్‌మ్యాన్’ చిత్రంతో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ గ్రామీణ మహిళలను చైతన్యవంతం చేయడానికి ‘రుతుస్రావ పారిశుద్ధం ఉద్యమం’లో ఓ అడుగు వేశాడు. ఆ స్ఫూర్తితో పశ్చిమబెంగాల్‌లోని, దక్షిణ దినాజ్‌పూర్ జిల్లా ఈ సామాజికోద్యమంలో మరో అడుగు ముందుకు వేసింది. పాఠశాల విద్యార్థినులందరికీ ఈ సినిమాను జిల్లా స్థాయి అధికారులు ఉచితంగా చూపిస్తున్నారు. తొలి విడతగా ఐదు వందల టికెట్‌లను అధికారులే కొని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థినులను సినిమాకు తీసుకెళ్లారు. విద్యార్థినులతో పాటు జిల్లా మేజిస్ట్రేట్ శరద్‌కుమార్ ద్వివేది, పోలీస్ సూపరింటెండెంట్ ప్రసూన్ బెనర్జీ, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ సుకుమార్ డే కూడా ‘ప్యాడ్‌మ్యాన్’ సినిమాను వీక్షించారు.

దక్షిణ దినాజ్‌పూర్ జిల్లాలో 70 శాతం మంది గ్రామాల్లోనే నివసిస్తున్నారు. వారిలో సగం మంది మహిళలు కూడా శానిటరీ న్యాప్‌కిన్‌లను వాడటం లేదు. జిల్లా వైద్యశాఖ అధ్యయనంలో ఈ సంగతి వెల్లడైంది. గ్రామీణ మహిళలను రుతుక్రమం సమయంలో పాటించాల్సిన శుభ్రత పట్ల చైతన్యవంతం చేయడానికి వైద్య ఆరోగ్య సిబ్బంది కొన్నేళ్లుగా రాష్ట్రమంతటా శ్రమిస్తూనే ఉంది. అయినా సరే వారి ప్రయత్నం అనుకున్నంతగా ఫలవంతం కాలేదు. అనేక అపోహలు గ్రామీణ మహిళల్ని ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. ఈ అపోహలను పూర్తిగా తొలగించడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్న అక్కడి ప్రభుత్వ యంత్రాంగం.. రాబోయే తరాన్ని చైతన్యవంతం చేస్తేనే సమాజం ఆరోగ్యకరమవుతుందనే నిర్ణయానికి వచ్చింది. ఆ నిర్ణయానికి ‘ప్యాడ్‌మ్యాన్’ మంచి అవకాశంగా కలిసొచ్చింది. ‘సినిమా ప్రభావవంతమైన మాధ్యమం. చెప్పాలనుకున్న విషయాన్ని చాలా సులభంగా చేరుస్తుంది’ అని అధికారులు అంటున్నారు.

పది నేప్‌కిన్‌లు రూ.27

రుతస్రావ పరిశుభ్రతను పాటించడం నేర్పిస్తే సరిపోతుందా? అందుకు తగినన్ని శానిటరీ న్యాప్‌కిన్స్‌ని అందుబాటులోకి తేవద్దా? తేవాలి. తెస్తున్నారు కూడా. స్థానిక స్వయం సహాయక బృందాల మహిళలకు న్యాప్‌కిన్‌ల తయారీలో అధికారులు శిక్షణ ఇప్పిస్తున్నారు. వారి చేత న్యాప్‌కిన్ తయారీ యూనిట్‌లు పెట్టించి ప్రభుత్వమే మెటీరియల్ సప్లయ్ చేస్తోంది. పది న్యాప్‌కిన్‌ల ప్యాకెట్ 27 రూపాయల కు అందుబాటులోకి తెచ్చింది వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీ చొరవతో ఆడవాళ్లకు అందివచ్చిన సౌకర్యం ఇది.

– మంజీర



● ‘ప్యాడ్‌మ్యాన్’తో సెల్ఫీ తీసుకుంటున్న దక్షిణ దినాజ్‌పూర్ జిల్లా విద్యార్థినులు

జయంతి

మావోయిస్టుల అడ్డాలో మహిళా రిపోర్టర్!



● హైదరాబాద్‌లో గత ఏడాది జరిగిన జాతీయ మహిళపాత్రికేయుల సదస్సులో ప్రసంగిస్తున్న జయంతి

అదొక మారుమూల గిరిజన ప్రాంతం. అరకొరా వసతులు ఉండే ఈ ప్రాంతంలో అమ్మాయిల పరిస్థితి మరీ దారుణం. చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం అక్కడ అనాదిగా వస్తున్న ఆచారం. చదువు, పుస్తకాలు ఇవేమీ వారికి తెలియవు. కానీ బురుడ జయంతి మాత్రం ఇలాంటి అననుకూల పరిస్థితులన్నింటినీ అధిగమించింది.

అతికష్టంమీద గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. కేవలం గ్రాడ్యుయేషన్‌తోనే ఆగిపోలేదు. జర్నలిజాన్ని తన వృత్తిగా ఎంచుకుని, తనలాంటి తనలాగే మరో పది మంది ఆడపిల్లలకు స్ఫూర్తిగా నిలిచింది. ఒడిశాలోని అత్యంత నక్సల్ ప్రభావిత ప్రాంతమైన మల్కన్‌గిరి గిరిజన సమాజంలో తొలి మహిళా జర్నలిస్టుగా అందరి మన్ననలు పొందుతోంది. తన గిరిజన సమాజంలో మార్పు కోసం కలంతో పోరాటం చేస్తోంది.

ఇంట్లో తొమ్మిదో అమ్మాయి!

పది మంది అక్కాచెల్లెళ్లలో జయంతి తొమ్మిదో అమ్మాయి. గిరిజన కోయ తెగలో అసలు అక్షరాస్యతే తక్కువ. అమ్మాయిలు బడికి వెళ్లడమే అరుదు. ఇక చదువుకోవడానికి సదుపాయాలు సంగతి సరేసరి. కానీ జయంతి తండ్రి ఎన్నో కష్టాలకోర్చి పిల్లల్ని చదివించారు. జయంతి పట్టుదలగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. కానీ ఆమె లక్ష్యం కేవలం గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడం కాదు. జర్నలిస్టు కావాలని కలలు కంది. తద్వారా తన కుటుంబానికి అండగా ఉండటంతోపాటూ, వెనకబడి వున్న తన గిరిజన సమాజంలో మార్పు తీసుకురావాలని భావించింది.

పట్టు పట్టి కలం పట్టింది

జర్నలిస్టు కావాలన్న తన కలను సాకారం చేసుకోవటానికి ఎన్నో కష్టాలు పడింది జయంతి. ఒడిశా సెంట్రల్ యూనివర్సిటీలో సీటు వచ్చింది కానీ, ఇంటికి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న యూనివర్సిటీకి వెళ్లాలంటే కష్టంతో కూడుకున్న వ్యవహారం. హాస్టల్‌లో ఉండి చదువుకునే ఆర్థికస్తోమతా లేదు. ఆ సమయంలో, తన స్నేహితురాలు ఆమెకు అండగా నిలిచింది. తన బంధువు ఇంట్లో ఉండి చదువుకునేలా అవకాశం కల్పించింది. అలా జయంతి జర్నలిజం కోర్సు పూర్తి చేసింది. చదువు అయిపోగానే ఇంటర్న్‌షిప్ కోసం జయంతి భువనేశ్వర్ వెళ్లాల్సి వచ్చింది. మళ్లీ ఆర్థిక ఇబ్బందులు. ఆమె ప్రతిభను, ఉత్సాహాన్ని, తాపత్రయాన్ని గమనించిన సినీ నిర్మాత బిరేన్ దాస్, జయంతికి గైడెన్స్ ఇచ్చారు.

జర్నలిజంలోనూ లింగ వివక్ష

ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి, ప్రధాన మీడియాలోకి ప్రవేశించింది జయంతి. ప్రస్తుతం ‘కళింగ’ టీవీలో పనిచేస్తోంది. తన గిరిజన కమ్యూనిటీ మల్కన్‌గిరిలోనే రిపోర్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తోంది. జయంతి కల నెరవేరినప్పటికీ, నక్సల్ ప్రభావిత ప్రాంతమైన మల్కన్‌గిరిలో కేవలం ఒకే ఒక్క మహిళ రిపోర్టింగ్ చేయడం ఆమెకు సవాల్‌గానే మారింది. అక్కడ కూడా లింగ వివక్ష ఎదురైంది. తన పురుష సహోద్యోగులు జయంతిని వెనక్కి లాగడానికి, భయపెట్టడానికి ఎన్నో పథకాలు వేసేవారు. ప్రతి అడుగును తను సవాల్‌గా తీసుకునేది. పురుష జర్నలిస్ట్‌లకు పోటీగా రాణించడం ప్రారంభించింది.

పోలీసుల వేధింపులు

వీటన్నింటికీ మించి ఆమెకెదురైన మరో పెద్ద సవాల్ పోలీసు వేధింపులు! ఒక కోయ తెగకు చెందిన అమ్మాయి విద్యాధికురాలిగా ఉండటం, ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడటంతో పోలీసులు ఆమెపై మావోయిస్టు ముద్ర వేశారు. ఈ క్రమంలో పలురకాల వేధింపులు ఆమెకు తప్పలేదు. ఆ వేధింపులను కూడా జయంతి ధైర్యంగా ఎదుర్కొంది. ఎక్కడా కూడా తాను తలొగ్గలేదు. జయంతి సాహసానికి పోలీసులు సైతం వెనుకంజ వేయాల్సి వచ్చింది. జయంతి కేవలం జర్నలిస్టుగా మాత్రమే కాక, గిరిజన సమాజంలోని బాలికలు చదువుకునేందుకు ఒక ఎన్జీవో సైతం నిర్వహిస్తోంది. ప్రధాన మీడియాలో పెద్ద పెద్ద అవకాశాలే ఆమె ముందు వచ్చి వాలినప్పటికీ, తాను మాత్రం తన గిరిజన కమ్యూనిటీలోనే సేవలందిస్తోంది. ఒకవేళ తను కనుక ఇక్కడ పనిచేయకపోతే, తన చదువుకు సార్థకమే లేదని అంటోంది జయంతి.

- కొటేరు శ్రావణి, ‘సాక్షి’ వెబ్

సాక్షి ఫ్యామిలీ
సినిమా
విజయవాడ
సోమవారం
19-2-2018

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా..! నేను ఒక అబ్బాయిని లవ్ చేస్తున్నా. సహజంగానే నాది చాలా సరదాగా ఉండే లైఫ్ స్టైల్. అందరితో ఇట్టే కలిసిపోతా. కానీ అలా ఉండటం తనకి నచ్చదు. ''బాయ్స్‌ని చూడొద్దు, ఎవరితోనూ మాట్లాడొద్దు'' అని రూల్స్ పెట్టాడు. తనమీద ఉన్న ఇష్టంతో అన్నీ పాటించా. కానీ, ఎప్పుడూ నా ఫోన్ ఆఫ్ అవ్వకూడదు. బిజీ రాకూడదు, తను లేకుండా బయటికి వెళ్లకూడదు, తన మెసేజ్‌కి రిప్లై ఇవ్వడం ఒక్క నిమిషం కూడా లేట్ అవ్వకూడదు... ఇలా చాలానే నిబంధనలు పెడుతూ వచ్చాడు. నెలరోజుల క్రితం మెసేజ్‌కి రిప్లై ఇవ్వడం లేట్ అయిందని, విడిపోదాం అన్నాడు. నేను ఏం మాట్లాడలేదు. మళ్లీ కాల్ చేసి ''నేను లేకుండా ఉంటావా?'' అన్నాడు. నీకు జాబ్ వచ్చాక మాట్లాడుకుందాం, అప్పటిదాకా వద్దు అన్నాను. దాంతో కొంచెం కామ్‌గా ఉన్నాడు. మంచిగా ఉండొచ్చుగా నాతో అని అడిగితే.. ''నీ క్యారెక్టర్ బ్యాడ్‌గా ఉన్నంత వరకూ నేను ఇలానే మాట్లాడతా'' అంటున్నాడు. తన కోసం ఎంతో మారాను. నేనేం తప్పు చేశానో నాకే అర్థం కావట్లేదు. తనే ప్రాణం అనుకున్నాను. కానీ ఎందుకు ప్రతిసారీ అనుమానించి అవమానిస్తున్నాడో తెలీదు. ఏదైనా సలహా ఇవ్వండి అన్నయ్యా ప్లీజ్.

– అఖిల

సరదాగా ఉండాలి.

'హీరో ఒప్పుకోడు కదా సార్???'

ఎందుకు ఒప్పుకోడు?

హీరోయిన్ హీరో కంటే సరదాగా ఉంటే హీరో ఒప్పుకోడు సార్!'

అంత ఇన్‌సెక్యూర్ హీరోనా మనోడు??

'కరెక్టే సార్.. వాడి మీద కాన్ఫిడెన్స్ ఉంటే, సరదాగా జాలీగా హ్యాపీగా ఉన్నందుకు అసలు అఖిలని ఇంకా ఎక్కువగా ప్రేమించాలి.'

అదెలా నీలాంబరీ???

సినిమాలు చూడ్డంలేదా సార్? అమ్మాయి ఎంత యాక్టివ్‌గా ఉంటే హీరో అంతగా లవ్‌లో పడతాడు. వానలో సాంగ్ పాడుతాడు. ఎడారిలో కూడా స్టెప్పులు వేస్తాడు. గాల్లో పల్టీలు కొడతాడు. నిద్రలో మేలుకుని ఉంటాడు...'

నీలాంబరీ...!!

'ఏంటి సార్ శంకరాభరణం సినిమాలో శంకర శాస్త్రి ఒర్రినట్టు ఒర్రినారేంటి సార్???'

నీ పొయెట్రీ భరించలేకపోతున్నా...

'అమ్మాయి కూడా అబ్బాయిని ఇక భరించకూడదు సార్!' అని నవ్వింది నీలాంబరి.

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

		2				8	4	
			8					1
		7	3		1	2		9
	1	3		7				8
7	8		4		9		1	2
6				1		9	3	
3		1	2		6	5		
2					4			
	4	9				7		

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

3	8	5	7	4	1	2	9	6
4	1	7	9	6	2	3	5	8
9	6	2	5	3	8	1	4	7
8	9	4	2	7	3	5	6	1
7	2	6	1	5	4	9	8	3
5	3	1	8	9	6	4	7	2
6	5	9	3	1	7	8	2	4
2	7	3	4	8	5	6	1	9
1	4	8	6	2	9	7	3	5


● నాగచైతన్య

ముహూర్తం కుదిరిందా?

'సవ్యసాచి' సినిమా రిలీజ్‌కు ముహూర్తం కుదిరిందా? అంటే.. అవుననే సమాధానమే ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో ఇప్పుడు వినిపిస్తోంది. నాగచైతన్య హీరోగా చందు మొండేటి దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'సవ్యసాచి'. నిధి అగర్వాల్ కథానాయిక. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే... ఈ సినిమాను తొలుత రంజాన్ ఫెస్టివల్ సందర్భంగా రిలీజ్ చేస్తారన్న ఊహాగానాలు వినిపించాయి.

ఇప్పుడు లేటెస్ట్‌గా 'సవ్యసాచి' చిత్రాన్ని మే 24న రిలీజ్ చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తున్నారట. ఆల్రెడీ నాగచైతన్య నటించిన '100పర్సెంట్ లవ్', 'మనం','తడాఖా', 'రారండోయ్ వేడుక చుద్దాం' చిత్రాలు మే నెలలో రిలీజ్ అయ్యాయి. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మరి... నాగచైతన్యకు కలిసొచ్చిన మే మంత్‌లోనే 'సవ్యసాచి' చిత్రం రిలీజ్ అవుతుందా? లేక వేరే రిలీజ్ డేట్‌ను ఎనౌన్స్ చేస్తారా? అన్న విషయంపై క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు ఆగక తప్పదు.

సంతోషమే

జీవితంలో ప్రీషియస్ మూమెంట్స్ కొన్నే ఉంటాయి. బర్త్‌డే, లైఫ్‌లో ఫస్ట్ జాబ్, పెళ్లి ఇలాంటివి కొన్ని. వీటిని మనం చాలా పదిలంగా గుర్తుపెట్టుకుంటాం. ఒకవేళ ఇవన్నీ ఒకే నెలలో జరిగితే? ఆ నెల మనకు ఎంతో స్పెషల్‌గా ఉండిపోతుంది. జూనియర్ ఎన్టీఆర్‌కు అలాంటి స్పెషల్ నెల మే. ఎందుకంటారా? ఎన్టీఆర్ బర్త్ డే మే 20. అతను హీరోగా నటించిన ఫస్ట్ సినిమా 'నిన్ను చూడాలని' మే 25న రిలీజ్ అయింది. లక్ష్మీ ప్రణతిని పరిణయమాడింది కూడా మే నెల్లోనే. వారి పెళ్లి రోజు మే 5. అంతేనా.. అనుకోకండి ఎన్టీఆర్‌కు మరో స్పెషల్ మూమెంట్ కూడా ఈ మేలోనే రాబోతోంది. ఎన్టీఆర్ మరోసారి తండ్రి కాబోతున్నారు. ఆయన భార్య లక్ష్మీప్రణతి డెలివరీ డేట్‌ను మే నెలాఖరున ఇచ్చినట్టు సమాచారం. అంటే అభయ్ రామ్‌కు తమ్ముడో చెల్లో రాబోతున్నారన్నమాట. సో.. ఎన్టీఆర్‌కు మే అంటే సంతోషమే.


● ఎన్టీఆర్


● సమంత

అభిమాన కోలాహలం

యూ–టర్న్ తీసుకోవడానికి సమంత రాజమండ్రి వెళ్లారు. పవన్ కుమార్ దర్శకత్వంలో శ్రద్ధా శ్రీనాథ్, రాధిక చేతన్, దిలీప్ రాజ్ ముఖ్య తారలుగా రూపొందిన కన్నడ చిత్రం 'యూ–టర్న్'. ఈ సినిమాను అదే టైటిల్‌తో తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కిస్తున్నారు. సమంత లీడ్ రోల్ చేస్తోన్న ఈ సినిమాకి పవన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆది పినిశెట్టి, రాహుల్ రవీంద్రన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం. ఈ సినిమా షూటింగ్ శనివారం రాజమండ్రిలో ప్రారంభమైంది. అయితే.. సమంతను చూడటానికి చాలా మంది అభిమానులు అక్కడికి వచ్చారు. దీంతో అక్కడంతా కోలాహలం నెలకొంది. వారి అభిమానానికి ఫిదా అయ్యారు సమంత. ''యూ–టర్న్' సినిమా స్టార్టైంది. అభిమానుల ప్రేమ నన్ను మరింత ప్రోత్సహిస్తోంది. మూవీని మరింత బాగా తీయడంలో నాకు ప్రేరణ కల్పిస్తోంది'' అని పేర్కొన్నారు సమంత.

నాటకాలను బతికిద్దాం - రాఘవేంద్రరావు

''**మ**నకు తెలిసి రాజులెందరో ఉంటారు. ఆ రాజుల్లో రారాజు రామానాయుడుగారు. నార్త్ ఇండియాలోనే తెలుగు ఇండస్ట్రీకి ఎంతో వైభవం తీసుకొచ్చారాయన'' అని దర్శకుడు కె. రాఘవేంద్రరావు అన్నారు. 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) రజతోత్సవ వేడుకల్లో భాగంగా డా. డి. రామానాయుడు 3వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో 'మా' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నాటక రంగం నుంచి సినిమారంగానికి వచ్చిన నటుడు జయప్రకాశ్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం రాఘవేంద్రరావు మాట్లాడుతూ– ''మరుగున పడిపోతున్న నాటకాలను బయటకి తీసుకురావాలి. నాటకాలను బతికించి పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉంది. అప్పుడే కొత్త కళాకారులు బయటికొస్తారు'' అన్నారు. ''నా కల్యాణ మండపం కార్ల షెడ్‌లా అయిపోతోంది. అందులో నాటకాలు వేయించండి' అని రామానాయుడుగారు చనిపోయే ముందు నాతో అన్నారు. 'రామానాయుడు కళా సమితి' ఏర్పాటు చేసి నాటకాలను ప్రోత్సహించనున్నాం. ఈ సమితిలో సభ్యత్వం తీసుకొని నాటకరంగ అభివృద్ధికి తోడ్పడాలి'' అన్నారు రచయిత పరుచూరి గోపాలకృష్ణ. ''భారతదేశ చలనచిత్ర రంగానికి రామానాయుడుగారు ఓ మోనార్క్. ప్రపంచ చలనచిత్ర పరిశ్రమలో మూవీ మొఘల్ అయిన ఆయన ఓ మహాసముద్రం'' అన్నారు నటుడు ఆర్. నారాయణ మూర్తి. ''మా నాన్నగారు స్థాపించిన సంస్థ ఈ స్థాయిలో ఉందంటే ఎందరో దర్శకులు, నటులు, సాంకేతిక నిపుణులే కారణం'' అన్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు.


● జయప్రకాశ్ రెడ్డిని సన్మానిస్తున్న సినీ ప్రముఖులు

''నలుగురు సన్మాన గ్రహీతలకు ఒక్కొక్కరికి 11వేల నగదును దర్శకుడు హరీశ్‌శంకర్ అందించారు'' అన్నారు 'మా' అధ్యక్షుడు శివాజీరాజా. నటులు కోటా శ్రీనివాసరావు, విద్యాసాగర్, 'మా' జనరల్ సెక్రటరీ నరేశ్, ఎగ్జిక్యూటివ్ వైఎస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, కోశాధికారి పరుచూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బెనర్జీ, కార్పొరేటర్ ఖాజా సూర్యనారాయణ, 'మా' సభ్యులు పాల్గొన్నారు.


● విజయ్, నాని, శ్రీమిత్ర చౌదరి, శ్రీకాంత్, తరుణ్, విజీ చెర్రిష్

సరికొత్త హారర్

శ్రీకాంత్ , నాజియా జంటగా విజీ చెర్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రా.. రా'. శ్రీమిత్ర చౌదరి సమర్పణలో విజి చెర్రీస్ విజన్స్‌పై విజయ్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 23న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ– ''హారర్ జోనర్‌లో నేను చేసిన తొలి సినిమా ఇది. ఇప్పటి వరకూ హారర్ నేపథ్యంలో చాలా సినిమాలు వచ్చినా 'రా..రా' సరికొత్తగా ఉంటుంది. ఈ సినిమా నాకు మంచి సక్సెస్ ఇస్తుందనే నమ్మకం ఉంది. మమ్మల్ని సపోర్ట్ చేయడానికి వచ్చిన నాని, తరుణ్‌తో పాటు అందరికీ కృతజ్ఞతలు'' అన్నారు. ''అష్టా చమ్మా' నుంచి శ్రీకాంత్‌గారితో నాకు మంచి పరిచయం ఉంది. నటుడిగా ఆయనేంటో అందరికీ తెలుసు. ఆయనకి 'రా.. రా' మరో పెద్ద హిట్ చిత్రంగా నిలవాలని కోరుకుంటున్నా'' అన్నారు హీరో నాని. ''శ్రీకాంత్‌గారితో 24 సంవత్సరాల అనుబంధం ఉంది. నా బ్రదర్‌లాంటి వ్యక్తి. ఆయన వంటి సీనియర్ హీరో ఇలాంటి సినిమా చేయడం గొప్ప విషయం. సినిమా తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది'' అన్నారు శ్రీమిత్ర చౌదరి. నిర్మాత విజయ్, సంగీత దర్శకుడు షకీల్, హీరో తరుణ్, నటులు అలీ, రఘుబాబు, నటి హేమ, నిర్మాత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విన్నర్ కాంబినేషన్ రిపీట్


● సాయిధరమ్

హీరో సాయిధరమ్ తేజ్ దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో చిత్రం రాబోతుందన్న విషయం తెలిసిందే. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మే నుంచి స్టార్ట్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు జె.భగవాన్– జె.పుల్లారావు మాట్లాడుతూ ''సాయి ధరమ్ తేజ్, గోపీచంద్ కాంబినేషన్‌లో సినిమా నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. ఒక కొత్త జోనర్‌లో ఈ సినిమా ఉంటుంది. ఇలాంటి కాన్సెప్ట్‌ను ధరమ్ తేజ్ ఇదివరకు చేయలేదు. ఈ సినిమాకు సంబంధించిన కాస్ట్ అండ్ క్రూ వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు.


● శృతీహాసన్

సమ్మర్‌లో సాక్ష్యం

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, పూజా హెగ్డే జంటగా శ్రీవాస్ దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్న చిత్రం 'సాక్ష్యం' – నేచర్ ఈజ్ ది విట్‌నెస్ అనేది ట్యాగ్‌లైన్. ఈ డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను ప్రపంచవ్యాప్తంగా మే 11న విడుదల చేయనున్నట్టు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఆ తర్వాత ఓ కీలక షెడ్యూల్‌ను అమెరికాలో చిత్రీకరించనున్నారట. ఆ షెడ్యూల్‌తో సినిమా కంప్లీట్ అవ్వనుంది. ఈ సినిమాకు శ్రీవాస్ స్క్రిప్ట్, సాయి శ్రీనివాస్ చేసిన యాక్షన్ సీన్స్, పూజా గ్లామర్ హైలెట్స్‌గా నిలుస్తాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: ఆర్థర్ ఎ. విల్సన్, మాటలు: సాయి మాధవ్ బుర్రా, సంగీతం: హర్షవర్ధన్.


● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ఫన్నీగాయ్!

మైఖేల్ కోర్స్‌లే, హీరోయిన్ శృతీహాసన్ మధ్య ప్రేమాయణం నడుస్తోందని ఇండస్ట్రీ టాక్. రీసెంట్‌గా చెన్నైలో జరిగిన ఓ వివాహ వేడుకలో కమల్‌హాసన్‌తో, మరో సందర్భంలో శృతి తల్లి సారికతో మైఖేల్ ఉన్న ఫోటోలు బయటికి వచ్చాయి. దీంతో మైఖేల్, శృతి పెళ్లిపీటలెక్కబోతున్నారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇప్పట్లో పెళ్లి ఆలోచన లేదని ఈ ఏడాది బర్త్‌డే సందర్భంగా చెప్పారు శృతి. కానీ మైఖేల్‌పై మాత్రం ఫుల్ క్లారిటీ ఇవ్వలేదు. ఇప్పుడు లేటెస్ట్‌గా మైఖేల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పి మరోసారి వార్తల్లో నిలిచారామె. '' ప్రతి విషయంలో నాతో కలిసి నవ్వుతూ నవ్విస్తుంటాడు. నాకు తెలిసిన ఫన్నీగాయ్. హ్యాపీ బర్త్‌డే టు మై బెస్ట్ ఫ్రెండ్'' అంటూ మైఖేల్‌కు పుట్టనరోజు శుభాకాంక్షలు తెలిపారు శృతి. అంతేకాదు ఈ టైమ్‌లో మైఖేల్ పక్కన తను లేకపోయినందుకు 'ఐ యామ్ సారీ' అని కూడా పేర్కొన్నారామె.

పరి పరిశోధన

మూలకణాలతో క్యాన్సర్లకు వ్యాక్సిన్!

ప్రాణాంతకమైన క్యాన్సర్‌పై పోరులో మనిషి కీలకమైన విజయం సాధించాడు. శరీరంలోని ఏ కణంగానైనా మారిపోగల సామర్థ్యమున్న మూలకణాలతో రొమ్ము, ఊపిరితిత్తుల, చర్మ కేన్సర్లను అడ్డుకోగల వ్యాక్సిన్‌ను స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. అంతేకాదు.. క్యాన్సర్ మళ్లీమళ్లీ తిరగబెట్టకుండా ఈ వ్యాక్సిన్ నిరోధించగలదని పశువులపై జరిపిన పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. నాలుగు రోజుల వయసున్న పిండంలో ఉండే కణాలను పిండ మూల కణాలుగా చెబుతారు. ఎదిగిన తరువాత కొన్ని అవయవాల్లో అతితక్కువ మోతాదులో ఉండేవి ఇన్‌డ్యూస్డ్ ప్లూరీ పోటెంట్ స్టెమ్‌సెల్స్ అంటారు. స్టాన్‌ఫర్డ్ శాస్త్రవేత్తలు దాదాపు 75 ఎలుకల్లోకి ఈ ప్లూరీ పోటెంట్ మూలకణాలను ఎక్కించారు. రేడియోధార్మికత సాయంతో ఈ కణాలను చైతన్యరహితం చేసిన తరువాత శరీరంలోకి



ఎక్కించినప్పటికీ రోగ నిరోధక వ్యవస్థ దీనికి స్పందించింది. నాలుగు వారాల్లో దీని ప్రభావం కనిపించడం మొదలైంది. దాదాపు 70 శాతం ఎలుకల్లో రొమ్ము కేన్సర్ కణాలను శరీరం తిరస్కరించగా.. మిగిలిన వాటిల్లో కణితుల సైజు బాగా తగ్గిపోయింది. ప్లూరీపోటెంట్ స్టెమ్‌సెల్స్‌కు, కేన్సర్‌కణాలకు సారూప్యతల కారణంగా రోగ నిరోధకవ్యవస్థ పూర్తిస్థాయిలో చైతన్యవంతమై కేన్సర్ కణాలపై దాడులు మొదలుపెట్టిందని శాస్త్రవేత్తల అంచనా. ప్లూరీ పోటెంట్ స్టెమ్‌సెల్స్‌లోకి మరిన్ని ఎక్కువ యాంటీజెన్లను జొప్పించి వ్యాక్సిన్‌ను తయారు చేస్తే రోగ నిరోధక వ్యవస్థలోని టి–కణాలు మరింత ఎక్కువ ప్రభావం చూపుతాయని.. తద్వారా క్యాన్సర్‌ను నిరోధిస్తాయని ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్న శాస్త్రవేత్త ఒకరు చెప్పారు.

సౌరశక్తితో రికార్డు!

సూర్యుడి నుంచి భూమ్మీదకు వచ్చే శక్తి మొత్తాన్ని ఒడిసిపట్టుకోగలిగితే పెట్రోలు, డీజిల్, గ్యాస్‌ల అవసరం అస్సలు ఉండదన్నది అందరికీ తెలిసిందే. కాకపోతే ఈ స్థాయిలో శక్తిని విద్యుత్తుగా మార్చేందుకు తగిన టెక్నాలజీ, పదార్థాలు మనకు అందుబాటులో లేవంతే! అయితే... ఈ దిశగా చేస్తున్న ప్రయత్నాల్లో హానెర్జీ అనే కంపెనీ శాస్త్రవేత్తలు కీలక విజయం సాధించారు. అత్యంత పలుచగా ఉంటూనే పడిన సూర్యకాంతిలో 25.1 శాతాన్ని విద్యుత్తుగా మార్చే కొత్త తరం సోలార్ ప్యానెల్స్‌ను ఈ కంపెనీ అభివృద్ధి చేసింది. డ్రోన్లు మొదలుకొని అనేక ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు బ్యాటరీల అవసరమే లేకుండా చేయగల పరిణామం ఇది. గాలియం ఆర్సనైడ్ పదార్థంతో తయారైన ఈ కొత్త ప్యానెల్స్ ఇప్పటికే అందుబాటులో ఉన్న ఇదేరకం



సోలార్‌ప్యానెల్స్ కంటే రెండు రెట్లు ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి చేయడం విశేషం. పలుచగా ఉండటం.. కావాల్సిన విధంగా మడత పెట్టేందుకు అనువుగా ఉండటం తదితర కారణాల వల్ల ఈ హానెర్జీ ప్యానెల్స్‌ను బ్యాక్‌ప్యాక్‌లు మొదలుకొని బస్సు, కార్లపైకప్పుల వరకూ ఎక్కడ కావాలంటే అక్కడ అతికించుకుని విద్యుత్తు పొందవచ్చునని ఈ పరిశోధనలో పాల్గొన్న శాస్త్రవేత్త ఒకరు తెలిపారు. నిజానికి హానెర్జీ యూరోపియన్ కారు తయారీ సంస్థలతో ఈ రకమైన ఒప్పందాలను కూడా కుదుర్చుకుంటోంది.

అతుక్కుంటాయి.. వివరాలిస్తాయి!

ఐసీయూలో ఉన్న రోగిని మీరెప్పుడైనా చూశారా? ఒళ్లంతా కప్పేసిన తీగలు, సెలైన్, ఇతర గొట్టాలతో కనిపిస్తారు వారు. అత్యవసర పరిస్థితుల్లో శరీరం తాలూకూ స్పందనలన్నింటినీ గుర్తించేందుకు ఈమాత్రం ఏర్పాట్లు అవసరం. ఇకపై మాత్రం కాదు. ఎందుకంటారా? ఫొటోలో కనిపిస్తోందే.. అలాంటి స్టిక్కర్లతోనే గుండెకొట్టుకునే వేగం మొదలుకొని రకరకాల వివరాలను సేకరించేందుకు నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త జాన్ ఎ.రోజర్స్ వినూత్నమైన టెక్నాలజీలను సిద్ధం చేస్తున్నారు. శరీరం కదలికలకు తగ్గట్టుగా కదులుతూనే వివరాలు సేకరించగల ఈ వినూత్నమైన వేరబుల్ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ఐసీయూలో మాత్రమే కాదు.. దీర్ఘకాలికవ్యాధి తరువాత కోలుకునే క్రమంలోనూ ఎంతో ఉపయోగపడుతుంది. కండరాల కదలికలు,



గుండె పనితీరు, నిద్ర తాలూకూ నాణ్యత వంటి అనే విషయాలను వైద్యులకు తెలియజేయగలవు ఈ స్టిక్కర్లు. గొంతు వద్ద అతికించుకునే స్టిక్కర్... రోగులు ఆహారాన్ని సక్రమంగా మింగ గలుగుతున్నారా, లేదా? అతడి స్వరపేటిక ఎలా పనిచేస్తోంది? వంటి అంశాలను కూడా గుర్తించగల సెన్సర్లను కలిగి ఉంటుంది. ప్రస్తుతం ఉపయోగించే మైక్రోఫోన్ల కంటే ఇవి చాలా మెరుగైన ఫలితాలిస్తాయని రోజర్స్ అంటున్నారు. రోగులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తరువాత కూడా వీటిని వాడుతూ ఉండవచ్చునని, ఎప్పటికప్పుడు వివరాలు డాక్టర్ల కంప్యూటర్లు లేదా స్మార్ట్‌ఫోన్లలో నమోదవుతూ ఉంటాయని వివరించారు.

కాలేయ వ్యాధికి కార్బోహైడ్రేట్లు తక్కువ ఉన్న ఆహారం మేలు!

కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉన్న ఆహారంతో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఇటీవలి కాలంలో అనేక పరిశోధనలు చెబుతున్నాయి. తాజాగా ఫ్యాటీ లివర్ వ్యాధి విషయంలోనూ ఈ రకమైన ఆహారం ఎంతో మేలు చేస్తుందని గుర్తించారు కేటీహెచ్ రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ శాస్త్రవేత్తలు. మద్యంతో సంబంధం లేని రకమైన ఫ్యాటీ లివర్ వ్యాధితో బాధపడుతున్న కొందరు ఊబకాయులకు రెండు వారాల పాటు తక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం అందించినప్పుడు వారి జీవక్రియలతోపాటు కడుపు/పేవుల్లోని బ్యాక్టీరియాలోనూ తేడాలు కనిపించాయని ఈ రెండు పరిణామాలు కాలేయంలోని కొవ్వు తగ్గేందుకూ దోహదపడ్డాయని ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్న శాస్త్రవేత్త మార్డినోగీ తెలిపారు. కార్బోహై



డ్రేట్లు తక్కువగా, ప్రొటీన్లు ఎక్కువగా ఉన్న ఆహారం శరీరంలో ప్రమాదకరమైన హెపాటిక్ కొవ్వుల ఉత్పత్తి ప్రక్రియపై ప్రభావం చూపిందని, బి విటమిన్ల మోతాదుతోపాటు ఫోలిక్ యాసిడ్‌లను ఉత్పత్తి చేసే బ్యాక్టీరియా ఎక్కువైందని వివరించారు. ఈ రకమైన ఆహారం బరువు తగ్గేందుకు, గుండెజబ్బుకు దారితీసే ప్రమాదాన్ని కూడా గణనీయంగా తగ్గిస్తుందని చెప్పారు. అయితే శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉన్న వారు ఆహారపు అలవాట్లను మార్చుకునే ముందు వైద్యులను సంప్రదించడం మేలని సూచించారు. పరిశోధన వివరాలు సెల్ మెటబాలిజం తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

బ్రేవ్. రోజ్ మెక్‌గావన్. బ్రేవ్!
ఇది హాలీవుడ్‌తో పరిచయం ఉన్నవాళ్లు..
'మీ టూ' ఉద్యమం గురించి తెలిసినవాళ్లు..
స్త్రీవాదులు.. స్త్రీల మీద హింసను, వేధింపులను
వ్యతిరేకిస్తున్నవాళ్లంతా అనుకుంటున్న మాట!
రోజ్ మెక్‌గావన్ రాసిన పుస్తకం పేరు కూడా .. 'బ్రేవ్'!

ది బ్రేవ్ లేడీ


రోజ్ మెక్‌గావన్


తను రాసిన 'బ్రేవ్' పుస్తకంతో రోజ్ మెక్‌గావన్

రోజ్ మెక్‌గావన్ హాలీవుడ్ నటి, మోడల్, రచయిత్రి. హాలీవుడ్ దిగ్గజం 'హార్వే వెన్‌స్టీన్' బాధితుల్లో ఒకరు. హార్వే వెన్‌స్టీన్‌ను రాక్షసుడిగా అభివర్ణించి హాలీవుడ్ విస్తుపోయేలా చేశారు. 'నేను హాలీవుడ్ అనే మెంటల్ డిజార్డర్‌తో బాధపడ్డాను' అనే స్టేట్‌మెంట్‌తో ప్రపంచ చిత్రపరిశ్రమకు, దానితో సంబంధం ఉన్నవాళ్లందరికీ షాక్ ఇచ్చారు. ఇటీవలే తను పూర్తి చేసిన 'బ్రేవ్' అనే పుస్తకంలో తన పెంపకం దగ్గర్నుంచి హాలీవుడ్ దాకా ఎన్నో విషయాలను చెప్పారు. ఇప్పుడు ఇక్కడ రోజ్ బయోగ్రఫీకి కారణం కూడా ఆమె బ్రేవ్‌నెస్ అండ్ బ్రేవ్ పుస్తకమే!

సన్‌డాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్ సమయంలో

1997 సన్‌డాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్ జరుగుతోంది. అప్పటికే రోజ్ హాలీవుడ్‌లోకి అడుగుపెట్టి దాదాపు అయిదేళ్లవుతోంది. హార్వే వెన్‌స్టీన్ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్. లాబీలో ఉన్న మీటింగ్ రోజ్ వెళ్లగానే హఠాత్తుగా మీటింగ్‌ను హోటల్‌లోని తన రూమ్‌లోకి మార్చాడు. రోజ్ వెళ్లారు. అక్కడ ఆమె పట్ల అతను అనుచితంగా ప్రవర్తించాడు. అది బయటకు వెళ్లకుండా ఉండటానికి ఆమెతో సెటిల్‌మెంట్ చేసుకున్నాడు. ఈ విషయం 2017, అక్టోబర్‌లో ది న్యూయార్క్ టైమ్స్ బయటపెట్టింది. 2017, అక్టోబర్ 12న రోజ్ కూడా చెప్పింది.. అవును హార్వే తనను రేప్ చేశాడు, ఈ విషయం మీద అమెజాన్ స్టూడియోలో కంప్లయింట్ చేస్తే చర్య తీసుకోకపోగా.. ఆ ప్రాజెక్ట్ నుంచి తననే తొలగించారని. ఈ విషయంతో పాటు హాలీవుడ్‌లోని ఇతర పురుషపుంగవుల మీదా దాడి చేసింది తన ట్విట్టర్‌లో. అయితే హాలీవుడ్‌లో నటీమణుల మీద జరుగుతున్న వేధింపులు, సెక్సువల్ అబ్యూజ్‌తో పాటు తన బాల్యం, జీవితంలోని ముఖ్య ఘట్టాలతో తాను రాసిన బ్రేవ్ అనే పుస్తకాన్ని 2018, జనవరి 30న రిలీజ్ చేశారు రోజ్ మెక్‌గావన్. అంతేకాదు ఆ మరుసటి రోజు అంటే జనవరి 31న 'సిటిజన్ రోజ్' పేరిట ముర్రే ప్రొడక్షన్స్ కింద బనిమ్ నిర్మించిన అయిదు భాగాల డాక్యుమెంటరీ రిలీజ్ అయింది. ఇందులో 'మీ టూ మూవ్‌మెంట్'లో మెక్‌గావన్ పోషించిన ముఖ్యభూమిక గురించి ఉంటుంది.

ఎక్కడ పుట్టారు? ఎలా పెరిగారు?

రోజ్ ఇటలీలో పుట్టారు. తండ్రి డానియల్. ఆర్టిస్ట్ . తల్లి.. టెర్రీ. రచయిత. 1968 కాలంలో ఇళ్లల్లోంచి పారిపోయిన టీనేజర్స్, హిప్పీ మూవ్‌మెంట్‌లోని ఇంకొంత మందితో కలిసి డేవిడ్ బెర్గ్ మొదలుపెట్టిన 'చిల్డ్రన్ ఆఫ్ గాడ్' ఇటాలియన్ చాప్టర్‌ను నిర్వహిస్తుండేవాడు రోజ్ తండ్రి డానియల్. ఆ కల్ట్‌లోనే పెరిగిన రోజ్ పదిహేనేళ్ల వరకు అస్తవ్యస్త బాల్యాన్ని గడిపారు. ఆమెకు నిద్రలో నడిచే అలవాటూ ఉండింది. చిల్డ్రన్ ఆఫ్ గాడ్ గ్రూప్‌లో భాగంగా తల్లిదండ్రులతో కలిసి యూరప్ అంతా తిరిగారు ఆమె. ఇటలీలో తండ్రికున్న పరిచయాలతో రోజ్ చైల్డ్ మోడల్‌గా మారింది. తనకు పదేళ్లున్నప్పుడు తల్లిదండ్రులతో సహా అమెరికా మకాం మార్చారు రోజ్. టీన్స్‌లో ఉన్నప్పుడు తల్లితండ్రి విడిపోయారు. తండ్రితో కలిసి సియాటెల్‌లో ఉండసాగారు రోజ్. పదిహేనేళ్ల వయసులో తల్లి, తండ్రినీ కాదనుకొని లాస్‌ఏంజెల్స్‌కు ప్రయాణమయ్యారు.

హాలీవుడ్ ఎంట్రీ..

1992లో 'ఎన్‌సినో మ్యాన్'తో హాలీవుడ్ లోకి ఎంటర్ అయ్యారు. 1995లో వచ్చిన ది 'డూమ్ జెనరేషన్'తో అందరి దృష్టి పడింది ఆమె మీద. ఆ సినిమాకు ఇండిపెండెంట్ స్పిరిట్ అవార్డ్‌ను అందుకున్నారు రోజ్. ఆ తర్వాత వచ్చిన స్క్రీమ్ ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టింది. అందులో తన సహనటుడుగా ఉన్న బెన్ అఫ్లెక్ కూడా తన పట్ల అనుచితంగా ప్రవర్తించాడని ఫిర్యాదు చేశారు రోజ్. ఆ తర్వాత 2001 నుంచి 2006 వరకు ది డబ్ల్యూబీ లో ప్రసారమైన చార్మ్‌డ్ సీరియల్‌లోని పెయిజ్ మాథ్యూతో టెలివిజన్ ప్రేక్షకులకూ అభిమాన నటి అయ్యారు.

కంట్రావర్సీస్

ముక్కుసూటి తనం, నమ్మినదాన్ని ఆచరించడం రోజ్ మెక్‌గావన్ తత్వం. అదే ఆమె వ్యక్తిత్వం. ఎల్‌జీబీటీ యాక్టివిస్ట్ అయిన ఆమె స్వలింగ వివాహాలను నిషేధించిన కాలిఫోర్నియా స్టేట్‌కు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో పాల్గొన్నారు. గేస్‌కు మద్దతు పలికిన ఆమెనే తర్వాత గేస్ కూడా స్త్రీద్వేషులనే స్టేట్‌మెంట్‌ను ఇచ్చారు. వాళ్లు మహిళా హక్కుల కోసం తమ గొంతును కలుపుతారు అనుకున్నా. కాని మిగిలిన పురుషుల్లాగే వాళ్లు ప్రవర్తిస్తున్నారు. మహిళలపట్ల, వాళ్ల హక్కుల పట్ల చిన్నచూపుతో వ్యవహరిస్తున్నారు. ఇప్పుడనిపిస్తోంది అనవసరంగా వాళ్లకు మద్దతు పలికానని' అంటూ కామెంట్ చేశారు. దీంతో గే కమ్యూనిటీ ఆమె మీద ధ్వజమెత్తింది. అయినా తన మాటను వెనక్కి తీసుకోలేదు. అయితే తమను స్త్రీ ద్వేషులన్నందుకు క్షమాపణ చెప్పాలని గే కమ్యూనిటీ డిమాండ్ చేస్తే ఆ ఒక్కమాటను మాత్రమే వెనక్కి తీసుకుంటున్నానని, మిగిలిన విషయంలో తన అభిప్రాయం ఏమాత్రం మారదని, అలా అన్నందుకు పశ్చాత్తాపం కూడా లేదని స్పష్టం చేశారు రోజ్.

గోల్డెన్ గ్లోబ్... బ్లాక్ డ్రెస్

'మీ టూ' క్యాంపెయిన్‌లో ప్రధాన గొంతుక అయిన రోజ్ గోల్డెన్‌గ్లోబ్ అవార్డు ప్రదానోత్సవ సభలో హాలీవుడ్‌లోని మహిళల మీద వేధింపులకు నిరసనగా నటి మెరిల్‌స్ట్రీప్ బ్లాక్ డ్రెస్ వేసుకొని రావడాన్నీ తప్పు పట్టారు. మెరిల్ స్ట్రీప్‌ను హిపోక్రాట్‌గా వర్ణించారు. 'మీ టూ క్యాంపెయిన్‌కు మద్దతు తెలపకుండా, హాలీవుడ్‌లోని లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా నోరువిప్పకుండా నల్ల బట్టలు వేసుకొని రెడ్‌కార్పెట్ మీద నడిస్తే నిరసన తెలిపినట్టు కాదు. ఇండస్ట్రీలో అన్యాయాల మీద వ్యూహాత్మకంగా పాటిస్తున్న మౌనాన్ని వీడాలి' అంటూ మెరిల్ స్ట్రీప్‌కు చురక అంటించారు రోజ్. ఇది హాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారింది. అయినా రోజ్ లెక్క చేయలేదు. తన అన్న మాటమీదే నిలబడ్డారు. ఇప్పటికైనా సైలెన్స్‌ను బ్రేక్ చేయండి అంటూ అభ్యర్థించారు.



> మహిళను
> మనిషిగా చూడండి..
> సెక్సువల్‌ఆబ్జెక్ట్‌గా కాదు.
> స్త్రీలు కూడా సెక్సువలైజ్
> కాకుండా తమ
> సెక్సువాలిటీని
> ఓన్ చేసుకోవాలి.
> - రోజ్ మెక్‌గావన్

సెక్స్‌సింబల్ కాదు.. మనిషి

'చిల్డ్రన్ ఆఫ్ గాడ్' .. పిల్లలను కూడా లైంగిక సాధనాలుగా చూసే కల్ట్. ఆ నేపథ్యంలో పెరిగారు రోజ్. ఎంత భయంకరమైన బాల్యాన్ని అనుభవించారో.. అంతే భయంకరమైన యూత్‌నీ గడిపారు. మహిళను సెక్స్‌సింబల్‌గా చూసే చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టారు. అక్కడా అంతే భయంకరమైన అనుభవాలు. వీటన్నిటి మీద ఇప్పుడు పోరాటం తలపెట్టారు. నేనింతే.. అనే స్వభావం గల మనిషి ఆమె. అదే స్వభావం రోజ్ మెక్‌గావన్‌ను నిలబెడ్తోంది. తన పోరాటానికి శక్తినిస్తోంది. ''మహిళను మనిషిగా చూడండి.. లైంగిక సాధనంగా కాదు. స్త్రీలు కూడా సెక్సువలైజ్ కాకుండా తమ సెక్సువాలిటీని ఓన్ చేసుకోవాలి'' అంటారు రోజ్‌మెగావన్.. ది బ్రేవ్ లేడీ!

- శరాది

ఈ వారం YouTube హిట్స్

102 నాటవుట్ – టీజర్


నిడివి: 1 ని. 02 సె.; హిట్స్: 49,95,900

అమితాబ్, రిషి కపూర్ అనగానే 'చల్ మేరే భాయ్'... పాట గుర్తుకొస్తుంది. 'నసీబ్'లో వాళ్లిద్దరూ కలిసి యాక్ట్ చేశారు. 'అమర్ అక్బర్ ఆంథోనీ'లో కూడా వాళ్ల జోడీ పండింది. 27 ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పుడు వాళ్లు తిరిగి నటిస్తున్నారు. సినిమా పేరు '102 నాటవుట్'. గుజరాతీ రచయిత సౌమ్యా మిశ్రా రాసిన నాటకం ఆధారంగా ఈ సినిమా తీశారు. ఇందులో 102 ఏళ్ల తండ్రి అతని 75 ఏళ్ల కొడుకు మధ్య ఉన్న బంధాన్ని చర్చిస్తుంది. ఆశ్చర్యం ఏమిటంటే కొడుకు తండ్రిని చూసుకోవడం కన్నా తండ్రి కొడుకును చూసుకోవడం ఈ సినిమా విశేషం. కొడుకులు సాధారణంగా తండ్రులను వృద్ధాశ్రమానికి పంపుతుంటారు కదా. ఇందులో తండ్రి కొడుకును వృద్ధాశ్రమానికి పంపుతానంటాడు. తర్వాత ఏమవుతుందనేది కథ. గతంలో 'ఓ మై గాడ్' వంటి హిట్ సినిమా తీసిన ఉమేష్ శుక్లా ఈ సినిమాకు దర్శకుడు. ప్రేక్షకుల్లో కుతూహలం రేపుతున్న ఈ సినిమా టీజర్ యాభై లక్షల హిట్స్‌కు సమీపించింది.

ఎవ్విరి స్కూల్ రొమాన్స్ – షార్ట్‌ఫిల్మ్


నిడివి: 5 ని. 52 సె.; హిట్స్: 49,00,350

హైస్కూల్ స్థాయి వయసొచ్చాక– కో ఎడ్యుకేషన్ అయితే గనుక– స్కూళ్లలో కలిగే ఆకర్షణలు, కోరుకునే స్నేహాలు, ఇన్‌ఫాచ్యుయేషన్... వీటి మీద ఏ షార్ట్‌ఫిల్మ్ కనిపించినా నోస్టాల్జియాలోకి వెళ్లిన అనుభూతి వస్తుంది. 'ఫిల్టర్ కాఫీ' యూ ట్యూబ్ చానల్ తయారు చేసిన 'ఎవ్విరి స్కూల్ రొమాన్స్' షార్ట్ ఫిల్మ్ స్కూళ్లో అబ్బాయి అమ్మాయిల మధ్య ఆకర్షణలో చోటు చేసుకునే సరదాలను చూపిస్తుంది. స్కూల్ బస్‌లో సీటు తీసి పెట్టడం, కోడ్ నేమ్స్ పెట్టుకుని మాట్లాడటం, ఇంటికి ఫోన్ చేస్తే తల్లో తండ్రో ఎత్తితే హడలిపోయి పెట్టేయడం, లంచ్ బాక్స్ షేర్ చేసుకోవడం.. ఇవన్నీ కనిపిస్తాయి. చివరకి ఎస్ అంటే ఎస్ అనుకున్నా సాధారణంగా ఇలాంటి ఆకర్షణలన్నీ స్కూలు ముగిశాక అంతమైపోతుంటాయి. సరదాగా చూడదగ్గ షార్ట్‌ఫిల్మ్ ఇది. .


ఒరు అదార్ లవ్ – టీజర్



నిడివి: 44 సె.; హిట్స్: 1,64,92,700

కన్ను కొట్టే అమ్మాయి ప్రియా వారియర్ పుణ్యాన ఈ సినిమా రిలీజ్‌కు ముందే దేశమంతా తెలిసి పోయింది. వాస్తవానికి ఇది చిన్న మలయాళ సినిమా. రాబోయే రంజాన్ పండుగకి (జూన్) దేశంలో విడుదల కానుంది. కేరళకు పరిమితం కావాల్సిన ఈ వ్యవహారం ఒక పాటలో ప్రియా ప్రదర్శించిన హావభావాల వల్ల విపరీత ప్రచారం పొందింది.'ఒరు ఆదార్ లవ్' ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిల స్కూలు ప్రేమ కథ. రొమాంటిక్ కామెడీలు తీస్తాడని గుర్తింపు పొందిన ఒమర్ లులు దీనికి దర్శకుడు. దీని కోసం అందరూ కొత్తవారిని తీసుకుంటే వారిలో ఒకరైన ప్రియా వారియర్ దేశాన్ని ఆకర్షించింది. వారంలోనే దీని అఫీషియల్ టీజర్ కోటిన్నర హిట్స్‌ను దాటిపోయింది. అంతా ప్రియా లీల.

మళ్లీ చెప్పకుందాం! రీటోల్డ్ కథలు - 09

భార్య కావలెను




● జూడీ బ్రాడీ

మొన్న సుబ్బారావు కనిపించాడు. నమస్తే చెల్లెమ్మా... అని ఉత్సాహంగా పలకరించాడు. ఏమిటి సంగతి అనంటే డివోర్స్ అయిపోయిందట మంచి అమ్మాయి ఉంటే చూడమ్మా చేసుకుంటాను అన్నాడు. మళ్లీ మనవాడికి మంచి భార్య కావాలన్నమాట.

నేను కూడా ఒకరికి భార్యనే. ఇద్దరు పిల్లల తల్లినే. కానీ ఈ సుబ్బారావు శాల్తీ తగిలినప్పటి నుంచి నా బుర్రలో కూడా ఒక పురుగు తొలుస్తూ ఉంది. నాక్కూడా ఒక భార్య ఉంటే ఎంత బాగుంటుంది? అవును. మీరు సరిగ్గానే విన్నారు. నాక్కూడా ఒక భార్య ఉంటే ఎంత బాగుంటుంది.

ఎందుకు అంటారా?

చెప్తా వినండి.

నాకు భార్య కావాలి. నేను మళ్లీ ఏ ఉస్మానియాలోనో, సెంట్రల్ యూనివర్సిటీలోనో చేరి నా చదువును తిరగదోడి సరిగా చదివి ఆ చదువుతో నాలుగు డబ్బులు సంపాదించే యోగ్యతను తెచ్చుకుని నా కాళ్ల మీద నేను నిలబడదలుచుకున్నాను కనుక నాకో భార్య కావాలి. నేను తెల్లారి పుస్తకాలు పట్టుకుని చదువుకు పోతే నా పిల్లలను 'నాన్నా.. కన్నా' అని లేపి, ముద్దు చేసి, బాత్‌రూమ్‌లో ఫలానాది కడిగి, బ్రష్ చేయించి, స్నానానికి శుభ్రంగా వొళ్లు రుద్ది, బ్రెడ్ తినిపించి, స్కూల్ బ్యాగులు ఈ భుజాన ఒకటి ఆ భుజాన ఒకటి తగిలించుకుని మెట్లు దిగి బస్ దాకా నడిచి పిల్లలను ఎక్కించి వచ్చే భార్య కావాలి. వాళ్లు అమ్మా జ్వరం అంటే హాస్పిటల్‌కి ఫోను కొట్టి ఫలానా డాక్టర్ అపాయింట్ ఉందేమో చెప్తారా అండీ అని వినమ్రంగా అడిగే భార్య కావాలి. స్స్... పంటి నొప్పి అనగానే ఊబర్ బుక్ చేసి అమీర్‌పేట దాకా వెళ్లి మంచి డెంటల్ హాస్పిటల్‌లో చూపించుకుని వచ్చే భార్య కావాలి. 'అమ్మా... నా ఫ్రెండు ప్రహ్లాద్‌గాడు వాళ్ల నాన్నతో కలిసి ఈ సమ్మర్‌కు సింగపూర్ వెళుతున్నాడట' అని చిన్నబుచ్చుకుంటే 'వెళితే వెళ్లనీయమ్మా... మనం ఎంచక్కా మీ నానమ్మ ఊరు జగ్గయ్యపేట వెళదాం' అని వాళ్లలో సంతోషమూ ఆత్మవిశ్వాసమూ నింపి వాళ్లను తల ఎత్తుకు తిరిగేలా చేసే భార్య కావాలి. నేను వెళుతూ వెళుతూ ఒక క్షణం గడప దగ్గర నిలబడి ఏదైనా సాయం కావాలా అని మాటవరసకు అడిగితే 'ఇవన్నీ ఉండే తలనొప్పులేలేండి. మీకెందుకు మీరెళ్లండి' అని చిరునవ్వు చెదరకుండా చెప్పే భార్య కావాలి. అయితే ఆమె కాస్తో కూస్తో పని చేయాలండోయ్. ఆఫీసుకు ఇలా వెళ్లి అలా వచ్చేయాలి. లేట్ అవర్స్ గీట్ అవర్స్ జాన్తా నై. కావాలంటే ఒక గంట పని తగ్గించుకుని నా కోసం నా పిల్లల కోసం టైమ్ స్పెండ్ చేయాలి. అలాంటి భార్యే కదా నాకు కావాలి.

ఇక నాక్కావలసిన భార్య నుంచి నేను కాసింత మంచి వంటను ఆశించడం తప్పంటారా? రొయ్యలు, వంకాయ కలిపి రుచిగా తియ్యగూర చేసే భార్యను, మిరియాల చారు కాచినప్పుడు తప్పకుండా గుర్తుపెట్టుకుని వడియాలు కాల్చి ఇచ్చే భార్యను, ఈ మనిషికి లేత సొరకాయ కూరంటే మహా ఇష్టం సుమండీ అని తెచ్చి కాసింత పాలుబోసి వండి పెట్టే భార్యను కోరుకోవడం ఏ మాత్రం అత్యాశ కాదంటే కాదు. నాకు కష్టం కలక్కుండా పిల్లలకు అంతరాయం కలక్కుండా విసుక్కోకుండా జిడ్డోడే ముఖంతో కనిపించకుండా ఇప్పుడే స్నానం చేసి రెడీ అయినట్టుగా వంట చేసుకుంటూ కనిపించే భార్య కావలెను. ఇక డీమార్ట్‌కు రా, మోర్‌కు రా, మెట్రోకు రా అని ఆమె పిలిచేది లేదు. నేను వెళ్లేదీ లేదు. ఇంటికి ఏయే సరుకులు కావాలో ఆమెకు తెలియదా? మధ్య నేను పుల్ల పెట్టాలా? కాని– ఇవన్నీ తను చేసుకుంటూ తన లోకంలో ఉంటే కాదనను కాని నాకింత నడుము పట్టేసినప్పుడు, మెడ పీకేస్తున్నప్పుడు, పడిశంతో ముక్కు ఎర్రగా అయిపోయినప్పుడు 'అయ్యో... ఏమిటండీ ఇలాగా' అంటూ ఆగమాగం అయిపోయి నాకోసం లీవు పారేసి నా నొప్పి తన నొప్పిగా భావించి కూచునే భార్య నాకు తప్పనిసరిగా కావాలి. ఇంటి శుభ్రత పట్ల తనకు పట్టింపు ఉండాలి. ఈ ఇంటిని ఎప్పుడూ నేను శుభ్రంగా ఉంచుకుంటాను దీనికి ఎవ్వరి సహాయం అక్కర్లేదు అనే ఆత్మాభిమానం నాక్కాబోయే భార్యకు ఉండాలి. ఇక సంవత్సరానికి ఒకసారి అరకో, హార్సిలీహిల్సో వెళతాము కదా. అప్పుడు 'ఏయ్ పిల్లలూ... డిస్టర్బ్ చేయకండి' అని వాళ్లను బంతాటకు దూరం తీసుకెళ్లి నన్ను మాత్రం చెట్టు కింద రిలాక్స్‌డ్‌గా పడుకుని కొబ్బరి నీళ్లు తాగేలా చేసే మంచి భార్య నాకు కావాలి.

ఇక సంఘంలో నా మర్యాద నిలబెట్టే భార్య ఉండాలని ఎవరు మాత్రం అనుకోరు చెప్పండి. గెస్టులు వస్తారనగా టపాటపా ఇల్లు సర్దేసి, సోఫా కవర్లు మార్చేసి, ఫ్లవర్ వాజుల్లో కొత్త పూలు పెట్టేసి, రూమ్ స్ప్రేలు కొట్టేసి, పిల్లలూ బుద్ధిగా ఉండాలమ్మా అని వాళ్లకు జాగ్రత్తలు చెప్పేసి, ఎవరెవరికి ఏ పదార్థం ఇష్టమో వండి పెట్టేసి, డ్రింక్స్‌లోకి ఈ స్నాక్స్ కావాలా ఆ స్నాక్స్ కావాలా అని కర్టెన్ పట్టుకు నిలబడి అడిగేసి, యాష్ ట్రేలను తళతళలాడేట్టు టీపాయ్ మీద పెట్టేసి, గెస్టులు వచ్చాక ప్రతి మాట అనుమతి కోసం నా వైపు చూస్తూ నా మెచ్చుకోలును పొందే భార్య నాకు కావాలి. ఇదొకటా. ఒక్కోసారి 'నాకు బోర్ కొడుతుందోయ్ ఫ్రెండ్స్‌తో పోతున్నా రాత్రికి రాను' అనంటే 'అదెంత మాట అలాగే' అనే భార్య నాకు కావాలి.

ఇక రాత్రి పూట 'ఊహూ' 'నోనో' అనే భార్య నాకు నచ్చదు. పిలిచినప్పుడు రావాలి. చెప్పినట్టు వినాలి. నేను టీవీ చూసీ చూసీ సెల్‌లో గడిపీ గడిపీ తను గాఢనిద్రలో ఉండగా లేపి రమ్మన్నా నిద్ర కళ్లతో అయినా సరే రావాలి. కాని నాకు మూడ్ లేనప్పుడు పిలవకూడదు. తనకు కావాలనుకున్నప్పుడు పిలవకూడదు. అలా చేస్తే నాకు చాలా చెడ్డ కోపం వస్తుందని గ్రహించి మసలుకునే భార్య నాకు కావాలి.

సరే. నాకు చదువు అయిపోయింది. ఉద్యోగం వచ్చేసింది. డబ్బులొస్తున్నాయ్. ఇక నోర్మూసుకుని ఇంట్లో కూచో... నన్నూ పిల్లలను చూసుకో అనంటే అలాగేనండీ అని పల్లెత్తు మాట అనని భార్య కావాలి. సరేనబ్బా. ఇది కూడా చెప్పేస్తా. ఇన్‌కేస్ నాకు ఈ భార్య కంటే ఇంకో మంచి భార్య కాదగ్గ అమ్మాయి కనిపించిందనుకోండి.. ఈమెను వదిలిపెట్టి ఆమెతో కొత్త జీవితం ప్రారంభించాలనుకున్నాననుకోండి... అప్పుడు ఎల్లెల్లవో అని ఇంటి నుంచి పంపేస్తే డివోర్స్ ఇచ్చేస్తే నా కొత్త జీవితం కోసం పిల్లలను తీసుకుని కిక్కురుమనకుండా నిష్క్రమించే ఉత్తమురాలైన భార్య నాకు కావాలి.

భార్య వల్ల ఇన్ని సౌలభ్యాలు ఉండగా భార్యను మీరు వద్దంటారా? నేను వద్దంటానా? చెప్పండి.

కథ ముగిసింది.

అమెరికన్ స్త్రీ హక్కుల కార్యకర్త జూడీ బ్రాడీ రాసిన వ్యంగ్య రచన ఇది. 1971లో చేసిన ఈ రచన అప్పటి నుంచి కొన్ని వందలసార్లు పత్రికలలో ప్రచురితం అవుతూనే ఉంది. నేటికీ ప్రాసంగికత కలిగి ఉంది. 'ఇంటికి వెళ్లి ఏ సంగతీ ఉత్తరం రాస్తాం' అనే మాటకు మించిన హింసాత్మకమైన మాట ఉందా? ఎస్ చెప్పాల్సింది మగపెళ్లివాళ్లు. ఎగిరి గంతెయ్యాల్సింది ఆడపెళ్లివాళ్లు. షరతులు చెప్పాల్సింది అబ్బాయి. ఓకే చెప్పాల్సింది అమ్మాయి. పెళ్లయ్యాక వేధించాల్సింది అబ్బాయి వేదన పడాల్సింది అమ్మాయి. ద్వంద్వ ప్రమాణాలు పేరుకుపోయిన వ్యవస్థ పెళ్లి. అందులో ఏ శ్రమ చట్టం లేని కార్మికురాలు భార్య. ఈ అసంఘటిత వర్గం ఏకమైతే యజమాని పరిస్థితి ఏమిటో.

పునః కథనం: ఖదీర్

సూపర్ పేరెంట్స్‌కు సాక్షి ఆహ్వానం

● పోకడకు భిన్నంగా మీ అమ్మ నాన్న మిమ్మల్ని పెంచి పెద్దచేశారా? ● ఎటువంటి వివక్షా అంటకుండా ఎదగనిచ్చారా? ● అన్నింటా మీ అభిప్రాయాలను గౌరవించారా? ● మీ ఎదుగుదలకు ఆకాశమే హద్దని ప్రోత్సహించారా? ● అణచివేతలను అధిగమించే శక్తినిచ్చారా? ● మంచిని మంచనీ, చెడుని చెడు అనీ తేల్చుకోగలిగే నిక్కార్సైన స్వభావాన్ని మీకు వారు అందించి ఉంటే వారే సూపర్ పేరెంట్స్. ● మీ సూపర్ పేరెంట్స్ గురించి మాకు రాయండి. మనమంతా కలిసి వారిని మార్చి 7న సత్కరించుకుందాం.
Mail ID : shakthi@sakshi.com



షార్ట్ ఫిల్మ్‌లకు 'సాక్షి' ఆహ్వానం

చూస్తున్నారుగా.. 'నేను శక్తి' పేరిట సాక్షి ప్రచురిస్తున్న కథనాలు. దానిలో మీరూ భాగస్వాములు కండి.
● లింగవివక్ష ● గృహహింస ● వేధింపులు ● సాధికారత
అంశాలపై 10 నిమిషాల నిడివిగల షార్ట్ ఫిల్మ్‌లను తీసి మాకు పంపండి. వచ్చిన వాటిలోంచి ప్రముఖ సినీదర్శకులు నాలుగింటిని ఎంపిక చేస్తారు. వాటిని మార్చి 7వ తేదీన ముగింపు ఉత్సవంలో ప్రదర్శిస్తాం. విజేతలకు తగిన ప్రోత్సాహకం ఉంటుంది. మీరు షార్ట్ ఫిల్మ్‌లను పంపాల్సిన మెయిల్ ఐడీ: Mail ID : shakthi@sakshi.com



200 షెల్ కంపెనీలు, బినామీ ఆస్తులు

పీఎన్‌బీ కుంభకోణంలో జోరు పెంచిన దర్యాప్తు సంస్థలు

- కొనసాగిన ఈడీ సోదాలు.. దాదాపు 24 స్థిరాస్తుల అటాచ్‌కు సిద్ధం
- ప్రతీ ఎల్‌వోయూకు పర్సంటేజీల రూపంలో వసూళ్లు
- సీబీఐ విచారణలో గోకుల్ నాథ్ శెట్టి, ఖారత్‌లు వెల్లడి!
- తప్పుచేసిన వారిలా ప్రవర్తించొద్దు.. నోరు విప్పండి: రాహుల్
- బ్యాంకుల్ని మోసగించిన వారి వివరాలు బయటపెట్టాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ/ముంబై

వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, అతని వ్యాపార భాగస్వామి మెహుల్ చోక్సీలు పీఎన్‌బీని రూ. 11,400 కోట్లకు మోసగించిన కేసులో దర్యాప్తు సంస్థలు దాదాపు 200 షెల్(నకిలీ) కంపెనీలు, బినామీ ఆస్తుల్ని గుర్తించాయి. భారత్‌తో పాటు విదేశాల్లోని ఈ కంపెనీల ద్వారా అక్రమ లావాదేవీలు నెరపి.. స్థలాలు, బంగారం, విలువైన రాళ్ల రూపంలో బినామీ ఆస్తుల్ని కూడగట్టినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), ఐటీ శాఖలు నిర్ధారణకు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈడీ, ఐటీ శాఖల అధికారులు బృందంగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు వరుసగా నాలుగోరోజైన ఆదివారం కూడా మోదీ, చోక్సీల ఆస్తులపై ఈడీ దాడులు కొనసాగించింది. దేశవ్యాప్తంగా 15 నగరాల్లోని 45 చోట్ల నగల దుకాణాలు, తయారీ కేంద్రాల్లో సోదాలు నిర్వహించి రూ. 20 కోట్ల మేర వజ్రాలు, బంగారాన్ని స్వాధీనం చేసుకుంది. దాదాపు 24 స్థిరాస్తుల్ని గుర్తించి మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కింద అటాచ్ చేసేందుకు సిద్ధమైంది. ఈ కేసులో ఈడీ రూ. 5,674 కోట్ల మేర వజ్రాలు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన రాళ్లు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. 'ఆదాయపు పన్ను శాఖ తాత్కాలికంగా అటాచ్ చేసిన 29 ఆస్తుల విలువను కూడా అంచనా వేస్తున్నాం. త్వరలో మరిన్ని ఆస్తుల్ని అటాచ్ చేస్తాం' అని ఈడీ తెలిపింది.

అందరికీ పర్సంటేజీలు..

మెహుల్ చోక్సీ ప్రమోటర్‌గా ఉన్న గీతాంజలి గ్రూప్ కంపెనీల అనుబంధ సంస్థల ఆస్తిఅప్పుల పట్టీని ఆదివారం తనిఖీ చేసిన సీబీఐ.. కస్టడీలో ఉన్న పీఎన్‌బీ ఉద్యోగులు గోకుల్ నాథ్ శెట్టి (రిటైర్డ్), మనోజ్ ఖారత్, నీరవ్ హామీదారు హేమంత్ భట్‌ను ప్రశ్నించింది. విచారణలో శెట్టి, ఖారత్‌లు పలు ఆసక్తికర అంశాల్ని వెల్లడించినట్లు సమాచారం. నీరవ్ , చోక్సీలకు 'లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఓయూ), లెటర్ ఆఫ్ క్రెడిట్‌ల జారీ కోసం మంజూరు చేసిన మొత్తానికి అనుగుణంగా పర్సంటేజీలు వసూలు చేసేవారని, కుంభకోణంతో ప్రమేయమున్న అందరు అధికారులకు ఆ మొత్తాన్ని పంచేవారని తెలుస్తోంది. పీఎన్‌బీ కుంభకోణానికి కేంద్ర బిందువైన ముంబైలోని బ్రాడీ రోడ్డు బ్రాంచ్‌ను సీబీఐ దాదాపుగా తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. సోమవారం కూడా తనిఖీలు కొనసాగుతాయని సీబీఐ అధికారులు వెల్లడించారు. ఈ కేసులో మరో ఆరుగురు వ్యక్తుల్ని విచారించిన దర్యాప్తు సంస్థ.. వారి పేర్లు చెప్పేందుకు నిరాకరించింది. వారిలో పలువురు బ్యాంకు అధికారులుండగా.. ఒకట్రెండు రోజుల్లో వారిని మరోసారి విచారించవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. బ్యాంకు సర్వర్ల నుంచి స్వాధీనం చేసుకున్న రికార్డుల్ని అధ్యయనం చేస్తున్నామని, క్విడ్ ప్రో కో కోణంలో కూడా దర్యాప్తు ఉంటుందని.. ప్రస్తుతం దృష్టంతా కేసును పూర్తిగా వెలికితీసి.. నిధులు ఎక్కడికి మళ్లాయో తెలుసుకోవడంపైనే ఉందని సీబీఐ వెల్లడించింది.


నీరవ్

శ్వేతపత్రం విడుదల చేయాలి: కాంగ్రెస్

దేశంలోని ఆర్థిక మోసగాళ్లతో బీజేపీ అగ్ర నాయకత్వానికి సంబంధాలున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. గత ఐదేళ్లలో రూ. 61 వేల కోట్ల మేర బ్యాంకు కుంభకోణాలు చోటుచేసుకున్నట్లు ఆర్బీఐ వెల్లడించిందని, ఆ ఐదేళ్లలో నాలుగేళ్లు ఎన్డీఏనే అధికారంలో ఉందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ తివారీ ఢిల్లీలో పేర్కొన్నారు. ఆర్థిక మోసగాళ్లకు, బీజేపీ అగ్ర నాయకత్వానికి సంబంధాలు.. దేశ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర సందేహాల్ని రేకెత్తిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే పార్లమెంటు సమావేశాల లోపు బ్యాంకింగ్ వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, బ్యాంకుల నుంచి కోట్ల రుణాలు తీసుకొని మోసగించిన సంస్థలు, ప్రమోటర్లు, కార్పొరేట్ సంస్థల యజమానుల వివరాల్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు బయటపెట్టేలా కేంద్రం ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. గత ఏడాది డిసెంబర్ 31 వరకు ఉన్న ఎన్పీఏలు(నిరర్థక ఆస్తులు), బ్యాంకుల్ని మోసగించిన సంస్థల వివరాల్ని వెబ్‌సైట్లలో ప్రజలకు తెలిసేలా అన్ని బ్యాంకులు ఉంచాలన్నారు. కాంగ్రెస్ హయాంలోనే బ్యాంకు మోసాలకు బీజం పడిందంటున్న బీజేపీ గత నాలుగేళ్ల కాలంలో వాటిపై ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో ఎన్పీఏల మొత్తం విలువ రూ. 8,36,782 కోట్లు కాగా.. ఈ విషయంలో ప్రపంచంలో భారత్ ఐదో స్థానంలో ఉందని, ఎన్పీఏల్లో కార్పొరేట్ కంపెనీల వాటా 77 శాతమని తివారీ తెలిపారు.

రెండు నిమిషాలు కూడా మాట్లాడలేరా?: రాహుల్

పీఎన్‌బీ కుంభకోణంలో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీలు నోరు విప్పాలని, తప్పు చేసిన వారిలా ప్రవర్తించవద్దని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సూచించారు. 'పరీక్షల్లో ఎలా ఉత్తీర్ణులవ్వాలో విద్యార్థులకు ప్రధాని మోదీ రెండు గంటలు పాఠాలు చెప్పారు. అయితే రూ.22 వేల కోట్ల బ్యాంకింగ్ కుంభకోణంపై మాత్రం రెండు నిమిషాలు కూడా మాట్లాడరు. జైట్లీ దాక్కుంటున్నారు' అని ట్వీటర్‌లో ఎద్దేవా చేశారు.

మరో భారీ కుంభకోణం

రూ. 800 కోట్లకు బ్యాంకుల్ని ముంచి విక్రమ్ కొఠారీ పరారు!

- ఎక్కడికీ పారిపోలేదు: రొటొమ్యాక్ పెన్స్ యజమాని కొఠారీ



న్యూఢిల్లీ/కాన్పూర్: వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ షాక్ నుంచి ఇంకా తేరుకోకముందే.. కాన్పూర్‌కు చెందిన వ్యాపార వేత్త విక్రమ్ కొఠారీ రూ. 800 కోట్ల మేర బ్యాంకుల్ని ముంచేసి విదేశాలకు పరారయ్యారన్న వార్త కలకలం రేపుతోంది. రొటొమ్యాక్ పెన్స్ కంపెనీ యజమాని కొఠారీ.. అలహాబాద్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల నుంచి తీసుకున్న రూ. 800 కోట్ల రుణాల్ని ఎగ్గొటారని, ఈ రుణాల మంజూరులో బ్యాంకులు కూడా రాజీపడ్డాయని కథనాలు వెలువడ్డాయి. ఒక నివేదిక ప్రకారం ముంబైలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ. 485 కోట్లు, కోల్‌కతాలోని అలహాబాద్ బ్యాంకు నుంచి రూ. 352 కోట్లను కొఠారీ రుణంగా తీసుకున్నారని.. ఏడాది గడిచినా వడ్డీ గానీ రుణం గానీ కొఠారీ చెల్లించనట్లు తెలుస్తోంది. కాన్పూర్ నడిబొడ్డున ఉన్న కొఠారీ కంపెనీ ప్రధాన కార్యాలయం వారం నుంచి మూసేఉందని.. ఆయన జాడ కూడా తెలియడం లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే తాను పారిపోయానంటూ వస్తున్న వార్తలు ఊహాగానాలేనని కొఠారీ చెప్పినట్లు స్థానిక మీడియాలో వార్తలొచ్చాయి. 'నేను కాన్పూర్ వాసిని.. ఇక్కడే ఉంటాను. వ్యాపార అవసరాల కోసం అవసరమైనప్పుడు విదేశాలకు వెళ్లి వస్తుంటా' అని కొఠారీ పేర్కొన్నారు. మరోవైపు అలహాబాద్ బ్యాంకు మేనేజరు రాజేశ్ గుప్తా మాట్లాడుతూ.. కొఠారీ ఆస్తుల్ని అమ్మడం ద్వారా డబ్బును రాబట్టుకోగలమనే నమ్మకం ఉందన్నారు. గతేడాది బ్యాంక్ ఆఫ్ బరోడా.. రొటొమ్యాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను 'ఉద్దేశపూర్వక ఎగవేతదారు'(విల్‌ఫుల్ డిఫాల్టర్)గా ప్రకటించింది. తమను 'విల్‌ఫుల్ డిఫాల్టర్' జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఆ కంపెనీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించింది. రూ. 300 కోట్లకు పైగా ఆస్తుల్ని ఇచ్చేందుకు సిద్ధమైనా రొటొమ్యాక్‌ను 'విల్‌ఫుల్ డిఫాల్టర్'గా తప్పుగా ప్రకటించారని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీబీ భోస్లే, జస్టిస్ యశ్వంత్ వర్మ ధర్మాసనం పేర్కొంది. రిజర్వ్ బ్యాంకు నిర్దేశించిన ప్రమాణాల మేరకు రొటొమ్యాక్‌ను విల్‌ఫుల్ డిఫాల్టర్‌గా ప్రకటిస్తూ ఫిబ్రవరి 27, 2017న ఆదేశాలు జారీ అయ్యాయి.



ఆదివారం భార్యాపిల్లలతో కలసి ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను సందర్శించిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో. ఆ తరువాత మథురలో వైల్డ్‌లైఫ్ ఎస్‌ఓఎస్ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ఏనుగుల సంరక్షణ కేంద్రానికి వెళ్లి వారి సేవలను కొనియాడారు. అక్కడి ఏనుగులకు ఆహారం తినిపించారు.

మేఘాలయలో తీవ్రవాదుల దాడి

ఎన్‌సీపీ అభ్యర్థి మృతి

షిల్లాంగ్: త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న మేఘాలయలో ఆదివారం తీవ్రవాదులు దాడి చేశారు. ఈ దాడిలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) విలియమ్ నగర్ నియోజకవర్గ అభ్యర్థి జొనాథన్ సంగ్మాతోపాటు ఆయన సెక్యూరిటీ సిబ్బంది ఇద్దరు మృతి చెందారు. తూర్పు గరో జిల్లాలో జరిగిన ఈ ఘటనలో తీవ్రవాదులు తొలుత పేలుడు జరిపి అనంతరం సంగ్మా వాహన శ్రేణిపై కాల్పులకు దిగారు. మేఘాలయ శాసనసభలో ఉన్న మొత్తం 60 స్థానాలకు ఈ నెల 27న పోలింగ్ జరగనుండటం తెలిసిందే. మేఘాలయ ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా మృతులకు సంతాపం తెలిపారు.

భూటాన్‌లో రావత్, దోవల్ రహస్య పర్యటన

న్యూఢిల్లీ: ఈ నెల మొదటి వారంలో ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్, విదేశాంగ శాఖ కార్యదర్శి విజయ్ గోఖలే, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ భూటాన్‌లో రహస్యంగా పర్యటించిన సంగతి ఆలస్యంగా వెలుగుచూసింది. వారు భూటాన్ అధికారులతో డోక్లాంలో భద్రతా పరిస్థితి, చైనా నిర్మిస్తున్న రక్షణ మౌలిక వసతులపై చర్చించినట్లు తెలిసింది. డోక్లాం చుట్టుపక్కలా పెరుగుతున్న చైనా ఆర్మీ ప్రాబల్యం, రక్షణలో భారత్, భూటాన్‌ల మధ్య సహకారాన్ని సమీక్షించారు. ఫిబ్రవరి 6–7 తేదీల్లో ఈ పర్యటన జరిగిందని, సానుకూల ఫలితాలు వెలువడ్డాయని ప్రభుత్వ విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇరు దేశాలు రక్షణ రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై కూడా చర్చించినట్లు పేర్కొన్నాయి. భారత్, చైనాల మధ్య డోక్లాం ప్రతిష్టంభన తరువాత భూటాన్‌లో మన ఉన్నతాధికారులు పర్యటించడం ఇదే తొలిసారి. అంతకు మూడు రోజుల ముందు ప్రధాని మోదీ భూటాన్ ప్రధానితో గువాహటిలో సమావేశవడం గమనార్హం.

రజనీకాంత్‌తో కమల్‌హాసన్ భేటీ



సాక్షి, చెన్నై: ప్రముఖ సినీనటులు రజనీకాంత్, కమల్ హాసన్ చెన్నైలో భేటీ అయ్యారు. పోయెస్ గార్డెన్‌లోని రజనీ నివాసానికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లిన కమల్.. ఈ నెల 21న మదురైలో పార్టీ ప్రకటన కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. గంటసేపు భేటీ తర్వాత వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. తామిద్దరం మంచి మిత్రులమనీ, ఏ కార్యక్రమం చేపట్టినా పరస్పరం తెలియజేసుకుంటామని కమల్ చెప్పారు. రాజకీయ కార్యాచరణపై రజనీ తనను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేసినట్లు వెల్లడించారు. సినిమాల తరహాలోనే రాజకీయాల్లో కూడా తామిద్దరి దారులు వేర్వేరని వ్యాఖ్యానించారు. ఆదివారం రాత్రి చెన్నై గోపాలపురంలోని నివాసంలో కరుణానిధిని కలిసిన కమల్, ఆయన ఆశీస్సులు అందుకున్నారు.

పాక్ గగనతలంపై వెళ్లినందుకు 2.86 లక్షలు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ రష్యా, అఫ్గానిస్తాన్, ఇరాన్, ఖతార్ సహా పలుదేశాలకు పాక్ మీదుగా వెళ్లినందుకు ఆ దేశానికి కేంద్రం రూ.2.86 లక్షలు చెల్లించినట్లు సమాచారహక్కు(ఆర్టీఐ) చట్టం కింద వెల్లడైంది. తమ గగనతలాన్ని వాడుకున్నందుకు ఈ మొత్తాన్ని నేవిగేషన్ చార్జీల కింద పాకిస్తాన్ వసూలుచేసినట్లు పాక్‌లోని భారత హైకమిషన్ కార్యాలయం తెలిపింది. నేవీ మాజీ అధికారి లోకేశ్ బత్రా దాఖలుచేసిన ఆర్టీఐ పిటిషన్‌కు కమిషన్ ఈ మేరకు జవాబిచ్చింది. రష్యా, అఫ్గానిస్తాన్ పర్యటనల నుంచి స్వదేశానికి తిరిగివస్తూ పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ పుట్టినరోజు వేడుకల కోసం మోదీ లాహోర్‌లో దిగిన సంగతి తెలిసిందే. ఇందుకోసం పాకిస్తాన్ రూ.1.49 లక్షలు వసూలుచేసిందని తెలిపింది. 2016లో మోదీ ఇరాన్ పర్యటనకు రూ.77,215, ఖతార్ పర్యటనకు రూ.59,215 లను పాక్‌కు చెల్లించినట్లు వెల్లడించింది.

ముంబైకి రెండో విమానాశ్రయం

శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

- 21 ఏళ్ల తర్వాత మోక్షం.. రూ. 16,700 కోట్ల వ్యయం
- విమానయాన రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నాం: మోదీ

నవీ ముంబై/ సాక్షి, ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైలో రెండో అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం శంకుస్థాపన చేశారు. అలాగే దేశంలోనే అతి పెద్ద నౌకాశ్రయమైన జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ (జేఎన్‌పీటీ)లోని నాలుగో టర్మినల్‌లో మొదటి దశను మోదీ ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. ప్రస్తుతం దేశంలోనే అత్యంత రద్దీ కలిగిన (ఒకటే రన్‌వే ఉన్న వాటిలో) ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంపై భారాన్ని తగ్గించేందుకు ఈ కొత్త విమానాశ్రయాన్ని అందుబాటులోకి తేనున్నారు. నవీ ముంబైలో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదన 1997 నుంచి ఉండగా శంకుస్థాపన చేసేందుకు 21 ఏళ్లు పట్టడం గమనార్హం. రూ.16,700 కోట్లతో ఈ ఎయిర్‌పోర్టును జీవీకే గ్రూప్, సిడ్కో (ముంబై నగర పారిశ్రామికాభివృద్ధి సంస్థ) కలిసి నిర్మించనున్నాయి. 2019 చివరి నాటికి తొలిదశ పూర్తయి విమానాల రాకపోకలు ప్రారంభమవుతాయని సిడ్కో చెబుతున్నప్పటికీ, కనీసం ఐదేళ్లు పడుతుందని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా అనడం గమనార్హం. మొత్తం నాలుగు దశల్లో 2031 నాటికి విమానాశ్రయ నిర్మాణం పూర్తికానుంది.

వృద్ధి అవకాశాలను గుర్తించనే లేదు..

విమానాశ్రయానికి శంకుస్థాపన సందర్భంగా మోదీ మాట్లాడుతూ దేశంలో విమానయాన రంగం రోజురోజుకూ వృద్ధి చెందుతున్నా, అందుకు తగ్గట్లు మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవన్నారు. విమానయాన రంగంలో వృద్ధికి ఉన్న అపారమైన అవకాశాలను గత ప్రభుత్వం గుర్తించలేదనీ, తాము ఆ పని చేసి ఇందుకోసం కొత్త విధానాన్ని సైతం తీసుకొచ్చామని మోదీ పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం 450 విమానాలు అందుబాటులో ఉండగా, గత ఏడాది కాలంలోనే 900 కొత్త విమానాలకు కంపెనీలు ఆర్డర్లు ఇవ్వడమే ఈ రంగంలో ప్రగతికి నిదర్శనమన్నారు. కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కారీ, మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు, సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, జీవీకే గ్రూప్ చైర్మన్ వెంకట కృష్ణా రెడ్డి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా, శివసేన మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించలేదంటూ ఆ పార్టీ ఎమ్మెల్యే మనోహర్ భోయిర్ నిరసనకు యత్నించగా పోలీసులు అరెస్టు చేశారు.


విమానాశ్రయం శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి గడ్కారీ, మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు, సీఎం ఫడ్నవీస్

50 శాతం పెరిగిన పోర్టు సామర్థ్యం

జేఎన్‌పీటీలో నాలుగో టర్మినల్ మొదటి దశ ప్రారంభమవడంతో నౌకాశ్రయం సామర్థ్యం 50 శాతం పెరిగింది. ఇప్పటివరకు జేఎన్‌పీటీకి 4.8 మిలియన్ల కంటెయినర్లను నిర్వహించే సామర్థ్యం ఉండగా తాజాగా ఆ సంఖ్య 7.2 మిలియన్ కంటెయినర్లకు చేరింది.

మా బడ్జెట్ ఫలితాలనూ సాధిస్తుంది..

'మా బడ్జెట్ కేవలం ఖర్చు పెట్టడమే కాకుండా ఫలితాలను రాబట్టడంపైనా దృష్టి పెట్టింది. మేం తీసుకొచ్చిన సంస్కరణలు దేశ సామాజిక, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేస్తున్నాయి' అని మోదీ అన్నారు. ముంబైలోని బాంద్రాలో 'మ్యాగ్నటిక్ మహారాష్ట్ర' ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర దేశంలోనే మొదటి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్నారు.

త్రిపురలో 76% పోలింగ్

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

అగర్తలా/న్యూఢిల్లీ: త్రిపురలో ఆదివారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సుమారు 76% పోలింగ్ నమోదైందని, 25.73 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల సంఘం తెలిపింది. మొత్తం 60 శాసనసభా స్థానాలకు గాను 59 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. చరిలాం నియోజకవర్గం అభ్యర్థి రామేంద్ర నారాయణ్ దేబ్ ఆకస్మిక మృతితో అక్కడ ఎన్నికలు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించటంతో పోలింగ్‌కు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 91.82% పోలింగ్ నమోదైందని డిప్యూటీ ఎన్నికల కమిషనర్ సుదీప్ జైన్ వెల్లడించారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత కూడా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి కనిపించారనీ, ఓటింగ్ శాతం పెరిగే అవకాశాలున్నాయనీ చెప్పారు. పోలింగ్ బందోబస్తు కోసం 300 కంపెనీల భద్రతా బలగాలను వినియోగించారు. నాలుగు పర్యాయాలుగా అధికారంలో కొనసాగుతున్న సీపీఎం ఈసారి బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది.

కుప్పకూలిన విమానం

ఇరాన్‌లో 66 మంది మృతి

టెహ్రాన్: ఇరాన్‌లో ఆదివారం ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. అసెమన్ ఎయిర్‌లైన్స్ విమానయాన సంస్థకు చెందిన ఈపీ3704 విమానం జాగ్రోస్ పర్వతాల్లో కూలిపోయింది. అందులోని మొత్తం 66 మందీ చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. రాజధాని టెహ్రాన్ నుంచి యాసుజ్ పట్టణానికి ఓ చిన్నారి సహా 60 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో విమానం వెళ్తుండగా దుర్ఘటన జరిగింది. రెండు ఏటీఆర్–72 ఇంజిన్లు కలిగిన ఈ విమానం స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8 గంటలకు బయలుదేరిన 45 నిమిషాల తర్వాత రాడార్‌తో సంబంధాలు తెగిపోయాయని అధికారులు తెలిపారు. జాగ్రోస్ పర్వతాల్లో భారీగా మంచు కురుస్తుండటంతో అత్యవసర సహాయక బృందాలు ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయన్నారు. దుర్ఘటనపై విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ ఆదేశించారు.


విమానాశ్రయం సమీపంలో రోదిస్తున్న మృతుల బంధువులు

అమెరికా ఆంక్షలతోనే దుర్ఘటనలు..

అసెమన్ సంస్థకు ప్రస్తుతం 36 విమానాలు ఉండగా వాటిలో మూడు ఏటీఆర్–72 రకం ఇంజిన్లతో పనిచేస్తున్నాయి. ఈ ఇంజిన్లు 1990ల్లో తయారైనవి. ఇదే సంస్థకు ఉన్న బోయింగ్ 727–200 రకం విమానాలు 1979 నాటివి. ఇరాన్ సంస్థలు విమానాలను ఆధునీకరించుకోలేకపోవడానికి ప్రధాన కారణం అమెరికా ఆంక్షలు. అయితే 2015లో అమెరికా సహా ఇతర ప్రపంచ దేశాలతో ఇరాన్ కుదుర్చుకున్న అణు ఒప్పందంతో కొత్త విమానాలు, ఇంజిన్‌లను కొనుగోలు చేసే అవకాశం లభించింది. దీంతో అసెమన్ సంస్థ ఇప్పటికే విమానాల కొనుగోలు ప్రక్రియను ప్రారంభించింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

మల్కన్‌గిరి / చింతూరు (రంపచోడవరం) / చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఆదివారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య భీకర కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ పౌరుడితో పాటు ఇద్దరు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. సుక్మా జిల్లా భెజ్జి పోలీస్‌స్టేషన్ పరిధిలో చింతగుఫ–భెజ్జి రహదారి పనులు చేయిస్తున్న సూపర్‌వైజర్ అనిల్‌కుమార్‌ను మావోలు ఆదివారం కాల్చిచంపడంతో పాటు 12 వాహనాలను దహనం చేశారు. అక్కడ పనిచేస్తున్న 30 మంది కూలీలను తమవెంట తీసుకెళ్లారు. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్తున్న భద్రతా దళాలే లక్ష్యంగా ఎలమగూడెం ప్రాంతంలో మావోలు మందుపాతర పేల్చటం తోపాటు కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఓ పౌరుడితో పాటు జిల్లా రిజర్వ్ గార్డ్స్‌కు చెందిన జవాన్లు మడ్కమ్ హందా, ముకేశ్ కడ్తీ ప్రాణాలు కోల్పోగా, ఆరుగురు జవాన్లు గాయపడ్డారు. అయితే, కూలీల జాడ తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

ప్రజాస్వామ్యమే బీజేపీ ఆయుధం

- పార్టీ కేంద్ర కార్యాలయ ప్రారంభోత్సవంలో మోదీ
- ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ ఆఫీసు: అమిత్‌షా

న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీతోపాటు మాతృసంస్థ జనసంఘ్ ఎల్లప్పుడూ జాతి హితమే లక్ష్యంగా ఉద్యమాలు సాగించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. పార్టీ విజయానికి ప్రజాస్వామ్య విలువలే కారణమన్నారు. ఆదివారం ఢిల్లీలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ మార్గ్‌లో నిర్మించిన పార్టీ నూతన కేంద్ర కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. 1951లో భారతీయ జనసంఘ్ స్థాపించిన నాటి నుంచి ఆశయ సాధనే లక్ష్యంగా సాగుతోందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని అటల్ బిహారీ వాజ్‌పేయి విజయవంతంగా నడిపారన్నారు. ప్రాంతీయ పార్టీల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుంటూ, దేశ ప్రజల్లో కొత్త ఆశలను ఆయన నింపారని కొనియాడారు. ప్రజాస్వామ్యం మన రక్తంలోనే ఉందన్నారు. కార్యకర్తలే పార్టీకి ఆత్మవంటి వారని పేర్కొన్నారు. ఏడాదిన్నరలోనే మూడంతస్తుల పార్టీ కార్యాలయాన్ని నిర్మించేందుకు కృషి చేసిన అమిత్‌షాను, ఆయన బృందాన్ని ప్రధాని మెచ్చుకున్నారు.


బీజేపీ నూతన కార్యాలయంలో ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా

అతి పెద్ద కార్యాలయం: అమిత్‌షా

దాదాపు 1.70 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న పార్టీ కొత్త కార్యాలయం ప్రపంచంలోనే అతి పెద్దది అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తెలిపారు. కొత్త కార్యాలయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విశాలమైన సోషల్ మీడియా ఆఫీసు, అన్ని రాష్ట్రాల పార్టీ కార్యాలయాలతో ఆన్‌లైన్ అనుసంధానత ఉందన్నారు. దేశంలోని మొత్తం 694 జిల్లాలకు గాను 635 జిల్లాల్లో ఏడాదిలోగా పార్టీ సొంత కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అగ్రనేతలు ఎల్‌కే అద్వాణీ, మురళీ మనోహర్ జోషి, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కారీ తోపాటు కేంద్ర మంత్రులు, నేతలు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాజధానిలోని ల్యూటెన్స్ ప్రాంతం నుంచి పార్టీ కార్యాలయాన్ని బయటకు తరలించిన మొదటి జాతీయ పార్టీ బీజేపీయే. దీంతో ల్యూటెన్స్ జోన్‌లోని నివాస ప్రాంతాల్లో దశాబ్దాలుగా కార్యకలాపాలు నెరపుతున్న పార్టీలపై ఒత్తిడి పెరిగినట్లయింది.

రష్యా చర్చిలో కాల్పులు

ఐదుగురి మృతి

మాస్కో: రష్యాలోని దగెస్తాన్ ప్రాంతంలోని కిజ్‌లయార్ పట్టణంలో ఆదివారం ఓ చర్చిలో ఇస్లాం ఉగ్రవాది జరిపిన కాల్పుల్లో ఐదుగురు మహిళలు మృతిచెందారు. ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. ఆ తరువాత పోలీసులు నిందితుడిని హతమార్చారు. ప్రార్థన చేస్తున్న క్రైస్తవులపై గుర్తుతెలియని దుండగుడు కాల్పులకు తెగబడ్డాడని, నలుగురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందగా మరో మహిళ ఆసుపత్రిలో కన్ను మూసినట్లు అంతర్గత భద్రతా మంత్రిత్వ శాఖ పేర్కొంది. దుండగుడి వయసు 20–30 ఏళ్ల మధ్య ఉంటుందని, అతడు స్థానికుడేనని ఇంటర్‌ఫాక్స్ వార్తా సంస్థ వెల్లడించింది. 'అల్లాహు అక్బర్' అని నినదిస్తూ గడ్డంతో ఉన్న వ్యక్తి రైఫిల్, కత్తితో చర్చిలోకి చొచ్చుకొచ్చి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ఫాదర్ పావెల్ చెప్పారు. చెచెన్యాకు సరిహద్దుగా ఉన్న దగెస్తాన్ రష్యాలోని కల్లోలిత ప్రాంతాల్లో ఒకటి.

అరటి గెల..అదిరేలా



ఐరాల: సాధారణంగా అరటి గెల అడుగున్నర నుంచి 4 అడుగుల లోపే ఉంటుంది. కానీ, చిత్తూరు జిల్లా ఐరాల మండలం చుక్కావారి పల్లెకు చెందిన రైతు బాలకృష్ణ పెరటిలో సాగు చేస్తున్న అరటి చెట్టు అత్యధికంగా ఎనిమిది అడుగుల వరకు ఎత్తు పెరిగి 56 గుత్తులతో సుమారు 820 కాయలు కాసింది. చుట్టుపక్కల నుంచి రైతులు పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చి రైతువద్ద అరటి పిలకలు తీసుకెళుతున్నారు. ఈ అరటి పిలకలను కేరళలోని గురువాయూరు నుంచి తీసుకొచ్చినట్లు బాలకృష్ణ తెలిపారు. సేంద్రియ ఎరువులు వినియోగించడం ద్వారా ఈ మేరకు దిగుబడి వచ్చినట్లు చెప్పారు.

వంశధారలో వింతచేప




గార: శ్రీకాకుళం జిల్లాలో వంశధార నది బంగాళా ఖాతంలో కలిసే చోట పోర్టు కళింగపట్నానికి చెందిన మత్స్యకారులకు ఆదివారం ఓ వింత చేప దొరికింది. అచ్చు పాములా కనిపిస్తున్న ఈ చేప ఆరు అడుగుల పొడవు ఉంది. బీచ్‌కు వచ్చిన సందర్శకులు ఈ చేపను చూసి ఆశ్చర్యపోయారు. ఈ చేపను 'ఈల్స్' అని పిలుస్తారని, ఇది అరుదుగా దొరుకుతుందని మత్స్యకారులు తెలిపారు.

కనుల పండువగా అభిషేకోత్సవం

బాహుబలి సేవకు నేడు ప్రధాని రాక

మైసూరు (శ్రవణబెళగోళ): కర్ణాటకలోని హాసన్ జిల్లా శ్రావణ బెళగోళలోని వింధ్యగిరిపై వైరాగ్యమూర్తి బాహుబలి అభిషేకోత్సవం కనుల పండువగా సాగింది. మహామస్తకాభిషేకాలు ఆదివారం 9వ రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహాభిషేకాలు శనివారం జరగడం తెలిసిందే. ఆదివారం కూడా పవిత్ర ద్రవ్యాలతో 57 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని జైనమునులు, భక్తులు ఆనందోత్సాహాలతో అభిషేకించారు. ఆదివారం 1,008 కలశాలతో 21 సుగంధ ద్రవ్యాలతో ఇవి జరిగాయి. శ్రావణ బెళగోళ మఠాధీశుడు చారుకీర్తి భట్టారక కీర్తి స్వామీజీ, సద్గురు జగ్గి వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు. బాహుబలి పుణ్యస్నానాన్ని వీక్షించడానికి విచ్చేసిన వేలాది భక్తులతో వింధ్యగిరి కిటకిటలాడింది. కొండపైకి ఎక్కలేనివారికి డోలీలు సాయపడుతున్నాయి. సోమవారం ప్రధాని నరేంద్రమోదీ అభిషేకాల్లో పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు వింధ్యగిరి పర్వతానికి చేరుకోనున్న ప్రధాని.. బాహుబలికి అభిషేకం చేస్తారు. మైసూరులో జరిగే మైసూరు– బెంగళూరు జంట రైలుమార్గం ప్రారంభోత్సవంలోనూ ఆయన పాల్గొంటారు.



పెరుగుతో బాహుబలికి అభిషేకం

వైభవంగా వసంతోత్సవం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫాల్గుణ శుద్ధ చవితిరోజైన ఆదివారం ఉదయం వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. రాత్రి ఘనంగా ధ్వజావరోహణం కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం ఉదయం కేడిగం వాహనంపై, రాత్రి సింహాసనం –కామధేను వాహనాలపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు జరిగింది.



స్వామి, అమ్మవార్లకు వసంతోత్సవం

ముందుగా ఉత్సవమూర్తులకు జరిపిన వసంతోత్సవం భక్తకోటికి నేత్రానందాన్ని కలిగించింది. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని జ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కందమూర్తి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా సన్నిధి వీధిలోని వసంతమండపం వద్దకు తీసుకువచ్చారు. ఉత్సవమూర్తులతో పాటు ఉమాదేవి సమేత చంద్రశేఖరస్వామి కొలువుదీరిన త్రిశూలానికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం దేవస్థానంలోని సూర్యపుష్కరిణి వద్ద ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు, త్రిశూలానికి స్నానాలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించి యాగశాలలోని కలశాలలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఊరేగింపు చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగన్ ప్రజా సంకల్పయాత్ర

- పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పశ్చిమ గోదావరి జిల్లా జగన్నాథపురంలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ




జగన్నాథపురంలోవైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన పెద్దిరెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు

భీమవరం: అధికార టీడీపీ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను తీవ్రంగా మోసగించిందని, అందువల్లే ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేపట్టారని చిత్తూరు జిల్లా పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలం జగన్నాథపురంలో చెల్లుబోయిన కృపారావు కుమారులు రాజు బ్రదర్స్ ఏర్పాటు చేసిన దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆదివారం రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకుని ఇప్పటికే ప్రకటించిన నవరత్నాలతోపాటు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందిస్తారని వెల్లడించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయకూడదనే ఉద్దేశంతోనే గత ఎన్నికల్లో జగన్ అమలు చేయలేని హామీలివ్వలేదని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే, భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త గ్రంధి శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ సభలో పార్టీ నేతలు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ముదునూరి ప్రసాదరాజు, మేకా శేషుబాబు, వంకా రవీంద్రనాథ్, గుణ్ణం నాగబాబు, కారుమూరి నాగేశ్వరరావు, కవురు శ్రీనివాస్, పీవీఎల్ నర్సింహరాజు, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజీపడ్డారు.. విద్యార్థుల సొమ్ము మింగేశారు!

- ట్యాబ్‌ల పంపిణీలో ఖజానాకు రూ.60 లక్షల మేర గండి
- ప్రైవేట్ సంస్థతో కుమ్మక్కై కేసును అటకెక్కించిన అధికారులు
- సర్వశిక్ష అభియాన్ నిధులు కాంట్రాక్టర్లకు ధారాదత్తం

సాక్షి, అమరావతి



పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్

పేదపిల్లల విద్యాభివృద్ధి కోసం సర్వశిక్ష అభియాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు కాంట్రాక్టర్ల జేబుల్లోకి చేరుతున్నాయి. హెడ్మాస్టర్లకు, ఇతర అధికారులకు ట్యాబ్‌లు(ట్యాబ్లెట్ పీసీలు) పంపిణీ వ్యవహారంలో రూ.60 లక్షల మేర గోల్‌మాల్ జరిగింది. దీనిపై రెండేళ్ల క్రితం పెట్టిన కేసు నీరుగారి పోతున్నా ఉన్నతాధికారులు నోరెత్తడం లేదు.

అసలేం జరిగింది?

ట్యాబ్‌ల పంపిణీకి ఎలాంటి టెండర్లు పిలవకుండానే హైదరాబాద్‌లోని చంద్రహాస్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థకు కాంట్రాక్టు కట్టబెట్టారు. ఈ సంస్థ ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు ట్యాబ్‌లను పంపిణీ చేయాలి. ట్యాబ్‌లను అన్ని జిల్లాలకు అందించాల్సిన బాధ్యత ఆ సంస్థదే. అందుకయ్యే రవాణా చార్జీలను చంద్రహాస్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెల్లించేలా అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ సంస్థ 'లెనోవా ట్యాబ్ 2ఏ7–30' అనే మోడల్ ట్యాబ్‌లను పంపిణీ చేసింది. 10 వేల ట్యాబ్‌లను ఒకొక్క దానికి రూ.7,100 చొప్పున ప్రభుత్వం నుంచి వసూలు చేసింది. వీటిని అన్ని జిల్లాలకు పంపిణీ చేయాల్సి ఉండగా, విజయవాడలో కృష్ణా జిల్లా సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారికి అప్పగించి చేతులు దులుపుకుంది. అప్పటికే ఆ సంస్థకు అధికారులు రూ.6.39 కోట్లు చెల్లించేశారు.

ప్రభుత్వ పెద్దలకు కమీషన్లు

ట్యాబ్‌ల పంపిణీలో ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ తరువాత రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రస్తుత ఎస్పీడీ జి.శ్రీనివాస్ ట్యాబ్‌ల పంపిణీలో ఫిర్యాదులపై ప్రాథమికంగా సంస్థాగత విచారణ చేయించారు. ట్యాబ్‌లపై ఉన్న ఎంఆర్‌పీ ధరపై స్టిక్కర్లు అతికించినట్లు, కొన్నింటిని కనిపించకుండా చేసినట్లు గుర్తించారు. ట్యాబ్‌ల వాస్తవ ధర రూ.6,500 ఉండగా, దాన్ని రూ.7100కు పెంచి స్టిక్కర్లు అతికించారని తేల్చారు. వాస్తవానికి వేలల్లో ట్యాబ్‌లు కొంటున్నందున ఎంఆర్‌పీ కంటే చాలా తక్కువ ధరకే కంపెనీలు అందిస్తాయి. కానీ, చంద్రహాస్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ పంపిణీ చేసిన ట్యాబ్‌ల ధర తగ్గకపోగా, అదనంగా రూ.600 చొప్పున ఒక్కో ట్యాబ్‌పై పెంచేసింది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు రూ.60 లక్షల మేర గండిపడిందని అప్పట్లో సర్వశిక్ష అభియాన్ తేల్చింది. ఈ సొమ్ము ప్రభుత్వ పెద్దలకే కమీషన్ల రూపంలో అందినట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వాన్ని మోసం చేసిన చంద్రహాస్ సంస్థపై కృష్ణా జిల్లా చిలకలపూడి పోలీసు స్టేషన్‌లో కేసు దాఖలు చేయించారు. ఎఫ్ఐఆర్ దాఖలై రెండేళ్లయినా ఆ కేసులో ఇప్పటికీ విచారణ పూర్తికాలేదు. ఇరువర్గాలు రాజీపడడం వల్లనే కేసును కోర్టుకు అప్పగించలేదని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

మూలకు చేరిన ట్యాబ్‌లు

చంద్రహాస్ సంస్థ పంపిణీ చేసిన ట్యాబ్‌లలో అత్యధికం మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలాయి. చాలా జిల్లాల్లో పాడైన ట్యాబ్‌లను మరమ్మతు చేయించలేదు. పల్స్ సర్వేను ప్రభుత్వం చేపట్టినప్పుడు ఆయా జిల్లాల కలెక్టర్లు రెవెన్యూ శాఖకు కొన్ని ట్యాబ్‌లను అప్పగించారు. తరువాత అవి వెనక్కు రాలేదు. ఫలితంగా పిల్లలకు సంబంధించిన సొమ్ము మొత్తం హారతి కర్పూరంలా కరిగిపోయింది.

రైతు చేతిలో చిరుత హతం



మృతిచెందిన చిరుత



రామమూర్తి

క్రిష్ణగిరి (సూళగిరి): ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రాణాలకే ముప్పు.. ఇక వెనకడుగు వేయకూడని పరిస్థితుల్లో తెగించాడో రైతు. ఏకంగా చిరుతపులితో హోరాహోరీగా పోరాడి దాన్ని హతమార్చిన ఘటన కర్ణాటక– తమిళనాడు సరిహద్దు జిల్లా క్రిష్ణగిరిలోని మహారాజగడ సమీపంలోని మేలుపల్లి గ్రామం వద్ద జరిగింది. గ్రామానికి చెందిన రామమూర్తి (62) అనే రైతు ఆదివారం ఉదయం పశువులను మేతకు తీసుకెళ్లిన సమయంలో అటవీ ప్రాంతం నుంచి ఓ చిరుతపులి అతడిపై దాడి చేసింది. పులిని చూసి భయపడకుండా అతడు దానితో హోరాహోరీగా తలపడ్డాడు. ఈ క్రమంలో తన చేతిలో ఉన్న వేటకొడవలితో చిరుత తలపై కొట్టడంతో అది అక్కడికక్కడే చనిపోయింది. ఈ ఘటనలో స్వల్ప గాయాలైన అతన్ని స్థానికులు క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అటవీ శాఖాధికారులు రామమూర్తిని విచారించగా, తన ప్రాణాలను కాపాడుకొనేందుకు చిరుతపై దాడి చేయవలసి వచ్చిందని చెప్పాడు.

అగ్నికి ఆహుతైన 200 గొర్రె పిల్లలు

రూ.5 లక్షల మేర ఆస్తినష్టం • వైఎస్సార్ జిల్లాలో ఘటన



కాలి బూడిదైన గొర్రె పిల్లలు

వేంపల్లె: వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలం కత్తలూరు గ్రామ పొలాల్లో 200 గొర్రె పిల్లలు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లింది. దీంతో గొర్రెల కాపరులు రోడ్డున పడ్డారు. ఆదివారం సాయంత్రం ఈ విషాదం చోటుచేసుకుంది. బాధితులు, ఎస్ఐ చలపతి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె మండలం కత్తలూరు గ్రామ పొలాల్లో ఎలంకూరి చిన్న అంకాల్ అనే రైతు ఆదివారం తన పొలంలో ఉన్న పత్తి కట్టెకు నిప్పు పెట్టి ఇంటికెళ్లాడు. ఈ మంటలు పక్కనే ఉన్న గొర్రెల దొడ్డికి వ్యాపించాయి. దీంతో గొర్రెల దొడ్డిలో ఉన్న చిన్న గంగన్న, సి.గంగన్న, ఆదిమూలం గంగన్న, మొలకాని సిద్ధయ్య, ఆదిమూలం సిద్ధయ్యలకు చెందిన దాదాపు 200 గొర్రె పిల్లలు కాలి బూడిదయ్యాయి. ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఈ దారుణం చోటుచేసుకుంది. సుమారు రూ.5 లక్షల మేర నష్టం జరిగిందని గొర్రెల కాపరులు వాపోయారు. తమకు జీవనాధారమైన గొర్రెల పిల్లలు చనిపోవడంతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ చలపతి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ప్రియుడి ఇంటిముందు బాలింత నిరసన

ప్రేమ పేరుతో వంచించిన నిందితుడు



నిందితుడి ఇంటి ముందు నిరసన తెలుపుతున్న బాధిత యువతి, కుటుంబ సభ్యులు

పాత పోస్టాఫీసు (విశాఖ దక్షిణ): ప్రేమించానంటూ వెంటపడి మాయమాటలతో గర్భవతిని చేసిన ప్రియుడి ఇంటి ముందు పదిరోజుల బిడ్డతో ఒక యువతి తన తల్లిదండ్రులు, బంధువులతో కలిసి ఆదివారం నిరసన చేపట్టింది. బాధితుల కథనం మేరకు.. నగరంలోని చిలకపేటకు చెందిన బొంది చిన అప్పారావు, దేవుడమ్మల కుమార్తె బొంది దేవి (19)ని అదే ప్రాంతానికి చెందిన చింతకాయల అయ్యన్న అలియాస్ పార్థు అనే యువకుడు ప్రేమ పేరుతో నమ్మించి గర్భవతిని చేశాడు. ఈనెల 7న దేవి ఆడపిల్లకు జన్మనిచ్చిందని తెలుసుకున్న పార్థు వెంటనే పరారయ్యాడు. దీనిపై ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడ్ని అదుపులోకి తీసుకుని ఈనెల 16న కేసు నమోదు చేశారు. కాగా, అదే రోజు అర్ధరాత్రి రాత్రి 12 గంటలకు పోలీసులు తమ ఇంటికి వచ్చి మోసగించిన యువకుడితో వివాహం చేయిస్తామని నమ్మబలికి తమ కుమార్తెతో ఎఫ్ఐఆర్ కాపీపై సంతకం చేయించారని దేవి తల్లిదండ్రులు చెప్పారు. కేసు నమోదైన తరువాత దేవికి, తనకు ఎటువంటి సంబంధంలేదని నిందితుడు చెప్పడంతో శనివారం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ముందు బాధితురాలు నిరసన చేపట్టింది. ఆ తరువాత నిందితుని ఇంటిముందు ఆందోళనకు దిగారు.

లగేజీ వ్యాన్, బస్సు ఢీ

తొమ్మిది మంది దుర్మరణం • తమిళనాడులో దారుణం



ప్రమాదానికి గురైన బస్సు

కాంచీపురం (తమిళనాడు): తమిళనాడులోని కాంచీపురం జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లగేజీ వ్యాన్, ప్రైవేట్ బస్సు ఢీకొన్న ఘటనలో తొమ్మిది మంది దుర్మరణం పాలయ్యారు. కాంచీపురం జిల్లాలోని తామల్ గ్రామంలో బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వేలూరు జిల్లా అరక్కోణం తాలుకా తిరునైమల్లి, మెట్టుకాళని గ్రామం నుంచి 23 మంది టాటా ఏస్ లగేజీ వ్యాన్‌లో ఆదివారం బయలుదేరారు. మధ్యాహ్నం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై కాంచీపురం సమీపంలోని తామల్ గ్రామం వద్ద వెళుతుండగా ప్రైవేటు బస్సు, లగేజీ వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లగేజీ వ్యాన్‌లో ఉన్న ఏడుగురు మహిళలు, మరొక వ్యక్తి సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందారు. మరో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కాంచీపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరో మహిళ మృతిచెందింది. పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరిని చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

షోర్ టు షోర్ పరిశ్రమ జీఎం అరెస్టు

అచ్యుతాపురం (యలమంచిలి): విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురంలో ఉన్న షోర్ టు షోర్ దుస్తుల తయారీ పరిశ్రమ జనరల్ మేనేజర్‌తో సహా ఆరుగురిపై అత్యాచారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దీనబంధు తెలిపారు. కొంతకాలంగా తనను వేధించడమే కాకుండా బెదిరించి లైంగిక దాడి చేస్తున్నారని అదే పరిశ్రమలో పనిచేస్తున్న జార్ఖండ్ యువతి ఆదివారం జిల్లా ఎస్పీని ఆశ్రయించింది. ఆయన సూచనల మేరకు అచ్యుతాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కంపెనీ జనరల్ మేనేజర్ దిలీప్ పింటో, సహ ఉద్యోగులు శ్యాంసుందర్, వాసుదేవ, బాలుశంకర్, సురేశ్, నరేశ్ తనను మానసికంగా శారీరకంగా హింసించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఎవరికైనా చెబితే వీడియోలున్నాయని బెదిరిస్తున్నారని వివరించింది. పరిశ్రమలో పనిచేస్తున్న ఇతర మహిళలను కూడా లోబరుచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. పోలీసులు కేసు నమోదుచేసి జీఎం దిలీప్ పింటో, ఉద్యోగి శ్యాంసుందర్‌ను అరెస్టు చేశారు. మిగిలినవారు పరారీలో ఉన్నారు.

ముద్రణ రంగాన్ని ఆదుకోవాలి

'ముద్రాపక మహా సమ్మేళనం'లో వక్తలు

సాక్షి, అమరావతి/చినకాకాని (మంగళగిరి టౌన్): ప్రింటింగ్ అండ్ ప్యాకేజింగ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి ముద్రణ రంగాన్ని ఆదుకోవాలని ఏపీ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకాని సమీపంలోని హాయ్‌ల్యాండ్‌లో 'ముద్రాపక మహాసమ్మేళనం' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. విద్యుత్ కేటగిరీ 2 నుంచి 3కు బదలాయించాలని కోరారు. పట్టణ, గ్రామ స్థాయిలోనే కాకుండా నగరాల్లో కూడా ప్రింటింగ్ ప్రెస్‌లు అసంఘటిత రంగంలో ఉన్నాయని, ఆదాయంలో 40 % అద్దెలకే చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



అరవింద్ మార్డికర్‌కు జ్ఞాపికను అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నగరాల్లో ప్రింట్‌పార్క్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం సబ్సిడీలు, ప్రోత్సాహకాలు సరైన సమయంలో ఇస్తే ఇతర దేశాలకు ప్రింటింగ్ ఎగుమతులు చేసి, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించగలుగుతామని తెలిపారు.

బెంగళూరులో చదువు.. వెంటనే పట్టు కొలువు

ఏఐసీటీఈ సర్వేలో వెల్లడి

సాక్షి, బెంగళూరు: దేశంలో అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీలకు కేంద్రంగా ఉన్న బెంగళూరులో చదువుకున్న పట్టభద్రులు కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొందుతున్నారని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఇటీవల నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 'ఇండియా స్కిల్స్–2018' పేరుతో ఏఐసీటీఈ ఈ సర్వే నిర్వహించింది. ఇందులో గ్రాడ్యుయేషన్ చదువులో నాణ్యత, కంపెనీల నియామకాల్లో బెంగళూరు విద్యార్థులు ముందంజలో ఉన్నట్లు తేలింది. చెన్నై, ఇండోర్, లక్నో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 2017లో పలు కంపెనీలు చేసిన నియామకాలతో పోలిస్తే ఈ ఏడాది 10 నుంచి 15 శాతం ఎక్కువగా బెంగళూరు నుంచి గ్రాడ్యుయేట్లను ఉద్యోగాలకు ఎంచుకున్నాయి. అత్యధిక ఉపాధి అవకాశాలు ఉన్న తొలి 10 రాష్ట్రాల్లో కర్ణాటక నాలుగో స్థానంలో నిలిచింది.

కంప్యూటర్ సైన్స్, ఐటీకి డిమాండ్

దేశవ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది విద్యార్థులు, 120కి పైగా కార్పొరేట్ కంపెనీల నుంచి సమాచారం సేకరించి సర్వే నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్, ఐటీ కోర్సులు చేసిన గ్రాడ్యుయేట్లను కంపెనీలు ఎగరేసుకుపోతున్నాయి. వీరిలో ప్రతి ముగ్గురు గ్రాడ్యుయేట్లలో ఒకరికి వెంటనే ఉద్యోగం వస్తోందని తేలింది. మొత్తం 52 శాతం మంది తాజా గ్రాడ్యుయేట్లు చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొందుతున్నట్లు సర్వే పేర్కొంది. మరోవైపు ఎంబీఏ, కామర్స్, ఐటీఐ ఉత్తీర్ణులకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని వివరించింది. సివిల్ ఇంజనీరింగ్ పట్టభద్రుల వైపు చాలా తక్కువమంది ఆసక్తి చూపుతున్నారని తెలిపింది.

అన్యాయం ఇప్పుడు గుర్తొచ్చిందా బాబూ?

- ముఖ్యమంత్రిపై వైఎస్సార్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ ధ్వజం
- టీడీపీ, బీజేపీ కుమ్మక్కై రాష్ట్రాన్ని మోసం చేశాయని మండిపాటు



విలేకరులతో మాట్లాడుతున్న బొత్స, చిత్రంలో పార్టీ నేతలు అమర్‌నాథ్, తైనాల, విజయప్రసాద్, వంశీకృష్ణ తదితరులు

విశాఖ సిటీ: కేంద్ర ప్రభుత్వం వరుసగా నాలుగుసార్లు బడ్జెట్‌లు ప్రవేశపెట్టి రాష్ట్రానికి అన్యాయం చేసిన తర్వాత మోసపోయామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు తీరిగ్గా గ్రహించారా? అని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. ఆయన ఆదివారం విశాఖపట్నంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. పోరాటాలు తప్పవని చంద్రబాబు వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో నాలుగేళ్లుగా ఏపీకి జరుగుతున్న అన్యాయంపై సీఎం ఒక్కసారైనా మాట్లాడి ఉంటే అర్థం ఉండేదని చెప్పారు. టీడీపీ, బీజేపీ కుమ్మక్కై విభజన హామీలను నెరవేర్చకుండా, అరకొర కేటాయింపులతో కాలయాపన చేస్తుండడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. ఆ రెండు పార్టీ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతిసారి ప్రతిపక్షంగా వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేపడితే టీడీపీ నేతలు ఏం చేశారని బొత్స ప్రశ్నించారు.

సీఎం సన్నాయి నొక్కులే

దేశంలో ఏ రాష్ట్రానికీ ఇవ్వనంతగా కేంద్ర ప్రభుత్వం ఏపీకి సాయం చేసిందని గతంలో చెప్పిన చంద్రబాబు ఇప్పుడు మాట మార్చారని బొత్స విమర్శించారు. ప్రజాగ్రహాన్ని చూసి యూ టర్న్ తీసుకున్నారన్న విషయం ప్రతి ఒక్కరికీ అర్థమైందన్నారు. ఇప్పుడు కూడా కేవలం సన్నాయి నొక్కులు నొక్కుతున్నారే తప్ప పోరాట కార్యాచరణ ప్రకటించకపోవడం చూస్తుంటే మరో డ్రామాకు టీడీపీ తెర తీసినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చామని చెబుతున్న నిధుల లెక్కలను ఎందుకు బయటపెట్టడం లేదో టీడీపీ ప్రభుత్వం చెప్పాలన్నారు.

మంత్రి నారాయణకు నిబంధనలు తెలుసా?

ఎన్నికల కోసమే వైఎస్సార్‌సీపీ ఎంపీలు రాజీనామాల డ్రామా ఆడుతున్నామని మంత్రి నారాయణ చేసిన వ్యాఖ్యలను బొత్స ఖండించారు. రాజ్యాంగం, చట్టం గురించి తెలియకుండా దొడ్డిదారిన రాజకీయాల్లోకి వచ్చి మంత్రి అయిన నారాయణకు ఎన్నికల నిబంధనలు తెలుసా? అని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న టీడీపీ మంత్రులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. చిత్తశుద్ధితో జగన్ నాయకత్వంలో జరుగుతున్న పోరాటానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని కోరారు. కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలన్న పవన్ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామన్నారు. మీడియా సమావేశంలో పార్టీ నేతలు మళ్ల విజయప్రసాద్, తైనాల విజయ్‌కుమార్, గుడివాడ అమర్‌నాథ్, వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, పసుపులేటి ఉషాకిరణ్, సనపల చంద్రమౌళి, సత్తి రామకృష్ణారెడ్డి, కోలా గురువులు, బొడ్డేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధనే లక్ష్యం

బలిజల వనభోజన మహోత్సవంలో నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి

మదనపల్లె : రాష్ట్రంలో 28 శాతం జనాభా ఉన్నప్పటికీ బలిజలు నేటికీ రాజ్యాదికారం సాధించే దిశగా అడుగులు వేయలేకపోతున్నారని, భవిష్యత్తులో దానిని సాధించడమే లక్ష్యంగా ఐక్యతతో పని చేద్దామని పలువురు నేతలు పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా మదనపల్లె బలిజ సేవా సమితి ఆధ్వర్యంలో తంగాల వేణుగోపాల్ సహకారంతో స్థానిక బెంగళూరు రోడ్డులోని జవుకుపల్లె తోపులో బలిజల వన భోజన ఆత్మీయ కలయిక నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు అంబటి రాంబాబు, మాజీ ఎంపీ సాయిప్రతాప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి. హనుమంతరావు, జనసేన రాష్ట్ర నేత పసుపులేటి హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా నేత జంగాలపల్లె శ్రీనివాసులు హాజరయ్యారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ, అన్ని పార్టీల్లోనూ బలిజలు ఉన్నారని, ఎవరు ఏ పార్టీలో ఉన్నా బలిజలకు అన్యాయం జరిగితే గొంతెత్తాల్సిందేనన్నారు. బలిజలు బలీయమైన కులమైనప్పటికీ ఐక్యతలేని కారణంగా స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి అణగారిపోతున్న కులంగా ఉండాల్సి వస్తోందన్నారు. వ్యక్తుల మధ్య ఎన్ని విభేదాలున్నా సమయం వచ్చినప్పుడు ఒకేతాటిపైకి వచ్చి అధికారం చేజిక్కించుకునే ఇతర కులాలను బలిజలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వనభోజన మహోత్సవానికి ముందు బలిజ కులస్తులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఉత్తరాది మఠం భూ బాగోతంపై కలవరం

- టీడీపీ నాయకుల్లో అలజడి
- ఆన్‌లైన్ రికార్డుల్లో భూముల నంబర్లు మాయం
- సమగ్ర విచారణకు వైఎస్సార్‌సీపీ డిమాండ్



తొండంగి మండలం అగ్రహారంలో కబ్జాకు గురైన ఉత్తరాది మఠం భూములు

తుని: తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలంలో ఉత్తరాది మఠం భూముల కబ్జా వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికార పార్టీ నాయకుల్లో కలవరం మొదలైంది. ఓ మంత్రి అండదండలతో సాగిన ఈ భూదందాపై 'సాక్షి' ప్రధాన సంచికలో 'మఠం భూముల్లో బేతాళులు' శీర్షికన వచ్చిన కథనం, అటు బాధిత రైతులు చేసిన ఆందోళనలతో టీడీపీ వర్గాల్లో, అధికారుల్లోనూ కలవరం మొదలైంది. ఈ నేపథ్యంలో నిన్నటివరకూ ఆన్‌లైన్‌లో ఉన్న భూముల వివరాలు ఆదివారానికి మటుమాయం చేశారు. గుంటూరు శ్రీరామచంద్ర స్వామి ఉత్తరాది మఠానికి పిఠాపురం సంస్థానం 17వ శతాబ్దంలో తొండంగి మండలం పి.అగ్రహారం పంచాయతీ పరిధిలో 410 ఎకరాల భూమిని దానం చేసింది. ఈ భూమిని మఠం నిర్వాహకులు రైతులకు కౌలుకు ఇచ్చారు. అధికార పార్టీ నాయకులు బినామీ పేర్లతో సుమారు 100 ఎకరాలను కబ్జా చేశారు. మరో 150 ఎకరాలను కూడా ఇతరుల పేర్లతో మార్పు చేసినట్టు తెలుస్తోంది. సిద్ధా ముత్యాలు, అతని భార్య గంగాభవాని, అచ్చమ్మ, యడ్ల బేతాళుడు, సోదరుడు శ్రీనివాస్, గెద్దం శ్రీకాంత్ తదితరుల పేర్లతో సర్వే నంబర్లు 33/13, 33/24, 33/29, 33/34, 33/48, 33/52, 33/59/1లలో సుమారు 80 ఎకరాల భూమి ఉంది. దీనిపై బాధిత రైతులు శనివారం ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో సిద్ధా ముత్యాలు, గంగాభవాని పేరిట ఉన్న భూముల సర్వే నంబర్లను ఆన్‌లైన్ రికార్డుల నుంచి రెవెన్యూ అధికారులు తొలగించారు. అచ్చమ్మ పేరిట ఉన్న భూముల వివరాల దగ్గర 'అన్‌నోన్' పేరుతో పెట్టారు. భూముల మార్పులో పాత్ర ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. దీంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కాగా, ఈ భూములను ఆన్‌లైన్‌లో మార్పు చేసిన తహసీల్దార్ ఇప్పటికే ఉద్యోగ విరమణ చేశారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



సెజ్, సీలింగ్, దేవాదయ శాఖ, మఠం భూములను బినామీల పేర్లతో ఆర్థిక మంత్రి అనుచరులు స్వాహా చేశారు. ఉత్తరాది మఠానికి చెందిన 410 ఎకరాల్లో సుమారు 300 ఎకరాల రికార్డులను గోల్‌మాల్ చేశారు. మార్కెట్ ధర ప్రకారం వీటి విలువ రూ.75 కోట్లు ఉంటుంది. భారీస్థాయిలో అక్రమాలకు పాల్పడుతున్నా అధికారుల్లో చలనంలేదు. రైతులకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ చేసి, కబ్జాకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.

– దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే, తుని

నేడు 'చలో విజయవాడ' నిర్వహించి తీరుతాం

ఏపీ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): బెదిరింపులు, నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక చైర్మన్ పి.కాశీమధుబాబు అన్నారు. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సమానపనికి సమాన వేతనం తదిదర సమస్యలపై సోమవారం 'చలో విజయవాడ' కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో కార్మికులను నిర్బంధిస్తున్నారని ధ్వజమెత్తారు. చిత్తూరు, అనంతపురం, విజయనగరంతోపాటు ప్రకాశం జిల్లాకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులను అధికారులు, పోలీసులు అడ్డుకుంటున్నారని చెప్పారు. సోమవారం ఉదయం 10.00 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి ధర్నాచౌక్ వరకు చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు. కాగా, ఎన్నికల సమయంలో చంద్రబాబు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మత్స్యకారుల బడ్డీలు దగ్ధం

- విశాఖలో రోడ్డున పడ్డ మత్స్యకార కుటుంబాలు
- రూ.25 లక్షల మేర ఆస్తి నష్టం



ఫిషింగ్ హార్బర్ వద్ద దగ్ధమైపోతున్న బడ్డీలు

పాత పోస్టాఫీసు (విశాఖ దక్షిణ): విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో మత్స్యకారుల బడ్డీలు దగ్ధమయ్యాయి. దీంతో వాటిల్లో ఉన్న విలువైన సాగాగ్రి పూర్తిగా కాలిపోయింది. ఇక్కడ గాంధీ విగ్రహం వెనుక ఉన్న స్థలంలో మత్స్యకారులు తమ సామగ్రిని భద్రపరుచుకునేందుకు సుమారు 40 బడ్డీలు ఏర్పాటు చేసుకున్నారు. చేపల వేటకు వినియోగించే ఖరీదైన వలలు, ఇంజన్లు, తెడ్లు, మరమ్మతులకు వినియోగించే పరికరాలు, ఇంజన్ ఆయిల్, ఇలా అనేక రకాల పరికరాలను బడ్డీల్లో భద్రపరుచుకుంటారు. వీటిల్లో రూ.80 నుంచి రూ.90 వేల వరకు విలువైన వస్తువులు ఉంటాయని అంచనా. కాగా, రూ.25 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని మత్స్యకారులు చెబుతున్నారు. అగ్నిమాపక శకటాలు సంఘటనా స్థలాన్ని చేరుకునే సరికే చాలావరకూ బడ్డీలు కాలిపోయాయి. బడ్డీలు కాలిపోయి సర్వం కోల్పోయిన మత్స్యకారులు కన్నీరుమున్నీరుగా విలిపిస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

టీడీపీ ఎంపీలు రాజీనామాకు సిద్ధపడాలి

వైఎస్సార్‌సీపీ విప్ పీఆర్కే



మాచర్ల: రాష్ట్ర ప్రయోజనాలను నాలుగు సంవత్సరాలు మరచిపోయిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తానని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన గుంటూరు జిల్లా మాచర్ల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పార్టీ ఎంపీలతో రాజీనామా చేయిస్తానని ప్రకటించిన తరువాత రోజుకొక ప్రకటనతో అధికార పార్టీ నాయకులు మభ్యపెడుతున్నారని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు టీడీపీ ఎంపీలు కూడా రాజీనామాకు సిద్ధపడాలన్నారు. రాజీనామాలు చేసినా ప్రయోజనం లేదని, కేంద్ర ప్రభుత్వాన్ని రోజూ బతిమలాడుకుందామకునే ధోరణి వలన సాధించేది ఏమీ ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయ్యాకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీలతో రాజీనామాకు సిద్ధపడ్డారన్నారు. ఇది ప్రత్యేక హోదా కోసం చిత్తశుద్ధితో వ్యవహరించే కార్యక్రమం అని, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలకాలని పీఆర్కే కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే న్యాయం జరుగుతుందని, రోజుకొక మాటతో కాలం గడిపే నాయకుల వలన రాష్ట్రానికి ప్రయోజనమేమీలేదని గుర్తించాలని ఆయన కోరారు.

'ఇన్నర్' కోసం 3,556 ఎకరాలు సమీకరణ

- 42 గ్రామాల పరిధిలో రెండు దశల్లో నిర్మాణం
- కృష్ణానదిపై చోడవరం, హర్చిశ్చంద్రపురం వద్ద బ్రిడ్జిలు
- కొండపల్లి వద్ద 8 కి.మీ. మేర సొరంగ మార్గం

సాక్షి, అమరావతి

రాజధాని అమరావతి చుట్టూ ప్రతిపాదించిన ఇన్నర్ రింగు రోడ్డు నిర్మాణానికి అవసరమైన 3,556.17 ఎకరాల భూమిని రైతుల నుంచి సమీకరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని 42 గ్రామాల పరిధిలో ఈ భూమిని సమీకరించనున్నారు. రాజధాని కోసం 34 వేల ఎకరాలను సమీకరించిన విధంగానే ఇన్నర్ రింగు రోడ్డు కోసం కూడా తీసుకోనున్నారు. రింగు రోడ్డు నిర్మించిన తర్వాత రైతుల వాటాగా అభివృద్ధి చెందిన ప్లాట్లను వారికి తిరిగి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూసేకరణ ద్వారా అయితే రైతులకు భారీగా డబ్బు ఖర్చు చేయాల్సి వుండడం, అంత మొత్తం సమీకరించే పరిస్థితి ప్రభుత్వానికి లేకపోవడంతో ఈ ప్రాజెక్టును కూడా భూసమీకరణ ద్వారానే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇన్నర్ రింగు రోడ్డు కోసం 2,195.87 ఎకరాలు, రాజధానిలోని 27 రోడ్లను ఇన్నర్ రింగు రోడ్డుకు అనుసంధానించేందుకు 1360.30 ఎకరాలు అవసరమని తేల్చారు. 11.11 కిలోమీటర్లు మేర ఎటువంటి ప్రణాళిక లేక ప్రాంతం నుంచి తీసుకోవాల్సి వుంది. మొత్తం 3,556.17 ఎకరాలను సమీకరించి 75 మీటర్ల వెడల్పు, 96.16 కిలోమీటర్ల మేర ఇన్నర్ రింగు రోడ్డును నిర్మించనున్నారు.



రాజధానిలో ప్రతిపాధిత ఇన్నర్ రింగ్ రోడ్డు మ్యాప్

ఈ గ్రామాల మీదుగా..

గుంటూరు జిల్లాలోని అనంతవరం, చినకాకాని, చినవడ్లపూడి, ఎంద్రాయి, హరిశ్చంద్రపురం, కంతేరు, కర్లపూడి, కాజ, మోతడక, నూతక్కి, పెదపరిమి, పెదవడ్లపూడి, రామచంద్రాపురం, తాడికొండ, తుమ్మపూడి, వడ్డమాను గ్రామాల మీదుగా ఈ రోడ్డు నిర్మించనున్నారు. కృష్ణా జిల్లా పరిధిలోని చోడవరం, దాములూరు, దోనెఆత్కూరు, గంగూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కవులూరు, కేతనకొండ, కొండపల్లి, కొండపల్లి ఫారెస్ట్, కొటికలపూడి, కొత్తూరు, నవిపోతవరం, నిడమానూరు, నున్న, పాతపాడు, పెనమలూరు, పోరంకి, సావారిగూడెం, కే.తాడేపల్లి, త్రిలోచనపురం, వెదురుపావులూరు, వెలగలేరు, వైకుంఠపురం, జామి, మాచవరం గ్రామాల్లో రోడ్డు నిర్మించడానికి ప్రణాళిక రూపొందించారు.

రెండు దశల్లో నిర్మాణం

ఇన్నర్ రింగు రోడ్డును రెండు దశలుగా విభజించి నిర్మించనున్నారు. మొదటి దశలో.. హైదరాబాద్ రూటులోని 65 నెంబరు జాతీయ రహదారి వద్ద ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ నుంచి మొదలై కృష్ణా నది మీదుగా రాజధాని నగరం, కాజ, చోడవరం, పోరంకి, పెనమలూరు, నిడమానూరు, కొత్తూరు తాడేపల్లి వద్ద నున్న బైపాస్ రోడ్డు వరకూ 68.08 కిలోమీటర్లు నిర్మించనున్నారు. రెండో దశలో నున్న బైపాస్ రోడ్డు నుంచి మళ్లీ కేతనకొండ వరకూ మిగిలిన 28.08 కిలోమీటర్లు నిర్మించనున్నారు. ఈ దశ మొత్తం అటవీ ప్రాంతం గుండా నిర్మించనున్నారు. కొండపల్లి పరిధిలోని అటవీ ప్రాంతం, కొండలు కావడంతో దీన్ని రెండో దశలో చేర్చారు. ఈ కొండల ప్రాంతంలోనే ఇన్నర్ రింగు రోడ్డు 8 కిలోమీటర్ల సొరంగ మార్గం ఉంటుంది. మరోవైపు.. ఇన్నర్ రోడ్డులో భాగంగా కృష్ణా నదిపైన చోడవరం –రామచంద్రా పురం,కొటికలపూడి–హరిశ్చంద్రపురం బ్రిడ్జిలు నిర్మించడానికి ప్రణాళిక రూపొందించారు. ఇటీవలే ఇన్నర్ రింగు రోడ్డు నిర్మాణానికి నోటిఫికేషన్ కూడా జారీచేసిన సీఆర్‌డీఏ.. అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు విధించింది. ఆ తర్వాత వెంటనే రైతులు, యజమానుల నుంచి భూమిని సమీకరించేందుకు సిద్ధమవుతుంది.

మూడో భాగస్వామ్య సదస్సులో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు

మంత్రి యనమల రామకృష్ణుడు

సాక్షి, అమరావతి/పెదవాల్తేరు (విశాఖతూర్పు): విశాఖలో ఈనెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్న మూడో పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో 300 ఎంవోయూల ద్వారా రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. విశాఖ కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సదస్సులో 40 దేశాల ప్రతినిధులు, 15 దేశాల మంత్రులు పాల్గొంటారని చెప్పారు. గత రెండు సదస్సుల్లో 876 ఎంవోయూల ద్వారా 11లక్షల10వేల కోట్లు పెట్టుబడులు రాగా, 22 లక్షల మందికి ఉపాధి లభించిందని తెలిపారు. సదస్సు రోజున విశాఖలో తలపెట్టిన ధర్నా విరమించుకోవాలని వామపక్షాలకు విజ్ఞప్తి చేశారు. విశాఖ బీచ్‌రోడ్డులో లూలూ సంస్థకు భూ కేటాయింపులపై మీడియా ప్రశ్నించగా నిబంధనల ప్రకారమే కేటాయింపులు జరిగాయన్నారు.

బీజేపీకి మాయసభలా కనిపిస్తోందా..?

రాజధాని అమరావతిని మయసభతో పోల్చి మాట్లాడటం బీజేపీ నేతలకు తగదని యనమల అన్నారు. చారిత్రాత్మక స్థలంలో నిర్మిస్తున్న చారిత్రాత్మక రాజధాని బీజేపీ నేతలకు మయసభ లాగా కనిపిస్తోందా..?అని ప్రశ్నించారు. ఏపీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్‌దేనని ఆరోపించారు. రెండు సార్లు తనను రాజ్యసభకు పంపిన రాష్ట్రానికి జైరామ్ రమేష్ తీరని అన్యాయం చేశారన్నారు.

నిజనిర్ధారణ కమిటీతో ప్రయోజనం లేదు

- ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి
- ప్రజల ప్రయోజనాలతో టీడీపీ, బీజేపీ చెలగాటమాడుతున్నాయి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న జోగి రమేశ్

మైలవరం: పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన ఫ్యాక్ట్స్ ఫైండింగ్ కమిటీతో ఎటువంటి ప్రయోజనంలేదని, అదోక ఫార్స్ ఫ్యాక్ట్ కమిటీ అని ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వివిఆర్ కృష్ణంరాజు విమర్శించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు టీడీపీ నేతలు పవన్‌ను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా మైలవరంలో అఖిలపక్ష నాయకులు, మేధావులు, విద్యావేత్తలతో 'ప్రత్యేక హోదా – రాష్ట్ర ప్రయోజనాలు – రాజకీయ పార్టీల వైఖరి' అంశంపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక హోదాను పక్కదోవ పట్టించాలని చూసే రాజకీయ పార్టీలను ప్రజలు క్షమించరని అన్నారు. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యయనంలో తెలుగు దేశం పార్టీకి చెందిన సుమారు 750 మంది నాయకులకు రూ.100 కోట్ల నుంచి రూ.4500 కోట్లు వరకు ఆస్తులు ఉన్నట్లు తేలిందని, వారిలో పది శాతం మంది అమరావతిలో పెట్టుబడులు పెట్టినా రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగేదని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా పోరులో భాగంగా తమ పార్టీ పార్లమెంట్ సభ్యులు స్పీకర్ ఫార్మెట్‌లోనే రాజీనామా చేయనున్నారని, టీడీపీకి ఆ ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. నాడు లంచాల కోసమే ప్యాకేజీని అంగీకరించారని, కేంద్రం నిధులు విడుదలపై కఠినంగా వ్యవహరించడంతో ఇప్పుడు నాటకాలాడుతున్నారని ఎదేవా చేశారు. బెటర్ ఏపీ అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి, జనవాహిణి పార్టీ జాతీయ అధ్యక్షుడు డీఎస్ఎన్‌వీ ప్రసాదబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి, సీపీఐ నాయకుడు బుడ్డి రమేష్, సీపీఎం నాయకుడు మహ్మద్ జానీ, విద్యావేత్త పి.వెంకట్‌తో పాటు పలువురు వక్తలు మాట్లాడారు.

ప్రజాస్వామ్య విధానాలకు ప్రభుత్వాలు దూరం

- తెలుగు రక్షణకు న్యాయవాదులు ఉద్యమించాలి
- హైకోర్టు న్యాయమూర్తి ఎ.రామలింగేశ్వరరావు



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ రామలింగేశ్వరరావు

విజయవాడ లీగల్: ప్రభుత్వాలు ప్రజాస్వామ్య విధానాలకు దూరమవుతున్నాయని హైకోర్టు న్యాయమూర్తి ఎ.రామ లింగేశ్వరరావు అన్నారు. 'న్యాయస్థానాల్లో తెలుగు వినియోగం కోసం ఉద్యమ సమాలోచన' అంశంపై విజయవాడ సివిల్ కోర్టుల ప్రాంగణంలో ఆదివారం సదసస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో తెలుగు రక్షణకు న్యాయవాదులు ముందుండి ఉద్యమాన్ని నడిపించాలని సూచించారు. ప్రభుత్వ విధానం తెలుగులో లేకపోతే కోర్టుల్లో తీర్పులు మాతృభాషలో ఎలా వస్తాయని ప్రశ్నించారు. ప్రభుత్వం అనుకూలంగా ఉంటేనే తెలుగులో న్యాయ పరిపాలన జరుగుతుందన్నారు.

పరభాషలు మాతృ భాష తరువాతే

విదేశీ భాష ఎంత వాడుకలోఉన్నా మాతృ భాషను మించి ప్రాచుర్యం పొందలేదని విశ్రాంత జడ్జి మంగారి రాజేందర్ అన్నారు. భాషను అభివృద్ధి చేయడానికి కవులు, పండితులు అక్కర్లేదని, పాలకుల్లో పట్టుదల ఉంటే చాలని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.లక్ష్మణరావు మాట్లాడుతూ అమ్మను మర్చిపోతే జన్మకు సార్థకత లేదన్నారు. తెలుగు భాష అభివృద్ధిని కోరడమంటే అమ్మకు అన్నం పెట్టండి అని అడగటమేనని ఆవేదన వ్యక్తంచేశారు. బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు భాషను ప్రేమించాలని బ్రిటీష్, నిజాంనవాబుల కాలంలోనే కోర్టులో తీర్పులు తెలుగులో వచ్చాయన్నారు. సమావేశంలో అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు సామల రమేష్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షుడు బి.హనుమారెడ్డి, ఐలు సంఘం నాయకులు సంపర దుర్గాశ్రీనివాసరావు, సి.వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టెట్‌లో పొరపాట్లను సరిదిద్దాలి

- అభ్యర్థుల విన్నపం
- విద్యా శాఖ అధికారుల తప్పులతో ఇబ్బందులు
- టెట్ పరీక్షల సమయంలోనే డీఈడీ, కంప్యూటర్ సర్టిఫికెట్ పరీక్షలు
- నష్టపోతామంటూ ఆందోళన

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రక్రియలో చోటు చేసుకున్న పొరపాట్లను సరిదిద్దాలంటూ వేలాది మంది అభ్యర్థులు అధికారులకు విన్నపాలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు కూడా ఇవి వస్తూనే ఉన్నాయి. టెట్‌కు నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి అధికారుల పొరపాట్లతో అనేక అవాంతరాలు ఎదురైన సంగతి తెలిసిందే. రెండుసార్లు షెడ్యూల్‌లో మార్పులు చేసినా పొరపాట్లు అలాగే కొనసాగుతున్నాయి. ఇటీవల హాల్‌టిక్కెట్ల జారీతో ఇవి మరింత ఎక్కువయ్యాయి. రాష్ట్రంలో కాకుండా చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లను పరీక్ష కేంద్రాలుగా కేటాయించడంతో వేలాది మంది అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. మరోపక్క రాష్ట్రంలో కూడా పరీక్ష కేంద్రాలను సొంత జిల్లాలోనో, పక్క జిల్లాల్లోనో కాకుండా ఎక్కడో వందల కిలోమీటర్ల దూరంలో ఉన్నవాటిని కేటాయించడంతో అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా మహిళలు, దివ్యాంగులకు ఇలాంటి కేంద్రాలు రావడంతో అంత దూరం ఎలా వెళ్లాలో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలను సరిదిద్దే చర్యలను పాఠశాల విద్యా శాఖ చేపట్టినా ఇంకా అనేక వందల మందికి ఇబ్బందులు తప్పేలా లేవు. కేవలం రాష్ట్రేతర కేంద్రాలు పడినవారికి రాష్ట్రంలో పరీక్ష రాసేలా సర్దుబాటు చేస్తున్నారు. ఇలాంటివారు 15,606 మంది ఉండగా వారి సెంటర్లు మారుస్తూ సవరించిన హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్లో పొందుపర్చారు. వాటిని అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. అలాగే సమీప సెంటర్లు మార్పు కోరినవారిలో కొంతమందికి మాత్రమే ఆ అవకాశం ఇచ్చారు. పేపర్లలో మార్పులు, ఇతర సమాచారంలో తప్పులున్నా వాటిలో మార్పులు చేసుకోవడానికి టెట్ అధికారులకు విన్నపాలు అందుతున్నాయి. కాగా, టెట్‌కు 4.46 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 93 శాతం మంది హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని కన్వీనర్ ఎ.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 184 సెంటర్లు ఏర్పాటయ్యాయన్నారు. ఈ నెల 21 నుంచి మార్చి 3 వరకు పరీక్ష జరగనుంది. ఇతర రాష్ట్రాల పరీక్ష కేంద్రాల్లో మార్పులు చేసినవారికి మార్చి 2న సెకండ్ సెషన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. ఇక పేపర్–1, 2లకు కలిపి 8 సెషన్లలో, పేపర్–3 మూడు సెషన్లలో జరగనుంది. టెట్ సమయంలోనే ఇతర పరీక్షలు కూడా ఉండడం అభ్యర్థులకు సమస్యగా మారింది. ఈ పరీక్ష సమయంలోనే సాంకేతిక విద్యాబోర్డు కంప్యూటర్ సర్టిఫికెట్ పరీక్ష నిర్వహిస్తోంది. ఏపీపీఎస్సీతో సహా పలు సంస్థలు పెట్టే పోటీ పరీక్షలకు కంప్యూటర్ సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో అనేకమంది ఈ పరీక్షకు హాజరవుతుంటారు. డీఎడ్ తదితర పరీక్షలు కూడా ఉండడంతో వాటి వల్ల తమకు నష్టం జరగకుండా టెట్ వాయిదా వేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ఎంపీల రాజీనామాలతోనే హోదా సాధ్యం!

- కేంద్రం నుంచి టీడీపీ మంత్రులు వైదొలగాలి
- సీఎం అఖిలపక్షాలను ఢిల్లీకి తీసుకెళ్లాలి
- నాలుగేళ్ల తర్వాత చంద్రబాబు కొత్త నాటకం
- ప్యాకేజీపై బాబు సంతృప్తి చెందారన్న బీజేపీ నేత
- 'హోదా కోసం ఎందాకైనా' చర్చా వేదికలో వక్తలు



విశాఖలో 'సాక్షి' నిర్వహించిన 'హోదా కోసం ఎందాకైనా' చర్చా వేదికలో పాల్గొన్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర కేబినెట్‌లో ఉన్న టీడీపీ మంత్రులు సహా ఎంపీలంతా మూకుమ్మడి రాజీనామాలు చేస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తప్పక సాధ్యమవుతుందని మేధావులు, విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా రాకపోవడానికి సీఎం చంద్రబాబు ద్వంద్వ వైఖరే కారణమని పలువురు దుయ్యబట్టారు. హోదాకంటే ప్యాకేజీయే మిన్న అని నాలుగేళ్లు చెప్పుకొచ్చిన సీఎం ఎన్నికలు సమీపిస్తుండడంతో సరికొత్త నాటకమాడుతున్నారని విమర్శించారు. అఖిలపక్ష నేతలను ఢిల్లీ తీసుకెళ్లి హోదాపై చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తప్ప మరేదీ అంగీకరించబోమని తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రజలకు హోదా బిక్ష కాదని, హక్కు అని గుర్తు చేశారు. ఆదివారం విశాఖలో 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహించిన 'హోదా కోసం ఎందాకైనా' అనే చర్చా వేదిక కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ విశాఖ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, హోదాపై ప్రకటన చేయలేదని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొంతెత్తితే చంద్రబాబు మౌనం దాల్చారని, పైగా హోదా ఒక ముగిసిన అధ్యాయమంటూ ఎద్దేవా చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. హోదా హామీతోనే రాష్ట్ర ప్రజలు టీడీపీ, బీజేపీలను గెలపించారని, కానీ సీఎం హోదా వద్దన్నారని బీజేపీ నేతలు చెబుతున్నారని చెప్పారు. బడ్జెట్ ఆమోదంలో కేబినెట్‌లో ఉన్న టీడీపీ మంత్రులు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. విశాఖకు రైల్వే జోన్‌కోసం విశాఖ ఎంపీ హరిబాబు ఒక్క లేఖ కూడా రాయకపోవడం శోచనీయమన్నారు. మాజీ మంత్రి పి.బాలరాజు మాట్లాడుతూ హోదా కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. యూపీఎస్సీ మాజీ సభ్యుడు, ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ కేఎస్ చలం మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనన్నారు. ఏపీ చాంబరాఫ్ కామర్స్ అధ్యక్షుడు జి.సాంబశివరావు మాట్లాడుతూ విశాఖకు రైల్వే జోన్ కోసం పోరాడినా ఇవ్వకపోవడం తగదన్నారు. బీజేపీ నాయకుడు, న్యాయవాది పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. విభజన హామీల అమలుకు కేంద్రం కట్టుబడి ఉందన్నారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీపై సీఎం చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారని ఆయన స్పష్టం చేశారు. ఐద్వా నగర అధ్యక్షురాలు మాధవి మాట్లాడుతూ హోదా కోసం ఏందాకైనా వెళ్తామని స్పష్టం చేశారు. ఏయూ ప్రొఫెసర్ జాన్ మాట్లాడుతూ విభజన అశాస్త్రీయమని బీజేపీ, టీడీపీ నేతలు చెబుతుండడం సిగ్గుచేటన్నారు. చర్చా వేదికలో ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షుడు ఎస్ఎస్ శివశంకర్, సీపీఎం నగర కార్యదర్శి బి.గంగారావు, సీపీఐ నాయకుడు పైడిరాజు, కాంగ్రెస్ నేత బొలిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త వరుదు కల్యాణి, ఆంధ్ర మహిళా సమాఖ్య నాయకురాలు విమల, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాంతారావు, ఏయూ ప్రొఫెసర్ బ్రహ్మానందం, విద్యార్థి సంఘం నేతలు శ్యాంసుందర్, కాపునాడు జిల్లా అధ్యక్షుడు తోట రాజీవ్ హాజరయ్యారు.

రూ.4 లక్షల కోట్లు కొల్లగొట్టారు

'హోదా కోసం ఎందాకైనా'లో రసవత్తర చర్చ

చర్చా వేదికలో టీడీపీ నేతల భూకుంభకోణంపై రసవత్తర చర్చ జరిగింది. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో రూ.4కోట్ల విలువైన దాదాపు లక్ష ఎకరాల భూ కుంభకోణం జరిగిందని ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ కేఎస్ చలం ఆరోపించారు. మీడియాలో వచ్చిన పలు పరిశోధనాత్మక కథనాల ఆధారంగా తానీ విషయాన్ని చెబుతున్నానని, వాటిని తాను నమ్ముతున్నానని చెప్పారు. ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చాలన్నారు. చలం ఆరోపణలకు చర్చా వేదికలో పాల్గొన్న పలువురు వక్తలు మద్దతు ఇస్తూ మాట్లాడారు. వీటిపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విశాఖలో అధికార పార్టీ అండదండలతో జరిగిన ప్రభుత్వ భూముల కబ్జాపై ఆధారాలతో ఫిర్యాదు చేశామని సీపీఐ నగర కార్యదర్శి పైడిరాజు చెప్పారు.

● తెలంగాణ

మార్చిలో మెట్రో మాల్స్ ప్రారంభం!

అందుబాటులోకి పంజగుట్ట, హైటెక్ సిటీ మాల్స్



సాక్షి, హైదరాబాద్: నగర మెట్రో ప్రాజెక్టులో రవాణా ఆధారిత అభివృద్ధి ప్రాజెక్టు కింద పంజగుట్ట, హైటెక్ సిటీల్లో నిర్మించిన భారీ మెట్రో మాల్స్‌ను మార్చి 1వ తేదీన లాంఛనంగా ప్రారంభించేందుకు నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం పంజగుట్టలోని మెట్రో మాల్‌లో 13 తెరల పీవీఆర్ సినిమాస్, హైటెక్ సిటీ మెట్రో మాల్‌లో 4 తెరల పీవీఆర్ సినిమా హాళ్లు ఇటీవలే ప్రారంభమయ్యాయి. అలాగే ఇతర ఫుడ్ కోర్టులు, బ్రాండెడ్ దుస్తులు, షూజ్, వైద్య సేవలందించే పలు రకాల సంస్థలు మాల్స్ ప్రారంభమైన తర్వాత కార్యకలాపాలు మొదలుపెడతాయని సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆయా సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు సంస్థ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ మాల్స్‌కు జీహెచ్ఎంసీ, అగ్నిమాపక శాఖ నుంచి కొన్ని అనుమతులు రావాల్సి ఉందని తెలిపాయి. ప్రస్తుతం మాల్స్‌లోని పీవీఆర్ సినిమా హాళ్లకు ప్రేక్షకుల రద్దీ అధికంగా ఉందని పేర్కొన్నాయి. మరో 2 నెలల్లో ఎర్రమంజిల్, మూసారాంబాగ్‌ల్లోనూ మెట్రో మాల్స్‌ను ప్రారంభిస్తామని చెప్పాయి. మొత్తంగా 4 చోట్ల కలిపి 18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎల్‌అండ్‌టీ సంస్థ మెట్రో మాల్స్‌ను నిర్మించిన విషయం తెలిసిందే.



ఒక్కటైన అమ్రపాలి, సమీర్ శర్మ

హన్మకొండ అర్బన్: వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ అమ్రపాలి, జమ్మూకు చెందిన ఐపీఎస్ అధికారి సమీర్‌శర్మ ఒక్కటయ్యారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జమ్మూలో బంధుమిత్రుల సమక్షంలో వీరి వివాహం ఘనంగా జరిగింది. ఈ నెల 21 వరకు కలెక్టర్ దంపతులు జమ్మూలోనే ఉంటారు. ఈ నెల 22న హైదరాబాద్‌కు రానున్నారు. 23న వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రముఖులకు వివాహ విందు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోనూ విందు కార్యక్రమం ఖరారైంది. ఈ నెల 26 నుంచి మార్చి 7 వరకు ఈ నూతన దంపతులు టర్కీలో పర్యటించనున్నారు.

నేటి నుంచి వరల్డ్ ఐటీ కాంగ్రెస్

హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో 3 రోజుల సదస్సు

సాక్షి, హైదరాబాద్: 'ఐటీ పరిశ్రమ ఒలింపిక్స్'గా ఖ్యాతిగాంచిన ప్రతిష్టాత్మక ప్రపంచ ఐటీ కాంగ్రెస్ మూడు రోజుల సదస్సు భాగ్యనగరం వేదికగా సోమవారం ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న ఈ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభోపన్యాసం చేయనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతోపాటు ప్రముఖ ఐటీ కంపెనీల సీఈఓలు ప్రసంగించనున్నారు. వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయెన్స్ (డబ్ల్యూఐటీఎస్ఏ), నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సదస్సును నిర్వహించనున్నాయి. 40 ఏళ్లగల చరిత్రగల ఈ సదస్సును తొలిసారి భారత్‌లో నిర్వహిస్తుండటంతో దీనికి ప్రత్యేకత సంతరించుకుంది. 1978లో తొలిసారి ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు జరగ్గా 22వ సమావేశానికి హైదరాబాద్ వేదిక కావడం విశేషం. ఐటీ రంగ వ్యాపారానికి సంబంధించిన ఆలోచనలు, ఆవిష్కరణలు, వ్యూహాలు, వ్యాపారాలు, భవిష్యత్తు తదితర అంశాలపై మేధోమథనం కోసం ఏటా నాస్కామ్ నిర్వహించే ఇండియా లీడర్‌షిప్ ఫోరం (ఐఎల్ఎఫ్) కార్యక్రమం సైతం ఈ సదస్సుతోపాటే జరగనుంది. ఐఎల్ఎఫ్‌లో అంతర్భాగంగా ప్రపంచ ఐటీ కాంగ్రెస్ నిర్వహణలో నాస్కామ్ భాగస్వామ్యం వహించనుంది.

'పంచ' తంత్రం...

ఐటీ కంపెనీల్లో ఆటోమేషన్ ప్రభావం ఎక్కువ కావడం, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), వర్చువల్ రియాలిటీ (వీఆర్), బ్లాక్‌చైన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఐటీ కంపెనీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇలాంటి పరిణామాలను తట్టుకునేందుకు కంపెనీలకు సంసిద్ధత తప్పనిసరిగా మారింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఐదు ప్రధాన అంశాలపై ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌లో దృష్టిసారించనున్నారు.

30 దేశాల నుంచి ప్రతినిధులు...

ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సుకు 30 దేశాల నుంచి ఐటీ రంగానికి సంబంధించిన 2,000 మంది దార్శనికులు, పరిశ్రమ, ప్రభుత్వాల సారథులు, విద్యావేత్తలు హాజరుకానున్నారు. టాప్ 500 ఐటీ కంపెనీల నుంచి కనీసం 20 మంది సీఈఓలు, మరో 100 మంది ఎగ్జిక్యూటివ్‌లు ఈ భేటీలో పాల్గొననున్నారు. సదస్సులో 50కిపైగా చర్చా గోష్టులు, మరో 50కిపైగా ఐటీ ఉత్పత్తులపై ప్రదర్శన (షోకేస్)లు ఉండనున్నాయి.

సమష్టి కృషితోనే రక్షణ స్వావలంబన

రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు జి.సతీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశంలోని పరిశోధన సంస్థలు, యూనివర్సిటీలు, మిగతా విద్యా సంస్థలు, పారిశ్రామిక రంగం కలసికట్టుగా కృషి చేయడం వల్ల రక్షణ రంగంలో దేశం స్వావలంబన సాధించడం వేగవంతమైందని రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. అత్యాధునిక టెక్నాలజీలతో విమానాల ఉత్పత్తి చేసేందుకు మరింతగా కృషి చేయాలని అన్నారు. భవిష్యత్ వైమానిక, రక్షణ వ్యవస్థల్లో సూక్ష్మస్థాయి, తెలివైన సెన్సార్లు, నావికా వ్యవస్థలు కీలకపాత్ర పోషించనున్నాయని, ఇందుకు తగినట్లుగా మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైన ఐఎఫ్ఏసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ, యుద్ధ విమానాలు, క్షిపణి, క్షిపణి ప్రయోగ వాహనాల్లో రేపటి తరం టెక్నాలజీలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాలన్నారు. డీఆర్‌డీవో డైరెక్టర్ డాక్టర్ క్రిస్టోఫర్ మాట్లాడుతూ, భారత్ పూర్తి స్వదేశీ టెక్నాలజీతో అభివృద్ధి చేసుకున్న తేలికపాటి యుద్ధ విమానం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ సమర్థంగా, నిలకడగా సేవలందిస్తుందని.. కృత్రిమ మేథ ఆధారంగా పనిచేసే అత్యాధునిక వ్యవస్థలను ఇందులో ఏర్పాటు చేయడమే కారణమని తెలిపారు. వైమానిక వ్యవస్థలకు సంబంధించి నియంత్రణ, మార్గదర్శక వ్యవస్థలు ఎంతో కీలకమైనవని.. ఇటీవలి కాలంలో ఈ రంగంలో డీఆర్‌డీవో చేస్తున్న పరిశోధనల వల్ల దేశ రక్షణ వ్యవస్థలు అంతర్జాతీయ స్థాయిని అందుకుంటున్నాయన్నారు.

'టీఎస్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్'లో 2,553 జేఎల్ఎంలు

తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీఎస్ఎన్‌పీడీసీఎల్).. 2,553 జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. పదోతరగతి/తత్సమాన విద్యతోపాటు ఐటీఐ(ఎలక్ట్రికల్/వైర్‌మ్యాన్) లేదా ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో రెండేళ్ల ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులు అర్హులు. వయసు 2018, జనవరి 1 నాటికి 18-35 ఏళ్ల లోపు ఉండాలి. ఫిబ్రవరి 22, 2018 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. చివరి తేదీ మార్చి 19, 2018. దరఖాస్తు రుసుం, రిజర్వేషన్లు తదితర పూర్తి వివరాలకు వెబ్‌సైట్: tsnpdcl.cgg.gov.in



PHYSICAL SCIENCE (EM)

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబర్-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com

ఎగ్జామ్ టిప్స్



నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-నీట్.. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. ఈ సంవత్సరం నుంచి ఆయుష్ కోర్సులకు కూడా నీట్ స్కోర్ తప్పనిసరిగా మారింది. అంతేకాదు.. విదేశీ యూనివర్సిటీల్లో ఎంబీబీఎస్ చేయాలన్నా.. నీట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. తాజాగా నీట్-2018 నోటిఫికేషన్ వెలువడింది. మే 6న దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో నీట్-2018లో విజయానికి నిపుణుల సలహాలు, సూచనలు...

నీట్‌గా నెగ్గుదామిలా..!

ఈ ఏడాది తెలుగు రాష్ట్రాలు సైతం నేషనల్ పూల్‌లోకి చేరాయి. దాంతో తెలుగు విద్యార్థులకు మరిన్ని సీట్లు లభించే అవకాశముంది. అందుకోసం మంచి మార్కులు సాధించడం తప్పనిసరి. 'నీట్‌లో నెగ్గాలంటే.. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 600 నుంచి 700 మార్కులలోపు.. రిజర్వ్‌డ్ కేటగిరీ వర్గాలు 550కు పైగా మార్కులు సాధించాలి. అప్పుడు రాష్ట్రాల్లో అందుబాటులో ఉన్న సీట్లకు, తాజాగా నేషనల్ పూల్ ఫలితంగా జాతీయ స్థాయిలో లభించే 15 శాతం సీట్లు పొందేందుకు అవకాశం లభిస్తుంది' అంటున్నారు సబ్జెక్ట్ నిపుణులు. ఈ మార్కుల శ్రేణిని చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. సైంటిఫిక్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగిస్తే నీట్‌లో మెరుగైన మార్కులు సాధించడం సులభమే అని పేర్కొంటున్నారు.



నీట్-2018 పరీక్ష విధానం

- ఇంటర్మీడియెట్ (బైపీసీ) తత్సమాన కోర్సులో గ్రూప్ సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- డిసెంబర్ 31 నాటికి 17 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు.
- మొత్తం నాలుగు విభాగాల్లో పరీక్ష ఉంటుంది. అవి.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ (బోటనీ+జువాలజీ). ప్రశ్నల సంఖ్య – 180. (ఒక్కో విభాగం నుంచి 45 ప్రశ్నలు). ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు. మొత్తం 720 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- నెగెటివ్ మార్కింగ్ కూడా అమల్లో ఉంది. తప్పు సమాధానానికి ఒక మార్కు కోల్పోతారు.
- **పరీక్ష తేదీ:** మే 6, 2018. వివరాలకు **వెబ్‌సైట్:** **http://cbseneet.nic.in**



ప్రిపరేషన్

బయాలజీ (బోటనీ+జువాలజీ)

- బయాలజీ విభాగంలో ప్రశ్నల కోణంలో గతేడాది ప్రశ్నపత్రాన్ని విశ్లేషిస్తే.. మార్కుల పరంగా సెల్ బయాలజీ (4 ప్రశ్నలు), బయలాజికల్ క్లాసిఫికేషన్ (3 ప్రశ్నలు), ఎకాలజీ (6 ప్రశ్నలు) విభాగాలకు ప్రాధాన్యం లభించింది.
- నీట్‌లో మెరుగైన మార్కుల దిశగా అభ్యర్థులు బయాలజీపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. బయాలజీలోని బోటనీ, జువాలజీ సబ్జెక్టుల నుంచి దాదాపు 45 చొప్పున ప్రశ్నలుంటాయి. బయాలజీపై పట్టు సాధించేందుకు అకాడమీ పుస్తకాల్లోని అంశాలను ఒకటికి రెండుసార్లు సమగ్రంగా అధ్యయనం చేయాలి.
- గత రెండేళ్ల నీట్ ప్రశ్నపత్రాలను విశ్లేషిస్తే.. రెండు సబ్జెక్ట్‌లకు సంబంధించి ఇంటర్మీడియెట్‌లోని ప్రథమ, ద్వితీయ సంవత్సరాల అంశాలకు సమ ప్రాధాన్యం కల్పిస్తూ ప్రశ్నలు అడిగారు. కాబట్టి విద్యార్థులు ఇంటర్మీడియెట్ రెండు సంవత్సరాల సిలబస్‌పై పూర్తిగా పట్టుసాధించేందుకు కృషి చేయాలి.
- హ్యూమన్ ఫిజియాలజీ, మైక్రోబ్స్ ఇన్ హ్యూమన్ ఫిజియాలజీ, హ్యూమన్ ఇన్సులిన్ అండ్ వ్యాక్సిన్ ప్రొడక్షన్, టాక్సానమీ, నెర్వస్ సిస్టమ్, క్లాసిఫికేషన్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఫిజియాలజీ, బయోటెక్నాలజీ అప్లికేషన్స్, ఎకలాజికల్ సక్సెషన్, ఎకలాజికల్/ఎన్విరాన్‌మెంటల్ ఇష్యూస్‌పై పట్టు సాధించాలి.
- డయాగ్రమ్ ఆధారిత ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. చాప్టర్ల వారీగా ముఖ్యమైన అంశాలను తప్పనిసరిగా చదవాలి.
- బయాలజీలోని మార్ఫాలజీ, సిస్టమాటిక్ బోటనీలోని పలు సైంటిఫిక్ పదాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- ప్లాంట్ కింగ్‌డమ్ కూడా విద్యార్థులు దృష్టిపెట్టాల్సిన మరో ముఖ్యమైన అంశం. ఈ చాప్టర్‌లోని అంశాలను గుర్తుంచుకోవడాన్ని విద్యార్థులు క్లిష్టంగా భావిస్తారు. కానీ.. డ్రైల్యాండ్ హేబిటెట్స్‌లో ఇమిడిపోవడానికి గ్రూప్స్‌లో మారుతున్న వేర్వేరు లక్షణాలను గుర్తు చేసుకుంటూ చదివితే సులువుగా ఈ అంశాలపై పట్టు లభిస్తుంది.
- పూర్తిగా ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరమైన హిస్టాలజీ, ఇంటర్నల్ అనాటమీలోని అంశాలను గుర్తు పెట్టుకోవడానికి వేర్వేరు మొక్కల సమూహాల్లో వేస్క్యులర్ ఎలిమెంట్స్ ప్రమేయాన్ని తెలుసుకోవాలి.
- గత పేపర్లను పరిశీలిస్తే.. ఎకాలజీ, జెనెటిక్స్, ఎవాల్యుయేషన్, హ్యూమన్ ఫిజియాలజీ, హ్యూమన్ రీ-ప్రొడక్షన్, రీ ప్రొడక్టివ్ హెల్త్ చాప్టర్లలోని అన్ని అంశాలను ఔపోసన పట్టాలి.
- ఎకాలజీకి సంబంధించి సగటున పది ప్రశ్నలు ఖాయంగా కనిపించింది. బయాటిక్ ఫ్యాక్టర్స్, అడాప్టేషన్స్‌పై పూర్తిస్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి.
- జువాలజీకి సంబంధించిన సామాజిక అవగాహన కూడా అవసరం. జాతీయ జంతువులు, పార్కులు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, వాతావరణ మార్పు వంటి సమకాలీన, సామాజిక సంబంధిత అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. డయాగ్రమ్ ఆధారిత ప్రశ్నలు కూడా అడిగే అవకాశం ఉంది. వీటిపై పట్టు సాధించాలంటే.. ఎన్‌సీఈఆర్‌టీ 11, 12 తరగతుల్లోని జువాలజీ పుస్తకాల్లోని డయాగ్రమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.



రివిజన్‌కు ప్రాధాన్యం

ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయిన తర్వాత నీట్‌కు లభించే సమయంలో కొత్త అంశాల ప్రిపరేషన్ కంటే అప్పటికే పట్టు సాధించిన అంశాల రివిజన్‌కు ప్రాధాన్యమివ్వాలి. ఇలా రివిజన్ సమయంలో అప్పటికే రూపొందించుకున్న షార్ట్‌నోట్స్, డయాగ్రమ్స్‌ను ప్రాక్టీస్ చేయడం ఎంతో ముఖ్యం. అదే విధంగా డయాగ్రమ్స్‌కు సంబంధించి ఒక భాగాన్ని గుర్తించే నైపుణ్యంతోపాటు.. దాని ప్రాధాన్యాన్ని వివరించే సామర్థ్యం కూడా పొందాలి. సదరు డయాగ్రమ్‌కు సంబంధించి సబ్జెక్టు పరంగా ఉన్న అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ఫిజిక్స్, కెమిస్ట్రీ...



- గతేడాది ప్రశ్నపత్రాన్ని పరిశీలిస్తే.. ఫిజిక్స్‌లో మెకానిక్స్ (52 మార్కులు); మోడ్రన్ ఫిజిక్స్ (32 మార్కులు); ఎలక్ట్రో డైనమిక్స్ (40 మార్కులు)కు మార్కుల పరంగా అధిక వెయిటేజీ లభించింది.
- కెమిస్ట్రీలో ఇనార్గానిక్ కెమిస్ట్రీ-1, 2 (64 మార్కులు); ఆర్గానిక్ కెమిస్ట్రీ-1 (12 మార్కులు), ఆర్గానిక్ కెమిస్ట్రీ-2 (52 మార్కులు); ఫిజికల్ కెమిస్ట్రీ-1 (28 మార్కులు), ఫిజికల్ కెమిస్ట్రీ-2 (24 మార్కులు).
- నీట్ అభ్యర్థులు కొంత ఆందోళనకు గురయ్యే సబ్జెక్ట్‌లు ఫిజిక్స్, కెమిస్ట్రీ. ప్రాక్టీస్ బేస్డ్ లెర్నింగ్‌తో ఈ రెండు సబ్జెక్టులపై పట్టు సాధించడం తేలికే. అప్లికేషన్ ఓరియెంటేషన్, కాన్సెప్ట్ బేస్డ్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగించాలి.
- ఫిజిక్స్‌లో ఎలక్ట్రో మ్యాగ్నటిజం, ఏసీ సర్క్యూట్స్, రే ఆప్టిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- కెమిస్ట్రీలో కెమిస్ట్రీ ఇన్ ఎవ్రీ డే లైఫ్, ఈథర్స్-నామెన్‌క్లేచర్, క్లీనింగ్ ఏజెంట్స్, క్లీనింగ్ యాక్షన్స్, బయలాజికల్ ఇంపార్టెన్స్ ఆఫ్ మెగ్నీషియం అండ్ కాల్షియం, ఎస్-బ్లాక్ ఎలిమెంట్స్‌ను ముఖ్య అంశాలుగా భావించి పట్టు సాధించాలి.
- గతేడాది వెయిటేజీలనే నమ్ముకోకుండా.. అన్ని అంశాలను విశ్లేషణాత్మకంగా చదివితే ఈ రెండు విభాగాల్లోనూ ఎలాంటి ప్రశ్నలు ఎదురైనా సమాధానాలివ్వొచ్చు.

తెలుగులోనూ ప్రశ్నపత్రం

తెలుగులోనూ ప్రశ్నపత్రం అందుబాటులో ఉంటుందని పేర్కొనడం ఈసారి నీట్ తెలుగు అభ్యర్థులకు కలిసొస్తుందని చెప్పొచ్చు. దీనివల్ల ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి ప్రయోజనం కలుగుతుంది. బోటనీ, జువాలజీలకు సంబంధించి కొన్ని పదాల విషయంలో ఇంగ్లిష్ పదజాలంపైనా అవగాహన పెంచుకుంటే.. ప్రశ్నపత్రంలో ఏదైనా అనువాద దోషాలు తలెత్తినా సులువుగా అధిగమించే సామర్థ్యం లభిస్తుంది.

నేషనల్ పూల్ ప్రయోజనమే.. కానీ..

ఈ ఏడాది రెండు తెలుగు రాష్ట్రాలు నేషనల్ పూల్‌లోకి వెళ్లాయి. దీనివల్ల మన రాష్ట్రంలోని సీట్లతోపాటు జాతీయ స్థాయిలో దాదాపు నాలుగున్నర వేల సీట్లు అందుబాటులోకి వస్తాయి. కానీ, వీటికి తెలుగు రాష్ట్రాల విద్యార్థులతోపాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా పోటీపడతారు. కాబట్టి ర్యాంకులు, మార్కుల పరంగా ఉన్నతంగా నిలవాల్సి ఉంటుంది. గతేడాది జనరల్ కేటగిరీలో 10 వేల వరకు; రిజర్వ్‌డ్ కేటగిరీల్లో 25 వేల వరకు ర్యాంకుతో నేషనల్ పూల్ సీట్లు లభించాయి.

కనీస ఉత్తీర్ణత తప్పనిసరి

నీట్‌లో ఉత్తీర్ణత, ఆ తర్వాత మెరిట్ జాబితా విడుదల కోణంలో సీబీఎస్ఈ ప్రత్యేకంగా నీట్‌లో అర్హత నిబంధనలు రూపొందించింది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 50 పర్సంటైల్, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 40 పర్సంటైల్ సాధించాలి. అయితే ఆయా వైద్య కళాశాలల్లో ప్రవేశం పొందాలంటే మాత్రం 80 పర్సంటైల్‌కు పైగా జాబితాలో నిలిస్తేనే సాధ్యమవుతుంది.

గమనిక: గతేడాది ఆలిండియా కోటా సీట్ల భర్తీ కోణంలో జనరల్ కేటగిరీలో ఎనిమిది వేల ర్యాంకు వరకు, రిజర్వ్‌డ్ కేటగిరీల్లో 20 వేల ర్యాంకు వరకు సాధించిన అభ్యర్థులకు సీట్లు లభించాయి. తెలుగు రాష్ట్రాల్లో ఫైనల్ మెరిట్ కోణంలో ఎంబీబీఎస్ కోర్సు విషయంలో జనరల్ కేటగిరీ నీట్‌లో అయిదు వేల ర్యాంకుతో సీట్లు భర్తీ అయినట్లు సమాచారం.

ఇన్‌పుట్స్
బి.రాజేంద్ర (బోటనీ),
కె.శ్రీనివాసులు (జువాలజీ),
సీహెచ్.రామకృష్ణ (ఫిజిక్స్), టి.కృష్ణ (కెమిస్ట్రీ).

బులెటిన్ బోర్డ్

ఎన్ఐటీ ఉత్తరాఖండ్‌లో 38 ఖాళీలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఉత్తరాఖండ్ (ఎన్ఐటీ యూకే).. 38 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** ప్రొఫెసర్/అసోసియేట్ ప్రొఫెసర్/అసిస్టెంట్ ప్రొఫెసర్-38. ❖ **వేతనం:** ప్రొఫెసర్-రూ.1,59,600; అసోసియేట్ ప్రొఫెసర్-1,39,600; అసిస్టెంట్ ప్రొఫెసర్-1,01,500.
- **విభాగాలు:** ఇంజనీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, సీఎస్ఈ, ఎంఈ, సీఈ; నాన్ ఇంజనీరింగ్‌లో మ్యాథమెటిక్స్, సోషల్ సైన్సెస్, ఎకనమిక్స్, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను బట్టి పీహెచ్‌డీతోపాటు నిబంధనల మేర అనుభవం. ❖ **ఎంపిక:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.1,000. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 13, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** మార్చి 20, 2018.
- **వెబ్‌సైట్:** **nituk.ac.in**

ఐఐటీ (ఐఎస్ఎం)లో 6 ఖాళీలు

జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ (ఐఎస్ఎం)లో 6 ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టు-ఖాళీలు:** ప్రాజెక్ట్ ఫెలో (పీఎఫ్)/సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)-4; జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-2. ❖ **ఫెలోషిప్ స్టైపెండ్:** పీఎఫ్/ఎస్ఆర్ఎఫ్-రూ.28,000; జేఆర్ఎఫ్-రూ.25,000. ❖ **అర్హతలు:** కెమికల్ ఇంజనీరింగ్/కెమిస్ట్రీ (అప్లైడ్ కెమిస్ట్రీ సహా)/అప్లైడ్ జియాలజీ/తత్సంబంధ విభాగాల్లో బీటెక్/ఎంటెక్/ఎంఎస్సీ/ఎంఎస్సీ టెక్.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **ఎంపిక:** వాకిన్ ఇంటర్వ్యూ.
- **వెబ్‌సైట్:** **www.iitism.ac.ins**

జాగ్రఫీ — నాలెడ్జ్ Bytes

అగ్ని పర్వతాలు..




అగ్ని పర్వతాల ప్రస్తావన ఇప్పుడెందుకు అనుకుంటున్నారా..! ఎందుకంటే... ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మన కళ్లముందే 20 భారీ అగ్నిపర్వతాలు నిత్యం విస్ఫోటనం చెందుతున్నాయి. అంతేకాదు ప్రపంచంలోని ఇలాంటి మొత్తం అగ్నిపర్వతాల్లో దాదాపు 20 శాతానికి పైగా నీటిలోనే ఉన్నాయి. ప్రపంచ అగ్నిపర్వతాల్లో 10 శాతం వరకూ ఒక్క జపాన్‌లోనే ఉండటం విశేషం. సౌర మండలంలోని అగ్నిపర్వతాల్లోకెల్లా అత్యంత ఎత్తైన పర్వతం ఎక్కుడుందో తెలుసా..! భూమి మీదలేదు. మార్స్ గ్రహంపై ఉన్న ఒలంపస్ మోన్స్ అత్యంత ఎత్తైన అగ్నిపర్వతం. భూమిపై ఉన్న అత్యంత ఎత్తైన అగ్నిపర్వతం పేరు హవాయి దీవుల్లోని మౌనా కియా. దీని ఎత్తు 4207 మీటర్లు. ప్రపంచంలో అతిపెద్ద అగ్నిపర్వతం మౌనా లువా. దీని ఎత్తు 4169 మీటర్లు. వల్కనిక్ ఎక్స్‌ప్లోసివిటీ ఇండెక్స్ (వీఈఐ) ఆధారంగా అగ్నిపర్వతాలను వర్గీకరిస్తారు. సూపర్ వల్కానో వీఈఐ 8. సూపర్ వల్కానో ఎలా ఉంటుంది..? దీని విస్ఫోటనం వల్ల ఎలాంటి భారీ నష్టం జరుగుతుంది.. అనే సందేహం వస్తోంది కదా..! కాంపి ఫ్లెగిరె.. ఇది ఇటలీలోని నేపల్స్‌లో ఉన్న అత్యంత వినాశకారి అగ్నిపర్వతం. మరో సూపర్ వల్కానో అమెరికాలోని పశ్చిమ ప్రాంతంలోని యెల్లోస్టోన్. ఇది 2.1 మిలియన్ ఏళ్ల క్రితం తొలిసారిగా విస్ఫోటనం చెందింది. ఈ సూపర్ వల్కానో మళ్లీ బద్దలైతే.. అమెరికాలోని చాలా భాగం నివాసయోగ్యం కాకుండా పోతుందని, అమెరికా నుంచి విమానాల రాకపోకలు శాశ్వతంగా ఆగిపోతాయని, పంటలు పూర్తిగా నాశనమవడం వంటి వైపరీత్యాలు సంభవిస్తాయని నిపుణుల అంచనా!!

నిత్యం చురుగ్గా ఉండే భారీ అగ్ని పర్వతాలు..

1. షివ్‌లుచ్ అగ్నిపర్వతం, రష్యా, ఎత్తు 3307 మీటర్లు, 1999 నుంచి విస్ఫోటనం చెందుతోంది.
2. మౌంట్ ఎట్నా, ఇటలీ, ఎత్తు 3350 మీటర్లు, 2013 నుంచి చురుగ్గా ఉంది.
3. క్రాకటోవా, ఇండోనేషియా, ఎత్తు 813 మీటర్లు, 1994 నుంచి నిత్యం బద్దలవుతోంది.
4. సకురాజిమా, జపాన్, ఎత్తు 1070 మీటర్లు, 1955 నుంచి విస్ఫోటం చెందుతోంది.
5. మౌంట్ నిరాగోంగో, కాంగో, ఎత్తు 3400 మీటర్లు, 2013 నుంచి చురుగ్గా ఉంది.

Quote of the day



The philosophy of the school room in one generation will be the philosophy of government in the next.

- Abraham Lincoln



In Kenya women are the first victims of environmental degradation, because they are the ones who walk for hours looking for water, who fetch firewood, who provide food for their families.

-Wangari Maathai

ప్రవేశాలు

సీయూ సెట్-2018

దేశవ్యాప్తంగా ఉన్న 10 కేంద్రీయ విశ్వవిద్యాలయాలతోపాటు బెంగళూరులోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ (బీఏఎస్ఈ)లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి సెంట్రల్ యూనివర్సిటీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీయూ సెట్-2018)కు ప్రకటన విడుదలైంది. దీన్ని హర్యానా, జమ్మూ, జార్ఖండ్, కర్ణాటక, కశ్మీర్, కేరళ, పంజాబ్, రాజస్థాన్, సౌత్ బిహార్, తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలతోపాటు బెంగళూరులోని బీఏఎస్ఈ సంయుక్తంగా విడుదల చేశాయి.

- **కోర్సులు:** డిగ్రీ, పీజీ, రీసెర్చ్ ప్రోగ్రామ్స్.
- **అర్హతలు:** సంబంధిత కోర్సులను అనుసరించి ఇంటర్/డిగ్రీ/పీజీ.
- **ఎంపిక:** ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (సీయూ సెట్-2018).
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.800; ఎస్సీ/ఎస్టీ-రూ.350; దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** మార్చి 26, 2018.
- **వెబ్‌సైట్:** **www.cucetexam.in**

CUCET
Central Universities Common Entrance Test

టీజీ గురుకుల్ సెట్-2018

'పీజీ టు కేజీ మిషన్'లో భాగంలో తెలంగాణ ప్రభుత్వం వివిధ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2018-19 సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశాలకు 'టీజీ గురుకుల్ సెట్-2018' ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు:** ఐదో తరగతి. ❖ **మాధ్యమం:** ఆంగ్లం.
- **ప్రవేశం కల్పించే పాఠశాలలు:** ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ.
- **అర్హతలు:** ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. అలాగే తల్లిదండ్రుల వార్షిక ఆదాయం.. పట్టణాల్లో నివసిస్తున్నట్లయితే రూ.2,00,000; పల్లెల్లో నివసిస్తున్నట్లయితే రూ.1,50,000కు మించరాదు.
- **వయసు:** 2018, సెప్టెంబర్ 1 నాటికి 9-11 ఏళ్ల లోపు వయసు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గరిష్ఠ వయోపరిమితిలో రెండేళ్ల సడలింపు ఉంటుంది. ❖ **ఎంపిక:** ప్రవేశ పరీక్ష (టీజీ గురుకుల్ సెట్-2018) ద్వారా.
- **దరఖాస్తు రుసుం:** రూ.50.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** మార్చి 16, 2018.
- **వెబ్‌సైట్:** **tgcet.cgg.gov.in**

కాంపిటీటివ్ కౌన్సెలింగ్

ఆర్ఆర్‌బీ గ్రూప్-డీలో విజయం సాధించేందుకు ప్రధానంగా ఏ అంశాలను అధ్యయనం చేయాలి?

- ఎన్.వికాస్, హైదరాబాద్.



ఆర్ఆర్‌బీ గ్రూప్-డీ సిలబస్‌లో మ్యాథమెటిక్స్; జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్; జనరల్ సైన్స్; కరెంట్ అఫైర్స్ అంశాలున్నాయి.

మ్యాథమెటిక్స్

మ్యాథమెటిక్స్ స్కోరింగ్ విభాగమని చెప్పొచ్చు. పదో తరగతి స్థాయిలో సమస్యలుంటాయి. ప్రాక్టీస్ ద్వారా ఈ విభాగంలో మంచి మార్కులు పొందొచ్చు.

■ **వెయిటేజీ అంచనా**

సింప్లిఫికేషన్:7-10మార్కులు; డేటా ఇంటర్‌ప్రెటేషన్: 4-5 మార్కులు; ఆల్జీబ్రా:3-5; పర్సంటేజీలు: 2-3; నంబర్ సిస్టమ్: 2-3; యావరేజెస్: 1-2; రేషియో అండ్ ప్రపోర్షన్: 1-2; మిక్చర్ ప్రాబ్లమ్స్: 1-2; మెన్సురేషన్: 1-2; టైమ్ అండ్ వర్క్: 1-2; స్పీడ్, టైమ్, డిస్టెన్స్: 2-3; ఇంట్రెస్ట్: 1-2; ప్రాఫిట్ అండ్ లాస్: 2-3; నంబర్ సిరీస్: 1-2; జామెట్రీ: 1-2; ట్రిగనోమెట్రీ: 0-1; ప్రాబబిలిటీ: 0-1 మార్కులు.

రీజనింగ్

తార్కిక అవగాహనా స్థాయిని పరీక్షించేలా రీజనింగ్ ప్రశ్నలుంటాయి. వీటికి సరైన సమాధానాలు గుర్తించేందుకు ప్రత్యేక సూత్రాలు ఉండవు. మోడల్ ప్రశ్నల సాధన ద్వారా ఇందులో మంచి మార్కులు పొందొచ్చు. సునిశిత పరిశీల ద్వారా ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించొచ్చు.

■ **వెయిటేజీ అంచనా**

అనాలజీ: 2-3 మార్కులు; సిరీస్: 3-5; కోడింగ్ అండ్ డీకోడింగ్: 1-3; పజిల్స్: 4-5; డైరెక్షన్ అండ్ డిస్టెన్స్: 0-1; బ్లడ్ రిలేషన్స్: 1; ఆల్ఫాబెట్ అండ్ వర్డ్ టెస్ట్: 0-1; వెన్‌డయాగ్రమ్: 2-3; మిస్సింగ్ నంబర్: 1-2; నాన్ వెర్బల్ రీజనింగ్: 1-2; క్లాసిఫికేషన్: 1-2; వెర్బల్ రీజనింగ్: 1-2 మార్కులు.

జనరల్ అవేర్‌నెస్- కరెంట్ అఫైర్స్

ప్రణాళిక ప్రకారం ప్రిపరేషన్ ద్వారా జనరల్ అవేర్‌నెస్-కరెంట్ అఫైర్స్ విభాగంలో ఎక్కువ మార్కులు సాధించొచ్చు. తక్కువ సమయంలోనే ఇందులోని ప్రశ్నలకు తేలిగ్గా సమాధానాలు గుర్తించేందుకు అవకాశముంది. ఈ విభాగం నుంచి దాదాపు 25 ప్రశ్నలు వస్తాయి. ఇందులో సైన్స్ అండ్ టెక్నాలజీ; క్రీడలు, సంస్కృతి, వ్యక్తులు, ఆర్థికరంగం, పాలిటీ, ఇతర ప్రాధాన్య సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి.

■ **వెయిటేజీ అంచనా**

పాలిటీ-3 మార్కులు; జాగ్రఫీ: 4 మార్కులు; హిస్టరీ-4 మార్కులు; ఎకానమీ-4 మార్కులు; ప్రభుత్వ విధానాలు: 2 మార్కులు; స్టాటిక్ జనరల్ నాలెడ్జ్: 10 మార్కులు.

- స్టాటిక్ జీకేలో కరెన్సీలు, రాజధానులు, జాతీయ పార్కులు, నదులు, డ్యాంలు, జలసంధులు, నదుల ఒడ్డున నగరాలు, ప్రధాన కార్యాలయాలు (జాతీయ, అంతర్జాతీయ సంస్థలు), సంస్కృతి (సంప్రదాయ నృత్యాలు, పండగలు తదితర), క్రీడలు (ముఖ్య టోర్నీలు-విజేతలు, రికార్డులు, పతకాల సంఖ్య, కప్‌లు, భవిష్యత్ క్రీడలకు వేదికలు తదితర).
- కరెంట్ అఫైర్స్ కోసం పత్రికలు చదవడం ప్రధానం. ముఖ్యాంశాలను ప్రత్యేకంగా నోట్స్‌లో రాసుకొని, చదవాలి.

జనరల్ సైన్స్

గత ప్రశ్నపత్రాల పరిశీలన ద్వారా జనరల్ సైన్స్‌లో దృష్టిసారించాల్సిన ప్రధానంశాలపై అవగాహన పెంపొందించుకోవచ్చు. ఈ విభాగం నుంచి కూడా దాదాపు 25 ప్రశ్నలు రావొచ్చు.

■ **వెయిటేజీ అంచనా**

ఎన్విరాన్‌మెంట్-2 మార్కులు, ఫిజిక్స్- 6 మార్కులు; కెమిస్ట్రీ-6 మార్కులు; బయాలజీ-2 మార్కులు.

- ఎన్.వినయ్‌కుమార్‌రెడ్డి,
చైర్మన్, ఐఏసీఈ.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం 19-2-2018

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
287 ▼	93 ▼
34,011	10,452

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	7,239	▼	17
డోజోన్స్	25,219	▲	19
ఎఫ్‌టీఎస్ఈ 100	7,295	▲	60
డాక్స్	12,452	▲	106
షాంఘై (14 ముగింపు)	3,199	▲	15
నికాయ్	21,720	▲	255

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

బిజ్ క్విజ్-4

ప్రపంచంలో తక్కువ పన్ను ఎక్కడుంది? అత్యధికంగా చెల్లిస్తున్న పన్ను రేటెంత? ఇవే కాదు. ఇలాంటి పలు ప్రశ్నలకు మీకు జవాబులు తెలుసా? తెలుసుకుంటారా? అయితే సాక్షి బిజినెస్ పాఠకుల కోసం సునీల్ ధవళ అందిస్తున్న బిజినెస్ క్విజ్... చూడండి.

WWW.SAKSHIBUSINESS.COM

విద్యా రుణం... తెలివుండాలి!

- ఉద్యోగంలో చేరిన తర్వాత వెసులుబాటు
- కావాలంటే రుణ నిబంధనలు మార్చాలని అడగొచ్చు
- నచ్చకపోతే వేరే సంస్థ నుంచి తక్కువ వడ్డీకి రీఫైనాన్స్
- ఎంత వడ్డీ చెల్లించినా గరిష్ఠంగా ఎనిమిదేళ్లు పన్ను ఆదా
- ఎన్‌బీఎఫ్‌సీల్లో కొన్నింటికే ఈ పన్ను వెసులుబాటు
- క్రెడిట్ స్కోరు దెబ్బతినకుండా చూడటమూ ముఖ్యమే



ఉన్నత చదువులు చదువుకోవటం అందరికీ ఇష్టమే. కాకపోతే కొందరికి ఆర్థికంగా ఎలాంటి దన్నూ ఉండదు కనక... ఉన్నత చదువులు కలగానే మిగిలిపోతుంటాయి. అలాంటి వారికి వెన్నుదన్నునిచ్చేవే విద్యా రుణాలు. కుటుంబీకులు కొంత కష్టపడి... చదువుకునే సంస్థ గనక సరైనదైతే ఈ రుణానికి ఎలాంటి అడ్డంకులూ ఉండవు. ఇప్పుడు చాలా మంది ఆధారపడుతున్నది కూడా వీటిపైనే!!.

సరే! రుణం వస్తుంది. దాన్ని కాలేజీకి చెల్లించి చదువు కూడా పూర్తి చేస్తాం. ఆ తరవాత..? ఇపుడదే పెద్ద సమస్య. ఈ రుణాన్ని తీర్చాల్సిన బాధ్యత గుర్తొచ్చినప్పుడే కష్టమనిపిస్తుంది. ముఖ్యంగా పెద్ద మొత్తంలో రుణం తీసుకుంటే నెలవారీ చెల్లించాల్సిన వాయిదాలు (ఈఎంఐ) చాలా ఇబ్బందిగా మారతాయి. త్వరగా ఉద్యోగం దొరక్కపోవటమో... దొరికినా తక్కువ జీతంతో రావటమో జరిగితే... ఆ ప్రభావం తిరిగి చెల్లించే వాయిదాలపై పడుతుంది. దీనివల్ల క్రెడిట్ స్కోరు పడిపోవడమే కాకుండా, ఆ రుణం భారంగా మారుతుంది కూడా. విద్యా రుణమూ దీనికి మినహాయింపేమీ కాదు. అందుకే... విద్యా రుణం తీసుకోవాలనుకున్న వారు ఆ రుణం చేతికందాక ఏం చేయాలి? అవసరమైతే దాన్ని పునరుద్ధరించుకుని గరిష్ఠ ప్రయోజనాలు ఎలా పొందాలి? పన్ను ప్రయోజనాలేంటి? వంటి కీలక సమాచారం తెలుసుకోవాలి. ఆ వివరాలే ఈ 'ప్రాఫిట్' ప్రధాన కథనం...

– సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం

అవసరమైతే రీఫైనాన్స్ చేసుకోండి

విద్యా రుణానికి దరఖాస్తు చేసుకున్నప్పుడు చాలా మంది అది చేతికొస్తే చాలనుకుంటారు. అందుకని వడ్డీ రేటు తగ్గించాలని డిమాండ్ చేయలేని పరిస్థితిలో ఉంటారు. బ్యాంకు పెట్టిన షరతులు, నియమ, నిబంధనలను ఆమోదిస్తున్నట్టు సంతకాలు కూడా చేసేస్తారు. రుణం తీసుకుని విద్య పూర్తయి ఉద్యోగంలో చేరాక మాత్రం... ఆ రుణానికి సంబంధించిన ఒప్పంద నిబంధనలు సౌకర్యంగా అనిపించకపోవచ్చు. మరి అప్పుడు ఏం చేయాలి?

''నిజానికిలా అనిపించినపుడు సమీక్షించాలని బ్యాంకును నిరభ్యంతరంగా డిమాండ్ చేయొచ్చు. వినియోగదారుడు తీసుకున్న విద్యా రుణానికి అవసరమైతే మరో సంస్థ నుంచి సానుకూల షరతులపై రీఫైనాన్స్ చేసుకునే అవకాశం కూడా ఉంది'' అని అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ సీఈవో అమిత్‌గండా చెప్పారు. రీఫైనాన్స్ అంటే మరో సంస్థ నుంచి రుణం తీసుకుని పాత రుణాన్ని తీర్చివేయటమన్న మాట. రుణం తీసుకుని విద్య పూర్తి చేసిన వారు, ఉద్యోగం దొరికి రుణాన్ని చెల్లించే మెరుగైన స్థితిలోకి వచ్చినపుడు వారికి నియమ, నిబంధనలు నచ్చలేదనుకోండి. అలాంటపుడు ఈ రీఫైనాన్స్‌తో పాతదానికి గుడ్‌బై చెప్పెయొచ్చు. కాకపోతే కొత్త సంస్థ నుంచి రుణం తీసుకుంటారు కనుక ప్రాసెసింగ్ ఫీజు కొంత చెల్లించాల్సి ఉంటుంది. కొత్తగా రుణాన్ని ఆఫర్ చేస్తున్న సంస్థ నిబంధనలు సౌకర్యంగా ఉంటే, తక్కువ వడ్డీ రేటుకు వస్తుంటే రీఫైనాన్స్ ఆప్షన్‌ను పరిశీలించొచ్చనేది అమిత్ గండా సూచన.



ఇదెలా పనిచేస్తుందంటే...

ఉదాహరణకు రూ.20 లక్షల రుణాన్ని 12 శాతం వడ్డీ రేటుపై 9 ఏళ్లలో తీర్చేయాలి. ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు లేదనుకుంటే, రెండేళ్ల విద్యా సమయాన్ని మినహాయించి చూస్తే, మిగిలిన కాలానికి రూ.9.66 లక్షలను వడ్డీ రూపంలో చెల్లించాల్సి వస్తుంది. మంచి ఉద్యోగంలో చేరిన తర్వాత సహజంగానే తిరిగి రుణం పొందేందుకు అవకాశాలు మెరుగవుతాయి. అప్పుడు 10 శాతం వడ్డీపై రీఫైనాన్స్ సదుపాయం పొందినా గానీ, మిగిలి ఉన్న ఏడేళ్ల కాలంలో వడ్డీ తగ్గడం వల్ల రూ.1.77 లక్షలు ఆదా అవుతాయి. ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో సీటు సంపాదించి ఉంటే ఉద్యోగంలో చేరకముందే రుణ ఒప్పందాలను సమీక్షించాలని బ్యాంకులను డిమాండ్ చేయవచ్చు. ఎందుకంటే ప్రముఖ విద్యా సంస్థల్లో చదివిన వారికి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కచ్చితంగా ఉంటాయి కనక బ్యాంకులూ వారి డిమాండ్లను సానుకూలంగా పరిశీలిస్తాయి.

క్రెడిట్ స్కోరు పట్ల జాగ్రత్త

చాలా మందికి విద్యా రుణమే వారి జీవితంలో తీసుకునే తొలి రుణమవుతుంది. కాబట్టి క్రమం తప్పకుండా రుణ వాయిదా చెల్లింపులు జరిగేలా చూసుకోవాలి. లేదంటే వారి క్రెడిట్ స్కోరు తగ్గిపోయి, భవిష్యత్తులో ఇతర రుణాల విషయంలో సమస్యలు ఎదురవుతాయి. వేళ ప్రకారం రుణ వాయిదాలు చెల్లిస్తే చాలు. ప్రత్యేకంగా ఏ చర్యలూ అవసరం లేదు. క్రెడిట్ బ్యూరోల నుంచి క్రెడిట్ రిపోర్ట్‌ను తెప్పించుకుని పరిశీలించే అవకాశం కూడా ఉంది.



కోర్సు పూర్తికాకుంటే..? ఉద్యోగం రాకపోతే...?

ఒకవేళ రుణం తీసుకుని చేరిన కోర్సును విద్యార్థి పూర్తి చేయలేకపోతే ఎంటి పరిస్థితి? అన్న సందేహం తలెత్తవచ్చు. విద్యారుణ పథకం–2015 కింద ఇటువంటి సందర్భాల్లో విద్యార్థులు తమ కోర్స్ పూర్తి చేసేందుకు వీలుగా బ్యాంకులు కాల వ్యవధిని పొడిగిస్తాయి. వడ్డీయే కాదు, అసలు చెల్లింపులకు కూడా ఈ మేరకు కాలవ్యవధి పొడిగించినట్టుగానే భావించాలి. ఒకవేళ కోర్సు పూర్తయి ఉద్యోగం రాకపోయినా లేదా విద్యార్హతలకు తగ్గ ఉద్యోగం రాకపోయినా కూడా బ్యాంకులు మూడు సార్ల వరకు (ప్రతీ సారీ ఆరు నెలల చొప్పున) చెల్లింపుల కాల వ్యవధిని పొడిగించేందుకు సమ్మతిస్తున్నాయి. దీనివల్ల చెల్లింపుల భారం తగ్గుతుంది కానీ, రుణంపై చెల్లించే వడ్డీ భారం పెరుగుతుంది.

పన్ను లాభాలున్నాయి...

ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 80ఈ కింద విద్యా రుణం తీసుకున్న వారు దానిపై చెల్లించే వడ్డీని ఆదాయం నుంచి మినహాయించుకుని చూపే వెసులుబాటు ఉంది. ఈ సెక్షన్ కింద క్లెయిమ్ చేసుకునేందుకు పరిమితి లేకపోవడం ఆకర్షణీయాంశం. అంటే వడ్డీ రూపంలో ఎంత చెల్లించినా గానీ ఆ మొత్తాన్ని ఆదాయం నుంచి మినహాయించి చూపించవచ్చు. ఎనిమిదేళ్లు, లేదా రుణ చెల్లింపుల కాలం ఈ రెండింటిలో ఏది తక్కువయితే అది అమల్లోకి తీసుకుంటారు. రుణంలో అసలుకు చేసే చెల్లింపులపై మాత్రం మినహాయింపు లేదు. ఈ చట్టం కింద పన్ను మినహాయంపులు అన్నవి వ్యక్తిగత ఉన్నత చదువులకు, జీవిత భాగస్వామి, పిల్లల విద్యలకు కూడా పొందొచ్చు.

ఉదాహరణకు ఏడేళ్ల కాల వ్యవధి కలిగిన రూ.20 లక్షల విద్యా రుణంపై 11.5 శాతం వడ్డీ రేటు అనుకుంటే, మొదటి రెండేళ్ల చదివే సమయంలో చెల్లింపులపై మారటోరియం తీసేయగా, రుణాన్ని తీర్చేందుకు ఐదేళ్లు ఉంటుంది. దీంతో ఏటా వడ్డీ రూపంలో రూ.2.3 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. రుణం తీసుకున్న వ్యక్తి అధిక పన్ను శ్లాబ్ పరిధిలో ఉంటే పన్ను మినహాయింపుల రూపంలో రూ.71,760 ఆదా అవుతుంది. ఈ మినహాయింపు పొందేందుకు వడ్డీ చెల్లింపుల సర్టిఫికెట్‌ను బ్యాంకు లేదా రుణమిచ్చిన సంస్థ నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. ఏ బ్యాంకులో రుణం తీసుకున్నా ఈ ప్రయోజనానికి అర్హులే. అయితే, ఎన్‌బీఎఫ్‌సీల్లో కొన్నింటికే ఈ సదుపాయం ఉంది. అందుకే ఎన్‌బీఎఫ్‌సీ నుంచి రుణం తీసుకునే ముందు ఈ అంశాన్ని ధ్రువీకరించుకోవాలి. రుణాన్ని ముందుగా తీర్చివేయదలిస్తే మాత్రం పన్ను ప్రయోజనాల కోణంలో ఓ సారి ఆలోచించడం మంచిది. ఎందుకంటే పన్ను చెల్లించేంత ఆదాయం ఉంటే రుణాన్ని ముందుగా తీర్చివేయడం కంటే కాల వ్యవధి వరకు కొనసాగించటం ద్వారా గణనీయమైన పన్ను ఆదా చేసుకోవచ్చు.

పొదుపు కొంచెం- నిధి ఘనం

వీలైనంత ముందు నుంచే పొదుపు, మదుపు ● ఇలా చేస్తేనే దీర్ఘకాలంలో భారీ నిధి

కొన్ని చుక్కల నీరు కలిస్తేనే ఒక బిందెడు అవుతాయి. కొన్ని బిందెలు కలిస్తేనే కోనేరు నీళ్లవుతాయి. కొన్ని కోనేర్లు కలిస్తే నదిని మరిపిస్తాయి. ఇదంతా ఎందుకంటే... పెద్ద నిధి సమకూరటానికి కావాల్సింది చిల్లర మొత్తాలే. చిన్నచిన్న పొదుపులే. ఎందుకంటే చాలామంది నెలవారీ సంపాదనలో మిగిలేది కొంచెమే కదా అని దాన్ని పొదుపు చేయటానికి వెనకాడతారు. అసలు వాటిని పెట్టుబడుల్లోకి మళ్లించటం గురించి ఆలోచించనే ఆలోచించరు. కానీ, ఆ కొద్ది మొత్తాలు కలిపితేనే పెద్ద నిధి అవుతుందన్న ఆలోచన ఎంత మందికి వస్తుంది? బడ్జెట్ చిన్నదే అయినా... క్రమశిక్షణతో ఇన్వెస్ట్ చేస్తే చక్కని కార్పస్‌ను సమకూర్చుకోవచ్చనేది నిపుణుల సూచన. జీవితంలో కీలక లక్ష్యాలను సాకారం చేసుకుని, విజయ తీరాలకు చేరుకోవాలంటే అందుకు డబ్బే ప్రధానంగా కావాలి. ఈ నేపథ్యంలో లక్ష్యాలు సాధించడానికి కావాల్సిన నిధిని సమకూర్చుకునేందుకు వీలైనంత పొదుపు చేయటం తప్పనిసరి. మిగిలేది కొంతే అయినా, బడ్జెట్ చిన్నదే అయినా పొదుపు, పెట్టుబడుల విషయంలో తీసుకోవాల్సిన, అనుసరించాల్సిన వ్యూహాలేంటనేవి తెలియజేసేదే ఈ కథనం...

ఉన్నదాంతోనే తొలి అడుగు..

''లక్ష్యాలను ప్రాధాన్యం మేరకు నిర్ణయించుకుని, అనవసర ఖర్చులకు కళ్లెం వేసుకోవాలి. కొన్ని లక్ష్యాలు మరీ గాల్లో మేడలు కట్టేలా ఉండకూడదు. విచక్షణా రహిత ఖర్చులను తగ్గించుకోవాలి'' అనేది 'లాడర్ 7 ఫైనాన్షియల్ సర్వీసెస్' వ్యవస్థాపకుడు సురేశ్ సెడగోపన్ సూచన. ఉదాహరణకు చిన్న వయసులోనే ఇంటిని కొనుగోలు చేస్తే ఇతర కీలక లక్ష్యాల కోసం మదుపు చేసేందుకు ఇన్వెస్టర్ల వద్ద మిగిలేదేమీ ఉండదు. కనుక కొన్నాళ్లు ఇంటి కొనుగోలును వాయిదా వేసుకుని అద్దె ఇంట్లో ఉండడం తెలివైన నిర్ణయం అవుతుంది. పెట్టుబడులను చిన్న వయసులోనే మొదలు పెట్టడం అన్నది లక్ష్య సాధనకు తోడ్పడుతుందంటున్నారు నిపుణులు. ఎంత ఇన్వెస్ట్ చేస్తున్నారన్నది కూడా కీలకమే. ఉదాహరణకు మీ పిల్లల ఉన్నత విద్య కోసం ఓ పెద్ద నిధిని 15 ఏళ్లలో సాధించాలన్న లక్ష్యంతో ఉన్నారనుకోండి. ప్రస్తుతం రూ.14 లక్షలు ఉండే కోర్స్‌ను 15 ఏళ్ల తర్వాత చెప్పించాలనుకుంటే అప్పటికి విద్యా ద్రవ్యోల్బణాన్ని కూడా కలుపుకుంటే దాదాపు రూ.33.55 లక్షలు అవసరం అవుతుంది. మరి ఈ లెక్కన 15 ఏళ్ల తర్వాత మీ లక్ష్యానికి అవసరమైన నిధి సమకూర్చుకునేందుకు వార్షికంగా కనీసం 12 శాతం రాబడులను ఇచ్చే సాధనంలో ప్రతి నెలా రూ.7,500 చొప్పున ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లాల్సి ఉంటుంది. ప్రారంభంలో ఇంత మొత్తం పెట్టుబడులు కేటాయించడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. పెట్టుబడికి కొద్ది మొత్తమే ఉండొచ్చు. అయినా ఫర్వాలేదు. రూ.7,500తోనే పెట్టుబడులు ప్రారంభించాలన్న కఠిన సూత్రమేమీ లేదు. మీ దగ్గర ఉన్నంత, సాధ్యమైనంత మేర పొదుపు చేస్తూ వెళ్లడం ద్వారా కూడా లక్ష్యాన్ని చేరుకోవచ్చు.



వీలైనప్పుడు అదనపు పెట్టుబడులు

ప్రారంభంలో కాకపోతే ఆ తర్వాత అయినా పెట్టుబడులను పెంచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. ఆర్థిక పరిస్థితులు, ఆర్జన మెరుగైనప్పుడు ఒకేసారిగా లేదా క్రమానుగతంగా పెట్టుబడులను పెంచుకోవాలి. ఆదాయ వృద్ధి అనేది ఎప్పుడూ ఒకే స్థాయిలో ఉండకపోవచ్చు. ఏటేటా ఇందులో మార్పు ఉండొచ్చు. అయినప్పటికీ దానికి అనుగుణంగా పెట్టుబడులను పెంచుకుంటూ వెళ్లాలి. ఏ దశలోనూ లక్ష్యం కోసం చేస్తున్న పెట్టుబడుల పట్ల కట్టుబాటు విడవకూడదు. క్రమశిక్షణ ముఖ్యం. పెట్టుబడులను కొనసాగిస్తూ, వీలున్నప్పుడల్లా వాటిని పెంచుకుంటూ పోవడం క్లిష్టమైనదే అయినా దాన్ని అనుసరించేందుకే ప్రయత్నించాలి. నిర్ణీత లక్ష్యం సమీపించిన సమయానికి అవసరానికంటే తక్కువ నిధి సమకూరినా ఫర్వాలేదు. ఎందుకంటే కొద్ది మొత్తమే ఉంది కదా అనుకుని పెట్టుబడులు పెట్టకుండా ఉండడం, వాయిదా వేయడం కంటే ఉన్నంత ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లిన వారే మెరుగైన స్థితిలో ఉంటారు. ఉదాహరణకు 15 ఏళ్ల కాలానికి రూ.33.55 లక్షల కోసం ప్రతీ నెలా రూ.7,500 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటే, ఓ ఐదేళ్లు జాప్యం చేశారనుకోండి. అప్పుడు మిగిలిన పదేళ్లలోనే ఆ నిధి సమకూరేందుకు వీలుగా ప్రతీ నెలా ఇన్వెస్ట్ చేయాల్సిన మొత్తం రూ.15,993కు పెరిగిపోతుంది. ''ఏ లక్ష్యం కోసమైనా ఇన్వెస్ట్ చేస్తున్నప్పుడు మనసులో దాన్ని కష్టమైనదన్న ఆలోచన పెట్టుకోవద్దు. ఇది ఎక్కువ సందర్భాల్లో తగినంత కార్పస్‌ను సమకూర్చుకోకుండా అడ్డుపడుతుంది'' అని సెడగోపన్ వ్యాఖ్యానించారు.

పన్ను ఆదా కోణంలో కాదు...

తక్కువ ఆదాయం కలిగిన వారు పన్ను ఆదా కోణంలో మాత్రమే ఇన్వెస్ట్ చేయకూడదన్నది నిపుణుల సూచన. పన్ను ఆదా కోణంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల సరైన సాధనాలను ఎంచుకోలేరని ఫిన్‌కార్ట్ ఎండీ తన్వీర్ ఆలమ్ అభిప్రాయపడ్డారు. ఉదాహరణకు పన్ను ఆదా చేసే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఈఎల్ఎస్ఎస్) దీర్ఘకాలంలో సంపద సృష్టికి మంచి ఆప్షన్. కానీ చాలా మంది ఇన్వెస్టర్లు దీర్ఘకాలం పాటు పెట్టుబడులను కొనసాగించరు. పన్ను ఆదా ఈక్విటీ పథకాల్లో మూడేళ్ల లాకిన్ పీరియడ్ అయిపోగానే పెట్టుబడులను వెనక్కి తీసేసుకుంటుంటారు. దీని వల్ల కాంపౌండింగ్ ప్రయోజనం కోల్పోతారు. దీర్ఘకాలం పాటు కొనసాగిస్తేనే సానుకూల రాబడులకు అవకాశం ఉంటుంది.



చిన్న ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు మ్యూచువల్ ఫండ్స్ సిప్ మార్గం మెరుగైనది. ఇవి కనీసం రూ.500 నుంచి కూడా సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేయడానికి అవకాశం కల్పిస్తున్నాయి. ఇలా ఇన్వెస్ట్ చేస్తూ స్టెప్ అప్ ఫీచర్‌ను వినియోగించుకోవచ్చు. దీనివల్ల నిర్ణీత కాలానికోసారి పెట్టుబడుల మొత్తం పెరుగుతుంటుంది. అలాగే, మ్యూచువల్ ఫండ్స్‌లో డైరెక్ట్ ప్లాన్‌ను ఎంచుకోవడం వల్ల దీర్ఘకాలంలో రాబడులు అధికంగా పొందొచ్చు. కాకపోతే డైరెక్ట్ ప్లాన్లు అనేవి ఇన్వెస్టర్లు సొంతంగా ఎంచుకునేవి. కనుక జాగ్రత్తగా వ్యవహరించాలి. రెగ్యులర్ ప్లాన్లతో పోలిస్తే డైరెక్ట్ ప్లాన్లలో ఎక్స్‌పెన్స్ రేషియో తక్కువగా ఉండడం వల్ల దీర్ఘకాలంలో పెద్ద మొత్తం సమకూరుతుంది.

ప్రొటెక్షన్ ప్లాన్స్‌పైనే దృష్టి

టాటా ఏఐఏ చీఫ్ ఆఫ్ ప్రొప్రైటరీ చానల్స్ రిషి శ్రీవాస్తవ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీవిత బీమా రంగంలో కార్యకలాపాలు మరింతగా విస్తరించే క్రమంలో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ప్రధానంగా ప్రొటెక్షన్ ప్లాన్స్‌పై దృష్టి సారిస్తోంది. అలాగే, పూర్తి స్థాయి ప్రీమియర్ ఏజెంట్స్ నెట్‌వర్క్‌ను నిర్మించుకుంటోంది. టాటా ఏఐఏ చీఫ్ ఆఫ్ ప్రొప్రైటరీ చానల్స్ రిషి శ్రీవాస్తవ ఈ విషయాలు తెలిపారు. దేశీయంగా సుమారు ఎనిమిది శాతం మందికి మాత్రమే బీమా కవరేజీ ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్న నేపథ్యంలో ఇన్సూరెన్స్ రంగంలో వృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు. వచ్చే పదేళ్లలో జీవిత బీమా విభాగంలో సేవింగ్స్ కూడా కలిపి ఉన్న పథకాలకన్నా.. ప్రొటెక్షన్ ప్లాన్స్‌కే మరింత ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. మొత్తం పాలసీ జారీ ప్రక్రియను డిజిటలైజేషన్ చేయడంపై తాము ప్రధానంగా దృష్టి పెడుతున్నామని ఆయన చెప్పారు. దీనికి రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి స్పందన వస్తోందన్నారు. ప్రస్తుతం టాటా ఏఐఏ సుమారు ఆరు రకాల రైడర్స్‌తో 34 పైచిలుకు పథకాలు అందిస్తోందని తెలిపారు.

ప్రీమియర్ ఏజెంట్స్ నెట్‌వర్క్ ఏర్పాటు..

ఏజెన్సీలు, బ్యాంకులు తదితర మార్గాల్లో తమ పథకాలను విక్రయిస్తున్నప్పటికీ.. సొంతంగా ప్రీమియర్ ఏజెంట్స్ నెట్‌వర్క్‌ను కూడా ఏర్పాటు చేసుకుంటున్నట్లు శ్రీవాస్తవ తెలిపారు. కంపెనీ ద్వారా శిక్షణ పొందిన ఈ ఫుల్‌టైమ్ ప్రీమియర్ ఏజెంట్స్.. పాలసీదారులకు మరింత మెరుగైన సేవలు అందించగలరని ఆయన చెప్పారు. మిగతా ఏజెంట్లతో పోలిస్తే ప్రీమియర్ ఏజెంట్లలో అట్రిషన్ (ఉద్యోగుల వలస) చాలా తక్కువగా ఉండటం వల్ల సుదీర్ఘ కాలం అటు పాలసీదారుకు ఇటు కంపెనీకీ ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 5,000 పైచిలుకు ఈ తరహా ఏజెంట్స్ ఉండగా, మొత్తం ఏజెంట్స్ సంఖ్య 20,000 స్థాయిలో ఉందని శ్రీవాస్తవ వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో వీరి సంఖ్య దాదాపు 400 దాకా ఉంటుందన్నారు.


టర్మ్ ప్లాన్‌తో మరింత ధీమా!!

తక్కువ ప్రీమియం .. అధిక కవరేజీ

సొంతిల్లు లేదా వాహనం కొనుక్కోవడం, పిల్లల చదువులు.. పెళ్లిళ్లు మొదలైన లక్ష్యాలకు అవసరమైన నిధులు సమకూర్చుకునేందుకు మనం ఎంతగానో ఆలోచిస్తాం. భవిష్యత్ ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని పొదుపు.. పెట్టుబడుల కోసం మనం ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్, పోస్టల్ స్కీమ్స్ లాంటి అనేక సాధనాలు ఎంచుకుంటూ ఉంటాం. వీటితో పాటు జీవిత బీమా కూడా కీలకమైనదే. ఇంటిల్లిపాదీ ఆధారపడిన ఇంటిపెద్దకు అనుకోనిదేదైనా జరిగినా.. కుటుంబం ఆర్థిక సంక్షోభంలో పడకుండా బీమా భరోసానిస్తుంది. జీవిత బీమాకు సంబంధించి అత్యంత తక్కువ ప్రీమియంతో అత్యధిక కవరేజీని అందించేవి టర్మ్ ప్లాన్లు. వీటి గురించి అవగాహన కల్పించేదే ఈ కథనం..



పునీత్ నందా
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్



ఓ రూ. 10 లక్షలు పెట్టి ఒక కొత్త కారు కొన్నామనుకోండి. దానికేమీ కాకుండా ముందుగా తగినంత కవరేజీ ఉండేలా వాహన బీమా తీసుకోవాలని ఆలోచిస్తాం. ఇందుకోసం ఏటా రూ. 25,000 నుంచి రూ. 30,000 దాకా ప్రీమియం కడతాం. వాహనం గురించే ఇంతగా ఆలోచిస్తున్నప్పుడు ఎంతో విలువైన మన జీవితం గురించి, మనమీద ఆధారపడిన కుటుంబ సభ్యుల గురించి ఇంకెంత ఆలోచించాల్సి ఉంటుంది. కారు భద్రత కోసం భారీ ప్రీమియం కట్టేందుకు సిద్ధపడే మనం .. అంతకన్నా ఎక్కువ విలువైన జీవితానికి బీమా తప్పకుండా తీసుకోవాల్సిందే. ఇందుకోసం తోడ్పడే టర్మ్ పాలసీలు చాలా చౌకైనవి.. అత్యంత విలువైన మన జీవితాలకు, మనం ఎంతగానో ప్రేమించే కుటుంబానికీ భరోసానిచ్చేవి. వీటితో ఏటా అత్యంత తక్కువగా రూ. 8,000 నుంచి రూ. 10,000 దాకా ప్రీమియంతో ఏకంగా రూ. 1 కోటి దాకా కవరేజీని పొందవచ్చు (సిగరెట్ అలవాటు లేని ముప్పయ్ ఏళ్ల వ్యక్తికి).


కవరేజీ లెక్క ఇలా..

సరే.. టర్మ్ పాలసీ తీసుకోవాలనుకుంటే ఎంత కవరేజీ ఉండేలా చూసుకోవాలన్న ప్రశ్న కూడా తలెత్తుతుంది. ప్రధానంగా మూడు అంశాలు ఈ విషయానికి సంబంధించి పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అవేంటంటే..

- **బేస్ లైఫ్ కవర్:** సుమారు 40 ఏళ్ల దాకా వయస్సు ఉన్న వేతన జీవులు తమ వార్షికాదాయానికి కనీసం 20–30 రెట్లు సమానమైన కవరేజీ ఉండేలా చూసుకోవడం మంచిది. ఇక నలభైలలో ఉన్నవారు వార్షికాదాయానికి 10–20 రెట్లు, యాభైలలో ఉన్న వారు 5–10 రెట్లు కవరేజీ ఉండేలా చూసుకోవాలి. టర్మ్ లైఫ్ కవరేజీ.. పదవీ విరమణ చేసే దాకా కొనసాగేలా ఉండాలి.
- **రుణాలు:** ఇతరత్రా చెల్లించాల్సిన రుణాలు మొదలైనవేమైనా ఉంటే టర్మ్ ప్లాన్ తీసుకునేటప్పుడు... బేస్ లైఫ్ కవరేజీకి ఆ మొత్తాన్ని కూడా జోడించి లెక్కేయాలి. ఒకవేళ పాలసీదారుకు అర్ధంతరంగా ఏదైనా జరిగినా.. రుణభారంతో వారి కుటుంబం ఇబ్బందుల పాలు కాకుండా ఇది ఆదుకుంటుంది.
- **క్రిటికల్ ఇల్‌నెస్ ప్రయోజనం:** మన జీవన విధానాలు ఒక్కోసారి తీవ్ర అనారోగ్యాలకు దారి తీసే ప్రమాదముంది. కనుక క్రిటికల్ ఇల్‌నెస్ ప్రయోజనాలు కూడా అందించే టర్మ్ ప్లాన్‌ను ఎంచుకోవడం మంచిది. ఒకవేళ పాలసీదారు.. ప్లాన్‌లో పేర్కొన్న తీవ్రమైన అనారోగ్యాల బారిన పడిన పక్షంలో బీమా మొత్తాన్ని ఒకేసారి అందుకునే వీలు ఉంటుంది.

పాలసీ తీసుకునేటప్పుడు వాస్తవాలు దాచిపెట్టొద్దు ..

జీవిత బీమా పాలసీ తీసుకునేటప్పుడు బీమా సంస్థకు తప్పనిసరిగా కొన్ని వివరాలు తెలియజేయాలి. ముఖ్యంగా జీవన విధానాలు, వ్యక్తిగత.. కుటుంబ ఆరోగ్యం తదితర అంశాల్లో ఏదీ దాచిపెట్టే ప్రయత్నం చేయకపోవడమే మంచిది. ఇక పాలసీదారు ఆరోగ్యాన్ని మదింపు చేయడానికి బీమా సంస్థ వైద్య పరీక్షల నివేదికలను కోరే అవకాశంఉంది. కస్టమర్‌కి ఎంత మేర కవరేజీ ఇవ్వొచ్చన్నది అంచనా వేసుకునేందుకు బీమా సంస్థకు ఇవి ఉపయోగపడతాయి. ఏ విషయంలోనూ తప్పుడు సమాచారం ఇవ్వడం లేదా.. వాస్తవాలను తొక్కిపెట్టి ఉంచడం లాంటిది చేస్తే క్లెయిమ్ సమయంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.



"కొందరు ఒక పని జరిగితే బాగుంటుందనుకుంటారు. మరికొందరు ఆ పని జరగాలనుకుంటారు. ఇంకొందరు ఆ పని జరిగేలా చూస్తారు. గొప్ప వ్యక్తులు ఈ గ్రూప్‌లోనే ఉంటారు."
– మైకేల్ జోర్డాన్, షార్లెట్ హార్నెట్స్ ఛైర్మన్.

పొదుపు-మదుపు



అస్థిరతల నడుమ స్థిరమైన రాబడులు

హెచ్‌డీఎఫ్‌సీ ఈక్విటీ ఫండ్





ఈక్విటీ మార్కెట్లు అంటేనే ఆటుపోట్లకు నిలయాలు. ప్రపంచ పరిణామాలు, దేశీయ పరిణామాలన్నింటికీ ప్రతిస్పందిస్తూ ఉంటాయి. అయితే, ఈ ప్రభావం అంతా స్వల్పకాలిక పెట్టుబడులపైనే అధికం. దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేసేవారికి ఈక్విటీలు రెండంకెల స్థాయిలో రాబడులు ఇచ్చినట్టు గణాంకాలు చూస్తే తెలుస్తుంది. కనుక రిస్క్ ఉన్నాగానీ, దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయడం ద్వారా గణనీయమైన రాబడులు ఆశించేవారు, అదే సమయంలో ఆటుపోట్లు సైతం పరిమితంగా ఉండాలనుకునే వారు, బ్లూచిప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు హెచ్‌డీఎఫ్‌సీ ఈక్విటీ ఫండ్‌ను పరిశీలించొచ్చు. దీర్ఘకాలంలో చెప్పుకోతగ్గ రాబడులను ఈ ఫండ్ అందించింది.

పనితీరు

ఐదేళ్ల కాలంలో ఈ ఫండ్ ఇచ్చిన రాబడులు వార్షికంగా సగటున 17.4 శాతంగా ఉన్నాయి. ఇదే సమయంలో బెంచ్ మార్క్ నిఫ్టీ– 500 రాబడులు 14.8 శాతానికే పరిమితమయ్యాయి. అంటే ఈ పథకం రాబడులు ప్రామాణిక సూచీని మించి ఉన్నాయి. అదే పదేళ్ల కాలంలో రాబడులను గమనిస్తే సగటున వార్షికంగా 13.3 శాతం చొప్పున ఉన్నాయి. ఈ కాలంలో నిఫ్టీ–500 రాబడులు 7.9 శాతమే. మూడేళ్ల కాలంలో 10.9 శాతం చొప్పున ప్రతిఫలాన్ని పంచింది. మధ్యస్థంగా రిస్క్ భరించే వారు, దీర్ఘకాలం పాటు కొనసాగేవారు ఈ ఫండ్‌ను పెట్టుబడుల కోసం పరిగణనలోకి తీసుకోవచ్చు. ఆటుపోట్లు పెరిగి, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ వేల్యూషన్లు అధిక స్థాయికి చేరిన ప్రస్తుత సమయంలో ఈ పథకం అనువైనది. ఇది ప్రధానంగా బ్లూచిప్ స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేస్తుంది.

2014లో ఈ ఫండ్ అసాధారణమైన పనితీరు చూపించింది. బెంచ్‌మార్క్ రాబడులు 35 శాతంగా ఉంటే, హెచ్‌డీఎఫ్‌సీ ఈక్విటీ ఫండ్ 53 శాతం రిటర్నులు ఇచ్చింది. అయితే, 2015, 2016 సంవత్సరాల్లో మాత్రం పనితీరులో వెనుకబడింది. బ్యాంకింగ్, ఐటీ రంగ స్టాక్స్ పెద్దగా రాణించకపోవడమే కారణం. ఈ పథకం ప్రధానంగా బ్యాంకులు, ఐటీ స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేయడం వల్ల అలా జరిగింది. అయితే, 2017లో మళ్లీ మెరుగైన ప్రదర్శన చూపించింది. బ్యాంకింగ్ స్టాక్స్ ర్యాలీ కలిసొచ్చింది. గతేడాది 36.8 శాతం రాబడులు ఇచ్చింది. బెంచ్ మార్క్ పెరుగుదల 30.6 శాతంగానే ఉంది. బ్యాంకింగ్ రంగంలో రికవరీ, ఐటీ రంగం టర్న్ అరౌండ్ అయితే దీర్ఘకాలంలో ఫండ్ పనితీరు ఇంకా మెరుగ్గా ఉండే అవకాశం లేకపోలేదు.

పోర్ట్‌ఫోలియో, పెట్టుబడుల విధానం

ప్రాధాన్య రంగాలైన బ్యాంకింగ్, ఐటీతోపాటు కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్స్, విద్యుత్ రంగం స్టాక్స్‌కు గడిచిన ఏడాదిలో ఎక్కువ కేటాయింపులు చేసింది. దాదాపు 60 శాతం పెట్టుబడులు ఈ నాలుగు రంగాల్లోనే ఇన్వెస్ట్ చేసింది. ఫండ్ పోర్ట్‌ఫోలియోలో ఐదు స్టాక్స్ వాటాయే దాదాపు 40 శాతంగా ఉంది. దీర్ఘకాల దృష్టితో ఫండమెంటల్ స్టాక్స్‌లో ఎక్స్‌పోజర్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. స్వల్ప కాల దృష్టితో ఇన్వెస్ట్ చేయదు. పెట్టుబడుల్లో మార్పు, చేర్పులు గమనిస్తే ఎస్‌బీఐలో ఎక్స్‌పోజర్ తగ్గించుకుని, గడిచిన నాలుగు నెలల కాలంలో యాక్సిస్ బ్యాంక్‌ను పోర్ట్‌ఫోలియోలో చేర్చుకుంది. రిలయన్స్ నిప్పన్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీని కూడా చేర్చుకుంది. అలాగే, అవెన్యూ సూపర్‌మార్ట్స్, వేదాంత, టాటా కెమికల్స్, సెంచురీ టెక్స్‌టైల్స్ అండ్ ఇండస్ట్రీస్, కంటెయినర్ కార్పొరేషన్ స్టాక్స్‌ను కూడా యాడ్ చేసుకుంది. ఆటోమొబైల్స్, మీడియా ఎంటర్‌టైన్‌మెంట్, రవాణా, పెస్టిసైడ్స్ రంగాల్లో పెట్టుబడులను గణనీయంగా తగ్గించుకుంది. మారుతి సుజుకీ, నెట్‌వర్క్ 18, అదానీ పోర్ట్స్‌లో లాభాలను స్వీకరించింది. అలాగే, భారతీ ఎయిర్‌టెల్, బీపీసీఎల్, ఎన్‌హెచ్‌పీసీ, క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ స్టాక్స్‌లో గడిచిన ఏడాదిలో పెట్టుబడులను పూర్తిగా వెనక్కి తీసేసుకుంది. మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌కు 22 శాతం పెట్టుబడులను కేటాయించింది.

టాప్ హోల్డింగ్స్


స్టాక్	పెట్టుబడుల శాతం
ఐసీఐసీఐ బ్యాంకు	10.1
లార్సన్ అండ్ టూబ్రో	9.80
ఎస్‌బీఐ	9.43
ఇన్ఫోసిస్	7.54
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	5.97
ఆర్ఐఎల్	3.73
బాలకృష్ణ ఇండస్ట్రీస్	3.14
యాక్సిస్ బ్యాంకు	2.72
సీఈఎస్‌సీ	2.68
గెయిల్	2.50

● యాప్‌కీ కహానీ...

భీమ్ ఎస్‌బీఐ పే

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సులభ, తక్షణ లావాదేవీల కోసం 'భీమ్ ఎస్‌బీఐ పే' అనే యాప్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీన్ని ఏ బ్యాంక్‌కు చెందిన కస్టమర్లు అయినా ఉపయోగించొచ్చు. 'భీమ్ ఎస్‌బీఐ పే' యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రత్యేకతలు



- ✦ యాప్‌ను ఉపయోగించాలంటే.. బ్యాంక్ ఖాతాతో అనుసంధానమైన మొబైల్ నంబర్‌ను కలిగి ఉండాలి. అలాగే డెబిట్ కార్డు కూడా అవసరమౌతుంది.
- ✦ వర్చువల్ పేమెంట్ అడ్రస్ (వీపీఏ).. అకౌంట్ నంబర్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్.. క్యూఆర్ కోడ్ వంటి మూడు విధానాల్లో చెల్లింపులు నిర్వహించొచ్చు.
- ✦ మీరు కస్టమర్ అయితే చెల్లింపులు చేయవచ్చు. అదే వ్యాపారి అయితే పేమెంట్స్‌ను స్వీకరించొచ్చు.
- ✦ ఒక ట్రాన్సాక్షన్ ద్వారా గరిష్ఠంగా లక్ష రూపాయలు పంపగలం. అలాగే ఒక రోజులో గరిష్ఠంగా ఇతరులకు రూ.లక్ష వరకు పంపొచ్చు.
- ✦ అదే మీరు వ్యాపారస్తులు అయితే.. 'ఐ యామ్ ఎ మర్చంట్' ఆప్షన్ ద్వారా యాప్‌లోకి లాగిన్ అవ్వాలి. తర్వాత కస్టమర్ల నుంచి పేమెంట్స్‌ను స్వీకరించొచ్చు.
- ✦ మల్టిపుల్ బ్యాంక్ అకౌంట్లను ఉపయోగించొచ్చు. లావాదేవీల వివరాలు పొందొచ్చు. ట్రాన్సాక్షన్లకు సంబంధించి ఏమైనా పొరపాట్లు ఉంటే ఫిర్యాదు చేయవచ్చు.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, ఫిబ్రవరి 15 నాటికి (అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు– ఏడాది	1–2 ఏళ్లు	5 ఏళ్లు, ఆపైన
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25
యాక్సిస్ బ్యాంక్	6.25-6.5	6.75- 6.90	6.90
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.25	6.45- 6.55	6.25-6.5
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.25
కెనరా బ్యాంక్	6.35	6.45- 6.5	6.00
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6-6.25	6.5-6.7	6.50
డీసీబీ బ్యాంక్	7.00	7-7.15	7.2-7.25
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.75-6.25	6.25 - 6.75	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6 - 6.50	6.6- 6.75	6.50
ఐడీబీఐ బ్యాంక్	6 - 6.5	6.5-6.75	6.00
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	5.75 - 6.25	6.50 - 6.75	6.00
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.25 - 6.5	6.75 - 6.85	6.50
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.6-6.7	6.7-6.85	6.25
ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.2-6.4	6.60	6.40
ఎస్‌బీఐ	6.25	6.25	6.00
సిండికేట్ బ్యాంక్	6.25	6.75	6.50

మరింత సమాచారం కోసం www.bankbazaar.com పై క్లిక్ చేయండి

డాలర్ బలహీనతతో రయ్‌మన్న పసిడి!

వారంలో 32 డాలర్లు అప్ ● 1,350 డాలర్ల వద్ద ముగింపు ● బుల్లిష్ ధోరణే అంటున్న నిపుణులు



అంచనాలకు అనుగుణంగానే డాలర్ ఇండెక్స్ మళ్లీ కింద చూపు చూడ్డం ప్రారంభించింది. ఇదే అదనుగా మళ్లీ పసిడి వారంలో ముందుకు దూసుకుపోయింది. అంతర్జాతీయ న్యూయార్క్ మర్కెంటైల్ ఎక్స్ఛేంజ్– నైమెక్స్‌లో ఔన్స్ (31.1గ్రా)కు 16వ తేదీతో ముగిసిన వారంలో పసిడి 32 డాలర్లు లాభపడి 1,350 డాలర్లకు ఎగిసింది. ఈ వారం ఒక దశలో పసిడి ఏకంగా ఐదు నెలల గరిష్టస్థాయి 1,363 డాలర్లను కూడా తాకింది. వారాల వారీగా చూస్తే, రెండు వారాలు వెనక్కు తగ్గిన పసిడి, మళ్లీ ఒకేవారంలో అంతే పైకి లేవడం గమనార్హం. నెలలవారీగా చూస్తే, నాలుగు నెలలుగా దూకుడును ప్రదర్శిస్తోంది. ఇక డాలర్ ఇండెక్స్ నేపథ్యం చూస్తే, దిగువ ముఖ పయన ధోరణి 16వ తేదీతో ముగిసిన వారంలో మరింత స్పష్టమైంది. మూడు వారాల క్రితం మూడేళ్ల కనిష్ట స్థాయి (88.30)కి పడి, అటుపై కొంత తేరుకుని 90 పైకి లేచిన డాలర్ ఇండెక్స్, గడచిన వారంలో ఒక దశలో మళ్లీ ఏకంగా 88.18 స్థాయికి పతనమైంది. తిరిగి కొంత కోలుకుని వారం వారీగా 1.18 నష్టంతో 89.03 స్థాయిలో ముగిసింది. ఈ డాలర్ ఇండెక్స్ ఒడిదుడుకుల ధోరణి అమెరికా ఆర్థిక అనిశ్చితికి అద్దం పడుతోందని, ఇదే ధోరణి కొనసాగితే, వచ్చే రెండు వారాల్లో పసిడి 1,400 డాలర్లవైపు పరుగు ఖాయమని నిపుణుల వాదన.

దేశీయంగానూ దూకుడు

ఇక దేశీయంగా చూస్తే డాలర్ మారకంలో రూపాయి విలువ వారంవారీగా 18పైసలు బలహీనపడ్డం (10వ తేదీతో ముగిసిన వారంలో 64.40), అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి దూకుడు వంటి అంశాలు దేశంలోనూ బంగారం మెరుపునకు కారణమయ్యాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో పసిడి వారంలో 10 గ్రాములకు రూ. 791 పెరిగి, రూ.30,801కి చేరింది. ప్రధాన ముంబై స్పాట్ మార్కెట్ లో ధర 99.9 స్వచ్ఛత ధర రూ. 785 లాభంతో రూ.30,915కు ఎగసింది. 99.5 స్వచ్ఛత ధర కూడా అదే స్థాయిలో పెరిగి రూ. 30,765కు చేరింది. వెండి కేజీ ధర భారీగా 790 లాభపడి, రూ. 38,710కి చేరింది.



బొమ్మ-బొరుసు

“ నువ్వేం చెప్పావన్నది జనానికి గుర్తుండదు. నువ్వేం చేశావన్నది కూడా వారికి గుర్తుండదు. కానీ నువ్వు వాళ్లకి చేసే మంచి, చెడు చిరకాలం గుర్తుంటాయి. ”
– మాయ ఏంజెలో, అమెరికా రచయిత్రి.



బ్యాంకుల్లో కేంద్రం

వాటా తగ్గించుకోవాలి

- వాటిని స్వతంత్రంగా పనిచేసేలా చూడాలి
- అసోచామ్‌ సూచన

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో కేంద్రం తనకున్న వాటాను 50 శాతం లోపునకు తగ్గించుకోవాలని అసోచామ్‌ సూచించింది. పీఎన్‌బీలో బయటపడిన రూ.11,400 కోట్ల కుంభకోణం వాటా తగ్గింపునకు బలమైన సంకేతంగా పేర్కొంది. వాటాదారులకు జవాబుదారీగా, డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణ కోణంలో, ప్రైవేటు బ్యాంకుల మాదిరిగా పనిచేసేలా ప్రభుత్వరంగ బ్యాంకులను అనుమతించాలని అసోచామ్‌ సూచించింది. ‘‘చారిత్రకంగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకులు ఒక సంక్షోభం తర్వాత ఒక సంక్షోభం ఎదుర్కొంటున్నాయి. వీటిలో ప్రభుత్వం ప్రధాన వాటాదారుగా ఉన్నప్పటికీ పన్ను చెల్లింపులదారుల డబ్బుతో వీటిని ఒడ్డున పడేసే విషయంలో ఒక పరిమితి అంటూ ఉంది’’అని అసోచామ్‌ తన ప్రకటనలో పేర్కొంది. బ్యాంకుల్లో ఉన్నత పదవులను ప్రభుత్వ ఉద్యోగాలకు కొనసాగింపుగా భావించే పరిస్థితి కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం తన వాటాను 50 శాతం లోపునకు తగ్గించుకుంటే, వాటికి మరింత స్వతంత్రతతోపాటు సీనియర్‌ మేనేజ్‌మెంట్‌లో బాధ్యత, జవాబుదారీతనం పెరుగుతాయని అసోచామ్‌ సూచించింది.

రుణం ఎగ్గొడితే వెంటనే చెప్పాల్సిందే!

ఈ ప్రతిపాదనను సెబీ అమలు చేసే అవకాశం

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ పీఎన్‌బీలో రూ.11,400 కోట్ల కుంభకోణం ఏళ్లుగా బయటపడని నేపథ్యంలో సెబీ గత ప్రతిపాదనను అమల్లో పెట్టే అవకాశం ఉంది. అన్ని లిస్టెడ్‌ కంపెనీలు రుణ చెల్లింపుల్లో విఫలమైన వారి వివరాలను ఒక్క రోజులోపే బయటపెట్టాలన్నది ఆ ప్రతిపాదన సారాంశం. ఈ కుంభకోణంలో అసలు పాత్రధారి అయిన నీరవ్‌ మోదీకి చెందిన ఫైర్‌స్టార్‌ డైమండ్‌ కంపెనీ లిస్టెడ్‌ సంస్థ కాదు. అయితే, ఆయన సమీప బంధువు, వ్యాపార భాగస్వామి మెహుల్‌చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్‌ లిస్టెడ్‌ సంస్థే. రుణ చెల్లింపుల్లో విఫలమైన కంపెనీల సమాచారం వెంటనే తెలుసుకోవడం ద్వారా ఇన్వెస్టర్లు సరైన నిర్ణయం తీసుకోగలరన్నది సెబీ ఉద్దేశ్యం. అయితే, బ్యాంకింగ్‌ పరిశ్రమ నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో అమలు చేయకుండా ప్రతిపాదనను పక్కన పెట్టింది. అయితే పీఎన్‌బీ స్కామ్‌తో అమలు చేసే అవకాశాలున్నాయని ఓ సీనియర్‌ అధికారి తెలిపారు.

‘పరిశీలన’లో పీఎన్‌బీ రేటింగ్‌లు

బ్యాంకు నుంచి పలు అంశాలపై స్పష్టత కోరాం

- అందిన తర్వాత తుది నిర్ణయం
- రేటింగ్స్‌ సంస్థ క్రిసిల్‌ ప్రకటన



ముంబై: భారీ స్కామ్‌తో వణికిపోతున్న పంజాబ్‌ నేషనల్‌ బ్యాంకు రేటింగ్‌లను పరిశీలనలో పెడుతున్నట్టు ప్రముఖ రేటింగ్‌ సంస్థ క్రిసిల్‌ ప్రకటించింది. ముంబైలోని బ్రాడీహౌస్‌ శాఖలో రూ.11,400 కోట్ల ఎల్‌వోయూల కుంభకోణం వెలుగు చూసిన విషయం విదితమే. నీరవ్‌ మోదీ, ఆయన కంపెనీలు ఈ మేరకు బ్యాంకు ఉద్యోగుల సాయంతో మోసపూరిత లావాదేవీలకు పాల్పడ్డారు. ఎస్‌బీఐ తర్వాత ప్రభుత్వ రంగంలో రెండో అతిపెద్ద బ్యాంకు అయిన పీఎన్‌బీకి సంబంధించి డెట్‌ ఇన్‌స్ట్రుమెంట్లకు క్రిసిల్‌ ఏఏఏ, ఏఏ రేటింగ్‌లు కేటాయించి ఉంది. ‘‘పీఎన్‌బీ డెట్‌ ఇనుస్ట్రుమెంట్లపై మా రేటింగ్‌లను ‘పెరుగుతున్న అనుమానాల నేపథ్యంలో రేటింగ్‌ పరిశీలన’లో ఉంచాం. బ్రాడీ హౌస్‌ బ్రాంచ్‌లో మోసపూరిత, అనధికారిక లావాదేవీలను గుర్తించినట్టు ఫిబ్రవరి 14 నాటి ప్రకటనలో వెల్లడించడంతో ఈ నిర్ణయం తీసుకున్నాం’’ అని క్రిసిల్‌ పేర్కొంది. ఈ స్కామ్‌ కారణంగా ఏర్పడే చెల్లింపుల బాధ్యత, పరిమాణం, రికవరీ అవకాశాలు, ప్రొవిజనింగ్‌ అంచనాలు, మూలధన రేషియోపై పడే ప్రభావం గురించి పీఎన్‌బీ నుంచి స్పష్టత కోరినట్టు క్రిసిల్‌ తెలిపింది. వీటిపై స్పష్టత వచ్చిన అనంతరం పరిశీలన జాబితా నుంచి పీఎన్‌బీ రేటింగ్‌లను తొలగించి తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

పెరిగిన ఉద్దేశపూర్వక ఎగవేతలు

పీఎన్‌బీలో జనవరితో ముగిసిన చివరి ఎనిమిది నెలల కాలంలో ఉద్దేశపూర్వక భారీ రుణ ఎగవేతల మొత్తం (రూ.25 లక్షలపైన రుణం తీసుకున్న కేసులు) 23 శాతం పెరిగిపోయింది. వీటికి సంబంధించిన బకాయిలు రూ.14,593 కోట్లు. గతేడాది జూన్‌ నుంచి బ్యాంకు ఈ డేటాను విడుదల చేస్తోంది. అప్పుడు ఉద్దేశ్యపూర్వక ఎగవేతలు రూ.11,879 కోట్లుగా ఉన్నాయి. అప్పటి నుంచి చూస్తే జనవరి నాటికి ఎనిమిది నెలల్లో 22.8 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. మొండి బకాయిల వసూళ్లపై తమ చర్యల్ని తీవ్రతరం చేసిన కాలంలోనే ఇవి పెరగడం గమనార్హం. అయితే మొత్తం మీద ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌ నాటికి బ్యాంకు నికర ఎన్‌పీఏలు రూ.34,076 కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఇవి రూ.34,994 కోట్లు. అంటే స్వల్పంగా తగ్గినట్టు తెలుస్తోంది. స్థూల ఎన్‌పీఏలు రూ.57,519 కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.55,628 కోట్లతో పోలిస్తే కొంచెం పెరిగాయి.

గీతాంజలి గ్రూపు రికార్డులు పరిశీలన

పీఎన్‌బీ స్కామ్‌ విచారణలో భాగంగా సీబీఐ, మెహుల్‌ చోక్సీ ప్రమోట్‌ చేసిన గీతాంజలి గ్రూపు కంపెనీల బ్యాలన్స్‌ షీట్లను పరిశీలిస్తోంది. పీఎన్‌బీ నుంచి తీసుకున్న రూ.11,384 కోట్ల ఎల్‌వోయూల ఆధారంగా వివిధ బ్యాంకు శాఖల నుంచి డ్రా చేసుకున్న మొత్తం ఎంతన్న దానిని తేల్చే పని ప్రారంభించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. బ్యాంకు రిటైర్డ్‌ ఉద్యోగి గోకుల్‌నాథ్‌ శెట్టి, మనోజ్‌ ఖారత్, నీరవ్‌మోదీ కంపెనీ ఉద్యోగి ఒకరిని సీబీఐ అరెస్ట్‌ చేసిన విషయం తెలిసిందే. వీరితోపాటు పీఎన్‌బీకి చెందిన ఇతర ఉద్యోగుల నుంచి సమాచారం రాబడుతోంది. మెహుల్‌ చోక్సీకి వ్యతిరేకంగా ఎఫ్‌ఐఆర్‌ దాఖలు చేసిన తర్వాత స్వాధీనం చేసుకున్న రికార్డులను పరిశీలిస్తున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. నీరవ్‌ మోదీ, మెహుల్‌ చోక్సీ ఇద్దరూ దగ్గరి బంధువులన్న విషయం తెలిసిందే. మరోవైపు వీరికి ఎల్‌వోయూల ఆధారంగా క్రెడిట్‌ ఇచ్చిన విదేశీ బ్యాంకు శాఖల ఉద్యోగులను కూడా సీబీఐ విచారించనుంది. హాంగ్‌కాంగ్‌లోని అలహాబాద్‌ బ్యాంకు, ఎస్‌బీఐ, యూనియన్‌ బ్యాంకు, యూకో బ్యాంకు, యాక్సిస్‌ బ్యాంకు ఉద్యోగులకు ఈ స్కామ్‌లో పాత్ర ఉన్నట్టు అధికార వర్గాల సమాచారం. నిబంధనల మేరకు ఎల్‌వోయూలు 90 రోజుల వరకే ఉండాలని, 365 రోజులు కాదని అవి వెల్లడించాయి. కనుక ఉద్యోగులకు తెలిసే ఇది జరిగి ఉంటుందని పేర్కొన్నాయి.

ఒడిదుడుకుల వారం

పీఎన్‌బీ స్కామ్‌ ప్రభావం కొనసాగుతుంది..

- ఈ వారమే ఎఫ్‌ అండ్‌ఓ ఎక్స్‌పైరీ
- ముడి చమురు ధరల గమనం కీలకమే
- ఈ వారం మార్కెట్‌పై విశ్లేషకుల అభిప్రాయం



ప్రపంచ మార్కెట్ల పోకడ, ముడి చమురు ధరల గమనం వంటి అంతర్జాతీయ అంశాలు ఈ వారం స్టాక్‌ మార్కెట్‌కు కీలకమని నిపుణులంటున్నారు. వీటితో పాటు దేశీయంగా పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ కుంభకోణం ప్రకంపనలు కూడా తగిన ప్రభావం చూపుతాయని వారంటున్నారు. ఈ నెల ఫ్యూచర్స్‌ అండ్‌ ఆప్షన్స్‌ (ఎఫ్‌అండ్‌ఓ) కాంట్రాక్టులు ఈ వారంలోనే ముగుస్తున్నందున స్టాక్‌ సూచీలు ఒడిదుడుకులకు గురవుతాయని మార్కెట్‌ విశ్లేషకులంటున్నారు. మరోవైపు విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి, డాలర్‌తో రూపాయి మారకం తదితర అంశాలు కూడా స్టాక్‌ సూచీల కదలికలను నిర్దేశిస్తాయని వారు పేర్కొన్నారు.

ఆల్‌టైమ్‌ హై నుంచి 6 శాతం డౌన్‌..

స్టాక్‌ సూచీలు వాటి జీవిత కాల గరిష్ట స్థాయిల నుంచి చూస్తే 6 శాతం వరకూ పతనమయ్యాయని జియోజిత్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ రీసెర్చ్‌ హెడ్‌ వినోద్‌ నాయర్‌ చెప్పారు. ఈ భారీ స్థాయి పతనం కారణంగా స్వల్ప కాలంలో స్టాక్‌సూచీలు స్థిరీకరణ అయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అయితే వాణిజ్య లోటు మరింతగా పెరగడం, బాండ్‌ ఈల్డ్స్‌ అంతకంతకూ పెరుగుతుండడం, అంతర్జాతీయంగా ఒడిదుడుకులు చోటు చేసుకోవడం తదితర కారణాల వల్ల ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటిస్తున్నారని వివరించారు. పీఎన్‌బీ స్కామ్‌ ఇతర బ్యాంక్‌లకు కూడా విస్తరించే అవకాశాలున్నాయని, సమీప కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంక్‌ షేర్లపై ఒత్తిడి కొనసాగుతుందని ఆయన అంచనా వేస్తున్నారు. పీఎన్‌బీ స్కామ్‌ కారణంగా ఆందోళన చెందిన ఇన్వెస్టర్లు అమ్మకాలు జరిపారని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌ హెడ్‌(ప్రైవేట్‌ క్లయింట్‌ గ్రూప్‌) వి.కె. శర్మ చెప్పారు. పీఎన్‌బీ స్కామ్‌ ప్రభావంతో ప్రభుత్వ రంగ బ్యాంక్‌ షేర్లు మరింతగా పతనమయ్యే అవకాశాలున్నాయి. వాణిజ్య లోటు మరింతగా పెరగడం ఒకింత ప్రతికూల ప్రభావం చూపించే అవకాశాలున్నాయి. ఇక అంతర్జాతీయ అంశాల పరంగా చూస్తే, జపాన్, అమెరికా, యూరప్‌ తయారీ రంగాల పర్చేజింగ్‌ మేనేజర్స్‌ ఇండెక్స్‌(పీఎమ్‌ఐ) గణాంకాలు ఈ బుధవారం(ఈ నెల 21న) వస్తాయి. ఈ నెల 17తో ముగిసిన వారానికి సంబంధించిన అమెరికా జాబ్‌లెస్‌ క్లెయిమ్స్‌ గణాంకాలు ఈ నెల 22న (గురువారం) వెల్లడవుతాయి. ఇక శుక్రవారం(ఈ నెల 23న) యూరప్, జపాన్‌ల జనవరి నెల రిటైల్‌ ద్రవ్యోల్బణ గణాంకాలు, జర్మనీ క్యూ4 జీడీపీ గణాంకాలు వస్తాయి.

వంద కోట్ల డాలర్ల విదేశీ నిధులు వెనక్కి

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ)మన స్టాక్‌ మార్కెట్‌ నుంచి ఈ నెలలో వంద కోట్ల డాలర్లు(రూ6,850 కోట్లు) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అంతర్జాతీయంగా స్టాక్‌ మార్కెట్లలలో అమ్మకాలు వెల్లువెత్తడం దీనికి ప్రధాన కారణమని నిపుణులు పేర్కొన్నారు. డిపాజిటరీల గణాంకాల ప్రకారం.., ఈ నెల 1–16 మధ్యన విదేశీ ఇన్వెస్టర్లు మన స్టాక్‌ మార్కెట్‌ నుంచి రూ.6,844 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకోగా, డెట్‌ మార్కెట్లో మాత్రం రూ.3,215 కోట్లు ఇన్వెస్ట్‌ చేశారు. గత నెలలో విదేశీ ఇన్వెస్టర్లు మన స్టాక్‌ మార్కెట్లో రూ.13,780 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. భారత దేశపు పది సంవత్సరాల బాండ్ల రాబడి 7.5 శాతాన్ని మించిందని, గత ఏడాది జూలై తర్వాత ఇదే అధికమని, అందుకనే మన డెట్‌మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరిగాయని ఆన్‌లైన్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ ప్లాట్‌ఫార్మ్‌ గ్రో సీఓఓ హర్ష్‌ జైన్‌ చెప్పారు.

గత వారం హీరోలు

స్టాక్స్	16 ముగింపు	8 ముగింపు	మార్పు(%)
వక్రంగీ	245	192	28
నెస్లె	7,590	6,991	9
బ్రిటానియా	4,781	4,627	3
సీమెన్స్	1,264	1,227	3
టాటా స్టీల్	688	671	3
క్యాడిల్లా హెల్త్‌కేర్	414	405	2
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	312	305	2
ఆర్‌ఐఎల్	922	904	2
దివీస్ ల్యాబ్స్	1,049	1,029	2
మారికో	306	300	2

ఎందుకు పెరిగాయంటే...

అంతకుముందు వారాల్లో భారీ పతనాన్ని చవిచూసిన వక్రంగీ...బైబ్యాక్, డివిడెండు చెల్లింపులు, వ్యాపారంలో పెట్టుబడులకు క్యాపిటల్‌ కేటాయింపు విధానాన్ని ప్రకటించడంతో ఈ షేరు భారీగా రికవరీ అయ్యింది. మార్కెట్‌ పతన నేపథ్యంలో సురక్షిత పెట్టుబడులుగా ఇన్వెస్టర్లు పరిగణించడంతో ఎఫ్‌ఎంసీజీ షేర్లు నెస్లే, బ్రిటానియా, మారికోలు ర్యాలీ జరిపాయి. కమోడిటీ షేర్ల రికవరీలో భాగంగా టాటా స్టీల్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్‌ షేర్లు పెరిగాయి.

గత వారం జీరోలు

స్టాక్స్	16 ముగింపు	8 ముగింపు	మార్పు(%)
పీఎన్‌బీ	126	159	-21
మదర్‌సన్ సుమి	326	364	-10
ఎస్‌బీఐ	272	301	-10
గ్లెన్‌మార్క్ ఫార్మా	522	578	-10
యస్ బ్యాంక్	312	335	-7
భారతీ ఇన్‌ఫ్రాటెల్	327	350	-7
క్రాంప్టన్ గ్రీవ్స్	227	242	-6
ఆర్‌ఈసీ	141	150	-6
ఏబీబీ ఇండియా	1,507	1,598	-6
యాక్సిస్ బ్యాంక్	538	568	-5

ఎందుకు తగ్గాయంటే...

రూ. 11,000 కోట్ల కుంభకోణం వెల్లడికావడంతో పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ షేరు 21 శాతం పతనమయ్యింది. క్యూ3 ఫలితాల్లో నష్టాల్ని ప్రకటించడంతో ఎస్‌బీఐ షేరు క్షీణించింది. బ్యాంకింగ్‌ షేర్లలో నెలకొన్న బలహీన ట్రెండ్‌ ప్రభావంతో యాక్సిస్‌ బ్యాంక్, యస్‌ బ్యాంక్‌లు తగ్గాయి. తాజా క్వార్టర్లో నికరలాభం 78 శాతం తగ్గడంతో గ్లెన్‌మార్క్‌ ఫార్మా షేరు పడిపోయింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌ -నెక్‌ /100కు రూ.లలో) 19-2-2018

విశాఖ	385–00
చిత్తూరు	408–00
వరంగల్	382–00
ముంబై	425–00
చెన్నై	415–00
విజయవాడ	383–00
గోదావరి	383–00
నమక్కల్	395–00
18–2–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	380–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.40
బెంగళూరు	405–00
ఢిల్లీ	415–00
కోల్‌కతా	432–00

మహారాష్ట్రలో ఆర్‌ఐఎల్‌ భారీ పెట్టుబడులు

రూ.60,000 కోట్లతో పారిశ్రామిక అభివృద్ధి

ముంబై: మహారాష్ట్రలో భారీ పెట్టుబడుల ప్రణాళికను ఆర్‌ఐఎల్‌ అధినేత ముకేశ్‌ అంబానీ ప్రకటించారు. మ్యాగ్నటిక్‌ మహారాష్ట్ర సదస్సు మొదటి రోజు ఇందుకు వేదికగా నిలిచింది. ‘‘ఆర్‌ఐఎల్‌ దాని అంతర్జాతీయ భాగస్వామ్య కంపెనీలు కలసి రానున్న పదేళ్లలో మహారాష్ట్రలో రూ.60,000 కోట్లను ఇన్వెస్ట్‌ చేస్తాయి. దేశంలో ఇదే తొలి సమగ్ర డిజిటల్‌ పారిశ్రామిక ప్రాంతం అవుతుంది’’ అని అంబానీ తెలిపారు. అయితే ఏర్పాటు చేసే స్థలం గురించి వెల్లడించలేదు. ముంబైలో ఆదివారం ఈ సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించగా, ముకేశ్‌ అంబానీ, రతన్‌టాటా సహా ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ‘‘ఆర్‌ఐఎల్‌తో కలసి పెట్టుబడులు పెట్టేందుకు 20కు పైగా అంతర్జాతీయ కంపెనీలు సంసిద్ధతను తెలియజేశాయి. వీటిలో సిస్కో, సీమెన్స్, హెచ్‌పీ, డెల్, నోకియా, ఎన్‌విడియా తదితర కంపెనీలు ఉన్నాయి’’ అని అంబానీ వెల్లడించారు. సేవల ఆధారిత ఈ నాలుగో పారిశ్రామిక విప్లవంతో చైనా తన తయారీ రంగంతో సాధించిన దాని కంటే భారత్‌ మరింత వేగంగా ప్రగతి సాధిస్తుందన్నారు.



మ్యాగ్నటిక్‌ మహారాష్ట్ర సదస్సు ప్రారంభం సందర్భంగా ముంబైలో ఆదివారం ముకేశ్‌ అంబానీ, రతన్‌టాటాల ఆత్మీయ పలకరింపు

టర్మ్‌ బీమా పాలసీని ఎలా ఎంచుకోవాలి ?

నా వయస్సు 47 సంవత్సరాలు. నాకు నెలకు రూ.40,000 జీతం వస్తోంది. నాకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. నేను ఇంత వరకూ ఎలాంటి బీమా పాలసీ తీసుకోలేదు. నేను ఎంత మొత్తానికి టర్మ్‌ ఇన్సూరెన్స్‌ తీసుకోవాలి ? నాకు తగిన టర్మ్‌ బీమా పాలసీని సూచించండి.

– శేఖర్, హైదరాబాద్

సాధారణంగా ఒక వ్యక్తి పదేళ్ల ఆదాయానికి సరిపడా కవరేజ్‌ ఉన్న బీమా తీసుకోవాలని బీమా నిపుణులు చెబుతుంటారు. అయితే ఎంత మొత్తానికి బీమా తీసుకోవాలి అనే విషయం మరికొన్ని ముఖ్యమైన అంశాలపై కూడా ఆధారపడి ఉంటుంది. మీ పిల్లల ఉన్నత విద్యావసరాలు. మీపై ఆర్థికంగా ఆధారపడి ఉన్న వ్యక్తుల అవసరాలు. మీ ఇతర బాధ్యతలు, తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఎంత మొత్తానికి బీమా పాలసీ తీసుకోవాలో మీరు నిర్ణయించుకోండి. ఇక మంచి టర్మ్‌ బీమా పాలసీ తీసుకోవడానికి మూడు అంశాలు ముఖ్యమైనవి. మొదటిది క్లెయిమ్స్‌ సెటిల్మెంట్‌ రేషియో..బీమా సంస్థ పరిష్కరించిన క్లెయిమ్స్‌ను బీమా సంస్థకు అందిన మొత్తం క్లెయిమ్స్‌తో భాగిస్తే వచ్చేదే క్లెయిమ్స్‌ సెటిల్మెంట్‌ రేషియో. ఇది ఎంత ఎక్కువగా ఉంటే అంత మంచిది. అందుకని అత్యధిక క్లెయిమ్స్‌ సెటిల్మెంట్‌ రేషియో ఉన్న కంపెనీ బీమా పాలసీను తీసుకోవడం ఉత్తమం. ఇక రెండో కీలకమైన అంశం.. చెల్లించాల్సిన ప్రీమియమ్‌..టర్మ్‌ బీమా అనేది తక్కువ వ్యయాలున్న సమర్థవంతమైన పాలసీ. అయితే కంపెనీ, కంపెనీకి ప్రీమియమ్‌ విషయంలో తేడాలు బాగానే ఉంటాయి. తక్కువ ప్రీమియమ్‌ ఉన్న పాలసీనే తీసుకోండి. ఇక టర్మ్‌ పాలసీ తీసుకునే విషయంలో ముఖ్యమైన మూడో అంశం.. రైడర్స్‌... బీమా పాలసీతో పాటు కొన్ని రైడర్స్‌ను కూడా తీసుకుంటే అదనపు ప్రయోజనాలు పొందవచ్చు. బీమా కవరేజ్‌ను కూడా మెరుగుపరచుకోవచ్చు. రైడర్స్‌కు కొంత అదనపు ప్రీమియమ్‌ చెల్లించాల్సి ఉంటుంది. అనుకోని, ఊహించని విషాదాలు ఎదురైన పక్షంలో ఈ రైడర్స్‌ మీకు తగిన రక్షణను ఇవ్వగలవు. మీది తరచుగా ప్రయాణాలు చేసే ఉద్యోగమైతే, యాక్సిడెంట్‌ డెత్‌ బెనిఫిట్‌ రైడర్‌ను తీసుకోవాలి. ఇలాంటి రైడర్స్‌ చాలా ఉన్నాయి. అన్నింటినీ కాకుండా మీకు తగిన రైడర్స్‌ను ఎంచుకుంటే మంచిది. వివిధ బీమా సంస్థల క్లెయిమ్‌ సెటిల్మెంట్‌ రేషియో, ప్రీమియమ్‌ తదితర అంశాలను ఇప్పుడు ఆన్‌లైన్‌లో సులభంగా పోల్చిచూసుకోవచ్చు. ఇలా పోల్చి చూసుకుని, ఎక్కువ క్లెయిమ్స్‌ సెటిల్మెంట్‌ రేషియో, తక్కువ ప్రీమియమ్‌ ఉన్న పాలసీని ఎంచుకోండి.

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఇటీవల లాంగ్‌టర్మ్‌ డెట్‌ ఫండ్స్‌ సరైన రాబడులనివ్వడం లేదు. డెట్‌ ఫండ్స్‌లో ఉన్న నా ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకుందామనుకుంటున్నాను. ఇది సరైన నిర్ణయమేనా ?

– ప్రశాంత్, విశాఖపట్టణం

ఇటీవల కాలంలో లాంగ్‌టర్మ్‌ డెట్‌ ఫండ్స్‌ సరైన రాబడులనివ్వని మాట కరెక్టే. రాబడులు సరిగ్గా లేని కారణంగా ఈ డెట్‌ ఫండ్స్‌ నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకోవడం సరైన నిర్ణయమే. మీరు స్థిర ఆదాయ ఇన్వెస్టర్‌అయిన పక్షంలోనే ఇది సరైన నిర్ణయం. ఈ తరహా ఇన్వెస్ట్‌మెంట్స్‌కు నష్ట భయం చాలా తక్కువగా ఉంటుంది. వడ్డీరేట్లు తగ్గితే ఇవి మంచి రాబడులనిస్తాయి. లాంగ్‌టర్మ్‌ డెట్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్‌ను 2–3 సంవత్సరాల పాటు కొనసాగిస్తే, మంచి రాబడులే పొందవచ్చు. ఇటీవల కాలంలో ఇవి సరైన రాబడులు ఇవ్వని మాట వాస్తవమే అయినప్పటికీ, వీటి పనితీరు మరీ తీసికట్టుగా ఏమీ లేదు. అయితే రెండు నుంచి మూడేళ్లు వేచి చూడగలిగితే, మీకు మంచి రాబడులు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. భవిష్యత్తులో ఇంత గందరగోళం వద్దనుకుంటే, స్వల్పకాలిక డెట్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేయండి. ఈ ఫండ్స్‌ 8.5 శాతం రాబడులనిచ్చే అవకాశాలున్నాయి.

మ్యూచువల్‌ ఫండ్‌ సంస్థలు వ్యయాలను నెట్‌ అసెట్‌ వేల్యూ(ఎన్‌ఏవీ) నుంచే తగ్గిస్తాయా ? ఇది ఎలా ఉంటుంది? రోజువారీగా ఉంటుందా? నెలవారీగా ఉంటుందా ?

– స్రవంతి, విజయవాడ

మ్యూచువల్‌ ఫండ్‌ సంస్థలు ఫండ్‌ నిర్వహణ వ్యయాలన్నింటినీ ఎన్‌ఏవీ(నెట్‌ అసెట్‌ వేల్యూ) నుంచే తగ్గిస్తాయి. ఇది ఏ రోజుకారోజే జరుగుతుంది. ప్రతి రోజూ కొత్త ఇన్వెస్టర్లు ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేస్తారు. మరి కొంత మంది ఇన్వెస్టర్లు తమ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకుంటారు. ఇది ప్రతి రోజూ జరుగుతుంది. కాబట్టి మ్యూచువల్‌ ఫండ్‌ సంస్థలు ప్రతి రోజూ తమ వ్యయాలను ఎన్‌ఏవీ నుంచే తగ్గిస్తాయి. అంతేకాకుండా ఇన్వెస్టర్లు ఎన్‌ఏవీ ఆధారంగానే సదరు మ్యూచువల్‌ ఫండ్‌ యూనిట్లను కొనుగోలు చేయడం కానీ, విక్రయించడం కానీ చేస్తారు.

నేను నెలకు కొంత మొత్తాన్ని ఒక మ్యూచువల్‌ ఫండ్‌లో సిస్టమేటిక్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ ప్లాన్‌(సిప్‌) విధానంలో ఇన్వెస్ట్‌ చేస్తున్నాను. వచ్చే నెల నుంచి నా జీతం పెరుగుతోంది. సిప్‌ మొత్తాన్ని కూడా పెంచుదామనుకుంటున్నాను. అలా చేయమంటారా ? లేక అదే ఫండ్‌లో కొత్త సిప్‌ను ప్రారంభించమంటారా?

– ఆంటోని, ఈ మెయిల్‌ ద్వారా


మ్యూచువల్‌ ఫండ్స్‌లో సిప్‌ విధానంలో ఇన్వెస్ట్‌ చేస్తే మంచి రాబడులు పొందవచ్చు. జీతం పెరిగినప్పుడల్లానో, రెండు, మూడు సంవత్సరాలకొకసారి సిప్‌ మొత్తాన్ని పెంచితే ఇంకా మంచి ఫలితాలు వస్తాయి. ఇక మీ విషయంలో మీరు మీ సిప్‌ మొత్తాన్ని పెంచుకోవచ్చు. లేదా కొత్త సిప్‌ను ప్రారంభించవచ్చు. మీరు ఎలా చేసిన ఒకటే. సాంకేతికంగా చూసినా ఎలాంటి తేడా ఉండదు. ఎలా చేసినా పన్ను భారం ఒకే విధంగా ఉంటుంది.

33,850 పాయింట్ల దిగువన క్షీణత

మార్కెట్‌ పంచాంగం


వారం రోజుల క్రితం ప్రపంచ మార్కెట్లను బెంబేలెత్తించిన అమెరికా మార్కెట్‌ గత వారం గొప్పర్యాలీని జరిపింది. ఒకేవారంలో 4.5 శాతం పెరిగింది. గత ఐదేళ్లలో ఇంత పెద్ద ర్యాలీ అమెరికా మార్కెట్లో జరగడం ఇదే ప్రథమం. ఇది హఠాత్‌ పతనానికి ప్రతిగా జరిగిన ర్యాలీగానే పరిగణించాలని విశ్లేషకులు అంటున్నారు. అమెరికాతో పాటు ఇతర వర్ధమాన సూచీలు, ఆసియా మార్కెట్లు కూడా ఇటీవల పతనంలో సంభవించిన నష్టాల్లో 50–60 శాతం వరకూ పూడ్చుకోగలిగాయి. కానీ భారత్‌ మార్కెట్‌ మాత్రం 30 శాతం రికవరీ కాగలిగింది. దీర్ఘకాలిక ఈక్విటీ పెట్టుబడులపై బడ్జెట్లో ప్రతిపాదించిన పన్ను, పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ కుంభకోణం వంటి అంశాలు మన మార్కెట్‌..ఇతర సూచీలను అనుసరించకపోవడానికి కారణం . ఈ నేపథ్యంలో ఫిబ్రవరి డెరివేటివ్‌ సిరీస్‌ మరో నాలుగు రోజుల్లో ముగియనున్నది. మార్కెట్లో పతనం మొదలైన తర్వాత...జరగబోతున్న ఈ సిరీస్‌ ముగింపు...తదుపరి రోలోవర్స్‌...సమీప భవిష్యత్తులో మార్కెట్‌ ట్రెండ్‌ను నిర్దేశించవచ్చు. ఈ నేపథ్యంలో ప్రధాన సూచీల సాంకేతిక అంశాలు ఇలా వున్నాయి...

సెన్సెక్స్‌ సాంకేతికాలు..



ఫిబ్రవరి 16తో ముగిసిన నాలుగురోజుల ట్రేడింగ్‌వారంలో గత మార్కెట్‌ పంచాంగంలో సూచించిన అంచనాలకు అనుగుణంగా 34,100పైన బలం ప్రదర్శించిన బీఎస్‌ఈ సెన్సెక్స్‌ 34,535 పాయింట్ల గరిష్టస్థాయివరకూ ర్యాలీ జరిపినప్పటికీ, చివరిరోజైన శుక్రవారం 34,100 కీలక మద్దతు స్థాయిని కోల్పోయి 33,957 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంతక్రితంవారంతో కేవలం 5 పాయింట్ల లాభంతో 34,011 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం మార్కెట్‌ తగ్గితే సెన్సెక్స్‌కు 33,850 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోతే వేగంగా 33,482 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు. రానున్న రోజుల్లో ఈ స్థాయిని కూడా కోల్పోతే క్రమేపీ 32,600 పాయింట్ల స్థాయికి పతనం కావొచ్చు. ఈ సోమవారం సెన్సెక్స్‌ పెరిగినా, తొలి మద్దతుస్థాయిని పరిరక్షించుకున్నా 34,185 పాయింట్ల వద్దకు చేరవచ్చు. ఈ స్థాయిపైన వేగంగా 34,535 పాయింట్ల స్థాయిని తిరిగి అందుకోవొచ్చు. అటుపైన ముగిస్తే 34,660 పాయింట్లవరకూ పెరగవచ్చు. ఆపైన ముగిస్తే 34,874–35,006 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు.

నిఫ్టీ మద్దతు 10,398..




గత మార్కెట్‌ పంచాంగంలో ప్రస్తావించినట్లు క్రితం వారం ప్రథమార్థంలో 10,480 పాయింట్లపైన స్థిరపడిన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 10,618 పాయింట్ల గరిష్టస్థాయివరకూ పెరిగింది. ఈ స్థాయి వద్ద చివరిరోజున అవరోధాన్ని చవిచూసి 10,434 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 3 పాయింట్ల స్వల్ప నష్టంతో 10,452 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సోమవారం పాజిటివ్‌గా మార్కెట్‌ మొదలైతే నిఫ్టీకి 10,510 పాయింట్ల వద్ద తొలి అవరోధం కలగవచ్చు. ఈ స్థాయిపైన స్థిరపడితే మరోదఫా 10,615 పాయింట్ల స్థాయికి పెరగవచ్చు. ఈ స్థాయిని కూడా ఛేదించగలిగితే 10,702–10,736 పాయింట్ల శ్రేణి వరకూ నిఫ్టీ రిలీఫ్‌ ర్యాలీ సాగించవచ్చు. ఈ వారం నెగిటివ్‌గా మార్కెట్‌ మొదలైతే 10,398 పాయింట్ల వద్ద నిఫ్టీకి తొలి మద్దతు లభ్యమవుతున్నది. ఈ లోపున ముగిస్తే తిరిగి 10,276 పాయింట్ల స్థాయికి పతనం కావొచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే కొద్ది రోజుల్లో 10,075 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు.

– పి. సత్యప్రసాద్

భారత మహిళల జట్టుకు చుక్కెదురు

మూడో టి20లో దక్షిణాఫ్రికా విజయం


షబ్నిమ్


జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా గడ్డపై తొలిసారి టి20 సిరీస్ దక్కించుకోవాలనుకున్న భారత మహిళల జట్టు జోరుకు బ్రేక్ పడింది. వరుసగా రెండు టి20ల్లో గెలుపొందిన హర్మన్‌ప్రీత్ బృందం మూడో మ్యాచ్‌లో పరాజయం పాలైంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మిడిలార్డర్ వైఫల్యంతో టీమిండియా 5 వికెట్లతో ఓడింది. తొలుత టీమిండియా 17.5 ఓవర్లలో 133 పరుగులకే ఆలౌటైంది. మిథాలీ రాజ్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరినా... మరో ఓపెనర్ స్మృతి మంధాన (37; 5 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (48; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), వేద కృష్ణమూర్తి (23; 4 ఫోర్లు) ధాటిగా ఆడారు. ఒకదశలో 91/2తో పటిష్టంగా కనిపించిన భారత్‌ను సఫారీ పేసర్ షబ్నిమ్ 5 వికెట్లతో దెబ్బతీసింది. అనంతరం సఫారీలు ల్యూస్ (41; 5 ఫోర్లు), కెప్టెన్ నికెర్క్ (20 బంతుల్లో 26; 5 ఫోర్లు), ట్రియాన్ (34; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించడంతో మరో ఓవర్ మిగిలుండగానే విజయం సాధించారు. నాలుగో మ్యాచ్ బుధవారం సెంచూరియన్‌లో జరుగనుంది.

లంకదే టి20 సిరీస్


కుశాల్ మెండిస్

ఢాకా: బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో శ్రీలంక 75 పరుగుల తేడాతో నెగ్గి సిరీస్‌ను 2–0తో దక్కించుకుంది. మొదట శ్రీలంక 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు చేసింది. కుశాల్ మెండిస్ (70; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), గుణతిలక (42; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), తిసారా పెరీరా (31; 3 ఫోర్లు 1 సిక్స్), షనక (30; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం బంగ్లా 18.4 ఓవర్లలో 135 పరుగులకే ఆలౌటైంది. తమీమ్ ఇక్బాల్ (29; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మహ్మదుల్లా (41; 4 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగతావారంతా విఫలమయ్యారు. గుణతిలక, మధుశంక రెండేసి వికెట్లు తీశారు.

ఫైనల్లో న్యూజిలాండ్


మున్రో

హామిల్టన్: ముక్కోణపు టి20 క్రికెట్ టోర్నీలో న్యూజిలాండ్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆ జట్టు రెండు పరుగులతో ఓటమి పాలైనా... మెరుగైన రన్‌రేట్‌తో ఫైనల్‌కు చేరింది. బుధవారం జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియాతో న్యూజిలాండ్ తలపడనుంది. మొదట ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. మోర్గాన్ (46 బంతుల్లో 80; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం కివీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 192 పరుగులు చేసి ఓడింది. గప్టిల్ (47 బంతుల్లో 62; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), మున్రో (21 బంతుల్లో 57; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) చెలరేగినా ఫలితం లేకపోయింది.

ఫెడరర్ ఖాతాలో 97వ టైటిల్



రోటర్‌డామ్ (నెదర్లాండ్స్): స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ తన కెరీర్‌లో 97వ సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఆదివారం ముగిసిన రోటర్‌డామ్ ఓపెన్ టోర్నీలో అతను మూడోసారి చాంపియన్‌గా నిలిచాడు. ఫైనల్లో ఫెడరర్ 6–2, 6–2తో దిమిత్రోవ్ (బల్గేరియా)ను అలవోకగా ఓడించాడు. 55 నిమిషాల్లో ముగిసిన ఫైనల్లో ఫెడరర్ మూడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. సోమవారం మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్న ఫెడరర్ తాజా విజయంతో అతని ర్యాంక్ నాలుగు వారాలపాటు పదిలంగా ఉంటుంది. విజేతగా నిలిచిన ఫెడరర్‌కు 4,01,580 యూరోల (రూ. 3 కోట్ల 20 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

జోరు జయం మనదే

- టి20ల్లోనూ భారత్ శుభారంభం
- దక్షిణాఫ్రికాపై 28 పరుగుల తేడాతో విజయం
- మెరిసిన ధావన్, భువనేశ్వర్
- బుధవారం రెండో టి20

154 స్కోరుకు, 159 స్కోరుకు మధ్య తేడా ఐదు పరుగులే! కానీ వికెట్ల పతనం డబుల్ అయింది. ఈ డబుల్ ధమాకా భువనేశ్వర్‌ది. మొదటి స్కోరు వద్ద నాలుగు వికెట్లతో ఉన్న సఫారీ జట్టు రెండో స్కోరుకల్లా మరో నాలుగు వికెట్లను చేజార్చుకుంది. అంతలా... భువీ దెబ్బ తీశాడు. కాదు కాదు... దెబ్బ మీద దెబ్బ తీశాడు. వన్డేల్లో ఆధిపత్యాన్ని కొనసాగించిన కోహ్లి సేన... తాజాగా టి20ల్లోనూ శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది.


భువనేశ్వర్‌కు సహచరుల అభినందన

జొహన్నెస్‌బర్గ్: ధావన్ ధనాధన్ పరుగులు, భువనేశ్వర్ ఫటాఫట్ వికెట్లు సఫారీని కుదిపేశాయి. శిఖర్ ఇన్నింగ్స్ భారీ స్కోరుకు బాట వేస్తే, భువీ బౌలింగ్ ప్రత్యర్థిని ఉన్నపళంగా కూల్చేసింది. పటిష్టస్థితి నుంచి పరాజయానికి పడేసింది. దీంతో తొలి టి20లో భారత్ 28 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 203 పరుగుల భారీస్కోరు చేసింది. ధావన్ (39 బంతుల్లో 72; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) చెలరేగాడు. అనంతరం సఫారీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. హెన్‌డ్రిక్స్ (50 బంతుల్లో 70; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' భువనేశ్వర్ (5/24) నిప్పులు చెరిగాడు. రెండో టి20 మ్యాచ్ బుధవారం జరుగుతుంది. మోకాలి గాయంతో దక్షిణాఫ్రికా స్టార్ ఏబీ డివిలియర్స్ ఈ సిరీస్‌కు దూరం కాగా... చేతి వేలి గాయంతో ఈ మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్ ఆడలేదు.


ధావన్

సిక్స్‌లతో మొదలైంది...

మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌కు సిక్సర్లతో శ్రీకారం చుట్టాడు రోహిత్ శర్మ. ప్యాటర్సన్ వేసిన తొలి ఓవర్లో రెండు సిక్స్‌లు, ఒక ఫోర్ బాదడంతో 18 పరుగులు వచ్చాయి. అయితే ఇదెంతో సేపు సాగలేదు. మరుసటి ఓవర్లోనే రోహిత్ (9 బంతుల్లో 21; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపులు ముగిశాయి. డాలా బౌలింగ్‌లో కీపర్ క్లాసెన్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. ఏడాది తర్వాత బరిలోకి దిగిన రైనా (7 బంతుల్లో 15; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా ధాటిగా ఆడే ప్రయత్నంలోనే నిష్క్రమించాడు. ఈ దశలో ధావన్, కోహ్లి జోరు కొనసాగించారు. షమ్సీ వేసిన ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్ తొలిబంతికి లాంగాన్‌లో బెహర్దీన్ క్యాచ్ చేజార్చడంతో బతికిపోయిన కోహ్లి (20 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్)... ఆ ఓవర్లో ఫోర్, భారీ సిక్సర్ బాదాడు. అయితే షమ్సీ వేసిన మరుసటి ఓవర్లో భారత కెప్టెన్ వికెట్ల ముందు దొరికిపోయాడు. అనంతరం మనీశ్ పాండే, ధోని, పాండ్యా రాణించడంతో భారత స్కోరు 200 పరుగులు దాటింది.

రాణించిన హెన్‌డ్రిక్స్...

కష్టసాధ్యమైన లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు ఓపెనర్ హెన్‌డ్రిక్స్ వెన్నెముకగా నిలిచాడు. టాపార్డర్ విఫలమైనా... బెహర్దీన్ (27 బంతుల్లో 39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి హెన్‌డ్రిక్స్ గట్టెక్కించే ప్రయత్నం చేసినా భువనేశ్వర్ దెబ్బకు సాధ్యపడలేదు.

5 భారత్ తరఫున టి20ల్లో 5 వికెట్లు తీసిన తొలి పేసర్ భువనేశ్వర్.

78 పవర్‌ప్లేలో టీమిండియా చేసిన పరుగులు. భారత్‌కిదే అత్యధికం.

203 దక్షిణాఫ్రికాపై భారత్ సాధించిన అత్యధిక స్కోరు.

1 కేవలం 8.2 ఓవర్లలోనే భారత్ 100 కొట్టడం ఇదే తొలిసారి.

12 పుష్కర కాలం క్రితం భారత్ తొలి అంతర్జాతీయ టి20 ఆడింది ఇక్కడే. అప్పటి జట్టులో ఆడినవారిలో ధోని, రైనా ఇప్పుడు ఆడారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) క్లాసెన్ (బి) డాలా 21; ధావన్ (సి) క్లాసెన్ (బి) ఫెలుక్‌వాయో 72; రైనా (సి అండ్ బి) డాలా 15; కోహ్లి ఎల్బీడబ్ల్యూ (బి) షమ్సీ 26; పాండే (నాటౌట్) 29; ధోని (బి) మోరిస్ 16; పాండ్యా (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 203.**

వికెట్ల పతనం: 1–23, 2–49, 3–108, 4–155, 5–183. **బౌలింగ్:** ప్యాటర్సన్ 4–0–48–0, డాలా 4–0–47–2, మోరిస్ 4–0–39–1, షమ్సీ 4–0–37–1, స్మట్స్ 2–0–14–0, ఫెలుక్‌వాయో 2–0–16–1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: స్మట్స్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 14; హెన్‌డ్రిక్స్ (సి) ధోని (బి) భువనేశ్వర్ 70; డుమిని (సి) రైనా (బి) భువనేశ్వర్ 3; మిల్లర్ (సి) ధావన్ (బి) పాండ్యా 9; బెహర్దీన్ (సి) పాండే (బి) చహల్ 39; క్లాసెన్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 16; ఫెలుక్‌వాయో (సి) చహల్ (బి) ఉనాద్కట్ 13; మోరిస్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 0; ప్యాటర్సన్ (రనౌట్) 1; డాలా (నాటౌట్) 2; షమ్సీ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 175.**

వికెట్ల పతనం: 1–29, 2–38, 3–48, 4–129, 5–154, 6–158, 7–158, 8–159, 9–175.

బౌలింగ్: భువనేశ్వర్ 4–0–24–5, ఉనాద్కట్ 4–0–33–1, బుమ్రా 4–0–32–0, హార్దిక్ పాండ్యా 4–0–45–1, యజువేంద్ర చహల్ 4–0–39–1.

చెరువులో ఐదు మృతదేహాలు

- వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో కలకలం
- మృతులు తమిళనాడుకు చెందిన ఎర్రచందనం కూలీలుగా అనుమానం


మృతదేహాన్ని బయటికి తీస్తున్న మత్స్యకారుడు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట చెరువులో ఆదివారం ఐదు మృతదేహాలు లభ్యమయ్యాయి. చెరువుపై భాగం (రాజంపేట) వైపు చెర్లోపల్లెకు సమీపంలోని పెద్ద కుంటలో మృతదేహాలు ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఒంటిమిట్ట సీఐ రవికుమార్, ఏఎస్ఐ శ్రీధర్, సిద్దవటం ఎస్ఐ అరుణ్ రెడ్డితోపాటు రాజంపేట డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఆర్డీవో వీరబ్రహ్మం, తహసీల్దార్ శిరీష ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక మత్స్యకారులు, రాజంపేట ఫైర్ సిబ్బంది సాయంతో మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలు పూర్తిగా కుళ్లిపోయి ఉన్నాయి. కుంటలో ఇంకా ఏమైనా మృతదేహాలు ఉన్నాయేమోనని గాలింపు చేపట్టారు. మృతులు తమిళ కూలీలుగా పోలీసులు అనుమానిస్తున్నారు. శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెర్లోపల్లి గ్రామాన్ని సందర్శించి తమిళ కూలీల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో కుంటలో పడి ప్రమాదవశాత్తూ మృతి చెందారా? లేక ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓఎస్డీ (ఆపరేషన్) అద్నాన్ నయీం అస్మిన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. మృతులు తమిళ కూలీలని అనుమానాలున్నట్లుగా విలేకరులు ప్రశ్నించగా... ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టేందుకు ఆపరేషన్ జరుగుతుంటుందని సమాధానమిచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమితం కడప రిమ్స్‌కు తరలించారు. ఒంటిమిట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ అవే డ్రామాలు: రఘువీరా

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్ర విభజన సమయంలో రాజకీయ లబ్ధికోసం జరిగిన డ్రామాలే మళ్లీ చోటుచేసుకుంటున్నాయని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. ప్రత్యేక హోదా కోరుతూ 123 స్వచ్ఛ పాలిటిక్స్, హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజు కొనసాగాయి. దీక్షా శిబిరాన్ని కాంగ్రెస్ నేతలు రఘువీరారెడ్డి, సుంకర పద్మశ్రీ, తులసిరెడ్డి సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర విభజనలో బీజేపీ పాత్ర కూడా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభజన హామీలను నీరుగారుస్తున్నాయని ధ్వజమెత్తారు.

ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్‌సీపీ రాజీలేని పోరాటం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



నందిగామ: రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. కృష్ణా జిల్లా నందిగామలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేతలు స్వార్థ ప్రయోజనాల కోసం హోదాను పక్కన పెట్టి, ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్నారని, ఇప్పుడు అది కూడా దక్కకపోవడంతో దిక్కు తోచని స్థితిలో రోడ్డుపైకి వచ్చారన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విషయాల్లో అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కేంద్రం, రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయన్నారు. ఏప్రిల్ 2న 10 లక్షల మంది మాదిగలతో గుంటూరులో తిరుగుబాటు మహాసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నాన్చుతుంటే నాలుగేళ్లు నోరువిప్పలేదేం?

- ప్రత్యేక హోదాపై చంద్రబాబుది హైడ్రామా
- కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్



తిరుపతి (అలిపిరి): ప్రత్యేక హోదా విషయమై కేంద్రం నాన్చుతుంటే సీఎం చంద్రబాబు నాలుగేళ్లుగా ఎందుకు నోరు విప్పలేదని కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్ ప్రశ్నించారు. కేంద్రంపై చిన్నపాటి విమర్శ కూడా చేయకుండా ఇన్నేళ్లు గడిపేశారని దుయ్యబట్టారు. ఆదివారం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పనుల్లో అవినీతికి పాల్పడుతూ చంద్రబాబు రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తిరుపతిలో 2014 ఫిబ్రవరి 26న రూ.120 కోట్ల బడ్జెట్‌తో కేన్సర్ ఆస్పత్రికి పునాది రాళ్లు వేస్తే ఇంతవరకు నిర్మాణానికి నోచుకోలేదని చెప్పారు. పోలవరం నిర్మాణ పనుల్లో సీఎం చంద్రబాబు సొంత వర్గానికి కాంట్రాక్ట్ పనులు అప్పగించి భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుందని, కేంద్ర మంత్రివర్గంలో ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రత్యేక హోదాపై ఒత్తిడి తీసుకురావాల్సిందిపోయి నాటకాలు ఆడడం విడ్డూరంగా ఉందని అన్నారు. చంద్రబాబునాయుడు గడిచిన నాలుగేళ్లలో 29 సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లి రాష్ట్రానికి సాధించింది శూన్యమన్నారు. 30వ పర్యటనలోనైనా పునర్ వ్యవస్థీకరణ బిల్లు, ప్రత్యేక హోదాలపై మోదీని నిలదీయాలని చంద్రబాబుకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి చెందాలంటే 40 ఏళ్లు పడుతుందన్నారు. అదే 5 నుంచి 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తే ఏపీలోని 13 జిల్లాలు ఒక్కో హైదరాబాద్‌గా తయారవుతుందన్నారు.


జస్టిస్ రంజన్ గొగోయ్ దంపతులకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న జేఈఓ కేఎస్.శ్రీనివాసరాజు

శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ రంజన్ గొగోయ్

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు కూడా


ఆలయం వద్ద హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు

సాక్షి, తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో న్యాయమూర్తులు కుటుంబసభ్యులతో కలిసి వేర్వేరుగా ఆలయానికి వచ్చారు. ధ్వజస్తంభానికి మొక్కుకున్న అనంతరం శ్రీవారిని, వకుళమాతను దర్శించుకుని, హుండీలో కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వీరికి వేదపండితులు ఆశీర్వచనం ఇవ్వగా, తిరుమల జేఈఓ శ్రీనివాసరాజు లడ్డూప్రసాదాలు అందజేశారు. న్యాయమూర్తుల వెంట చిత్తూరు జిల్లా జడ్జి దుర్గారావు, ప్రొటోకాల్ జడ్జి సన్యాసినాయుడు ఉన్నారు.

అన్ని విషయాల్లోనూ అన్యాయమే..

- నాలుగేళ్లలో పవన్ ఏం ప్రశ్నించాడు?
- ఏపీ వర్సిటీల మేధావుల ఫోరం అధ్యక్షుడు నాగేశ్వరరావు ప్రశ్న

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): ప్రశ్నించడానికే వచ్చానన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ నాలుగేళ్లలో ఏం ప్రశ్నించాడో చెప్పాలని ఏపీ విశ్వవిద్యాలయాల మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ దారా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విభజన చట్టంలోని హామీలు అమలు చేయక.. బడ్జెట్‌లో ఇవ్వాల్సినవి ఇవ్వక.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ దొంగాట ఆడుతున్నాయని విమర్శించారు. బీజేపీ, టీడీపీలను అధికారంలోకి తెచ్చేందుకు నానా యాతనలు పడ్డ పవన్ కల్యాణ్ దేనిపైనా ప్రశ్నించకుండా.. ఇప్పుడు ఫ్యాక్ట్ ఫైండింగ్ అంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి సరికొత్త నినాదాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. గదుల్లో కూర్చొని చర్చించుకుంటే ప్రత్యేక హోదా, విభజన హామీలు రావని, రోడ్డెక్కి ఉద్యమాలు చేస్తేనే వస్తాయని పవన్ గుర్తెరగాలన్నారు. చంద్రబాబు ధనిక ముఖ్యమంత్రిగా పేరుగాంచారే తప్ప, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏనాడు ఆలోచించలేదని మండిపడ్డారు. ఇప్పటికే ప్రజలను అనేక రకాలుగా మభ్యపెట్టారని, ఇకనైనా మోసం చేయకుండా హక్కుల సాధనకు ఉద్యమ బాట పట్టాలని హితవు పలికారు. మార్చి 5న ఢిల్లీలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి రాష్ట్రంలోని 14 యూనివర్సిటీల నుంచి ప్రొఫెసర్లు, స్కాలర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని, రాజకీయ పార్టీలు కూడా కలసిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డాక్టర్ ఎం.ప్రకాశరావు, ఎం.కుషాల్ పాల్గొన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.